

'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 16

మంగళవారం 8-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




ఆర్‌సీబీ అదరహో

ఐపీఎల్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 12 పరుగుల తేడాతో విజయం -14లో



'హజ్' వీసాలపై సౌదీ నిషేధం


భారత్ సహా 14 దేశాలకు తాత్కాలికంగా నిలిపివేత -6లో



త్వరలో ఏఐకి మానవమేధ

మానవునికి మాత్రమే సాధ్యమయ్యే అపార మేధస్సును త్వరలోనే ఏఐ సాధించనుందని గూగుల్ సంచలన అంచనాకొచ్చింది.

- వివరాలు 6లో▶



చైనాపై మరో 50 శాతం!

చైనా విధించిన ప్రతీకార సుంకాలను వెనక్కి తీసుకోకుంటే ఆ దేశంపై మరో 50 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు.

- వివరాలు 6లో▶



సరిహద్దుల్లో ఎలక్ట్రానిక్ నిఘా

దేశ సరిహద్దుల పరిరక్షణకు ఎలక్ట్రానిక్ సర్వైలెన్స్ సిస్టమ్‌ను మోహరిస్తున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు.

- వివరాలు 6లో▶



తుదిశ్వాస వరకు పోరాడుతాం

సుప్రీం తీర్పుతో ఉద్యోగాలు కోల్పోయిన వారిలో అర్హులైన అభ్యర్థులకు బాసటగా నిలుస్తామని మమత హామీ ఇచ్చారు.

- వివరాలు 6లో▶

ట్రంప్ ట్రేడ్ వార్.. ఆపై మాంద్యం భయాలు

మార్కెట్లు భగభగ

ఒకేరోజు మన ఇన్వెస్టర్ల సంపద రూ.14 లక్షల కోట్లు ఆవిరి

- ప్రపంచవ్యాప్తంగా 'రెడ్' సిగ్నల్
- ఆసియా మార్కెట్లు అతలాకుతలం
- 4 వేల పాయింట్లు పడి... దాదాపు సగం కోలుకున్న సెన్సెక్స్
- భారత స్టాక్ మార్కెట్లు సైతం 3 శాతం వరకూ క్షీణత
- 15% పతనమైన హాంకాంగ్ సూచీ
- చమురు, బంగారం ధరలు కూడా భారీగా పతనం



'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాదంతో అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి గెలిచిన ట్రంప్... ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో సృష్టిస్తున్న భగభగలు చల్లారటం లేదు. అమెరికాతో వ్యాపారం చేస్తున్న ప్రతి దేశాన్నీ కాళ్ల బేరానికి వచ్చేలా చేయడానికి ఆయన ఎంచుకున్న ప్రతీకార సుంకాలు అమెరికా సహా అన్ని స్టాక్ మార్కెట్లలోనూ కల్లోలాన్ని కొన సాగిస్తున్నాయి. కెనడా, జపాన్ సహా పలు దేశాల అధినేతలు ట్రంప్‌తో చర్చలకు వెళుతున్నట్లు ఇప్పటికే ప్రకటించగా... చైనా మాత్రం దిగిరాలేదు. పైపెచ్చు ట్రంప్ టారిఫ్‌లకు జవాబుగా చైనా కూడా అమెరికా వస్తువులపై సుంకాలు పెంచటంతో ట్రంప్ బెదిరింపులకు దిగారు. చైనా వాటిని ఉపసంహరించుకోకపోతే మరో 50 శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. సోమవారం అమెరికా మార్కెట్లు మొదట్లో కోలుకున్నట్లు కనిపించినా ఈ ట్రేడ్ వార్ భయాలతో మళ్లీ భారీ పతనం దిశగా కదిలాయి. మరోవంక ట్రంప్ చర్యలతో ప్రపంచాన్ని మాంద్యం ముంచెత్తే అవకాశాలు 60 శాతానికి చేరినట్లు ఆర్థిక దిగ్గజాలు ప్రకటించాయి. దీంతో భారత్ సహా ప్రపంచ మార్కెట్లన్నీ సోమవారం భారీ పతనాన్ని చూశాయి. సెన్సెక్స్ ఆరంభంలో 4 వేల పాయింట్ల వరకూ నష్టపోయినా చివరకు కాస్త కోలుకుని 2,226.79 పాయింట్లు (-2.95%) క్షీణించి 73,137 వద్ద ముగిసింది. నిఫ్టీ 742 పాయింట్లు (-3.24%) పడిపోయి 22,160 వద్ద ముగిసింది. ఈ పతనంతో రూ.14 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరయ్యింది. చమురు, బంగారం ధరలు కూడా భారీగా పతనం అవుతున్నాయి. మరోవైపు హాంకాంగ్ సూచీ హాంగ్‌సెంగ్ 15% నష్టపోగా... తైవాన్ వెయిటెడ్ 11%, జపాన్ నికాయ్ 8%, సింగపూర్ స్ట్రెయిట్ టైమ్స్ 8%, చైనా షాంఘై 7% చొప్పున నష్టపోయాయి. యూరప్ మార్కెట్ల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు.

- వివరాలు 15లో

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు



కేసులు ఎత్తేయండి

హెచ్‌సీయూ విద్యార్థులపై కేసుల ఉపసంహరణకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

- వీసీ హామీ ఇస్తే వర్సిటీ నుంచి పోలీసు బలగాలు వెనక్కి: మంత్రుల కమిటీ
- ఆ 400 ఎకరాల్లో బందోబస్తు యథాతథం
- అధ్యాపకులు, విద్యార్థులను అక్కడ 'సర్వే'కు అనుమతించేది లేదు
- మంత్రుల కమిటీతో యూహెచ్‌టీఏ, పౌరసమాజ ప్రతినిధులు సమావేశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పోలీసు అధికారులను ఆదేశించారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ క్రమంలో న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ అధికారులకు తగు సూచనలు చేయవలసిందిగా న్యాయశాఖ అధికారులను ఆదేశించారు. కంచ గచ్చిబౌలి భూముల వివాదానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల సబ్ కమిటీ సోమవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం అధ్యక్షతన సమావేశమైంది. కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు మిగతా 2వ పేజీలో ▶

'కంచ' కథ తేలేదెప్పుడు?!

- కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూ వివాదంపై ప్రతిష్టంభన
- ప్రభుత్వం, విద్యార్థి సంఘాలు, పర్యావరణవేత్తలు.. ఎవరి వాదనలు వారివి
- ఆ భూములు సర్కారువేనంటూ కోర్టు తీర్పుల్ని ప్రస్తావిస్తున్న ప్రభుత్వ పెద్దలు

2 లో

న్యూస్‌రీల్

రైళ్లకు నిడివి చిక్కు!



ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో కూడిన ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య కనీసం నాలుగుకు పెంచాలన్న నిబంధన ఇప్పుడు కొంత సమస్యలకు కారణమవుతోంది. ఈ కోచ్‌ల సంఖ్య పెంచినప్పుడు నిర్ధారిత పొడవును రైలు మించి పోతోంది. దీంతో అంతే సంఖ్యలో ఇతర కోచ్‌లను తొలగించాల్సి వస్తోంది.

- వివరాలు 12లో▶

బీఆర్‌ఎస్ సభకు 3 వేల బస్సులు



వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే తమ పార్టీ రజతోత్సవ సభ కోసం 3 వేల బస్సులు సమకూర్చాలని ఆర్టీసీకి బీఆర్‌ఎస్ దరఖాస్తు చేసింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను బీఆర్‌ఎస్ బృందం సోమవారం కలిసింది.

- వివరాలు 3లో▶

మే 7 నుంచి ఆర్టీసీలో సమ్మె



ప్రభుత్వం, ఆర్టీసీ అధికారుల ముందు తాము ఉంచిన 21 డిమాండ్లను పరిష్కరించకుంటే మే 7 నుంచి సమ్మెకు దిగుతామని ఆర్టీసీలోని ఒక కార్మిక జేఏసీ హెచ్చరించింది. ఈ మేరకు సోమవారం కార్మిక శాఖ కమిషనర్, ఆర్టీసీ ఎండీకి సమ్మె నోటీసు అందించింది.

- వివరాలు 2లో▶

రాజ ఫలానికి ట్రంప్ దెబ్బ



కొత్త సుంకాలతో మామిడి ఎగుమతులు భారం

- తెలుగు రాష్ట్రాల మామిడి రైతులకు కొత్త కష్టాలు
- 0-5 శాతం నుంచి 26 శాతానికి పెరిగిన సుంకాలు
- తెలుగు రాష్ట్రాల నుంచి ఏటా 15 వేల టన్నులు ఎగుమతి

సాక్షి, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దెబ్బకు భారతీయ రాజ ఫలం మామిడి వెలవెలబోతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల మామిడి రైతులకు కొత్త కష్టం వచ్చిపడింది. భారత్ నుంచి ఎగుమతి అయ్యే వస్తువులపై ట్రంప్ ఇటీవల 26 శాతం ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. అందులో మన మామిడి పండ్లు కూడా ఉన్నాయి. దీంతో ఈసారి మామిడి ఎగుమతులపై ఈ సుంకాలు తీవ్ర ప్రభావం చూపనున్నాయి. దేశంలో తెలుగు రాష్ట్రాలు మామిడి ఉత్పత్తిలో ముందున్నాయి. ఇక్కడ సుమారు 7,64,500 ఎకరాల్లో మామిడి సాగవుతుండగా, ఏటా 24,45,900 టన్నుల మామిడి పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. మనదేశం నుంచి అమెరికాకు ఏటా 45,000 టన్నుల మామిడి పండ్లు ఎగుమతి అవుతున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచే 10 వేల నుంచి 15 వేల టన్నులు వెళ్తున్నాయి. మన బంగినపల్లి, తోతాపురి, కేసర్ వంటి రకాలను అమెరికన్లు ఎంతగానో ఇష్టపడుతారు. ఈ ఎగుమతుల విలువ రూ.150 కోట్ల నుంచి రూ.230 కోట్లు ఉంటోంది. ఇప్పుడు సుంకాల పెంపుతో ధరల పెరుగుదల అదనంగా మరో రూ.50 కోట్లకు పైగా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. అంటే అమెరికా ప్రజలకు మన మామిడి చాలా ప్రియం అవుతుంది. దీంతో డిమాండ్ తగ్గే ప్రమాదం ఉంది.

అసాధారణ సుంకాలు..

గతంలో అమెరికాకు మామిడి ఎగుమతిపై సుంకాలు 0 నుంచి 5 శాతం మధ్య ఉండేవి. ఇది వ్యవసాయ ఉత్పత్తులకు అనుకూలమైన వాణిజ్య ఒప్పందాల వల్ల మిగతా 3వ పేజీలో ▶

బనకచర్ల నిర్మాణం అక్రమం



జీఆర్‌ఎంబీ భేటీలో అభ్యంతరం వ్యక్తం చేసిన తెలంగాణ

- గోదావరి ట్రిబ్యునల్ అవార్డు-1980కి పూర్తి విరుద్ధం
- ఎలాంటి అనుమతుల్లేకున్నా ఏపీ పనులు వేగవంతం చేసింది
- సీడబ్ల్యూసీలోని టీఏసీ సమావేశాల తీర్మానాలకు సైతం ఇది విరుద్ధం
- ఈ అక్రమ ప్రాజెక్టును ఏపీ తక్షణమే విరమించుకోవాలని డిమాండ్
- బనకచర్ల విషయంలో గోదావరి బోర్డు తీరును సైతం తప్పుబట్టిన వైనం

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు విస్తరణలో భాగంగా ఏపీ చేపట్టిన గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు.. గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ అవార్డు-1980కి పూర్తి విరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. ఎలాంటి అనుమతుల్లేకున్నా ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆంధ్రప్రదేశ్ వేగవంతం చేసిందంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించే ఈ అక్రమ ప్రాజెక్టును తక్షణమే ఏపీ విరమించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ ప్రాజెక్టు విషయంలో గోదావరి బోర్డు పారదర్శకతను పాటించడం లేదని తీవ్రంగా తప్పుబట్టింది. గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) 17వ సమావేశం సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది. ఈ సందర్భంగా గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై వాడీవేడిగా సుదీర్ఘమైన చర్చ జరిగింది. చైర్మన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ తరఫున నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు. ప్రాజెక్టు నిర్మాణంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ట్రిబ్యునల్ అవార్డును కాలరాయడమే..

'పోలవరం ప్రాజెక్టులో భాగంగా చెరో 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడి, ఎడమ ప్రధాన కాల్వల నిర్మాణానికి మిగతా 12వ పేజీలో ▶



సోమవారం భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో నిర్వహించిన పట్టాభిషేక మహోత్సవంలో సింహాసనంపై ఆసీనుడైన శ్రీరామచంద్రమూర్తి 3 లో


గ్యాస్ బండపై రూ. 50 వడ్డింపు



- సాధారణ వినియోగదారులతోపాటు నిరుపేద ఉజ్వల పథకం లబ్ధిదారులకూ వర్తింపు
- సీఎన్‌జీపైనా రూపాయి పెంపు
- అర్ధరాత్రి నుంచే అమల్లోకి
- పెట్రోల్, డీజిల్‌పై రూ. 2 ఎక్సైజ్ సుంకం
- పెట్రోలియం సంస్థల నష్టాలతో ధరల పెంపు తప్పలేదన్న కేంద్రం
- పెట్రో భారం సామాన్యులపై ఉండదని స్పష్టీకరణ

6 లో

ఇదండీ సంగతి





అమ్మకు రక్ష

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో తగ్గిన ప్రసవ మరణాలు
- దక్షిణాదిలో కేరళ తర్వాత ఈ రెండు రాష్ట్రాలే
- తెలంగాణలో కేసీఆర్ కిట్, ఏపీలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఫలితం
- ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలో వెల్లడి.. ఆఫ్రికా దేశాల్లో మాతృ మరణాల రేటు ఎక్కువ

- వివరాలు 16లో

దంచికొట్టిన వడగళ్ల వాన

ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షం

ఏటూరునాగారం/వెంకటాపురం(కె)/ మంగపేట/ కేసముద్రం/కురవి/నర్సంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏజెన్సీలో వడగళ్ల వాన దంచికొట్టింది. ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వెంకటాపురం(కె) మండలాల పరిధిలో సోమవారం రాత్రి భారీ వర్షం పడటంతో కల్లాల్లో ఆరబోసిన మిర్చి, ధాన్యం తడిసిపోయాయి. వడగళ్ల వానతో ధాన్యం గింజలు రాలిపోయాయి. మంగపేట మండల పరిధిలో వాడగూడెం, పాలాయిగూడెం, చుంచుపల్లి, కొత్తమల్లూరు, మల్లూరు, తిమ్మంపేట, నర్సింహాసాగర్, పూరేడుపల్లి తదితర గ్రామాల్లో వడగళ్ల వర్షం కురిసింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం, ఇనుగుర్తి, కురవి, సీరోలు మండలాల్లోని పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. వరంగల్ జిల్లా నర్సంపేట, దుగ్గొండి, ఖానాపురం మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది.



ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరులో ఆరబెట్టిన ధాన్యంపై రాళ్లవాన

రెండ్రోజులు తేలికపాటి వానలు

ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు 16 లో



శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమక్షంలో సోమవారం ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేస్తున్న అద్దంకి దయాకర్, విజయశాంతి, అంజిరెడ్డి, సత్యం, కొమరయ్య, శ్రీపాల్‌రెడ్డి, శంకర్ నాయక్. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి, ఉత్తమ్ 3 లో

క్లుప్తంగా...

రాష్ట్రపతి దృష్టికి హెచ్‌సీయూ భూముల వ్యవహారం

సంతకాలతో కూడిన వినతిపత్రం ఇవ్వాలని ఏబీవీపీ నిర్ణయం

రాయదుర్గం: హెచ్‌సీయూలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం కూడా కొనసాగించిన కార్యక్రమంతో 1,100 సంతకాలను సేకరించినట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో 400 ఎకరాల భూమిని కాపాడాలనే లక్ష్యంతో మొత్తం 5,500 మందితో సంతకాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకొన్నట్లు ఏబీవీపీ నాయకులు వెల్లడించారు. మొదట కేటాయించిన భూములు, ఆ తర్వాత వివిధ అవసరాలకు తీసుకున్న భూములు, ప్రస్తుత పరిస్థితి, తాజాగా 400 ఎకరాల భూముల విషయం రాష్ట్రపతి, ప్రధానమంత్రి దృష్టికి తెచ్చేందుకే ఈ సంతకాల సేకరణ చేసినట్లు వారు వివరించారు. ఈ సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు అందించాలని నిర్ణయించారు. అనంతరం ప్రధాని మోదీని కూడా కలవాలని ఏబీవీపీ హెచ్‌సీయూ విభాగం నిర్ణయించింది.

క్రిశాంక్‌కు నోటీసులు జారీ

హెచ్‌సీయూపై తప్పుడు వీడియోలు సర్క్యులేట్ చేశారని కేసు



బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్‌కు నోటీసు అందజేసిన గచ్చిబౌలి ఎస్సై మహేశ్

గచ్చిబౌలి: హెచ్‌సీయూ అంశంలో మార్ఫింగ్ వీడియోలతో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు సర్క్యులేట్ చేసిన కేసును గచ్చిబౌలి పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. మార్ఫింగ్ వీడియోలు, ఫొటోలతో రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేశారని బాగన్నగారి అరుణ్‌రాజ్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు.. సోమవారం బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్‌కు నోటీసులు జారీ చేశారు. తెలంగాణ భవన్‌లో ఉన్న క్రిశాంక్‌ను బయటికి పిలిచి ఎస్సై మహేశ్ నోటీసులు అందజేశారు. కొండాపూర్‌లోని బీఆర్‌ఎస్ నేత కొణతం దిలీప్ ఇంటికి వెళ్లగా ఆయన లేకపోవడంతో జీ మెయిల్, వాట్సాప్ ద్వారా నోటీసు అందజేశారు. మరో ఇద్దరు నిందితులు హరీశ్, గౌతమ్ మెయిల్ ఐడీ వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.

'400 ఎకరాలు హెచ్‌సీయూకు అప్పగించాలి'

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టకు పాకులాడకుండా 400 ఎకరాలు హెచ్‌సీయూకు అప్పగించాలని బీసీ సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పంతాలకు పోకుండా హెచ్‌సీయూ భూములను కాపాడాలన్నారు. అలాగే పెండింగ్ ఫీజు, హాస్టల్ మెస్ బకాయిలు చెల్లించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు.

గ్రూప్-1పై రాష్ట్రపతి, ప్రధానిని కలుస్తాం

ఢిల్లీలో మీడియాతో గ్రూప్-1 అభ్యర్థులు



సోమవారం ఢిల్లీలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో వేలాది మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని అభ్యర్థులు వాపోయారు. జీవో 29తో ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కోల్పోతున్నట్లు వారు తెలిపారు. సుప్రీంకోర్టులో న్యాయం దక్కని కారణంగా.. త్వరలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీలను కలసి మా సమస్యను విన్నవిస్తామని గ్రూప్-1 అభ్యర్థి ప్రత్యూష నాయక్ తెలిపారు. శుక్రవారం జీవో 29ను దేశ సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో తమకు సుప్రీంకోర్టులో కూడా న్యాయం దక్కలేదని ఆరోపిస్తూ.. దేశ రాజధాని ఢిల్లీలో నాలుగు రోజులుగా గ్రూప్-1 అభ్యర్థులు ప్రత్యూష, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్, రత్నశేఖర్‌రెడ్డిలు రాష్ట్రపతి, ప్రధానిని కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం అభ్యర్థులు మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల గురించి మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తెలంగాణ విద్యార్థుల సమస్యలు పట్టడం లేదా అని నిలదీశారు. సమస్య పరిష్కారమయ్యే వరకూ ఢిల్లీని విడిచేది లేదని చెప్పారు. సమస్యల గురించి మాట్లాడుతుంటే ప్రభుత్వం కేసులతో వేధిస్తోందని ఆరోపించారు.

మైనర్ ఇరిగేషన్ సీఈగా రఘునాథరావు

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖ వనపర్తి చీఫ్ ఇంజనీర్ వి.రఘునాథరావును మైనర్ ఇరిగేషన్, కాడా, చెక్‌డ్యామ్‌ల విభాగం చీఫ్ ఇంజనీర్‌గా నియమిస్తూ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రఘునాథరావును ఈఎన్‌సీ(జనరల్) కార్యాలయానికి అటాచ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

'కంచ' కథ.. తేలేది ఎప్పుడు?

- కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూ వివాదంపై ప్రతిష్టంభన
- ప్రభుత్వం.. విద్యార్థి సంఘాలు, పర్యావరణ వేత్తలు.. ఎవరి వాదనలు వారివి
- ఆ భూములు ప్రభుత్వానివేనంటూ కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రస్తావిస్తున్న సర్కారు పెద్దలు
- తెరపైకి ఎకో పార్క్, యూనివర్సిటీ తరలింపు ప్రచారం..
- ప్రభుత్వ పెద్దల్లోనే భిన్నాభిప్రాయాలు



సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి వ్యవహారం ఇప్పట్లో తేలేలా లేదు. ఆ భూములు ప్రభుత్వానివేనని, ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకునే పరిస్థితి లేదని, ఆ భూముల దగ్గర సర్వే చేసేందుకు కూడా అంగీకరించేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2004లోనే ప్రభుత్వం యూనివర్సిటీకి ఈ భూములకు ప్రత్యామ్నాయంగా మరోచోట భూములు ఇచ్చిన నేపథ్యంలో ఈ భూములు ప్రభుత్వానికే చెందుతాయని అంటోంది. అందుకు భిన్నంగా ఈ భూములను యూనివర్సిటీకి తిరిగి అప్పగించాలనే డిమాండ్ చేయడమే కాకుండా, ఆ భూముల్లో పర్యావరణం, జీవవైవిధ్యం దెబ్బతినకుండా కాపాడాలని, ఆ ప్రాంత పరిసరాలు కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నేపథ్యంలో ఈ భూమి లంగ్‌స్పేస్‌గా ఉపయోగపడుతుందని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నేతలు, పర్యావరణవేత్తలు పట్టుబడుతున్నారు. అయితే ఆ ప్రాంతంలో స్టేడియంలు, భవన నిర్మాణాలు కొనసాగినప్పుడు లేని పర్యావరణ సమస్య ఇప్పుడే వచ్చిందా అంటూ కొందరు ప్రభుత్వ పెద్దలు స్పందిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి తప్పుడు వీడియోలు, ఫొటోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని హైకోర్టులో ప్రభుత్వం ఫిర్యాదు చేయడం గమనార్హం. కాగా కొందరు ప్రజాప్రతినిధులు పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యానికి కట్టుబడాల్సి వస్తే.. 400 ఎకరాలే కాకుండా యూనివర్సిటీ పరిధిలో ప్రస్తుతం ఉన్న 1600 ఎకరాలను కలిపి మొత్తం 2000 ఎకరాలతో అంతర్జాతీయ ఏకో పార్క్ నిర్మించాలంటూ ముఖ్యమంత్రికి సూచించినట్లు తెలుస్తోంది. విద్యార్థులు, పర్యావరణవేత్తల డిమాండ్‌కు విరుగుడుగా ప్రభుత్వం మొత్తం యూనివర్సిటీని ఎకో పార్క్‌గా ఏర్పాటు చేద్దామనే ప్రచారాన్ని ముందుకు తీసుకు వస్తుండటంతో ఈ వివాదం ఇప్పట్లో తేలేలా లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. యూనివర్సిటీని అవసరమైతే ఫ్యూచర్ సిటీకి తరలించాలనే ప్రతిపాదన కూడా ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్నట్లు ఆ వర్గాలు ప్రచారం చేస్తుండటం, విద్యార్థి సంఘాలు ఎంత మాత్రం వెనక్కి తగ్గకుండా మంత్రుల కమిటీ సమావేశానికి సైతం హాజరు కాకపోవడంతో వివాదం జటిలంగా మారింది. అయితే విద్యార్థులు, పర్యావరణవేత్తలకు కౌంటర్‌గా ఎకో పార్క్ నిర్మాణ అంశాన్ని తెరపైకి తేవడాన్ని, అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందిన యూనివర్సిటీని ఏకంగా అక్కడినుంచి తరలించాలనే ఆలోచన సరికాదని కాంగ్రెస్ పార్టీలో, ప్రభుత్వంలోని సీనియర్లు కొందరు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఇలాంటి లీకులు, ప్రచారం వల్ల నష్టం తప్ప లాభం ఉండదని వారన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆ 400 ఎకరాలకు సంబంధించిన అంశం సర్వోన్నత న్యాయస్థానంలో ఉన్నప్పుడు ఇతర అంశాలను తెరపైకి తేవడం సరికాదనే అభిప్రాయమూ వ్యక్తమవుతున్నట్లు తెలిసింది.

వేరే ఉద్దేశం లేదు!

ఈ అంశంపై ఓ మంత్రి మాట్లాడుతూ సమస్య సామరస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామే తప్ప మరో ఉద్దేశం ప్రభుత్వానికి లేదని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై ఎలా ముందుకు వెళ్లాలో నిర్ణయించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమిటీ వేశారని గుర్తు చేస్తున్నారు. అయితే ఆ 400 ఎకరాలపై న్యాయస్థానాలు స్పష్టమైన తీర్పులు ఇచ్చిన అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఆ భూములు అటవీ భూములు కావన్న అంశాన్ని కూడా స్పష్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. మరోవైపు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా దీనిపై దృష్టి పెట్టారని, యూనివర్సిటీ భాగస్వామ్య పక్షాలతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ.. వారి అభిప్రాయాలు సేకరిస్తున్నారని ఆయన వెల్లడించారు. సోమవారం ఆమె ఉపాధ్యాయ, పర్యావరణవేత్తలు, పౌర సమాజం నాయకులను వెంట పెట్టుకుని సచివాలయంలో మంత్రులతో సమావేశమయ్యారని చెప్పారు.



సన్నబియ్యం కాదు రొట్టెలతో సహపంక్తి భోజనం

ఇచ్చోడ: అధికారులు రొట్టెలు తిని.. సన్నబియ్యం బాగున్నాయని లబ్ధిదారులతో చెప్పించిన ఉదంతం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముకరా బిలో చోటుచేసుకుంది. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీని ఈనెల ఒకటి నుంచి ప్రారంభించిన విషయం తెలిసిందే. గ్రామాల్లో రేషన్ దుకాణాల ద్వారా వినియోగదారులకు ఈ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం జిల్లా అధికారులు ముకరా బిలో పర్యటించి సన్నబియ్యం పథకంపై లబ్ధిదారులను ఆరా తీశారు. సన్నబియ్యం పంపిణీపై సంతోషంగా ఉన్నామని వారితో చెప్పించారు. అక్కడే ఓ లబ్ధిదారు ఇంట్లో డీసీఎస్‌వో వాజీత్‌అలీ, సివిల్ సప్లయ్ డీఎం సుజాత, తహసీల్దార్ సత్యనారాయణరావు, ఎంపీడీవో లక్ష్మణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ జాదవ్ రామారావు మధ్యాహ్న భోజనం చేశారు. కానీ సన్నబియ్యంతో వండిన అన్నం కాకుండా రొట్టెలు తినడం గమనార్హం. అయితే లబ్ధిదారులతో మాత్రం సన్నబియ్యం బాగున్నాయని చెప్పించారు.

ఇప్పుడు ఎలాంటి ఆదేశాలివ్వలేం

- 'కంచ గచ్చిబౌలి'పై సర్కార్‌కు తేల్చిచెప్పిన హైకోర్టు
- తదుపరి విచారణ 24కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో చెట్లు నరికివేతకు సంబంధించి సోషల్ మీడియాలో పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు దృష్టికి తీసుకొచ్చింది. అలాంటి పోస్టులను నిలుపుదల చేసేలా ఆదేశాలివ్వాలని కోరగా, కౌంటర్ దాఖలు చేస్తే పరిశీలించి ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. ప్రభుత్వంతోపాటు, అటవీ, రెవెన్యూ, పోలీసు విభాగాలను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 24కు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములను తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్‌ఐఐసీ)కి బదిలీ చేసి, చదును చేయడాన్ని ఆపాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్) దాఖలైన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా అటవీ శాఖ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హాజరై.. ప్రభుత్వానికి అపఖ్యాతి తెచ్చేలా తప్పుడు ఫొటోలను, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారని చెప్పారు. కృత్రిమమేధ (ఏఐ)తో ఫేక్ ఫొటోలు సృష్టించి, వాటిని సోషల్ మీడియాలో పెడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మాసనం స్పందిస్తూ.. 'మీరు పిటిషనర్ కాదు కదా.. ప్రతివాది కనుక, మీ వాదనలతో కౌంటర్ దాఖలు చేయండి.. పరిశీలించి ఆదేశాలు జారీ చేస్తాం'అని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఇతర ప్రతివాదులను కౌంటర్ వేయాలని చెప్పింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాదులు ఎస్.నిరంజన్‌రెడ్డి, ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. ఇదే అంశంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేస్తోందని, తదుపరి విచారణను ఈ నెల 16కు వాయిదా వేసిందని చెప్పారు. ఒకేసారి ఇరుకోర్టులు విచారణ జరపడం సరికాదని, వాయిదా వేయాలని కోరారు. అంగీకరించిన ధర్మాసనం విచారణ వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, ఇదే అంశంపై ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ దాఖలు చేసిన పిల్‌ను ధర్మాసనం పాత పిల్‌లకు అటాచ్ చేసింది.

కేసులు ఎత్తేయండి..

▶ మొదటి పేజీ తరువాయి

వంశీచంద్ రెడ్డి, ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ శివధర్‌రెడ్డి, సైబరాబాద్ పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి ఈ సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ సంఘం (యూహెచ్‌టీఏ), పౌర సమాజ ప్రతినిధులు కూడా వారితో సమావేశమై పలు డిమాండ్లు ప్రస్తావించారు. ఈ సమావేశం అనంతరం డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు.

అక్కడ పోలీసు పహారా తప్పనిసరి

పౌర సమాజ ప్రతినిధులు, యూహెచ్‌టీఏ ప్రస్తావించిన పలు అంశాలు, డిమాండ్లపై మంత్రుల ఉప కమిటీ కీలక ప్రకటన చేసింది. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఇతర ప్రాంతాల నుంచి పోలీసు బలగాల ఉప సంహరణ కోసం హెచ్‌సీయూ వీసీకి లేఖ రాస్తామని హామీ ఇచ్చింది. విద్యార్థులు, హాస్టళ్ల భద్రతకు సంబంధించి వీసీ హామీ ఇస్తే బలగాలను ఉపసంహరిస్తామని పేర్కొంది. అయితే వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్న 400 ఎకరాల్లో మాత్రం పోలీసు బందోబస్తు కొనసాగుతుందని మంత్రులు స్పష్టం చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 400 ఎకరాల భూమిని రక్షించేందుకు పోలీసు పహారా తప్పనిసరి అని పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు సహా ఎవరినీ 400 ఎకరాల్లో సర్వేకు అనుమతించలేమని తెలిపారు. విద్యార్థులు కోరిన విధంగా యూనివర్సిటీని సందర్శించడానికి మంత్రుల కమిటీ సానుకూలంగా ఉందని, అయితే సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో న్యాయపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికిప్పుడు యూనివర్సిటీకి రాలేమని చెప్పారు. అయితే విద్యార్థులపై కేసులను సాధ్యమైనంత త్వరగా ఉపసంహరించుకునేలా పోలీసు, న్యాయ శాఖతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారు.

డిమాండ్లు అంగీకరిస్తేనే జేఏసీ నేతలు వస్తారు: యూహెచ్‌టీఏ

మంత్రుల సబ్ కమిటీని కలిసిన యూనివర్సిటీ అధ్యాపక, పౌర సమాజ ప్రతినిధులు పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు పెట్టారు. హెచ్‌సీయూ నుంచి పోలీసు బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, నిషేధాజ్ఞలను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై ఇటీవల నమోదు చేసిన అన్ని కేసులను ఉపసంహరించుకోవడంతో పాటు పోలీసు కస్టడీలో ఉన్న ఇద్దరు విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర సాధికార కమిటీ క్యాంపస్‌ను సందర్శించే ముందు 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూమిలో నష్టాన్ని అంచనా వేయడంతో పాటు జీవవైవిధ్య సర్వే నిర్వహించడానికి నిపుణులైన అధ్యాపకులు, పరిశోధకులకు అనుమతి ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్లే విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ ఈ సమావేశానికి హాజరు కాలేదని మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. పైన పేర్కొన్న తక్షణ డిమాండ్లు నెరవేర్చిన తర్వాతే విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మంత్రుల కమిటీ నిర్వహించే సమావేశానికి హాజరవుతారని యూహెచ్‌టీఏ, పౌర సమాజ ప్రతినిధులు స్పష్టం చేశారు. ప్రొఫెసర్లు సౌమ్య, శ్రీపర్ణ దాస్, భంగ్యా భుక్యా, పౌర సమాజ ప్రతినిధులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పోలీసులను ఉపసంహరించుకుంటున్నాం

సొంత సెక్యూరిటీపై మీ నుంచి లేఖ రాగానే వైదొలుగుతారు:భట్టి

సాక్షి, హైదరాబాద్: హెచ్‌సీయూ నుంచి పోలీసు బలగాలను ఉపసంహరించుకుంటున్నామని, తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ వైస్ చాన్స్‌లర్ బీజే రావుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం లేఖ రాశారు. విశ్వవిద్యాలయంలో మీ సొంత సెక్యూరిటీ ఏర్పాటు చేసుకున్నట్లుగా మీ నుంచి లేఖ అందిన మరుక్షణమే పోలీసులు క్యాంపస్ నుంచి వైదొలుగుతారని స్పష్టం చేశారు. యూనివర్సిటీ బోధన, పరిశోధనలకు సురక్షితమైన ప్రదేశంగా ఉంటుందని తెలంగాణ ప్రభుత్వానికి అచంచల విశ్వాసం ఉందని పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సోమ వారం సచివాలయంలో మంత్రుల సంఘం నిర్వహించిన సమావేశానికి యూనివర్సిటీ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, పౌర సంఘాల ప్రతినిధులు హాజరై హెచ్‌సీయూలో మోహరించిన పోలీసు బలగాలను ఉపసంహరించుకోవాలని కోరారని, వారి విజ్ఞప్తిపై మంత్రుల కమిటీ సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. యూనివర్సిటీలో శాంతి భద్రతల పరిరక్షణ, విద్యార్థులు, అధ్యాపకుల భద్రత దృష్ట్యా క్యాంపస్‌లో పోలీసులను అందుబాటు లో ఉంచాల్సిందిగా రిజి స్ట్రార్ కోరిన మీదటే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలను మినహాయించి మెయిన్ క్యాంపస్ సమీపంలో పోలీస్ బందోబస్తు ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ 400 ఎకరాల్లో చెట్ల సంరక్షణ పనులకు తప్ప ఏ ఇతర కార్యకలాపాలకు అనుమతించకూడదని స్పష్టం చేశారు. యూనివర్సిటీకి సంబంధించిన అంశంలో అందరితోనూ చర్చలకు ప్రభుత్వం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

మే 7 నుంచి ఆర్టీసీలో సమ్మె

- డిమాండ్లపై స్పందించకుంటే బస్సులు నిలిపేస్తాం
- ప్రభుత్వానికి ఆర్టీసీలోని ఒక జేఏసీ అల్టిమేటం
- మరోసారి సమ్మె నోటీసు జారీ
- ఇంకా సగంమందికి అందని జీతాలు



కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికులు మరోసారి సమ్మెకు సై అంటున్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ అధికారుల ముందు తాము ఉంచిన 21 డిమాండ్లను పరిష్కరించని పక్షంలో మే 7నుంచి సమ్మె ప్రారంభిస్తామని ఆర్టీసీలోని ఒక కార్మిక జేఏసీ హెచ్చరించింది. ఈ మేరకు సోమవారం కార్మిక శాఖ కమిషనర్‌తోపాటు ఆర్టీసీ ఎండీకి సమ్మె నోటీసు అందించింది.

కార్మికశాఖ కమిషనర్ ఆఫీస్ ముందు ధర్నా..

గత జనవరిలోనే ఆర్టీసీలోని ఒక జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చింది. కానీ, అప్పట్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో జేఏసీతో సంప్రదింపులు జరపలేమని అధికారులు తెలిపారు. ఎన్నికల కోడ్ ముడిసేనాటికి నోటీసు గడువు తీరిపోయింది. దీంతో మార్చి 6న మరోసారి నోటీసు ఇచ్చారు. దానికీ యాజమాన్యం నుంచి స్పందన రాలేదు. ఈలోపు హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఇది ముగిసే సరికి మళ్లీ సమ్మె నోటీసు గడువు ముగిసిపోతుంది. ఈ నేపథ్యంలో జేఏసీ నేతలు కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట సోమవారం సాయంత్రం ధర్నా నిర్వహించి, మరోసారి సమ్మె నోటీసు అందించారు. అనంతరం బస్‌భవన్‌లోని ఆర్టీసీ ఎండీ కార్యాలయంలో కూడా సమ్మె నోటీసు ఇచ్చారు. ఆ తర్వాత జేఏసీ నేతలు సమావేశమై మే 7 నుంచి సమ్మె ప్రారంభించాలని నిర్ణయించారు. జేఏసీ చైర్మన్ వెంకన్న, కో-చైర్మన్ హన్మంతు, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ మౌలానా, కో-కన్వీనర్లు యాదయ్య, సురేశ్, యాదగిరి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

వేచిచూసే ధోరణిలో మరో జేఏసీ

ఆర్టీసీలోని మరో జేఏసీ సమ్మెపై వేచిచూసే ధోరణిని అవలంభిస్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 53 రోజుల పాటు సమ్మె చేసినా ఎలాంటి ఫలితం దక్కలేదని ఆ జేఏసీ సమ్మెపై వెనుకడుగు వేస్తోంది. ప్రభుత్వంతో సంప్రదింపులతో సమస్యల పరిష్కారం కోసం చూస్తున్నట్టు కొందరు నేతలు చెబుతున్నారు.

వారం గడచినా అందని జీతాలు..

ఒకటో తేదీ దాటి వారం గడుస్తున్నా ఆర్టీసీ ఉద్యోగుల్లో సగం మందికి జీతాలు అందలేదు. శనివారం నాటికి కొందరు కండక్టర్లు, డ్రైవర్లకు మాత్రమే జీతాలందాయి. మిగతావారికి సోమవారం సాయంత్రం వరకు అందుతాయని చెప్పినా, ప్రభుత్వం నుంచి బకాయిలు విడుదల కాకపోవటంతో అధికారులు చేతులెత్తేశారు. శ్రామిక్, మెకానిక్, సెక్యూరిటీ తదితర చిరుద్యోగులకు జీతాలు అందకపోవటంతో ఆందోళన చెందుతున్నారు.

ఒసాకా-కన్సాయ్ ఎక్స్‌పోకు సీఎం

- 15న జపాన్ వెళ్లనున్న రేవంత్‌రెడ్డి బృందం
- రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరించటంపై ఫోకస్
- నేడు అహ్మదాబాద్‌కు సీఎం రేవంత్, మంత్రులు



సాక్షి, హైదరాబాద్: జపాన్‌లో జరిగే ఒసాకా-కన్సాయ్ ఎక్స్‌పో- 2025కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెళ్లనున్నారు. ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి బయల్దేరి వారు జపాన్ వెళ్తారు. వారి వెంట పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్, సీఎం కార్యాలయ అధికారి అజిత్‌రెడ్డి కూడా వెళ్తారని సమాచారం. ఈ నెల 13వ తేదీ నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు జరిగే ఈ ఎక్స్‌పోలో వివిధ దేశాల రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు పాల్గొంటారు. భారత్ నుంచి కూడా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొననున్నట్లు సమాచారం. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరించేందుకు ఒసాకా షోను వేదిక చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో దావోస్ వెళ్లిన రెండు దఫాల్లోనూ దాదాపు రూ.2.20 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒసాకా ఉత్సవంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్‌గోయల్ కూడా పాల్గొంటారని సమాచారం. తెలంగాణలో ప్రభుత్వం ఏయే రంగాలకు ఎలాంటి ప్రోత్సాహకాలను అందిస్తుంది? ఇక్కడ ఉన్న పెట్టుబడి వాతావరణం, స్కిల్డ్, అన్‌స్కిల్డ్ లేబర్‌తోపాటు, విద్యుత్, నీటి సరఫరా, భూముల కేటాయింపు, అనుమతులు, రాయితీలు తదితర అంశాలపై రాష్ట్ర బృందం ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు తెలిసింది. గతంలో రాష్ట్రం నుంచి ఇలాంటి షోకేస్ చేసే ప్రయత్నం జరగలేదని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

నేడు అహ్మదాబాద్‌కు సీఎం: సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం అహ్మదాబాద్ వెళ్లనున్నారు. మంగళ, బుధవారాల్లో అక్కడ జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, ఏఐసీసీ సమావేశాల్లో పాల్గొనేందుకు ఉదయం ఆయన బయలుదేరి వెళ్లనున్నారు. ఈ సమావేశాల డ్రాఫ్ట్ కమిటీలో సభ్యులుగా ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దామోదర్ రాజనర్సింహ, వంశీచంద్‌రెడ్డి ఇప్పటికే అహ్మదాబాద్ చేరుకున్నారు. కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడి హోదాలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ సమావేశాల్లో పాల్గొంటారు. బుధవారం జరిగే ఏఐసీసీ సమావేశానికి రాష్ట్రం నుంచి ఏఐసీసీలో ప్రాతినిధ్యం వహిస్తున్న 41 మందితోపాటు ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర మంత్రులు, ఇతర నేతలు హాజరుకానున్నారు. వీరంతా మంగళవారం అహ్మదాబాద్ బయలుదేరుతున్నారు.

పెట్టుబడులు పెడితే సంపూర్ణ సహకారం

సింగపూర్ కాన్సుల్ జనరల్‌తో భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి



సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్‌ను సత్కరిస్తున్న భట్టి

సాక్షి, హైదరాబాద్: గ్రీన్ ఎనర్జీ, రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ పునరుజ్జీవం, విద్య తమ ప్రభుత్వ ప్రాధాన్యరంగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ నేతృత్వంలోని ఆ దేశ బృందం సోమవారం సచివాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసింది. రాష్ట్రంతో ఆర్థిక సంబంధాలు బలోపేతం చేసేందుకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని, సహకారం అందించాలని ఎడ్గర్ పాంగ్ విజ్ఞప్తి చేశారు. ప్రాధాన్య రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ప్రదర్శిస్తే సంపూర్ణ సహకారం అందిస్తామని భట్టి హామీ ఇచ్చారు. గ్రీన్ ఎనర్జీ పాలసీ అమలులో భాగంగా సోలార్, హైడ్రో, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్టు వివరించారు. మొదటి దశ కింద రూ.600 కోట్లు కేటాయించామని, ప్రతి పాఠశాలను 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం నగరాల సమాహారమని, అత్యధిక పట్టణాలుండటంతో పట్టణాభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. సింగపూర్ పొలిటికల్ కాన్సుల్ వైష్ణవి వాసుదేవన్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు. అనంతరం సింగపూర్ బృందం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది.

బీసీలకు రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేశాం

చింతన్ శిబిర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సామాజిక న్యాయం, సాధికారతపై కేంద్ర సామాజిక న్యాయ శాఖ ఆధ్వర్యంలో డెహ్రాడూన్‌లో జరుగుతున్న చింతన్ శిబిర్ కార్యక్రమంలో మంత్రి పొన్నం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు మంత్రి సీతక్కతో కలిసి సదస్సుకు హాజరయ్యారు. ఇందులో భాగంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలను ప్రభుత్వం స్థాపించిందన్నారు. రాష్ట్రంలో ఏడాదిన్నర కాలంలో 69 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెప్పారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రారంభించిందని, ఈ పథకం కింద రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు ఆర్థిక సహాయం చేయనున్నట్లు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళలకు ఎన్నో పథకాలు ప్రారంభించిందన్నారు. రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పొన్నం వెల్లడించారు.

15 తర్వాత పనులు చేయం

- పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి
- బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డిమాండ్

సాక్షి, హైదరాబాద్: చేసిన కాంట్రాక్టు పనులకు బిల్లులు చెల్లించటంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తున్నందున ఈ నెల 15వ తేదీ తర్వాత ఎలాంటి ప్రభుత్వ పనులు చేపట్టబోమని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) తెలంగాణ శాఖ ప్రకటించింది. ఐదారేళ్ల నుంచి రాష్ట్రంలో సుమారు రూ.10-12 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. నీటి పారుదల శాఖ బిల్లులు రూ.6,500 కోట్లు, రోడ్లు భవనాల శాఖ బిల్లులు రూ.3 వేల కోట్లు, స్పెషల్ బిల్డింగ్ ఫండ్ (ఎస్బీఎఫ్) రూ.2 వేల కోట్లు, పంచాయతీరాజ్ శాఖలో రూ.1,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని బీఏఐ ప్రతినిధులు వెల్లడించారు. సోమవారం కొండాపూర్‌లోని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ కల్చరల్ సెంటర్‌లో బీఏఐ తెలంగాణ నూతన కమిటీని, సెంట్రల్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీఏఐ మాజీ జాతీయ అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు ఆఫ్ఘనిస్తాన్‌లో అయినా తేలిగ్గా పని చేయవచ్చు కానీ.. తెలంగాణలో చేయలేరని అన్నారు. బీఏఐ మాజీ జాతీయ అధ్యక్షుడు బొల్లినేని శీనయ్య మాట్లాడుతూ.. కాంట్రాక్టర్స్ తమ కార్యాలయంలో పనిచేసేవారికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. మోరీల నుంచి ఆనకట్టల వరకు అన్ని నిర్మాణ పనుల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని బీఏఐ హైదరాబాద్ సెంటర్ చైర్మన్ సల్లా శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా...

రాజ్యాంగాన్ని పాటించేవారే నిజమైన కాంగ్రెస్‌వాదులు

- జై సంవిధాన్ పాదయాత్రలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



పాదయాత్రలో జీవన్‌రెడ్డి తదితరులు

సారంగాపూర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని తు.చ. తప్పక పాటించేవారే నిజమైన కాంగ్రెస్‌వాదులని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో సోమవారం జై భీం.. జై బాపు.. జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రతిపౌరుడూ దేశంలో స్వేచ్ఛాజీవనం అనుభవిస్తూ, హక్కులు పొందగలుగుతున్నారన్నారు. కొందరు కాంగ్రెస్‌పార్టీ ముసుగు వేసుకున్నారని, వారికి కాంగ్రెస్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. తనకు పదవి ముఖ్యం కాదని, పదవి లేకున్నా ప్రజల మధ్యే ఉంటూ, వారి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. 'నేను జగిత్యాలను వీడేది లేదు.. ఇప్పుడు సర్వస్వతంత్రుడిని'అంటూ ఆయన వ్యాఖ్యానించారు.

మదర్‌డెయిరీ చైర్మన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం!

- యాదగిరిగుట్టలో 11 మంది డైరెక్టర్ల రహస్య సమావేశం

యాదగిరిగుట్ట: ఉమ్మడి నల్లగొండ–రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (మదర్ డెయిరీ) చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టేందుకు కొందరు డైరెక్టర్లు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ మేరకు 11 మంది డైరెక్టర్లు యాదగిరిగుట్టలోని రెడ్డి సత్ర భవనంలో సోమవారం రహస్యంగా సమావేశమైనట్టు సమాచారం. చైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి గెలిచిన తర్వాత.. ఆరు నెలలుగా సంస్థలో పాలు పోసే రైతులకు బిల్లులు చెల్లించకపోవడంతో పాటు ఉద్యోగులకు సరిగ్గా జీతాలు ఇవ్వడం లేదంటూ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. డెయిరీ పరిధిలో 15 మంది డైరెక్టర్లు ఉండగా, వీరి నుంచి మధుసూదన్‌రెడ్డి చైర్మన్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 9 మంది, బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు డైరెక్టర్లు గుట్టలో జరిగిన సమావేశంలో పాల్గొన్నట్టు తెలిసింది. ఈ డైరెక్టర్లంతా ముందుగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కలిసి బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వంతో మాట్లాడాలని కోరినట్టు తెలిసింది.

కేటీఆర్ పరువునష్టం కేసు జూలై 11కి వాయిదా

సిటీ కోర్టులు: మంత్రి కొండా సురేఖపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, ఎక్సైజ్ కోర్టులో సోమవారం జరిగింది. కొండా సురేఖ తన పరువుకు భంగం కలిగించారని, ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కేటీఆర్ పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో గత విచారణలోనే కేటీఆర్‌తోపాటు సాక్షుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకుంది. దీనిపై విచారణ చేపట్టిన జడ్జి ఎస్.శ్రీదేవి.. తదుపరి విచారణను జూలై 11కి వాయిదా వేశారు.

పట్టాభిషిక్తుడైన భద్రాద్రి రామయ్య

- రాజలాంఛనాలతో ప్రత్యేక పూజలు
- సామ్రాట్ కిరీటధారిగా దశరథ రాముడు
- వేడుకలకు హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జగదభిరాముడికి సోమవారం పట్టాభిషేక మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. సీతారాముల కల్యాణం మరుసటి రోజున పుష్యమి నక్షత్రం సందర్భంగా మిథిలా స్టేడియంలో రామయ్యకు పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 10 గంటలకు శంఖ, చక్ర, ధనుర్బాణాలు ధరించిన సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను పల్లకీ సేవగా బయటికి తెచ్చారు. మేళతాళాలు, కోలాటం, భజంత్రీలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ సింహాసనంపై కొలువుదీర్చారు. వైదిక మంత్రాలతో వశిష్టుడు, వామనుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, విజయుడు, సుయజ్ఞుడును వేద పండితులు వరింప జేసుకున్నారు.

సప్త సముద్రాలు, సకల నదుల జలాలు

పట్టాభిషేకం జరిగే ప్రధాన మండపానికి ముందు మూడు ఉప మండపాల్లో మూడు కలశాలను ఏర్పాటు చేశారు. ఒక మండపంలో సముద్ర, నదీ జలాలను ఆవాహన చేశారు. మరో కలశంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతోపాటు రామ పరివారాన్ని ఆవాహన చేశారు. మరో కలశంలో అష్టదిక్పాలకులను, పట్టాభిషేకానికి ఉపయోగించే వస్తువులతోపాటు ఆది దేవతలను ఆవాహన చేస్తూ చతుర్వేద హవన పురస్కృతంగా మండపత్రయ ఆరాధన నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శతనామార్చన చేశారు.



స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పక్కన మంత్రి తుమ్మల, తదితరులు

అటు రాజదండం, ఇటు రాజఖడ్గం

మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్న సుముహూర్తాన బంగారు సింహాసనంపై స్వర్ణఛత్ర, స్వర్ణపాదుక, రాజదండ, రాజపట్ట, రాజముద్ర, వజ్ర కిరీటాలను స్వామివారికి ప్రదానం చేశారు. లక్ష్మీదేవిని ఆవాహన చేసిన రాజముద్రికను కుడి చేతి వేలికి తొడిగారు. ఆ తర్వాత పూర్తి రాజ లాంఛనాలతో సామ్రాట్ కిరీటాన్ని శ్రీరాముడికి అలంకరించారు. రామదాసు చేయించిన పచ్చల పతకాన్ని శ్రీరాముడికి, చింతాకు పతకం సీతాదేవికి, రామ మాడను లక్ష్మణుడికి అలంకరించారు. స్వర్ణఛత్రం నీడలో ఎడమ వైపు రాజఖడ్గం, కుడి వైపున రాజదండంతో శ్రీరాముడిని అలంకరించారు. తలపై సామ్రాట్ కిరీటంతో గరుత్మంతుడు, వైనేతుడులు అందించే చామరల సేవను ఆస్వాదిస్తూ భక్తులకు రామయ్య దర్శనం ఇచ్చారు. అనంతరం మండపత్రయంలో మంత్రించిన జలాలను శ్రీరాముడిపై ప్రోక్షణ చేస్తూ పట్టాభిషేకాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత సీతాలక్ష్మణ సమేత రామచంద్రమూర్తికి మంగళహారతి ఇచ్చారు. చివరగా ముత్యాల దండతో ఆంజనేయుడి పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్

పట్టాభిషేక వేడుకకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత ఆలయానికి వచ్చిన గవర్నర్‌కు దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకోగా పండితులు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం గవర్నర్ పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్ పాల్గొన్నారు.

ఆదివాసీల ఆచార వ్యవహారాలు గొప్పవి

- గిరిజన మ్యూజియం ప్రారంభోత్సవంలో గవర్నర్



ఆదివాసీ కొమ్ముపాగాలతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే వెంకట్రావు, పక్కన పీవో రాహుల్

భద్రాచలం టౌన్: ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఆదివాసీ, గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవని, వాటిని ముందు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని ఆదివాసీ గిరిజన మ్యూజియాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆధునీకరించిన మ్యూజియంలో కలియదిరిగిన ఆయన ఆభరణాలు, సంగీత సామగ్రిని పరిశీలించడమే కాక ఫుడ్ కోర్టుల వద్దకు వెళ్లారు. అక్కడ ఆదివాసీ వంటకాలైన బొద్ది కూర పచ్చడిని రుచి చూసి 'బాగుంది.. తెలుగు రాక రుచి చెప్పలేకపోతున్నా'అంటూ ఇంగ్లిష్‌లో వ్యాఖ్యానించారు. ఈసారి తెలుగు నేర్చుకుని వచ్చి అన్ని వంటల రుచులను మీకు చెబుతానని తెలిపారు. ఆపై మూలికల ఆయిల్, ఇప్పపూవు లడ్డూలతో పాటు పలు రకాల స్వీట్లను ఆదివాసీలు గవర్నర్‌కు ఇవ్వగా ఆయన డబ్బు చెల్లించారు. కాగా, ఆదివాసీ గిరిజనుల ఆచార వ్యవహారాలకు సంబంధించి వస్తువులను సేకరించి ఒకచోట చేర్చడం సామాన్యమైన విషయం కాదంటూ 'గుడ్ జాబ్'అని ఐటీడీఏ పీఓ రాహుల్‌ను అభినందించారు.

అట్టహాసంగా కొత్త ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

- మండలి ప్రాంగణంలో చైర్మన్ గుత్తా సమక్షంలో ప్రమాణం చేసిన విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్, సత్యం, కొమరయ్య, అంజిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి
- హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్, కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: శాసనమండలి సభ్యులుగా ఇటీవల ఎన్నికైన ఏడుగురు సోమవారం మంత్రులు, పార్టీ ముఖ్య నేతల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. డాక్టర్ అద్దంకి దయాకర్, విజయశాంతి, కె.శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, పింగళి శ్రీపాల్‌రెడ్డి, మల్క కొమరయ్య, చిన్నమైల్ అంజిరెడ్డిలచేత మండలి ప్రాంగణంలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు డి.శ్రీధర్‌బాబు, ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, రఘునందన్‌రావు, డా.కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నర్సింహాచార్యులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, మాజీమంత్రి కె.జానారెడ్డి, ఎమ్మెల్యేలు బాలూ నాయక్, పద్మావతిరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మందుల శామేల్, బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని కొత్త ఎమ్మెల్సీలను అభినందించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్సీల కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. ప్రమాణం చేసిన వారందరికీ సభ నియమనిబంధనలతో కూడిన ప్రత్యేక కిట్, గుర్తింపు కార్డులను చైర్మన్ అందజేశారు.

- శాసనమండలి సభ్యుడి హోదాలో తనకు లభించే వేతనంలో 25 శాతాన్ని పార్టీకి విరాళంగా ఇస్తానని, అందులో 10 శాతం ఏఐసీసీకి, 15 శాతం టీపీసీసీకి ఇవ్వనున్నట్టు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రకటించారు.
- టీచర్ల సమస్యల పరిష్కారానికి మండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వెనుకాడబోనని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. టీచర్లు ఏ ఇబ్బంది వచ్చినా అన్నివేళలా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు.
- ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై, టీచర్లకు రావాల్సిన పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బిల్లుల కోసం పోరాటం చేస్తానన్నారు.

రేవంత్‌కు, కేసీఆర్‌కు మధ్య తేడాను ప్రజలు గమనించాలి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సాక్షి, హైదరాబాద్: 'దక్షిణ అయోధ్యగా పిలుచుకునే భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని గత పదేళ్లలో కేసీఆర్ పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. రాముని కల్యాణానికి కేసీఆర్ పట్టువస్త్రాలు తీసుకెళ్లాల్సి ఉండగా తన మనవడు హిమాన్షుతో పంపించి దేవుడిని అవమానించారు. ఆయన చర్యలతో రామభక్తులు ఎంతో మనోవేదనకు గురయ్యారు. అటు కేసీఆర్ నియంతృత్వ, అహంకారపూరిత వైఖరిని ప్రజలు గమనించాలి. ఇటు రేవంత్‌రెడ్డి ప్రజాపాలన, విశ్వాసాలపై ఆయనకున్న నిబద్ధతను పరిశీలించాలి'అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు భక్తిశ్రద్ధలతో రాములవారికి పట్టువస్త్రాలు సమర్పించడంతో రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. అదేరోజున సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో సీఎం నేలపై కూర్చుని ఆ కుటుంబంతో కలిసి భోజనం చేసిన తీరును తెలంగాణ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. ప్రభుత్వం ఏం చేసినా రాద్ధాంతం చేసే కేటీఆర్, హరీశ్‌రావు సన్నబియ్యం పంపిణీపై మాత్రం కిక్కురుమనడం లేదని సత్యం ఎద్దేవా చేశారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదు..

- ఢిల్లీ దర్బార్ విస్తరణ కొనసాగుతోంది..
- 'ఎక్స్' వేదికగా కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని, ఢిల్లీ దర్బార్ విస్తరణ (ఎక్స్‌టెన్షన్) ప్రభుత్వం కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం రాత్రి సంజయ్ 'ఎక్స్'వేదికగా స్పందిస్తూ.. రాష్ట్రంలో నాయకత్వ సంక్షోభం నెలకొందా? అని ప్రశ్నించారు. తెలంగాణలో రాజ్యాంగబద్ధమైన సరిహద్దులు కూలిపోయి చెదిరిపోయాయని, ఇది ప్రజా ప్రభుత్వం కాదని రబ్బర్ స్టాంప్ ప్రభుత్వమని మండిపడ్డారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తరచూ రాజ్యాంగ పరిరక్షణ అంటూ మాట్లాడుతుంటారని కానీ ఏఐసీసీ ఏజెంట్లను రిమోట్ కంట్రోల్‌తో తెలంగాణను నడిపేందుకు పంపించారని సంజయ్ ఆరోపించారు. రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జి, సీడబ్ల్యూసీ సభ్యురాలు ఇప్పుడు రాష్ట్రంలో 'డీ ఫ్యాక్టో'మంత్రిగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతీ రాష్ట్రానికి సంబంధించిన ఏదో ఒక అంశంలో జోక్యం చేసుకుంటున్నారని, తెలంగాణ విషయానికొస్తే హెచ్‌సీయూ సంబంధిత వ్యవహారాల్లో అధికారిక సమావేశానికి కూడా హాజరయ్యారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం–హెచ్‌సీయూల మధ్య ఏర్పడిన వివాదంలో ఏఐసీసీ ప్రతినిధి ప్రత్యేక ఆహ్వానితురాలిగా ఎలా కాగలిగారని బండి సంజయ్ ప్రశ్నించారు.

ఒక్క చాన్స్ ఇవ్వాలని ప్రాధేయపడతారా?

- 11 ఏళ్ల పాలనలో ఏం ఉద్ధరించారో సమాధానం చెప్పండి
- బీజేపీ తెలంగాణకు ఏం చేసిందో చర్చకు సిద్ధమా : టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలు తమకు ఒక్క చాన్స్ ఇవ్వాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రాధేయపడుతున్నారని టీపీసీసీ చీఫ్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. అలా ప్రాధేయపడడానికి ముందు 11 ఏళ్ల పాలనలో ప్రధాని మోదీ, బీజేపీ.. తెలంగాణ ప్రజలకు ఏం చేశారో, రాష్ట్రాన్ని ఏ మేరకు ఉద్ధరించారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవెల్లి వెంకటస్వామి, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్ల కొమురయ్య, టీపీసీసీ అధికార ప్రతినిధి బైకాని లింగంయాదవ్‌లతో కలిసి మాట్లాడారు. తెలంగాణకు బీజేపీ ఏం చేసిందో చర్చకు సిద్ధమా అని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు సవాల్ విసిరారు. తెలంగాణ కోసం బీజేపీ ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పదేళ్ల కాలంలో బంగారం లాంటి భూములను బీఆర్‌ఎస్ అమ్ముతుంటుంటే బీజేపీ నేతల కళ్లు మూసుకుపోయాయా అని ప్రశ్నించారు. బండి సంజయ్‌కు నిజంగా దమ్ముంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రంతో చర్చించి 9వ షెడ్యూల్‌లో చేర్పించాలని డిమాండ్ చేశారు. మతతత్వవాదాన్ని రెచ్చగొట్టే బీజేపీకి తెలంగాణలో అధికారం కల్లేనని, మత సామరస్యానికి, లౌకికవాదానికి కట్టుబడే ప్రజలు ఎన్నటికీ ఆ పార్టీని ఆదరించరనే విషయాన్ని ఆ ఇద్దరూ గ్రహించాలని మహేశ్‌గౌడ్ హితవు పలికారు. తమకు సంఖ్యాబలం లేకనే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, ఏ పార్టీకి మద్దతివ్వాలన్న దానిపై తాము ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. అసలు బీజేపీకి కూడా గెలిచేంత సంఖ్యాబలం లేదని, అయినా ఏ పార్టీని నమ్ముకొని బీజేపీ అభ్యర్థి నామినేషన్ వేశాడో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలన్నారు.

బీఆర్‌ఎస్ సభకు 3 వేల బస్సులు

- ఆర్టీసీకి బస్సుల కోసం రూ.8 కోట్లు చెల్లింపు
- ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో కేటీఆర్ భేటీ
- నేడు గ్రేటర్ పరిధిలోని నేతలతో సమావేశం
- త్వరలో నియోజకవర్గాలకు ప్రచార సామగ్రి
- రజతోత్సవ సభ ఏర్పాట్లు ముమ్మరం



సాక్షి, హైదరాబాద్: వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే పార్టీ రజతోత్సవ సభ కోసం బీఆర్‌ఎస్ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలవారీగా పార్టీ కీలక నేతలతో వరుస భేటీలు నిర్వహించి అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా జన సమీకరణపై పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు దిశా నిర్దేశం చేశారు. కేసీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు సమావేశాలు ఏర్పాటు చేసుకుని జన సమీకరణ ప్రయత్నాలు వేగవంతం చేశారు. గ్రామాలవారీగా లెక్కలు వేసుకుంటూ వాహనాలు సమకూర్చుకుంటున్నారు. సభకు తరలివచ్చే ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తల కోసం 3 వేల బస్సులు సమకూర్చాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్టీసీకి దరఖాస్తు చేసింది. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు సోమవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిశారు. బస్సులకు అద్దె కోసం రూ.8 కోట్ల చెక్కును సజ్జనార్‌కు అందజేశారు.

ఉమ్మడి వరంగల్ నేతలతో కేటీఆర్ భేటీ

ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సోమవారం నందినగర్ నివాసంలో భేటీ అయ్యారు. జన సమీకరణపై చర్చించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కనీసం రెండున్నర లక్షల మందిని సభకు తరలించాలని సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా ముఖ్య నాయకులు, క్రియాశీల కార్యకర్తలతో సమావేశాలను ఈ నెల 12వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పార్టీ ఇచ్చే ప్రచార సామగ్రిని క్షేత్ర స్థాయికి చేరవేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కోరారు. పార్టీ కండువాలు, జెండాలు, వాల్ పోస్టర్లు తదితర ప్రచార సామగ్రి పంపిణీ త్వరలో ప్రారంభమవుతుందని చెప్పారు. 'స్వరాష్ట్రాన్ని సాధించాం.. సగర్వంగా నిలబెట్టాం'నినాదంతో 'ఛలో వరంగల్'పేరిట రూపొందించిన రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను ఒకటిరెండు రోజుల్లో కేటీఆర్ ఆవిష్కరించనున్నారు.

నేడు 'గ్రేటర్'నేతలతో సమావేశం

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం ఉదయం 10.30కు తెలంగాణ భవన్‌లో జరగనుంది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ భేటీని సమన్వయం చేస్తారు. సభకు గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి జన సమీకరణపై ఈ సమావేశంలో చర్చిస్తారు. గ్రేటర్ పరిధిలోనే బీఆర్‌ఎస్‌కు ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉండటంతో జన సమీకరణను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది.

భట్టితో ఉద్యోగ జేఏసీ నేతల భేటీ

- ఉద్యోగుల సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లిన నేతలు



భట్టికి వినతిపత్రం ఇస్తున్న మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై ఈనెల 12న మంత్రివర్గ ఉపసంఘంతో సమావేశం నిర్వహిస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తదితరులు సోమవారం భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న 57 సమస్యలను లిఖితపూర్వకంగా వివరించారు. వాటి పరిష్కారం కోసం రూపొందించిన కార్యాచరణలో భాగంగా భట్టి విక్రమార్కతో సమావేశమై చర్చించారు. ఈ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘంతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరగా.. భట్టి పైవిధంగా స్పందించారు. అలాగే తహసీల్దార్ల, ఎంపీడీఓల తిరుగు బదిలీల విషయాన్ని పరిష్కరిస్తామన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఉద్యోగ జేఏసీ కో చైర్మన్ వంగా రవీందర్‌రెడ్డి, టీఎన్జీఓ ప్రధాన కార్యదర్శి ముజీబ్, టీజీఓ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజ ఫలానికి ట్రంప్ దెబ్బ

▶ మొదటి పేజీ తరువాయి

సాధ్యమైంది. తాజాగా ఈ పన్నులను 22 శాతం నుంచి 26 శాతం వరకు పెంచారు. ఈ సుంకాలు ఎగుమతి ధరలను గణనీయంగా పెంచుతాయి. దీనివల్ల అమెరికా ప్రజలకు భారత మామిడి ఖరీదైనదిగా మారి, ఇతర ప్రాంతాల మామిడితో పోటీ పడలేకపోవచ్చని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త టారిఫ్‌ల వల్ల ఎగుమతి ధరలు పెరిగినా, ఈ లాభం రైతులకు చేరే అవకాశం తక్కువగా కనిపిస్తోంది. ఎగుమతిదారులు సుంకాల భారాన్ని రైతులపై వేసే అవకాశం ఉంది. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించదనే ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా మార్కెట్‌లో డిమాండ్ తగ్గితే ఎగుమతి పరిమాణం కూడా తగ్గుతుంది. ఈక్వెడార్, ఇండోనేషియా వంటి దేశాలు తక్కువ ధరకు మామిడిని సరఫరా చేస్తే, భారత రైతులు మార్కెట్‌ను కోల్పోయే ప్రమాదం ఉంది. 'ఎగుమతులు తగ్గితే మా ఆదాయం తగ్గుతుంది. దేశీయ మార్కెట్‌లో ఇప్పటికే తక్కువ ధరలు వస్తున్నాయి'అని జగిత్యాల జిల్లాకు చెందిన రైతు రాజేందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి..

అమెరికా కొత్త సుంకాల వల్ల ఏర్పడే సంక్షోభం నుంచి తమను భారత ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు, ఎగుమతిదారులు కోరుతున్నారు. తగిన శిక్షణ, రాయితీలు ఇస్తేనే ఈ సంక్షోభాన్ని ఎదుర్కోగలమని చెబుతున్నారు. అమెరికా మార్కెట్‌లో పోటీ పడాలంటే కాయల నాణ్యత మెరుగుపరచడంతో పాటు ప్రభుత్వ సహకారం అవసరమని హైదరాబాద్‌కు చెందిన ఎగుమతిదారుడు ఒకరు పేర్కొన్నారు. ఈసారి తెలుగు రాష్ట్రాల్లో మామిడి ఉత్పత్తి గణనీయంగా తగ్గగా, తాజాగా టారిఫ్‌ల పిడుగు మరింత కుంగదీస్తోంది.

ప్రజల విశ్వాసం పొందేలా పనిచేయాలి

- అర్ధవార్షిక నేర సమీక్షలో డీజీపీ జితేందర్



మాట్లాడుతున్న జితేందర్. చిత్రంలో స్వాతి లక్రా, శిఖాగోయెల్, మహేశ్ భగవత్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రజల విశ్వాసం పొందేలా అంకితభావంతో పని చేయాలని పోలీసు అధికారులకు డీజీపీ జితేందర్ సూచించారు. ప్రజాభద్రతే లక్ష్యంగా పౌరులతో సత్సంబంధాలను పెంపొందించడానికి విజిబుల్ పోలీసింగ్ పెంచాలన్నారు. ఐపీఎస్ అధికారులు ప్రజలతో తరచూ మాట్లాడాలని సూచించారు. మహిళా ఐపీఎస్ అధికారులు మహిళల స్వీయఅభివృద్ధి, సాధికారతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. డీజీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన అర్ధవార్షిక నేర సమీక్షలో ఇంటెలిజెన్స్ డీజీ బి.శివధర్‌రెడ్డి, సీఐడీ డీజీ శిఖాగోయెల్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, శిక్షల శాతం పెరిగేలా దర్యాప్తులో నాణ్యత పెంచాలని, దర్యాప్తు ప్రక్రియలో క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్‌ఎస్) సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. 2024 ద్వితీయార్ధంలో నేరాలు..మొదటి అర్ధభాగంతో పోలిస్తే 4.9% తగ్గాయని సీఐడీ డీజీ శిఖాగోయెల్ తెలిపారు. దొంగతనాలు మినహా అన్ని ప్రధాన నేరాలు తగ్గాయన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పరిష్కారం 20.49% పెరిగిందన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై రాచకొండ సీపీ సుధీర్‌బాబు, శిక్షల రేటు మెరుగుపరచడానికి తీసుకున్న చర్యలను రామగుండం సీపీఅంబర్ కిశోర్ ఝా, దర్యాప్తు నాణ్యతపై ఖమ్మం సీపీ సునీల్‌దత్, పోస్ట్‌మార్టమ్ విధానాలు, ఫోరెన్సిక్ నివేదికలపై గాంధీ హాస్పిటల్ ఫోరెన్సిక్ హెడ్ డాక్టర్ కృపాకర్‌సింగ్ ప్రజంటేషన్ ఇచ్చారు.



గౌరవం అనేది గెలుచుకోవాల్సినది కాదు;
అది పోగొట్టుకోకూడనిది.
- ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 8 ఏప్రిల్ 2025

ట్రంప్ విధ్వంసం

'గ్రేట్ డిక్టేటర్' చిత్రంలో హిట్లర్ పాత్రధారిగా అభినయించిన చార్లీ చాప్లిన్ గ్లోబ్‌తో ఇష్టానుసారం ఆటలాడుకుంటున్న దృశ్యం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. కేవలం రెండేళ్లలో మీరు ప్రపంచానికే చండశాసనుడు కావొచ్చని చెప్పిన సలహాదారును... తనకు కాసేపు ఏకాంతం కావాలని బయటకు పంపి ఆ గ్లోబ్‌తో రకరకాల విన్యాసాలు చేస్తాడు. చివరికది మొహమ్మీదే భళ్లున బద్దలుకావటంతో ఆ ముచ్చట ముగుస్తుంది. జాత్యహంకారం తలకెక్కి ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకోవాలని కలలుగన్న హిట్లర్‌పై అది తిరుగులేని వ్యంగ్యాస్త్రం. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు అలాంటి ఆశలేం లేవుగానీ... వర్తమాన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అమరికను తలకిందులు చేయాలన్న సంకల్పం ... అందువల్ల అమెరికా భారీగా లాభపడుతుందన్న మూఢ విశ్వాసం ఆవరించినట్టుంది. పర్యవసానంగా గత గురువారం నుంచి అంతర్జాతీయ మార్కెట్లన్నీ అధోగతిలో పయనిస్తున్నాయి. ట్రంప్ విధించిన ప్రతిచర్య సుంకాలతో మాంద్యం ముప్పు తప్పదన్న భయం వెన్నాడుతుండగా ప్రధాన ఈక్విటీల విచ్చలవిడి అమ్మకాలతో మార్కెట్లు పతనమవుతున్నాయి. మన బీఎస్‌ఈ, నిఫ్టీల్లో ఒక్క రోజులో రూ. 14 లక్షల కోట్ల సంపద ఆవిరైందని చెబుతున్నారు. ఆఖరి క్షణంలో స్వల్పంగా కోలుకోవటం వల్ల ఇక్కడితో ఆగింది గానీ రేపన్నరోజు బాగుంటుందన్న భరోసా చాలామందికి లేదు. దేన్నయినా తట్టుకోగల సామర్థ్యమున్న మన ఆర్థిక వ్యవస్థవల్ల త్వరలోనే సాధారణ స్థితి ఏర్పడగలదని చెబుతున్న నిపుణులూ ఉన్నారు. అంతర్జాతీయంగా అయితే ఎక్కడా ఆశారేఖ కనబడటం లేదు. డాలర్ బలహీనపడటం, చమురు ధరలు పడిపోవటంలాంటి పరిణామాలన్నీ కేవలం మదుపరుల్లో తాత్కాలికంగా అలుముకున్న నిరాశా నిస్పృహల వల్లే అని నమ్మడానికి ఎవరూ సిద్ధంగా లేరు. చిత్రమేమంటే... ఇంత జరుగుతున్నా ఈ సంక్షోభాన్ని తాత్కాలికమైనదిగానే ట్రంప్ పరిగణిస్తున్నారు. తానిచ్చిన డోస్ పనిచేయటం మొదలెట్టాక అమెరికా ఆర్థిక వ్యవస్థ శరవేగంతో ఎదుగుతుందని విశ్వసిస్తున్నారు.

ఇదంతా చూస్తూ కూడా అధికార రిపబ్లికన్లు నోరెత్తరు. విపక్ష డెమాక్రాట్లూ మౌనంగానే ఉంటారు. సాధారణ ప్రజానీకం 'హ్యాండ్సాఫ్ ట్రంప్' అంటూ వేలాదిగా రోడ్లపైకొస్తున్నారు. మొత్తానికి ప్రపంచీకరణ కళ్లముందు కుప్పకూలుతోంది. ఈ ప్రపంచీకరణలో భాగస్వాములు కావటానికి ససేమిరా అన్న వర్ధమాన దేశాల పాలకులను నయానో భయానో దారికి తెచ్చి అక్కడి వనరులన్నిటినీ అమె రికా ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎడాపెడా వాడుకున్న అమెరికా... ట్రంప్ ఏలుబడి వచ్చాక దానికి విరుద్ధమైన పోకడలకు పోతోంది. ఇన్నేళ్లుగా అమెరికాను అన్ని దేశాలూ దోచుకున్నాయని ఎదురు ఆరోపిస్తోంది. గతవారం 'అమెరికా విముక్తి దినం' రోజున మిత్రులు, ప్రత్యర్థులన్న విచక్షణ కూడా లేకుండా సుంకాల మోత మోగించేందుకు ట్రంప్ అధ్యక్షుడికి వుండే 'ఎమర్జెన్సీ' అధికారాలను వినియోగించుకున్నారు. కేవలం యుద్ధ సమయాల్లో వాడుకోవాల్సిన ఈ అధికారాలను రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా ఆయన చేజిక్కించుకున్నా అమెరికన్ కాంగ్రెస్‌గానీ, ఇన్నాళ్లుగా స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహించిన రిపబ్లికన్లు గానీ, బహుళజాతి కార్పొరేషన్లు గానీ నోరెత్తక పోవటం ఆశ్చర్యకరం. కేవలం కెనడాపై విధించిన అదనపు సుంకాలను రద్దు చేయటం వంటి పరిమిత చర్య మినహా సెనేట్ మౌనంగా ఉండిపోయింది. ఈమాత్రం చర్యను కూడా ట్రంప్ మద్దతుదారులు సహించలేకపోతున్నారు. మాదకద్రవ్య ముఠాలను అదుపు చేయటానికి విధిస్తున్న సుంకాలను వ్యతిరేకిస్తారా అంటూ బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారు. ఈ సుంకాల విధింపు గుడ్డెద్దు చేలో పడిన చందాన ఉన్నదని జనాభా పెద్దగాలేని హెర్డ్ అండ్ మెక్‌డోనాల్డ్ ద్వీపాల వంటి అతి చిన్న ప్రాంతాలను సైతం వదలని తీరు గమనిస్తే తెలుస్తుంది.

ప్రపంచంలో అమెరికా స్థానాన్ని కైవసం చేసుకుని, అగ్రగామిగా నిలబడాలని దశాబ్దాలుగా చైనా పథకాలు పన్నుతోంది. ట్రంప్ దాన్ని వేగవంతం చేశారు. సుదీర్ఘకాలం నిర్మించుకున్న అనుబంధం కారణంగా ఇన్నాళ్లూ పాశ్చాత్య ప్రపంచం అమెరికాను సమర్థిస్తూ పోయింది. కెనడా, బ్రిటన్, జర్మనీ, జపాన్, ఆస్ట్రేలియా వంటివన్నీ అమెరికా ఏం చేసినా అది లోకకల్యాణం కోసమేనన్నట్టు వంతపాడాయి. ఇలాంటి అనుకూలతలు లేని కారణంగానే పూర్వపు సోవియెట్ అయినా, ప్రస్తుత రష్యా అయినా, చైనా అయినా దీటుగా నిలబడలేకపోయాయి. కానీ ట్రంప్ దాన్ని కాస్తా మార్చేశారు. కెనడా కొత్త ప్రధాని మార్క్ కేర్నీ మాటల్లో చెప్పాలంటే 'అమెరికా ఇక విశ్వసించదగ్గ భాగస్వామి కాద'ని తేలిపోయింది. జర్మనీ చాన్సలర్ కాబోతున్న ఫ్రెడరిక్ మెర్జ్ అయితే ఇంకాస్త ముందుకుపోయారు. అమెరికా నుంచి యూరప్ స్వాతంత్ర్యాన్ని సాధించాలని పిలుపు నిచ్చారు. ఇదంతా చివరకు ప్రపంచంలో చైనా పలుకుబడి పెరగడానికి దోహదపడుతుందన్న స్పృహ ట్రంప్‌కు లేకుండా పోయింది. నియమాల ఆధారిత ప్రపంచమే ధ్యేయం అంటూ ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనాకు వ్యతిరేకంగా క్వాడ్‌ను రూపొందించి అమెరికా మనల్ని అందులో భాగస్వాముల్ని చేసింది. సందర్భం వేరు కావొచ్చుగానీ ఆర్థికరంగంలో ఇవాళ అన్ని నియమాలనూ ఉల్లంఘిస్తున్న అమెరికాను క్వాడ్ విషయంలో మనం విశ్వసించవచ్చా అన్న సందేహం కలిగితే ఆశ్చర్యమేముంది? మౌలికంగా మార్కెట్లు కచ్చితమైన అంచనాల ఆధారంగా ముందుకు కదులుతాయి. మదుపుదార్లు స్వేచ్ఛగా, నిర్భయంగా పెట్టుబడులు పెడతారు. సంపద పోగవుతుంది. కానీ ట్రంప్ చర్యలతో అంతా తలకిందులైంది. ఇక, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోలుకోవటం ఇప్పట్లో సాధ్యమా?

రెండు ఉపయోగకర పర్యటనలు

విశ్లేషణ



టంకశాల అశోక్

ప్రధాని మోదీ ఈ నెల మొదటి వారంలో రెండు ఉపయోగకరమైన విదేశీ పర్యటనలు జరిపారు. మొదటిది - 4వ తేదీన థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన 'బిమ్‌స్టెక్' శిఖరాగ్ర సమావేశం కోసం. రెండవది - ఆ మరునాడు శ్రీలంకకు! ఈ రెండూ దేశ ప్రయోజనాలకు అవసరమైనవి కాగా, అదనంగా మరొకటి చెప్పుకోవాలి. బ్యాంకాక్‌లో ఆయన బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనుస్‌తో విడిగా సమావేశం కావటం.

లుక్ ఈస్ట్– యాక్ట్ ఈస్ట్

వివిధ దేశాల మధ్య పరస్పర సహకారాలే కాకుండా ఒక ప్రాంతానికి చెందిన దేశాల మధ్య అందుకోసం ప్రాంతీయ సంస్థలు ఏర్పడటం ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధ కాలం తర్వాత నుంచి ఉండగా, ఆ క్రమంలో ఇండియాకు సంబంధించి 1997లో వచ్చిందే 'బిమ్‌స్టెక్'. ఇటువంటివి సార్క్, హిందూ మహాసముద్ర తీర దేశాల సంస్థల పేరిట కూడా ఏర్పడ్డాయి గానీ, కారణాలు ఏవైనా అవి సంతృప్తికరంగా పనిచేయలేదు. ఆగ్నేయాసియాకు సంబంధించి 1967 నుంచి గత 57 ఏళ్లుగా విజయవంతంగా పనిచేస్తున్నది 'ఆసియాన్' (అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఆసియన్ నేషన్స్) ఒక్కటే.

'ఆసియాన్' దేశాలన్నీ భారత్ కన్నా చాలా చిన్నవి. వాటి ఆర్థిక వ్యవస్థలు కూడా చిన్నవే. ఆ పరిస్థితితో పోల్చినప్పుడు భారత్ కేంద్రంగా ఒక బలమైన ఆర్థిక సహకార వ్యవస్థ ఎప్పుడో ఏర్పడి బలపడ వలసింది. కానీ, విధానపరమైన లోపాల వల్ల ప్రభుత్వాలు కొంత కాలం అప్పటి సోవియట్ వైపు, తర్వాత పాశ్చాత్య ప్రపంచం వైపు చూశాయి గానీ చుట్టూ గల ఆసియా దేశాలను నిర్లక్ష్యం చేశాయి. ఈ వెనుకటి విధానాలకు భిన్నంగా మొదటిసారిగా 'లుక్ ఈస్ట్' పేరిట కొత్త విధానాన్ని ముందుకు తెచ్చింది, 1991లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు. ఆ విధంగా కొత్త దృష్టి అయితే ఏర్పడింది గానీ, ఆయనే అమలుకు తెచ్చిన ఆర్థిక సంస్కరణలు, వాటి అవసరాలను బట్టి అయినా తూర్పు దేశాలతో ఆర్థిక సంబంధాలు తగినంత అభివృద్ధి చెందలేదు. పీవీ ఐదేళ్ల పాలన తర్వాత రాజకీయ అస్థిరతలు ఏర్పడటం అందుకొక ముఖ్య కారణం. అప్పటికీ, విదేశాంగ వ్యవహారాలలో నిపుణుడైన గుజ్రాల్ నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాల కాలంలో విదేశాంగ మంత్రిగా, ప్రధానిగా పని చేసినపుడు 1997లో 'బిమ్‌స్టెక్' కోసం చొరవ తీసుకున్నారు. 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ- సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కో ఆపరేషన్' పేరిట ఏర్పడిన ఆ సంస్థలో మొదట ఇండియా, బంగ్లాదేశ్, శ్రీలంక, థాయ్‌లాండ్ సభ్య దేశాలు కాగా, తర్వాత నేపాల్, భూటాన్, మయన్మార్ చేరాయి. మోదీ ప్రధాని అయిన తర్వాత 'లుక్ ఈస్ట్'ను 'యాక్ట్ ఈస్ట్'గా మార్చి కొంత చురుకుదనం తెచ్చారు.

సుదీర్ఘ అశ్రద్ధ

ఇతర ఆసియా దేశాలతో కన్నా 'బిమ్‌స్టెక్' మధ్య సంబంధాలు మందకొడిగానే ఉన్నాయి. సంస్థ ఆర్థిక, రక్షణ సహకార విషయాలు అధికారుల స్థాయికి పరిమితం కాగా, ఈ నెల నాల్గవ తేదీ నాటి శిఖరాగ్ర సమావేశం ఏడేళ్ల తర్వాత జరగటం గమనించదగ్గది. ఏడు సభ్య దేశాలలో నేపాల్, భూటాన్ చిన్నవి, సముద్ర తీరం లేనివి అనుకున్నా, తక్కిన అయిదు కూడా ముఖ్యమైనవి, సముద్ర తీరం గలవి. సముద్ర మార్గ రవాణాలు, రక్షణలకు కీలకమైన ప్రదేశాల్లో ఉన్నాయి. ఈ రెండు అంశాలను 'బిమ్‌స్టెక్' లక్ష్యాలలో ప్రముఖంగా పేర్కొన్నారు కూడా! అయినప్పటికీ ఇంతకాలం కనిపించిన అలసత్వ వైఖరులు వాటికవే సరైనవి కాదు. ఈ పరిస్థితుల మధ్య బంగ్లాదేశ్, శ్రీలంక, మయన్మార్, థాయ్‌లాండ్‌లతో చైనా సన్నిహితమయ్యింది. అనగా, ఇండియాకు భౌగోళికంగా దగ్గరగా ఉండి, బంగాళాఖాత తీర ప్రాంతానివి అయి కూడా భారత్ వాటిని 'బిమ్ స్టెక్' ఏర్పాటు తర్వాత సైతం దగ్గర చేసుకోలేక, చైనాతో పోటీపడాల్సి వస్తున్నదన్నమాట. సంస్థలోని తక్కిన దేశాలకన్న భారత ప్రయోజనాలు విస్తృతమైనవి కావటం, బంగాళాఖాతం కీలక ప్రాంతంలో, అందులోనూ హిందూ మహాసముద్రానికి అనుసంధానమై ఉండటాన్ని బట్టి అటువంటి చొరవలు ఇండియాకే ఎక్కువ అవసరం. అయినా సుదీర్ఘ కాలం అశ్రద్ధలన్నవి ఎంత పొరపాటో చెప్పనక్కర లేదు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా తిరిగి శిఖరాగ్ర సమావేశం జరగటం మంచి పని. ట్రంప్ సుంకాల హెచ్చింపు చర్యలు సృష్టిస్తున్న ఒత్తిడుల మధ్య జరగటం మరింత మంచిదవుతున్నది. సమావేశంలో చర్చించిన ఆర్థిక సహకారం, అభివృద్ధి, శాస్త్ర-సాంకేతిక రంగాలు, రక్షణ వంటి అంశాలు షరా మామూలువే అయినా, 'ప్రపంచంలో ఏర్పడుతున్న అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా పరస్పర అభివృద్ధిపై దృష్టి పెట్టడం' అన్నది ప్రత్యేకంగా గమనించవలసిన ప్రకటన.



'బిమ్‌స్టెక్' సమావేశంలో ఇతర దేశాల నాయకులతో మోదీ

- ఇతర ఆసియా దేశాలతోకన్నా 'బిమ్‌స్టెక్' మధ్య సంబంధాలు మందకొడిగానే ఉన్నాయి. తాజా శిఖరాగ్ర సమావేశం ఏడేళ్ల తర్వాత జరగటం గమనించదగ్గది.
- మోదీకి అందజేసేందుకు యూనుస్ ఒక పాత చిత్రాన్ని తెచ్చారంటేనే సామరస్య వైఖరి కనిపిస్తున్నది. (2015లో ముంబయిలో జరిగిన సైన్స్ కాంగ్రెస్‌లో యూనుస్‌కు మోదీ బంగారు పతకం ప్రదానం చేసినప్పటి ఫొటో.)
- శ్రీలంక విషయానికి వస్తే, భౌగోళికతలు, ఆర్థిక, రక్షణ అవసరాలు, విభేదాలు అన్నింటా ఇండియా సంబంధాలు బంగ్లాదేశ్‌ను పోలి ఉండటం యాదృచ్ఛికమే.

బంగ్లా, లంకలతో సంబంధాలు

పోతే, ఇదే సంస్థలోని పొరుగు దేశమైన బంగ్లా నాయకునితో మోదీ సమావేశం, సంబంధాల పునరుద్ధరణకు దారితీసినట్లయితే ఉభయులకూ మేలు చేస్తుంది. ఇండియా జోక్యంతో 1971లో ఏర్పడిన ఆ దేశంతో సంబంధాలు ఈ 55 ఏళ్ళలో తరచూ ఒడిదుడుకులకు లోనయ్యాయి. ప్రధాని షేక్ హసీనా పతనం నుంచి కొద్ది నెలలుగా తిరిగి అదే పరిస్థితి తలెత్తింది. ఈ నాయకులిద్దరూ బ్యాంకాక్‌లో అసలు విడిగా సమావేశమవుతారా అనే సందేహాలుండేవి. కానీ, భారత ప్రధానికి అందజేసేందుకు బంగ్లా నాయకుడు జ్ఞాపక చిహ్నంగా ఒక పాత చిత్రాన్ని వెంట తీసుకువచ్చారంటేనే సామరస్య వైఖరి కనిపిస్తున్నది. బంగ్లాలో త్వరలో జరుగనున్న ఎన్నికలలో ఎవరు అధికారానికి రాగలదీ తెలియదు. ఇండియా మిత్ర పక్షమనుకునే షేక్ హసీనా 'అవామీ లీగ్'కు మాత్రం అవకాశాలు కన్పించటం లేదు. ఇండియాలో అనధికార శరణార్థి రూపంలో ఉన్న ఆమెను విచారణ నిమిత్తం తమకు అప్పగించాలని బ్యాంకాక్‌లో మోదీని బంగ్లా నాయకుడు మరొకమారు కోరారు. ఇరు దేశాల సంబంధాలలో ఇదొక చిక్కు ప్రశ్న. అక్కడ హిందువులపై దాడుల సమస్య అట్లానే ఉంది. వీటన్నింటినీ అధిగమిస్తూ 'బిమ్‌స్టెక్' లక్ష్యాల వైపు కదలటం రెండు దేశాలకూ పెద్ద పరీక్షే. కానీ ఉత్తీర్ణత సాధించక తప్పని పరీక్ష.

శ్రీలంక విషయానికి వస్తే, భౌగోళికతలు, ఆర్థిక, రక్షణ అవసరాలు, పరస్పర సహకారాలు, విభేదాలు అన్నింటి విషయాలలోనూ ఇండియా సంబంధాలు బంగ్లాదేశ్‌ను పోలి ఉండటం యాదృచ్ఛికమే కావచ్చు. అక్కడ సరికొత్త శక్తులు పూర్తి మెజారిటీలతో గెలిచి అధికారానికి రావటంతో పరిస్థితులు మారాయి. కొత్త అధ్యక్షుడు దిస్సనాయకే, దేశంలో నెలకొని ఉన్న సమస్యలు, వాటి నుంచి బయటపడి దేశాన్ని ముందుకు తీసుకుపోవాలనే పట్టుదల వల్ల, భారతదేశంతో గతంలో ఉండిన విభేదాలను మరచిపోయి పరస్పర సహకారం కోసం ప్రయత్నిస్తున్నారు. చైనాకు ఎంత సన్నిహితమైనా, తమ విధానం సంతులనమని కొత్తలోనే ప్రకటించటం, చైనా కన్న భారత్‌ను మొదట సందర్శించటం దిస్సనాయకే దౌత్యనీతికి రుజువులు. మోదీ సందర్శన సందర్భంగా ఇండిపెండెన్స్ స్క్వేర్ వద్ద స్వాగతం చెప్పిన అసాధారణ చర్య, ఆయనకు 'మిత్ర విభూషణ' పురస్కారం, తమ భూభాగాన్ని భారత వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగించనివ్వబోమన్న హామీ ఇదే కోవలోకి వస్తాయి. వివిధ ఆర్థిక, రక్షణ ఒప్పందాలు రెండు వైపుల నుంచి సజావుగా అమలైతే, ట్రంప్ ఆవిష్కరిస్తున్న కొత్త ప్రపంచపు సాధక బాధకాలను సమష్టిగా ఎదుర్కొన వీలవుతుంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

బయటపడటం ఎలా?



ట్రంప్ తన సుంకాలను ఉపసంహరించుకోవడానికి 93.62 శాతం అవకాశం ఉంది. లేదంటే అమెరికా కులీనవర్గం ఆయన్ని అధికారంలో కొనసాగనిస్తుందని అనుకోను. ఆయన్ని అభిశంసించడానికి మార్గాలు వెతుకుతుంది. ఇప్పుడు ట్రంప్‌కు కావాల్సిందల్లా తానొక గొప్ప వ్యవహర్తను అని చెప్పుకోవడానికి ఒక మంచి సాకు!

- అనింద్యో చక్రవర్తి, ఆర్థికాంశాల వ్యాఖ్యాత

పలకల స్థానం



మంచి పంట పొలాల మీద భారీ స్థాయి సౌర పలకలను ఏర్పాటు చేయడాన్ని ఎప్పుడూ అంగీకరించకూడదు. అది గ్రామీణ శోభను నాశనం చేయడమే కాదు, స్థానిక ఆహార సరఫరాను తగ్గిస్తుంది. అందుకే, బంజరు భూములు, కారు పార్కులు, ఇంటి పైకప్పుల మీద సౌర పలకలను ఉంచాలి.

- జేమ్స్ మెల్‌విల్, కమ్యూనికేషన్స్ కన్సల్టెంట్

సాంస్కృతిక మార్పు



జెనాలు చాలామంది మద్యపానాన్ని వదిలేస్తున్నారు. 'మీరెందుకు తాగడం లేదు?' అన్న ప్రశ్నను తప్పించుకోవడానికి ఎందరో సోడా నీళ్ల గ్లాసులతో కనబడుతున్నారు. పీర్ ప్రెషర్‌ను తట్టుకొని యువత ఇలా సొంత ఎంపిక చేసుకోగలగడం ఉపశమనంగా ఉంది. ఒక సాంస్కృతిక మార్పు ఏదో చోటు చేసుకుంటోందని పరిశ్రమ అంతర్గత వర్గీయులు కూడా చెబుతున్నారు.

- పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

ఇలా బయటపడొచ్చు!



ట్రంప్ సులభంగా బయటపడే మార్గం : నిజంగా అన్ని సుంకాలనూ ఆచరణలో పెట్టాలనుకోలేదనీ, మినహాయింపులకు బదులుగా అందరూ వరుసగా ఫేవర్స్ ఇచ్చి వెళ్తారని అనుకున్నాననీ చెప్పడం!

- పాల్ గ్రాహమ్, శాస్త్రవేత్త

డ్రోన్లే బలం



తమ డ్రోన్లు సొంతంగా తయారుచేసుకోలేని ఏ దేశమైనా లొంగి ఉండాల్సిందే!

- నావల్ రవికాంత్, ఇన్వెస్టర్

ఇన్ బాక్స్

సత్యాన్వేషి

ఆధునిక భారత మేధావులలో రాహుల్ సాంకృత్యాయన్ ఒకరు. ఈ పేరు వినగానే గుర్తుకు వచ్చేది ఆయన ప్రపంచ ప్రఖ్యాత గ్రంథం 'ఓల్గా సే గంగా' (తెలుగులో ఓల్గా నుంచి గంగకు). అంతే కాదు ఆయన విస్తృతమైన యాత్రా సాహిత్యం; వేదాంత, బౌద్ధ, మార్క్సిస్టు తత్వాలను ఆకళింపు చేసుకున్న తీరు; జాతీయోద్యమంలో పోషించిన పాత్ర; టిబెట్ నుండి పురాతన తాళ పత్రాలు, ధర్మకీర్తి సాహిత్యం, బౌద్ధ గ్రంథాలను వ్యయ ప్రయాసలకోర్చి వాటి జన్మ స్థానానికి తరలించిన వైనం... ఇలా మరెన్నో పార్శ్వాలు సాక్షాత్కరిస్తాయి.

సాంకృత్యాయన్ స్వభావ రీత్యా సత్యా న్వేషి. అయితే మిగిలిన వారిలా గ్రంథ పఠనంలో మాత్రమే నిమగ్నం కాకుండా ఉర్దూ కవి బజిందా చెప్పినట్లు కొత్త ప్రదేశాలను సందర్శించి తన జ్ఞాన జిజ్ఞాసను తీర్చుకున్నారు. స్వాతంత్ర్యోద్యమ కార్యకర్తగా, రైతు ఉద్యమ సారథిగా కారాగార వాసాన్ని అనుభవించారు. ఆయన ఆర్య సమాజంలో సభ్యుడైనప్పటికీ పారమార్థికత, ఆత్మ వాదాల పట్ల ఆసక్తిని చూపలేదు. పైపెచ్చు మార్మికవాదాన్ని, బాబాలను గర్హించారు. బౌద్ధం నుండి మార్క్సిజం వైపు పయనించి భౌతిక, అనాత్మ వాదాల దరి చేరారు. మార్క్సిస్టుగా కొనసాగుతూ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆ శిబిరంలో ఆయన రామ్ మనోహర్ లోహియా, జయప్రకాశ్ నారాయణ్, నరేంద్ర దేవాలతో కలసి పనిచేశారు.



రాహుల్ సాంకృత్యాయన్

సైద్ధాంతికంగా శిబిరాలు మారినా సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యాల పట్ల ఆయన విశ్వాసం అచంచలమైనది. కాశీలో పురోహిత వర్గం ఆయనను 'మహా పండిత' బిరుదుతో సత్కరించిన కొద్ది కాలానికే ఆయనను దాదాపు వెలి వేయ డానికి కారణం... ఆయన కుల వ్యవస్థను, బ్రాహ్మణాధిపత్యాన్ని నిర్ద్వంద్వంగా ఖండించడమే! 'ఓల్గా నుంచి గంగకు' చివరి అంకంలో కులవ్యవస్థపై గాంధీ – అంబేడ్కర్‌ల భేదాభిప్రాయాన్ని వివరిస్తూ అంబేడ్కర్‌ను సమర్థించారు రాహుల్. ఆయన పయనించిన మార్గం మనందరికీ అనుసరణీయం.

– ప్రొ॥ కొట్టు శేఖర్, మిజోరాం విశ్వవిద్యాలయం
(రేపు రాహుల్ సాంకృత్యాయన్ జయంతి)

బెయిల్ నియమం! జైలు మినహాయింపు!!

అభిప్రాయం



డా॥ మంగారి రాజేందర్

తీవ్రత లేని కేసుల్లో కూడా బెయిల్‌ని ట్రయల్ కోర్టు తిరస్కరించే ధోరణి పెరుగుతున్నందుకు సుప్రీంకోర్టు ఈమధ్య తీవ్ర ఆందోళన వ్యక్తపరిచింది. ప్రజాస్వామ్య రాజ్యం పోలీసు రాజ్యంగా మారకూడదని న్యాయమూర్తులు అభయ్ ఎస్. ఓకా, ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెయిల్ దరఖాస్తులను ట్రయల్ కోర్టులు అనవసరంగా తిరస్కరించడం వల్ల సుప్రీంకోర్టు మీద అనవసర భారం పడుతోందని, ట్రయల్ కోర్టు స్థాయిలో పరిష్కరించాల్సిన కేసులకు సంబంధించిన బెయిల్ పిటీషన్లను సుప్రీంకోర్టు పరిష్కరించవలసి రావడం మీద జస్టిస్ ఓకా దిగ్భ్రాంతిని వ్యక్తపరిచారు. దర్యాప్తు పూర్తి అయిపోయి చార్జిషీట్ దాఖలైన కేసుల్లో ముద్దాయి రెండు సంవత్సరాలకు పైగా నిర్బంధంలో ఉన్నప్పటికీ ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేయకపోవడాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం తప్పుపట్టింది. అది ఓ చీటింగ్ కేసు. ఆ కేసులో బెయిల్ కోసం సుప్రీం కోర్టు దాకా వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. 20 సంవత్సరాల క్రితం ఇలాంటి కేసుల్లో బెయిల్ పిటిషన్లు హైకోర్టులకు కూడా చేరేవి కావనీ, కానీ ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా అలాంటి పిటీషన్లతో నిండి పోతోందనీ అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం పేర్కొంది.

ప్రజాస్వామ్య దేశంలో దర్యాప్తు సంస్థలు అనవసరంగా అరెస్టు చేయడానికి వీల్లేదనీ, పోలీసు రాజ్యంగా మార్చకూడదనీ సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర పదజాలంతో తన ఉత్తర్వులలో పేర్కొంది. కస్టడీ అవసరం లేని కేసుల్లో వ్యక్తులను అరెస్టు చేయకుండా సుప్రీంకోర్టు 2022లో జారీ చేసిన ఉత్తర్వులను కూడా ధర్మాసనం గుర్తు చేసింది. ప్రజల స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత కోర్టుల మీద ఉంది. అందుకని బెయిల్ మంజూరు చేసే విషయంలో కోర్టులు ఉదారంగా ఉండాలి.

'బెయిల్ అనేది నియమం. జైలు అనేది దానికి మినహాయింపు'. ఈ ప్రాథమిక చట్టపరమైన సూత్రాన్ని కోర్టులు పదేపదే విస్మరిస్తున్నాయి. దీనికి ఉదాహరణగా సుప్రీంకోర్టు ముందుకు వచ్చిన ఈ కేసుని పేర్కొనవచ్చు. ఈ కేసులో ముద్దాయి మోసం కేసులో నిందితుడు. రెండు సంవత్సరాలకు పైబడి కస్టడీలో ఉన్నాడు. పోలీసులు తమ దర్యాప్తును పూర్తి చేశారు. చార్జిషీట్‌ను కూడా దాఖలు చేశారు. అయినప్పటికీ అతని బెయిల్ పిటీషన్‌ను ట్రయల్ కోర్టు – గుజరాత్ హైకోర్టులు తిరస్కరించాయి. చివరికి అతనికి బెయిల్‌ని సుప్రీంకోర్టు ఇవ్వాల్సి వచ్చింది.

బెయిల్ మంజూరు చేయడం గతంలో సరళంగా ఉండేది. ఇప్పుడు సంక్లిష్టంగా మారిపోయింది. జవాబు, రిజాయిండర్ (ప్రతి జవాబు); సర్రిజాయిండర్ లాంటి సంస్కృతి పెరిగిపోతోంది. ఎన్.డి. పి.ఎస్., మనీలాండరింగ్ లాంటి చట్టాలు నిరూపణా భారాన్ని ముద్దాయిపైనే మోపుతున్నాయి. దీనివల్ల రెగ్యులర్ బెయిల్ దరఖాస్తులు వెనకబడి పోతున్నాయి.



క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 437(4) ప్రకారం, అదే విధంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 480(4) ప్రకారం... బెయిల్ మంజూరు చేసినప్పుడు తగు కారణాలను రాయాల్సి ఉంటుంది. బెయిల్ తిరస్కరించినప్పుడు ఎలాంటి కారణాలూ రాయాలని చట్టం నిర్దేశించలేదు. ఇప్పుడు కొత్త చట్టాలు వచ్చాయి. ఈ చట్టాల ప్రకారం తగు కారణాలు మాత్రమే కాదు, ఎందుకు బెయిల్ మంజూరు చేయాల్సి వస్తుందో కూడా వివరంగా రాయాల్సి ఉంటుంది. ఇది రాయడం కొంత కష్టమైన పని. తగు సమయం అవసరమవుతుంది. ఐ.పి.సి. కేసుల్లో అంత వివరమైన కారణాలు అవసరం లేదు. అయినా కోర్టులు బెయిళ్లను తిరస్కరించడానికే ఎక్కువ మొగ్గు చూపుతున్నాయి. బెయిల్ అనేది నియమం– జైలు అనేది మినహాయింపు అనే సూత్రాన్నే కోర్టులు పాటించాలి. మనీ లాండరింగ్, 'ఉపా' లాంటి కేసుల్లో ఈ సూత్రాన్ని కొన్ని మార్పులతో వర్తింపచేయాల్సి ఉంటుంది.

గత సంవత్సరం ప్రతి సుప్రీంకోర్టు బెంచ్ ప్రతిరోజూ కనీసం 15 నుంచి 20 బెయిల్ దరఖాస్తులను విచారిస్తోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్ అన్నారు. సుప్రీం కోర్టు గత నాలుగైదు సంవత్సరాల నుంచి బెయిల్ దరఖాస్తుల పరిష్కారానికే ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి వచ్చింది. దీనివల్ల రాజ్యాంగపరమైన వివాదాలను పరిష్కరించాల్సిన సమయాన్ని సుప్రీంకోర్టు ఈ కేసుల వివాదాలను పరిష్కరించడానికి వినియోగించాల్సి వస్తోంది. చాలా బెయిల్ దరఖాస్తులను జిల్లా న్యాయ వ్యవస్థ పరిష్కరించవచ్చు. బెయిల్ అనేది ఒక నియమం అన్న విషయం జిల్లా న్యాయవ్యవస్థకు తెలియని విషయం కాదు. కానీ వారు రకరకాల కారణాల వల్ల బెయిల్స్‌ను మంజూరు చేయడానికి వెనకాడుతున్నారు. అందులో ముఖ్యమైనది - బెయిల్ మంజూరు చేస్తే మోటివ్స్‌ని న్యాయమూర్తులకు అంటగడుతారనీ, అదే విధంగా హైకోర్టు పాలనాపరమైన చర్యలు తీసుకుంటుందన్న భయం కూడా న్యాయమూర్తులను వెంటాడుతోంది. హైకోర్టు, సుప్రీంకోర్టులు కూడా బెయిల్స్ విషయంలో రకరకాలైన అభిప్రాయాలు, ఉత్తర్వులను జారీ చేశాయి. అది కూడా మరో కారణం. అందుచేత ఈ మధ్యన బెయిల్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు నిలకడగా ఉన్నాయి. 'బెయిల్ అనేది నియమం. తిరస్కరించడమనేది మినహాయింపు' అనే సూత్రానికి అనుగుణంగానే సుప్రీంకోర్టులు తీర్పులు ఉన్నాయి. జిల్లా న్యాయ వ్యవస్థ ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని బెయిల్స్‌ను ఉదారంగా ఇవ్వాల్సిన అవసరం ఉంది. రాజకీయ ప్రేరేపిత కేసుల సంఖ్య పెరుగుతున్న కాలంలో సుప్రీంకోర్టు, హైకోర్టులపై పని భారం పెంచకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా న్యాయ వ్యవస్థపై ఉంది.

వ్యాసకర్త తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ మాజీ డైరెక్టర్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు

సత్యమేవ జయతే!

'సత్యమే చివరకు జయిస్తుంది, అసత్యం కాదు' అని వేల ఏండ్ల కిందటే మన శాస్త్రాలు చెప్పాయి. 'సత్యం వద, ధర్మం చర' అని వేదం బోధిస్తుంది. అయినా ఎవరి మనసుల్ని గాయపరచకుండా సత్యాన్ని చెప్పటం కష్టం అని తెలుస్తుంది. సత్యాన్ని శ్రీకృష్ణుడు బోధించినప్పుడు ఎందరి మనోభావాలో దెబ్బతిన్నాయి, గౌతమ బుద్ధుడు బోధించినప్పుడూ అదే జరిగింది. నిన్న మొన్నటి వివేకానందుడు, దయానందుడు సత్యాన్ని వక్కాణించినప్పుడూ తమ మనోభావాలు దెబ్బతిన్నాయని చాలామంది అన్నారు. ఎందరో వారిపట్ల ద్వేషాన్ని పెంచుకొని వారిని హింసించటానికి, అవమానించటానికి, చివరకు చంపటానికీ సిద్ధపడ్డారు. కానీ కరుణామయులైన ఆ మహనీయులు లెక్క చేయక దృఢ సంకల్పంతో, పరోపకార బుద్ధితో, ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా సత్యాన్నే బోధించారు.



అజ్ఞానంలో కూరుకు పోయిన జనాల మనోభావాలు దెబ్బతినకుండా పదిలంగా అలాగే ఉండాలా లేక తాత్కాలికంగా వారి మనోభావాలు దెబ్బతిన్నా సరే చివరకు సత్యమేదో స్పష్టంగా వారికి తెలిసేట్టు చేయాలా అని వారు యోచించి... సత్యబోధ వైపే వారు పయనించారు. ఎవరి మనోభావాలో దెబ్బతింటాయని సత్యాన్ని చెప్పటానికి జంక రాదు. స్వార్థం లేకుండా, ఎదుటి వారి శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తే కొన్ని ఆపదలు, అడ్డంకులు ఎదురైనా సహించాలి. అనేకమంది మహనీయులు తాము కనుగొన్న ఏ సత్యాన్ని చెప్పినప్పుడైనా ఏదో మేర మనోభావాలు దెబ్బతిన్నవారు లేకపోలేదన్న విషయం మరువరాదు.

చివరకు శాస్త్రజ్ఞులు పరిశోధన చేసి, పరిశీలన చేసి, ప్రయోగం చేసి స్పష్టంగా ఋజువు చేసిన విషయాలు కూడా మతాధిపతుల మనోభావాల్ని దెబ్బతీసి, వారి ఆగ్రహాన్ని రగిల్చాయి కదా! సత్యమే నిలిచింది కదా! అజ్ఞానభరితమైన మనోభావాలను సంరక్షించటం ముఖ్యం కాదు, జ్ఞాన మిళితమైన, సత్యమనోభావాలను పెంచటం ముఖ్యం. ఎందుకంటే సత్యం... జ్ఞానం, అనంతం, బ్రహ్మ అన్నారు పెద్దలు!

– రాచమడుగు శ్రీనివాసులు



గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.11.20 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.10.29 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.11.01 నుండి 12.40 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.21 నుండి 9.10 వరకు, తదుపరి రా.10.52 నుండి 11.38 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.51 నుండి 10.28 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.53, **సూర్యాస్తమయం:** 6.10.

క్లుప్తంగా...

ఆయాతో అసభ్య ప్రవర్తన.. హెచ్‌ఎంపై కేసు

గచ్చిబౌలి: ఆయా పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు అందడంతో రాయదుర్గం జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడిపై లైంగిక వేధింపుల కేసు నమోదైన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాయదుర్గం ప్రైమరీ స్కూల్‌లో ఓ మహిళ (30) ఆయాగా పని చేస్తోంది. తనను చేయి పట్టుకొని లాగాడని, అసభ్య పదజాలంతో దూషించాడని రాయదుర్గం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎస్‌కె తాజ్‌బాబుపై మార్చి 28న ఫిర్యాదు చేసింది. ప్రాథమిక విచారణ చేసిన పోలీసులు హెచ్‌ఎంపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో బాలికకు లైంగిక వేధింపులపై నివేదిక కోరిన మహిళా కమిషన్

సికింద్రాబాద్: రైలు ప్రయాణంలో మైనర్‌బాలికపై లైంగిక వేధింపులు జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి నివేదిక ఇవ్వాలని జాతీయ మహిళా కమిషన్, రైల్వే పోలీసులను కోరింది. ఈనెల 2న రక్సెల్–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఒక వ్యక్తి కుటుంబం హైదరాబాద్ వస్తోంది. మహారాష్ట్రలోని కెల్జార్ రైల్వేస్టేషన్ సమీపంలో రాత్రి 2 గంటల సమయంలో ఆ కుటుంబానికి చెందిన బాలిక (12) రైలుబోగీలోని టాయ్‌లెట్‌కు వెళ్లింది. కాగా, బాలిక ఒక్కతే టాయ్‌లెట్‌కు వెళ్లడాన్ని గమనించిన ఓ యువకుడు లైంగిక వేధింపులకు గురిచేయడంతోపాటు, వీడియోలు చిత్రీకరించాడు. జరిగిన అఘాయిత్యాన్ని తెలుసుకున్న బాధితురాలి తండ్రి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగిన తరువాత ఇక్కడి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సంతోష్‌కుమార్ (22)ను అదుపులోకి తీసుకున్న సికింద్రాబాద్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా నిందితుడిని రిమాండ్‌కు తరలించిన విషయంపై మహిళా కమిషన్‌కు రైల్వే ఉన్నతాధికారులు నివేదికను పంపించారు.

గేట్ దిమ్మె కూలి బాలిక మృతి

- మరో బాలుడికి తీవ్ర గాయాలు


దీక్షిత

ఇబ్రహీంపట్నం: సరదాగా ఆడుకుంటున్న చిన్నారులపై దిమ్మెతో సహా గేట్ కూలిపడిన ఘటనలో ఓ బాలిక మృతిచెందగా మరో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా ఎల్మినేడుకు చెందిన బీసీ సంఘం నేత బజారు భిక్షపతి కూతురు దీక్షిత (11), కుమారుడు నవదీప్ ఆదివారం సాయంత్రం ఇదే గ్రామంలో ఉండే బాబాయి సతీశ్ ఇంటికి వెళ్లారు. గేటు వద్ద ఆడుకుంటుండగా అకస్మాత్తుగా గేట్‌తో పాటు దిమ్మె కూలి చిన్నారులపై పడటంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే నగరంలోని అస్పతికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం బాలిక మృతి చెందింది. నవదీప్‌కు కాలు విరగడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. దీక్షిత స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి, నవదీప్ నాలుగో తరగతి చదువుతున్నారు. నిన్న తల్లి.. నేడు తనయుడు

ఫుడ్‌పాయిజన్‌తో తల్లీకొడుకుల మృతి

- మృతురాలి సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు


పుష్పలత, నిహాల్(ఫైల్)

రుద్రంగి (వేములవాడ): ఫుడ్ పాయిజన్‌తో గంటల వ్యవధిలోనే తల్లీకుమారుడు మృతిచెందిన విషాదకర సంఘటన రుద్రంగి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కాదాసు పుష్పలత (35), నిహాల్ (6), శుక్రవారం రాత్రి ఇంట్లో రొట్టెలు తిని పడుకున్నారు. అనంతరం వాంతులు విరోచనాలు కావడంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించుకున్నారు. పరిస్థితి విషమించడంతో శనివారం కోరుట్ల, కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. చికిత్స పొందుతూ ఆదివారం తల్లి పుష్పలత మృతిచెందగా.. పరిస్థితి విషమించడంతో కొడుకు నిహాల్‌ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిహాల్ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రాణాలు కోల్పోయాడు. గంటల వ్యవధిలో తల్లీకొడుకులు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు

కాగా పుష్పలత, నిహాల్ మృతిపై అనుమానాలు ఉన్నాయని పుష్పలత అన్న పాలెపు శ్రీనివాస్ రుద్రంగి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. ఇంట్లో తరచూ గొడవలు జరిగేవని.. వాటిని మనసులో పెట్టుకొని పుష్పలత అత్తగారి కుటుంబ సభ్యులే విషప్రయోగం చేసి ఉంటారని ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశాడు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని పాలెపు శ్రీనివాస్ కోరారు. బాధితుల ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని రుద్రంగి ఎస్సై అశోక్ తెలిపారు.

రెన్యువల్‌కూ ఓ రేటుంది!

పెట్రోల్ డిస్పెన్సర్ స్టాంపింగ్ రెన్యువల్‌లో కొందరు అధికారుల చేతివాటం

- డిపార్ట్‌మెంట్ రుసుంపై డబుల్ వసూళ్లు.. లేకుంటే సవాలక్ష సాకులతో జరిమానాలు
- రాష్ట్ర కంట్రోలర్ దృష్టికి వెళ్లినా స్పందించని వైనం
- తూనికలు, కొలతల శాఖలో ఆగని అవినీతి


ఇన్‌స్పెక్టర్‌కు నగదు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్న డ్రైవర్

ఇదో మచ్చు తునక..

'గద్వాల జిల్లా అలంపూర్‌లోని పుష్పనాయుడు ఫిల్లింగ్‌స్టేషన్ డిస్పెన్సర్ మెషీన్ల స్టాంపింగ్ గడువు (ఫిబ్రవరి 9న) ముగుస్తుందని, బంకు యాజమాని 20 రోజులు ముందుగానే రెన్యువల్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే గడువు దాటిన రెండు రోజుల తర్వాత (ఫిబ్రవరి 11) ఫిల్లింగ్‌స్టేషన్‌ను సందర్శించి డిస్పెన్సర్ రెండు డ్యూయల్ నాజిల్‌కు రూ.3 వేల చొప్పున ఆరు వేలు, సీసీ ఫీజు కింద రూ.1,000, ఆలస్య రుసుం మొదటి త్రైమాసికం కింద 50 శాతం జరిమానా రూ. 3 వేలు విధించారు. మొత్తం రుసుం చెల్లించేందుకు ఆన్‌లైన్ ఆప్షన్ ఇవ్వడంతో యజమాని తక్షణమే చెల్లించడంతో స్టాంపింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. ఆ తర్వాత ఇన్‌స్పెక్టర్ డీఎస్‌ఎస్‌ఆర్ పుస్తకంపై ఆరా తీసి నిర్వహణ సరిగ్గా లేదన్న సాకుతో రూ. 25,000లు జరిమానా విధించి.. కేవలం రూ.5,000 చెల్లించినట్టు రశీదు చేతిలో పెట్టారు. ఇది ఒక్క ఫిల్లింగ్ స్టేషన్‌కు ఎదురైన పరిస్థితి కాదు.. అన్ని బంకుల స్టాంపింగ్ రెన్యూవల్స్‌లో దాదాపుగా ఇదే జరుగుతోంది.

సాక్షి, హైదరాబాద్: పెట్రోల్ బంకుల్లో డిస్పెన్సర్ మెషీన్లకు ఏటా స్టాంపింగ్ రెన్యువల్ తప్పనిసరి. దీని కోసం గడువుకు 30 రోజులు ముందే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 15 రోజుల్లో ఇన్‌స్పెక్టర్ బంకును సందర్శించి వెరిఫికేషన్ పూర్తి చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు డీఎల్‌ఎంఓ పోర్టల్‌కు చేరిన తర్వాత ఇన్‌స్పెక్టర్ ఆమోదంతో వెరిఫికేషన్ షెడ్యూల్ ఈ–మెసేజ్ ద్వారా యాజమానికి అందుతోంది. ఇన్‌స్పెక్టర్ ఆయిల్ కంపెనీ టెక్నీషియన్‌తో బంక్‌ను సందర్శించి డిస్పెన్సర్ మెషీన్లను పరిశీలించి ధ్రువీకరణతో వివరాలు నమోదు చేస్తా రు. ఆ తర్వాత స్టాంపింగ్ ఫీజు ఆప్షన్ ఇస్తారు. చెల్లింపు జరగగానే ఇన్‌స్పెక్టర్ డిజిటల్ సంతకంతో కూడిన ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ జారీ అవుతుంది. అయితే లంచాలకు అలవాటు పడిన కొందరు అధికారుల తీరు కారణంగా ఇవేమీ సవ్యంగా జరగడం లేదు.

నాజిల్‌కు రూ.1,750

పెట్రోల్ బంకుల డిస్పెన్సర్ నాజిల్‌కు స్టాంపింగ్ రెన్యువల్ కోసం రూ.1,750 చొప్పున ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అందులో రెన్యూవల్ ఫీజు రూ.1,500, సీసీ చార్జీలు రూ.250 ఉంటాయి. గడువు దాటితే మాత్రం మొదటి త్రైమాసికంలోపు 50 శాతం, రెండో త్రైమాసికంలో 100 శాతం, మూడో త్రైమాసికంలో 150 శాతం, నాలుగో త్రైమాసికంలో 200 శాతం జరిమానా చెల్లించాలి. అయితే ఇక్కడే కొందరు ఇన్‌స్పెక్టర్లు అనధికారికంగా వసూళ్లకు పాల్పడటం మామూలైంది.

జరిమానా సొమ్మును జేబులో వేసుకున్నారు

స్టాంపింగ్‌కు అదనంగా డబ్బులు ముట్టజెప్పలేదని డీఎస్ఎస్‌ఆర్ మెయింటెనెన్స్ సాకుతో జరిమానా విధించారు. నగదు రూ.25,000 వసూలు చేసి కేవలం రూ.5,000 మాత్రమే రశీదు ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ తీరుపై సీసీ కెమెరా వీడియో ఫుటేజీ, ఆధారాలను జత చేస్తూ రాష్ట్ర తూనికలు, కొలతల శాఖ కంట్రోలర్, ఉన్నతాధికారులకు ఈ–మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేశాను. హెడ్‌క్వార్టర్ ఏసీ (అడ్మిన్)కు కూడా వివరించా. ఫిర్యాదు చేసి 55 రోజులు దాటుతోంది. అయినా ఎలాంటి స్పందన లేదు.
– పుష్పనాయుడు, పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్, అలంపూర్

కంట్రోలర్ దృష్టికి తీసుకెళ్లా

అలంపూర్‌లోని ఫిల్లింగ్‌స్టేషన్ డిస్పెన్సర్ మెషీన్ల స్టాంపింగ్ వ్యవహారంలో ఇన్‌స్పెక్టర్‌పై వచ్చిన ఆరోపణలను రాష్ట్ర కంట్రోలర్ దృష్టికి తీసుకెళ్లాను. యాజమాని ఆడియో, వీడియో ఆధారాలతో సహా ఈ–మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసింది వాస్తవమే. నేను కూడా ఆ బంకు యజమానితో మాట్లాడాను. ఫిర్యాదుపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది.
– రాజేశ్వర్, అసిస్టెంట్ కంట్రోలర్ (అడ్మిన్) తూనికలు, కొలతల శాఖ, హైదరాబాద్

యానాం ఎమ్మెల్యే ఫొటోను పెళ్లి ప్రొఫైల్‌లో పెట్టి..

- 26 మంది యువతులను మోసం చేసిన కేటుగాడు
- విచారణలో గుర్తించిన జూబ్లీహిల్స్ పోలీసులు
- జోగడ వంశీకృష్ణపై పలు రాష్ట్రాల్లో 20కి పైగా కేసులు


వంశీకృష్ణ

బంజారాహిల్స్ (హైదరాబాద్): వివాహ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా పెళ్లిళ్ల పేరుతో యువతులను మోసగించిన ఘరానా మోసగాడు జోగడ వంశీకృష్ణ అలియాస్ చెరుకూరి హర్ష (33)ని కస్టడీకి తీసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు, తమ విచారణలో పలు ఆసక్తికరమైన విషయాలను రాబట్టారు. తన కాలేజ్‌మేట్ అయిన యానాం ఎమ్మెల్యే ఫొటోలను పెళ్లి ప్రొఫైల్‌లో తన ఫొటోగా పెట్టి నాలుగు రాష్ట్రాల్లో.. పెళ్లిళ్ల పేరుతో 26 మంది యువతులను అతను మోసం చేసినట్లుగా గుర్తించారు. గత నెలలో నగరానికి చెందిన ఒక వైద్యురాలిని షాదీ డాట్ కామ్ వెబ్‌సైట్ ద్వారా ఎన్‌ఆర్‌ఐగా పరిచయం చేసుకుని దాదాపు రూ.10 లక్షలకుపైగా మోసానికి పాల్పడ్డాడు. తన తల్లి అమెరికా నుంచి రాగానే వివాహం చేసుకుంటానని ఆమెను నమ్మించాడు. మోసాన్ని గ్రహించిన వైద్యురాలు గత నెలలో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు హర్షని అరెస్టు చేశారు. నిందితుడిపై హైదరాబాద్, రాచకొండ, విజయవాడ, ఖమ్మం పట్టణాలతో పాటు పలు రాష్ట్రాల్లో 20కి పైగా కేసులు ఉన్నట్లు గుర్తించారు. హర్షను ఐదు రోజుల కస్టడీకి తీసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు సోమవారం అతన్ని తిరిగి కోర్టులో హాజరుపర్చి జైలుకు తరలించారు. విచారణలో భాగంగా హర్షపై మరో ఐదు కేసులు నమోదై ఉన్నట్లు తెలిసింది. పోలీసులకు పట్టుబడకుండా స్నేహితుల పేరు మీద మూడు సిమ్‌కార్డులు తీసుకుని పలు మోసాలకు పాల్పడినట్లు విచారణలో గుర్తించారు. ఎన్‌ఆర్‌ఐగా నటించి పెళ్లిళ్ల పేరుతో మోసం చేసి సంపాదించిన డబ్బులతో వంశీకృష్ణ బెట్టింగ్‌లకు పాల్పడటమే కాకుండా విదేశీ టూర్లు కూడా చేసినట్లు పోలీసులు తెలిపారు.

కల్తీ కల్లుతో పలువురికి అస్వస్థత

- కామారెడ్డి జిల్లాలో ఘటన

బాన్సువాడ/నస్రుల్లాబాద్: కల్తీ కల్లు తాగి 42 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 12 మందిని మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి కల్లు డిపో నుంచి పలు గ్రామాలకు కల్లు సరఫరా అవుతోంది. సోమవారం ఈ కల్లు తాగిన అంకోల్, దుర్కి, దామరంచ గ్రామస్తులు పలువురు అస్వస్థతకు గురయ్యారు. కల్లు తాగిన తర్వాత కళ్లు తేలేయడం, మెడలు వెనక్కి పడేయడం చేస్తుండడంతో వారిని కుటుంబసభ్యులు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్రమంగా బాధితులు పెరుగుతుండడంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, అంకోల్ గ్రామానికి వెళ్లి వైద్య సిబ్బందికి సూచనలిచ్చారు. కల్తీ కల్లు బాధితులను వెంటనే ఆస్పత్రికి పంపించాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు సూచించారు. ఆరోగ్య సిబ్బంది స్థానిక గ్రామ పంచాయతీ వద్ద మందులను అందుబాటులో ఉంచారు. కాగా సోమవారం రాత్రి వరకు 42 మంది బాధితులు బాన్సువాడ ఆస్పత్రిలో చేరగా, వీరిలో 12 మందిని నిజామాబాద్ జీజీహెచ్‌కు పంపించారు. డిపోలోని కల్లును పరీక్షించామని, అందులో సీహెచ్ శాతం లేదని బాన్సువాడ ఎక్సైజ్ సీఐ యాదిరెడ్డి తెలిపారు. మరేదైనా మత్తు పదార్థం ఉందేమో తేల్చడానికి శాంపిల్స్ సేకరిస్తున్నామని చెప్పారు. కల్తీ కల్లు అమ్ముతున్న కల్లు దుకాణం నిర్వాహకుల లైసెన్స్ రద్దు చేయాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు.

సూర్యాపేట మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

- ఒక్కరోజే 40,930 బస్తాల ధాన్యం తీసుకువచ్చిన రైతులు


ధాన్యం రాశులు, బస్తాలతో నిండిన సూర్యాపేట వ్యవసాయ మార్కెట్

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు ధాన్యం పోటెత్తింది. ఈ యాసంగి సీజన్‌లో సోమవారం ఒక్కరోజే అత్యధికంగా 40,930 బస్తాల ధాన్యాన్ని రైతులు అమ్మకం కోసం మార్కెట్‌కు తీసుకొచ్చారు. ప్రస్తుతం సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ తదితర ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు పుట్లకొద్దీ ధాన్యం వెళ్తుండగా, మార్కెట్‌కు సైతం భారీగా వస్తోంది. ఈ మార్కెట్‌కు నిత్యం వరితో పాటు ఇతర అన్ని పంటలను రైతులు తీసుకొస్తుండగా 10 రోజులుగా ధాన్యం రాక పెరిగింది. ఈనెల 3న 27,192 బస్తాలు, మరుసటి రోజు 33,457 బస్తాలు వచ్చింది. మొన్నటి వరకు మార్కెట్‌కు సెలవులు ఉండడం, మరోపక్క కోతలు ముమ్మరం కావడంతో సోమవారం భారీగా ధాన్యం వచ్చింది. మరో 20 రోజుల పాటు ఇదే విధంగా ధాన్యం వచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

25 వేలకు పైగా జైశ్రీరాం రకం: ఇదిలా ఉండగా మార్కెట్‌కు అత్యధికంగా జైశ్రీరాం రకం ధాన్యం వచ్చింది. 25,318 బస్తాలు ఈ ధాన్యం వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. తర్వాత ఐఆర్ 64 రకం ధాన్యం 9,812 బస్తాలు, హెచ్‌ఎంటీ రకం 5,364 బస్తాల ధాన్యం వచ్చింది. అత్యల్పంగా ఆర్‌ఎన్‌ఆర్ రకం 20 బస్తాల మేర అమ్మకానికి వచ్చింది. రోజువారితో పోలిస్తే ధాన్యం అధికంగా రావడంతో కొంతమేర ధరలు తగ్గినట్లు రైతులు చెబుతున్నారు.

'అక్క'కు న్యాయం జరిగేదెప్పుడో..?

- 2012లోనే లొంగిపోయిన మావోయిస్టు పాశం స్వరూప
- పునరావాసం కింద ఇప్పటికీ అందని సాయం


స్వరూప

సాక్షి, వరంగల్: అడవుల్లో తుపాకీ పట్టి ఆ తరువాత జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టు.. తనకు లొంగుబాటు సమయంలో ప్రకటించిన పునరావాస సాయం కోసం అధికారుల చుట్టూ 13 ఏళ్లుగా ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుత సిద్దిపేట జిల్లా చేర్యాల (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా) మండలం కొమురవెల్లి గ్రామానికి చెందిన పాశం స్వరూప దాదాపు తొమ్మిదేళ్లు కమాండర్‌గా పనిచేసి 2012లో పోలీసులకు లొంగిపోయింది. ఆ సమయంలో పునరావాసం కింద 500 గజాల ఇంటిస్థలం, ఐదెకరాల వ్యవసాయ భూమి ఇస్తామని పోలీసు అధికారులు ప్రకటించారు. కానీ అలాట్‌మెంట్ చేయలేదు. దీంతో ఆమె కుటుంబపోషణ కోసం కొమురవెల్లి దేవస్థానం ప్రాంగణంలో పూలు అమ్ముకుంటూనే, తనకు ప్రభుత్వం పునరావాసం కింద ఇస్తానన్న భూమి కోసం పోరాటం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌కు వచ్చి మరో సారి కలెక్టర్‌కు తన బాధను ఏకరువు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను 'సాక్షి'పలకరించగా తన సమస్యను చెప్పుకుంది.

సింగరేణి ఆధ్వర్యంలో 50 మినీ చెరువుల నిర్మాణం

సాక్షి, హైదరాబాద్: భూగర్భ జలాల అభివృద్ధికి 'సింగరేణి నీటి బిందువు–జల సింధువు'అనే నినాదంతో కార్యక్రమాన్ని చేపట్టాలని సింగరేణి బొగ్గు గనుల సంస్థ నిర్ణయించింది. మైనింగ్ ప్రాంతంలోనూ, వెలుపల రెండు కిలోమీటర్ల పరిధిలో 50 మినీ చెరువులను ఏర్పాటు చేయనుంది. చెరువుల్లో పూడికతీత కూడా చేపట్టనుంది. సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ సోమవారం ఏరియా జనరల్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించి ఈ కార్యక్రమానికి సంబంధించి మార్గదర్శకాలు జారీచేశారు.

తుది దశలో ఆ మెట్రో డీపీఆర్‌లు

వారం, పది రోజుల్లో నార్త్, ఫోర్త్ సిటీ మెట్రో డీపీఆర్‌లు పూర్తి

- నిర్మాణ వ్యయంపై త్వరలో అంచనాలు
- రెండో దశ 'బి'కేటగిరీలో మూడు కారిడార్లు
- కేంద్రం అనుమతి కోసం ఎదురుచూపులు
- డబుల్‌డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌లపై ప్రతిష్టంభన



సాక్షి, హైదరాబాద్: మెట్రో రెండో దశ 'బి'విభాగం కింద ప్రతిపాదించిన నార్త్ సిటీ, ఫోర్త్ సిటీ మెట్రో ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు (డీపీఆర్‌లు) తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం మూడు కారిడార్‌ల అలైన్‌మెంట్‌లు, నిర్మాణ వ్యయంపై అంచనాలను సిద్ధం చేస్తున్నారు. మరో వారం, పది రోజుల్లో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ (హెచ్‌ఏఎంఆర్‌ఎల్) సంస్థ తుది మెరుగులు దిద్ది ప్రభుత్వానికి నివేదికలు అందజేయనుంది. మొదట్లో భావించినట్లుగా డబుల్‌డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌లకు అవకాశం ఉండకపోవచ్చన్నారు. జేబీఎస్ నుంచి మేడ్చల్ మార్గంలో డెయిరీ ఫాం వరకు హెచ్‌ఎండీఏ చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ మార్గంలో బేగంపేట్ ఎయిర్‌పోర్టు వద్ద 600 మీటర్ల సొరంగ మార్గాన్ని నిర్మించనున్నారు. దీంతో డబుల్ డెక్కర్‌పై ప్రతిష్టంభన నెలకొంది. మెట్రో కోసం ప్రత్యేకంగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అలాగే ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వరకు ప్రతిపాదించిన రూట్‌లో కూడా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ సాధ్యాసాధ్యాలపై సాంకేతిక, ఇంజనీరింగ్ నిపుణులు త్వరలో ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది. ఈ రూట్‌లో కూడా హెచ్‌ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రతిపాదించింది. ప్రస్తుతం కంటోన్మెంట్ ఏరియాలో రక్షణశాఖ నుంచి భూముల సేకరణపై ప్రతిష్టంభన నెలకొంది. రక్షణ శాఖ అధికారులతో హెచ్‌ఎండీఏ అధికారులు తాజాగా సమావేశమయ్యారు. మరోవైపు ఫోర్త్ సిటీకి ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌లో కొన్ని కిలోమీటర్లు భూమార్గంలో మెట్రో పరుగులు తీయనుంది. ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి మధ్యలో మెట్రో రైలు మార్గాన్ని నిర్మించాలనే ప్రతిపాదన ఉంది.

దశల వారీగా పనులు

జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24 కి.మీ., జేబీఎస్ నుంచి శామీర్ పేట్ వరకు 21 కి.మీ, ఫ్యూచర్‌సిటీ వరకు 41 కి.మీ. మెట్రో కారిడార్‌ల డీపీఆర్‌ల కోసం హెచ్‌ఏఎంఆర్‌ఎల్ దశలవారీగా క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించింది. ఈ కారిడార్‌లలో ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్‌తోపాటు భవిష్యత్తులో పెరగనున్న వాహనాల రద్దీపై ఇప్పటికే నివేదికలను రూపొందించారు. అలాగే జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్, పర్యావరణ ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేసి నివేదికలను సిద్ధం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మెట్రో రాక వల్ల నార్త్‌సిటీ వైపు వాహనకాలుష్యం భారీగా తగ్గుముఖం పట్టనుందని అంచనా. భూసామర్థ్య పరీక్షల్లో భాగంగా మేడ్చల్ మార్గంలో 14 చోట్ల, శామీర్ పేట్ మార్గంలో 11 చోట్ల పరీక్షలు పూర్తిచేశారు.

రెండో దశలో మొత్తం 162 కి.మీ.

మెట్రో రెండో దశలో ఇప్పటికే 5 కారిడార్‌లలో 76.4 కి.మీ. తోపాటు ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు 23 కి.మీ., శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వరకు 22 కి.మీ, ఫ్యూచర్‌సిటీ కారిడార్ 41 కి.మీ. చొప్పున మొత్తం 8 కారిడార్‌లలో 162.4 కి.మీ. వరకు మెట్రో కారిడార్‌లు విస్తరించనున్నారు. మెట్రో మొదటి దశలోని 69 కి.మీ.తో కలిపితే హైదరాబాద్‌లో మెట్రో సేవలు 231.4 కి.మీ.కు పెరగనున్నాయి. మొదట విస్తరించనున్న 5 కారిడార్‌లలో 2028 నాటికి సుమారు 8 లక్షల మంది ప్రయాణికులు, నార్త్‌సిటీ, ఫోర్త్‌సిటీ కారిడార్‌లతో కలిపి సుమారు 12 లక్షల మంది ప్రయాణించవచ్చని అంచనా. 2030 నాటికి మెట్రో ప్రయాణికులు 15 లక్షలు దాటే అవకాశం ఉంది. కాగా, హెచ్‌ఏఎంఆర్‌ఎల్ ఎండీగా ఎన్వీఎస్ రెడ్డిని త్వరలో తిరిగి నియమించనున్నట్లు సమాచారం.

నగరంలో నిషా ఎక్కువై...

- గ్రామాల్లో దొంగతనాలకు ప్రయత్నించి దొరికిన దొంగలు
- ఒక తుపాకీ, డమ్మీ రివాల్వర్, బుల్లెట్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

వర్గల్ (గజ్వేల్): ముగ్గురు దొంగలు కలిసి నగరంలోని సికింద్రాబాద్ ప్రాంతంలో దొంగతనాలకు పథకం వేశారు. అయితే నిషా ఎక్కువ కావడంతో, పథకాన్ని మార్చి గ్రామీణ ప్రాంతాలపై కన్నేశారు. అనూహ్యంగా వర్గల్‌లో పోలీసులకు దొరికిపోయారు. ఈ వివరాలను సోమవారం గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి మెదక్ జిల్లా రామాయంపేట మండలం నస్కల్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ ఎథిజాజ్ (22) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలాజీనగర్‌లో ఉంటున్నాడు. ఇతనితోపాటు జవహర్‌నగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి మహ్మద్ హిదాయత్‌అలీ అలియాస్ హిడ్డు (23), బాలాజీనగర్ ఆర్మీడెంటల్ కాలేజీ సమీపంలో ఉండే మద్దూర్ లాలు అలియాస్ నాని (24)లు మహిళలను టార్గెట్ చేస్తూ బంగారు చైన్లు, బైకుల దొంగతనాలు చేయడానికి కుట్రపన్నారు. ఇందులో భాగంగా ఎథిజాజ్, హిదాయత్ అలీలు బిహార్‌కు వెళ్లి ఓ రివాల్వర్, 38 బుల్లెట్లు కొనుగోలు చేశారు. ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జిలో మకాం వేసి చుట్టుపక్కల ప్రాంతాల్లో దొంగతనాలకు పథకం వేశారు. అయితే సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండటంతో విఫలమయ్యారు. దీంతో గ్రామీణ ప్రాంతాలు టార్గెట్‌గా సిద్దిపేట జిల్లా వర్గల్‌కు హోండా యాక్టివా ద్విచక్రవాహనంపై వచ్చి ఆదివారం రాత్రి పోలీసులకు దొరికిపోయారు. వీరిద్దరి సమాచారం మేరకు మూడో నిందితుడు మద్దూర్ లాలూను బాలాజీనగర్‌లోని అతని నివాసంలో పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి ఒక రివాల్వర్, మరో డమ్మీ రివాల్వర్, 35 బుల్లెట్లు, హోండా యాక్టివా వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సోమవారం జ్యుడీషియల్ రిమాండ్ కోసం గజ్వేల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచినట్లు పోలీసులు తెలిపారు.

కుమార్తె ప్రేమ వివాహం

- మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య


అజ్గర్‌పాషా

జూలపల్లి (పెద్దపల్లి): కన్న కూతురు ఓ యువకుడిని ప్రేమించి ఇంట్లో నుంచి వెళ్లిపోవడాన్ని జీర్ణించుకోలేక ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై సనత్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అజ్గర్‌పాషా (43) మహబూబాబేగం దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్దకుమార్తెకు వివాహం జరిపించి అత్తారింటికి పంపించారు. స్థానికంగా పదోతరగతి వరకు చదివిన చిన్నకూతురు (19) అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రేమించుకున్నారు. ఇద్దరి మతాలు వేరుకావడంతో తమ పెళ్లికి రెండు కుటుంబాల పెద్దలు అంగీకరించరని భావించి.. పెద్దలకు తెలియకుండా గతనెల 27వ తేదీ న ఇంట్లోనుంచి వెళ్లిపోయి వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలిసి అజ్గర్‌పాషా తీవ్ర మనస్తాపం చెందాడు. అప్పటినుంచి మద్యానికి అలవాటుపడి భార్యతో తరచూ గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో భార్యతో గొడవ లు, కూతురు వెళ్లిపోయిందన్న కలతతో ఆది వారం రాత్రి గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఏఐకి మానవమేధ

గూగుల్ సంచలన అంచనా



2030 కల్లా ఏజీఐ • మానవాళిపై తీవ్ర ప్రభావం

మానవునికి మాత్రమే సాధ్యమయ్యే అపార మేధస్సును త్వరలోనే కృత్రిమమేధ సాధించనుందని గూగుల్ సంస్థ సంచలన అంచనాకొచ్చింది. సృజనాత్మకత, మానవీయత, ఉద్వేగాలు మనిషికి మాత్రమే సొంతమని, మరమనుషుల్లాంటి కృత్రిమ మేధకు ఇవి సాధ్యం కాదని ఇన్నాళ్లూ శాస్త్రవేత్తల్లో ఉన్న అభిప్రాయాలు త్వరలో పటాపంచలు కాబోతున్నాయని గూగుల్ అనుబంధ డీప్‌మైండ్ సంస్థ సహ వ్యవస్థాపకుడు షేన్‌లెగ్ ఒక అంచనాకొచ్చారు. షేన్‌లెగ్ సహ రచయితగా సేవలందించిన ఒక విస్తృతస్థాయి నూతన పరిశోధన పత్రంలో సంబంధిత వివరాలున్నాయి. మానవాళికి కృత్రిమ మేధ పెనుముప్పుగా పరిణమించనుందని అధ్యయనం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది.

ఏజీఐతో వినాశనం

కృత్రిమ మేధ మానవ స్థాయి మేధస్సును సాధించడాన్ని ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) అంటారు. 2030 ఏడాదికల్లా ఏజీఐ సాకారమవుతుందని పరిశోధనా పత్రం అంచనా వేసింది. అసాధారణ ప్రజ్ఞాపాటవాలున్న ఏజీఐ సృష్టించే పెనుమార్పులకు మానవాళి వినాశనం చెందే ప్రమాదముందని అభిప్రాయపడింది. ''ఏజీఐ ఎంతటి తీవ్రమైన హాని కల్గిస్తుందనే విషయం కంటే ఆ హాని తాలూకు దుష్పరిణామాలను సమాజం ఏ మేరకు తట్టుకోగలదు, ఎంతమేరకు కోలుకుని మనుగడ సాగించగలదనేవే ఇక్కడ ప్రధానం'' అని పరిశోధన పత్రంలో అధ్యయనకారులు వ్యాఖ్యానించారు. అయితే మానవాళికి ఏజీఐ ఏ రకమైన హాని తలపెడుతుంది, వాటి తీవ్రత ఎంత ఉండొచ్చనే వివరాలను మాత్రం పేర్కొనలేదు. కాకపోతే ఏజీఐ ముప్పును ఎదుర్కొనేలా మానవాళి ఇప్పటినుంచే సంసిద్ధం కావాల్సిన అవసరం చాలా ఉందని నొక్కి చెప్పారు. గూగుల్, ఇతర కృత్రిమమేధ రంగ సంస్థలు కలిసి ఈ సమస్యకు ఉమ్మడి పరిష్కారం కనిపెట్టాలని సూచించారు.

ఏమిటీ ఏజీఐ?

కృత్రిమమేధ (ఏఐ) మరో ముందడుగు వేస్తే అదే ఏజీఐ. ఏఐ మనమిచ్చిన పనులు, టాస్క్‌లను మాత్రమే పూర్తి చేస్తుంది. అంతకుమించి సొంతంగా ఆలోచించదు. కానీ ఏజీఐ అలా కాదు. ఇచ్చిన పనిని ఎందుకిచ్చారు, అందులో ఎంత చేయాలి, ఆ పని అసలు నాకెందుకిచ్చారు, ఇచ్చిన డేటాలో భవిష్యత్తులో నా సొంతానికి పనికొచ్చేవి ఏమేమున్నాయి వంటివాటిని స్వీయసమీక్ష చేసుకోగలదు. అంటే సొంతంగా ఆలోచించగలదు. తుది ఫలితం పొందడం కోసం మనం ఏజీఐకు ఏదైనా సమాచారమిస్తే అది డేటాను అర్థంచేసుకుని, వాటి నుంచి కొత్త విషయాలను నేర్చుకుని, తనకు అన్వయించుకుని తుది ఫలితాన్నిస్తుంది. ఆ వివరాలను శాశ్వతంగా గుర్తుంచుకుంటుంది. దాంతో భవిష్యత్తులో మానవులు అడిగే, కోరే, అభ్యర్థించే విషయాలపై ఏఐ సైతం సొంత నిర్ణయం తీసుకున్నాకే పని మొదలుపెడుతుందని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో మానవమేధను బొపోసన పట్టే ఏజీఐ మనిషి దైనందిన జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే చర్చ ఇప్పుడు మొదలైంది.

అంతా అస్తవ్యస్తం


అందుబాటులో ఉన్న సమాచారంతో ఏజీఐ చాలా గిమ్మిక్కులు చేయొచ్చు. డేటాను తమకు అనుకూలంగా మార్చేయొచ్చు. దుర్వినియోగం చేయొచ్చు. తప్పులతడకగా డేటాలో మార్పులు చేయొచ్చు. డేటా ప్రాథమిక లక్ష్యాన్నే ఏమార్చొచ్చు. ఇతరులకు హాని తలపెట్టేందుకు ఇప్పటికే కొందరు ఏఐను విస్తృతంగా దుర్వినియోగం చేస్తున్న నేపథ్యంలో ఏజీఐ ఇంకెంత హాని తలపెట్టొచ్చనే అంచనాలను పరిశోధన పత్రం ప్రస్తావించింది. ''వచ్చే పదేళ్లలో ఏజీఐ అందుబాటులోకి రావొచ్చు. అది మానవమేధను మించిపోవచ్చు. అప్పుడది సొంతంగా ఆలోచిస్తూ తనకు నచ్చిన ఫలితాలనే ఇవ్వొచ్చు'' అని డీప్‌మైండ్ సీఈఓ డెమిస్ హసాబిస్ ఫిబ్రవరిలో ఆందోళన వ్యక్తంచేయడం తెలిసిందే. ఏజీఐలను సహేతుకతతో మానవాళి శ్రేయస్సుకు ఉపయోగపడేలా, వినాశనానికి తావులేకుండా అభివృద్ధి చేయాలని, సంబంధిత సంస్థలన్నింటిపై అజమాయిషీగా ఐరాస వంటి నియంత్రణ వ్యవస్థ ఉండాలని ఆయన కొంతకాలంగా పోరాటం చేస్తున్నారు. ''ఏజీఐ అత్యంత సురక్షిత వ్యవస్థగా మాత్రమే ఉండేలా, సంఘవ్యతిరేక శక్తుల చేతుల్లో పడకుండా పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ప్రపంచ దేశాల్లో ఏజీఐల కోసం ఎలాంటి పరిశోధనలు జరుగుతున్నాయనే దానిపై నిఘా ఉండాలి. మానవాళికి సురక్షితం కాని ప్రాజెక్టులపై కన్నేసి ఉంచేలా పెద్దన్న వంటి పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి'' అని డెమిస్ గతంలో అన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

గ్యాస్ బండపై రూ.50 వడ్డింపు

- సీఎన్‌జీపైనా రూపాయి పెంపు
- పెట్రోల్, డీజిల్‌పై రూ.2 ఎక్సైజ్ సుంకం
- పెట్రో భారం సామాన్యులపై ఉండదు

సాక్షి, న్యూఢిల్లీ: ఎల్పీజీ వినియోగదారులపై భారం మరింత పెరిగింది. గృహావసరాల ఎల్పీజీ సిలిండర్ ధరను 50 రూపాయలు పెంచుతూ కేంద్రం సోమవారం నిర్ణయం తీసుకుంది. ఇది సాధారణ వినియోగదారులతో పాటు నిరుపేద ఉజ్వల పథక లబ్ధిదారులకు కూడా వర్తిస్తుందని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి నుంచే పెంపు అమల్లోకి వచ్చింది. ఎల్పీజీ విక్రయాలపై పెట్రోలియం సంస్థలు నష్టాలు మూటగట్టుకుంటున్నందున ఈ నిర్ణయం తప్పలేదన్నారు. తాజా పెంపుతో దేశ రాజధానిలో ఎల్పీజీ సిలిండర్ ధర ఉజ్వల వినియోగదారులకు రూ.503 నుంచి రూ.553కు పెరిగింది. సాధారణ వినియోగదారులకు ధర రూ.853కి చేరింది. సీఎన్‌జీ ధరలను కూడా దాదాపు నాలుగు శాతం పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫలితంగా ఢిల్లీలో సీఎన్‌జీ ధర కిలోకు ఒక రూపాయి పెరిగి రూ.75.09కి చేరింది. వీటితో పాటు పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని కూడా కేంద్రం 2 రూపాయల చొప్పున పెంచింది. అయితే ఈ పెంపు రిటైల్ ధరలకు వర్తించబోదు. ఫలితంగా ఈ భారం సామాన్య వినియోగదారులపై పడబోదని పురి స్పష్టం చేశారు. ''అంతర్జాతీయంగా చమురు ధరలు బ్యారల్‌కు 70–75 డాలర్ల నుంచి 60 డాలర్లకు తగ్గిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్‌పై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం విధించాలని నిర్ణయించాం. దీనివల్ల కేంద్రానికి రూ.32 వేల అదనపు ఆదాయం సమకూరనుంది. సమీప భవిష్యత్తులో చమురు ధరలు పెరగని పక్షంలో పెట్రో ధరలను తగ్గించే అవకాశం కూడా ఉంది'' అని మంత్రి వెల్లడించారు. తాజా నిర్ణయంతో పెట్రోల్‌పై కేంద్రం పన్నులు లీటర్‌కు రూ.21.9కి, డీజిల్‌పై రూ.15.8కి చేరాయి. భారత్‌లో పెట్రోల్, డీజిల్ వార్షిక వినియోగం 16,000 కోట్ల లీటర్లు. మన చమురు అవసరాలకు 85 శాతం దాకా దిగుమతులపైనే ఆధారపడ్డాం.



ఎల్పీజీ సిలిండర్ ధర పెంపు ఇలా

నగరం	పాత ధర	కొత్త ధర
న్యూఢిల్లీ	803	853
హైదరాబాద్	855	905
కోల్‌కతా	829	879
ముంబై	802.5	852.5

మరో 50 శాతం వేస్తాం

చైనాకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం

- 34 శాతం ప్రతీకార సుంకాలపై ధ్వజం
- తక్షణం రద్దు చేయండి
- లేదంటే రేపట్నుంచే అమలు
- టారిఫ్‌లపై తగ్గేదే లేదన్న అధ్యక్షుడు



వాషింగ్టన్: చైనాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. అమెరికాపై 34 శాతం ప్రతీకార సుంకాలు విధించడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఆ నిర్ణయాన్ని మంగళవారంలోగా వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే బుధవారం నుంచి చైనాపై ఏకంగా మరో 50 శాతం అదనపు సుంకాలు విధిస్తానని సోమవారం హెచ్చరించారు. అంతేకాదు, ''చైనా విజ్ఞప్తి మేరకు పలు అంశాలపై ఆ దేశంతో పురోగతిలో ఉన్న అన్నిరకాల చర్చలనూ ఉన్నపళాన నిలిపేస్తాం. బదులుగా ఇతర దేశాలపై దృష్టి సారిస్తాం. ఆయా రంగాల్లో వాటితో బంధాలను పటిష్టం చేసుకుంటాం'' అని కుండబద్దలు కొట్టారు. చైనాపై ట్రంప్ ఇటీవలే 34 శాతం సుంకాలు విధించడం, బదులుగా అమెరికాపైనా అంతే శాతం సుంకాలు విధిస్తున్నట్టు చైనా ప్రకటించడం తెలిసిందే. అంతేగాక తమనుంచి అమెరికా దిగుమతి చేసుకుంటున్న పలు కీలక ఖనిజాలపై ఆంక్షలు కూడా విధించింది. దీనిపై ట్రంప్ తీవ్రంగా మండిపడుతూ తన సోషల్ మీడియా హాండిల్ ట్రూత్‌లో పలు పోస్టులు పెట్టారు. ''అమెరికా ఉత్పత్తులపై చైనా ఏళ్లుగా రికార్డు స్థాయిలో భారీ టారిఫ్‌లు వసూలు చేస్తోంది. అవి చాలవన్నట్టు నిన్న మరో 34 శాతం ప్రతీకార సుంకాలు విధించింది. ఇవిగాక చైనా కంపెనీలు అనైతిక సబ్సిడీలు, భారీ ద్రవ్య అవకతవకల వంటివాటికి పాల్పడుతూ వస్తున్నాయి! నేను విధించిన సుంకాలపై ఏ దేశమైనా ప్రతీకార చర్యలకు దిగితే సహించబోమని స్పష్టంగా హెచ్చరించా. వాటిపై అదనపు బాదుడు తప్పదని అప్పుడే స్పష్టం చేశా. చైనా ఇప్పుడు వాటిని రుచిచూడబోతోంది'' అని ప్రకటించారు.

అమెరికాలో ద్రవ్యోల్బణం లేదు

తన సుంకాల దెబ్బకు ప్రపంచ మార్కెట్లన్నీ పతనమవుతున్నా ట్రంప్ మాత్రం డోంట్ కేర్ అంటున్నారు. అమెరికా ద్రవ్యోల్బణం కోరల్లో చిక్కుతోందని ఆర్థిక నిపుణులంతా గగ్గోలు పెడుతున్నా అదేమీ లేదని చెప్పుకొచ్చారు. ఎవరేమన్నా సుంకాలపై తగ్గే ప్రసక్తే లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలంటికీ అమెరికా గత పాలకులు, తమను ఇంతకాలంగా దోచేసిన చైనా వంటి దేశాలే కారణమని నిందించారు. ''ఒక్కోసారి చేదుగా ఉన్నా చికిత్స తప్పదు. నా చర్యల ఫలితాలు ఇప్పటికే కన్పిస్తున్నాయి. చమురు ధరలు దిగొచ్చాయి. వడ్డీ రేట్లూ తగ్గుముఖం పడుతున్నాయి. ఆహార పదార్థాల ధరలూ తగ్గుతున్నాయి. ఇక ద్రవ్యోల్బణం ఎక్కడున్నట్టు? పలు దేశాలు అమెరికాను ఇంతకాలం పీల్చి పిప్పి చేశాయి. ముఖ్యంగా చైనా! ఇప్పుడు చూడండి, నా టారిఫ్‌ల దెబ్బకు చైనా మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. ఇకపై అమెరికాకు ప్రతి వారం ఏకంగా బిలియన్ల కొద్దీ డాలర్లు వచ్చిపడతాయి. చూసుకోండి'' అంటూ స్పష్టం చేశారు.

ఇక భారత్‌లోనే ఉత్పత్తి!

యాపిల్, సామ్‌సంగ్ యోచన

మొబైళ్ల తయారీ దిగ్గజాలు యాపిల్, సామ్‌సంగ్ ట్రంప్ టారిఫ్‌ల ప్రభావాన్ని తప్పించుకునే మార్గాల అన్వేషణలో పడ్డాయి. తమ అంతర్జాతీయ ఉత్పత్తి కేంద్రాలను లాభదాయక ప్రాంతాలకు తరలించాలని యోచిస్తున్నాయి. వియత్నాంపై 46 శాతం చైనాపై 34 శాతం చొప్పున సుంకాలు విధించిన ట్రంప్ భారత్‌పై 26 శాతంతో సరిపెట్టడం తెలిసిందే. దాంతో భారత్‌లో ఉత్పత్తిని వీలైనంతగా పెంచడంతో పాటు అంతర్జాతీయ ఉత్పత్తి వ్యవస్థలను వీలైనంత వరకూ ఇక్కడికి తరలించాలని యాపిల్, సామ్‌సంగ్ యోచిస్తున్నట్టు సమాచారం. యాపిల్ చాలా కాలంగా భారత్‌లో ఐఫోన్లు తయారు చేస్తోంది. ''చైనాలో ఉత్పత్తిని వీలైనంతగా తగ్గించుకోవాలని కంపెనీ నిర్ణయానికి వచ్చింది. ఇకమీదట అమెరికాకు కేవలం భారత్‌లో తయారైన ఐఫోన్లనే పంపనుంది. ప్రస్తుతానికి చైనాలో తయారు చేసిన ఫోన్లను యూరప్, లాటిన్ అమెరికా, ఆసియా దేశాలకు పంపిస్తుంది'' అని కంపెనీ వర్గాలను ఉటంకిస్తూ వార్తలొస్తున్నాయి. అంతేగాక ట్రంప్ టారిఫ్‌ల దెబ్బకు అమెరికాలో ఐఫోన్ల ధరలు 40 శాతం దాకా పెరగవచ్చంటున్నారు.

'హజ్' వీసాలపై సౌదీ నిషేధం

భారత్ సహా 14 దేశాలపై

రియాద్: హజ్ యాత్రికులకు నిరాశ కలిగించే వార్త. భారత్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ సహా 14 దేశాలపై సౌదీ అరేబియా వీసా నిషేధం విధించింది. ఈ ఏడాది హజ్ యాత్రకు ముందు వీసాల జారీని సౌదీ అరేబియా తాత్కాలికంగా నిలిపివేసింది. 2025 జూన్లో హజ్ ముగిసేదాకా ఉమ్రా, వ్యాపార, కుటుంబ సందర్శన వీసాల జారీని ఆపేసింది. హజ్ రద్దీ నియంత్రణకు, సరైన రిజిస్ట్రేషన్ లేకుండా హజ్ చేయడాన్ని నిరోధించడానికి ఈ చర్య తీసుకున్నట్టు తెలిపింది. గతంలో చాలామంది విదేశీయులు ఉమ్రా, విజిట్ వీసాలపై సౌదీలోకి ప్రవేశించారు. ఆపై అధికారిక అనుమతి లేకుండా చట్టవిరుద్ధంగా హజ్‌లో పాల్గొనడానికి ఎక్కువ రోజులు ఉండిపోయారు. ఇది తీవ్ర రద్దీకి దారితీసింది. వేడి, రద్దీ వల్ల 2024 హజ్ యాత్రలో 1,200 మంది యాత్రికులు మరణించారు. వీటిని నిరోధించడానికి వీసా నిబంధనలను కఠినతరం చేయాలని సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆదేశించారు. సవరించిన నిబంధనల ప్రకారం ఈ ఏడాది ఉమ్రా వీసాకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 2025 ఏప్రిల్ 13. అయితే హజ్ యాత్ర ముగిసేదాకా కొత్త ఉమ్రా వీసాల జారీ ఉండదు. హజ్ రద్దీ నియంత్రణకు మాత్రమే ఈ చర్య అని సౌదీ హజ్, ఉమ్రా శాఖ స్పష్టం చేసింది. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే ఐదేళ్ల నిషేధం విధిస్తారు. యాత్రికుల సంఖ్యను నియంత్రించడానికి ప్రతి దేశానికి నిర్దిష్ట హజ్ కోటా ఉంది.



సీఎం మమతకు తన ఆవేదన తెలుపుతున్న ఓ బాధితురాలు

తుదిశ్వాస వరకు పోరాడతాం

తొలగింపునకు గురైన టీచర్లకు మమత హామీ

కోల్‌కతా: సుప్రీంకోర్టు ఉత్తర్వులతో ఉద్యోగాలు కోల్పోయిన వారిలో అర్హులైన అభ్యర్థులకు బాసటగా నిలుస్తామని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హామీ ఇచ్చారు. తుదిశ్వాస వరకు పోరాటం సాగిస్తానని, జైలుకు వెళ్లాల్సి వచ్చినా భయపడేది లేదని స్పష్టం చేశారు. ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లు, సిబ్బందితో సోమవారం నేతాజీ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటైన సమావేశంలో సీఎం మమత ఉద్వేగంతో మాట్లాడారు. తొలగింపు ఆదేశాలు ఇప్పటి వరకు అందనందున, ఎప్పటిమాదిరిగానే స్కూళ్లకు వెళ్లి తమ విధులను స్వచ్ఛందంగా కొనసాగించాలని వారిని కోరారు. 2016లో నియమించిన 25,753 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది ఎంపికలో తీవ్ర అవకతవకలు జరిగాయని గుర్తించిన కలకత్తా హైకోర్టు వారందరినీ తొలగించాలంటూ 2024లో తీర్పు వెలువరించడం..దానిని తాజాగా సుప్రీంకోర్టు సమర్థించడం తెల్సిందే. సుప్రీంకోర్టు ఆదేశాలను పూర్తిగా పరిశీలించాక అర్హులైన అభ్యర్థుల ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైతే రివ్యూ పిటిషన్ వేస్తామన్నారు. ఒక వేళ తీర్పు మనకు అనుకూలమని తేలితే రెండు నెలల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడతామని ప్రకటించారు. అర్హులెవరూ ఉద్యోగాలు కోల్పోరాదని ఆమె పేర్కొన్నారు. ఉన్నఫళంగా ఉద్యోగులను తొలగిస్తే బడులు సాగేదెలా? ఉద్యోగాలు కల్పించలేని వారికి వారిని తొలగించే అధికారం కూడా ఉండరాదని వ్యాఖ్యానించారు. అయితే, అత్యున్నత న్యాయస్థానం తీర్పును తాము గౌరవిస్తామంటూ ఆమె.. తప్పులను సవరించే సమయాన్ని కూడా ప్రభుత్వానికి ఇవ్వలేదని పేర్కొన్నారు. సీనియర్ లాయర్లు అభిషేక్ సింఘ్వి, కపిల్ సిబాల్, రాకేశ్ ద్వివేది, కల్యాణ్ బెనర్జీ, ప్రశాంత్ భూషణ్‌లతో కూడిన బృందం ఉద్యోగాలు కోల్పోయిన వారి తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తారని ప్రకటించారు.

వినియోగదారుల ఫోరం అరెస్ట్ వారెంట్ ఇవ్వజాలదు

కలకత్తా హైకోర్టు స్పష్టీకరణ

కోల్‌కతా: వినియోగదారుల ఫోరంలకు అరెస్ట్ వారెంట్ జారీ చేసే అధికారం లేదని కలకత్తా హైకోర్టు స్పష్టం చేసింది. సాధారణ జైలులో నిర్బంధించాలంటూ ఉత్తర్వులు ఇచ్చేందుకు మాత్రమే అధికారముంటుందని పేర్కొంది. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార వేదిక ఇచ్చిన అరెస్ట్ వారెంట్‌ను సవాల్ చేస్తూ ఓ వ్యక్తి వేసిన పిటిషన్‌పై ఈ మేరకు తీర్పు వెలువరించింది. తన ఆదేశాల అమలు కోసం సీపీసీ (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్)కింద వారెంట్ ఇచ్చేందుకు అధికారం లేదని పేర్కొంది. ఇటువంటి ఆదేశాలు వినియోగదారుల రక్షణ చట్టంలో నిర్దేశించిన నిబంధనల పరిధిని అతిక్రమించడమే అవుతుందని తెలిపింది. ఓ వ్యక్తి ట్రాక్టర్ కొనుగోలు కోసం 2013లో ఓ ఫైనాన్స్ కంపెనీ నుంచి రుణం తీసుకున్నాడు. అతడు రూ.25,716 బకాయి చెల్లించలేదంటూ ఫైనాన్స్ కంపెనీ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుంది. దీంతో, బకాయిని పూర్తిగా చెల్లించిన ఆ వ్యక్తి ట్రాక్టర్‌ను, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను తనకు తిరిగి ఇప్పించాలంటూ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాడు. ఫోరం ఆదేశాలను ఫైనాన్స్ కంపెనీ యజమాని పట్టించుకోలేదు. దీంతో, ఫోరం అతడి అరెస్ట్‌కు వారెంట్ జారీ చేసింది. ఫోరం అధికారాలను సవాల్ చేస్తూ అతడు వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు పైవ్యాఖ్యలు చేసింది. ఫోరం వారెంట్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.



జమ్మూ కశ్మీర్ రాజ్‌భవన్‌లో కారుణ్య నియామక పత్రాన్ని అందజేస్తున్న అమిత్ షా

సరిహద్దుల్లో ఎలక్ట్రానిక్ నిఘా వ్యవస్థ

హోం మంత్రి అమిత్ షా వెల్లడి

జమ్మూ: దేశ సరిహద్దుల పరిరక్షణకు ఎలక్ట్రానిక్ సర్వైలెన్స్ సిస్టమ్‌ను మోహరిస్తున్నట్లు హోం మంత్రి అమిత్ షా తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవా దుల అక్రమచొరబాట్లను తిప్పికొట్టేందుకు, సరిహ ద్దుల్లో అండర్‌గ్రౌండ్ టన్నెళ్లను గుర్తించేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నామన్నారు. సరిహ ద్దుల కు ఆవలివైపు ఎలాంటి అనుమా నాస్పద కదలి కలున్నా ఈ నిఘా వ్యవస్థ కనిపెట్టి తక్షణమే స్పందిస్తుందన్నారు. జమ్మూకశ్మీర్‌లో మూడు రోజుల పర్యటనకు సోమవారం ఇక్కడికి ఆయన చేరుకు న్నారు. ఈ సందర్భంగా కథువా జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దుల్లో ఉన్న 'వినయ్' బోర్డర్ పో స్టును సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న బీఎస్ఎఫ్ జవాన్లతో మాట్లాడారు. అత్యంత సవాళ్లతో కూడిన పరిస్థితుల మధ్య విధులను సమర్థమంతంగా నిర్వహిస్తున్న జవాన్లను ఆయన ప్రశంసించారు. వానలు, భీకరమైన చలి, ఎండలను సైతం లెక్కచేయకుండా 365 రోజు లూ బోర్డర్ పోస్టుల్లో విధులు కొనసాగిస్తూ శత్రువుల కదలికలపై ఓ కన్నేసి ఉంచుతున్నారంటూ ప్రశంసించారు. ఇక్కడికి వచ్చి చూసిన వారికే జవాన్ల కష్టం ఏమిటో తెలుస్తుందంటూ వ్యాఖ్యానించారు.

అమరుల సంతానానికి ఉద్యోగాలు

అనంతరం మంత్రి అమిత్ షా రాజ్‌భవన్‌లో ఉగ్రవాదులతో పోరాటంలో నేలకొరిగిన 10 మంది పోలీసులు, ఒక ఇంజనీర్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారికి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కారుణ్య ప్రాతిపదికన మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఇటీవల కథువా జిల్లాలో పాక్ ఉగ్రవాదులతో జరిగిన పోరులో నేలకొరిగిన నలుగురు పోలీసు కుటుంబాల వారు కూడా వీరిలో ఉన్నారు. వీరమరణం పొందిన జశ్వంత్ సింగ్ కుమారుడు 12 ఏళ్ల యువరాజ్ సింగ్ కూడా కారుణ్య నియామక పత్రం అందుకున్నాడు. మేజర్ అయ్యాక ఇతడి నియామ కానికి అనుకూలమైన చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి కోరారు.

ఒమర్, రిజిజు భేటీపై రాజకీయ వివాదం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు శ్రీనగర్‌లోని తులిప్ గార్డెన్‌లో కలుసుకోవడం రాజకీయ దుమారం రేపుతోంది. వక్ఫ్ చట్టం విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) సానుకూల వైఖరి అవలంబించిన నేపథ్యంలోనే వీరిద్దరు కలుసుకున్నట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే, తన తండ్రి, మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా కోరిక మేరకు తులిప్ గార్డెన్‌కు వెళ్లిన ఒమర్‌కు అనూహ్యంగా అదే రోజు ఉదయం గార్డెన్‌కు వచ్చిన మంత్రి రిజిజు కలిశారని అధికార నేషనల్ కాన్ఫరెన్స్ అంటోంది. యోగక్షేమాలు తెలుసుకున్న అనంతరం ఎవరికి వారు వెళ్లిపోయారని చెబుతోంది. ఇదంతా కేవలం అనుకోకుండా జరిగిన పరిణామమని, దీన్ని అనవసరంగా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని ఆరోపించింది. అయితే, రిజిజు 'ఎక్స్'లో అబ్దుల్లాలతో కలిసి ఉన్న ఫొటోలను షేర్ చేయడం వివాదాన్ని రేపింది. వక్ఫ్ సవరణ చట్టంపై బీజేపీకి ఎన్‌సీకి లొంగిపోయిందని ప్రతిపక్ష పీడీపీ ఆరోపించింది. పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి రిజిజుకు తులిప్ గార్డెన్‌లో ఎన్‌సీ ఎర్ర తివాచీ పరిచిందని మరో నేత అన్నారు. సీఎం ఒమర్ తులిప్ గార్డెన్‌లో తారసపడిన కేంద్ర మంత్రి రిజిజుకు కనీసం దూరంగా ఉండటం ద్వారా నిరసన తెలిపి ఉండాల్సిందని పీపుల్స్ కాన్ఫరెన్స్ చీఫ్ సజాద్ లోనె పేర్కొన్నారు.

రాణా పిటిషన్ తిరస్కరణ

న్యూయార్క్: ముంబై ఉగ్ర దాడుల నిందితుడు తహవ్వుర్ రాణా (64)కు మరోసారి చుక్కెదురైంది. తనను భారత్‌కు పంపొద్దంటూ అతను పెట్టుకున్న పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. న్యూయార్క్‌లోని భారత సంతతికి చెందిన అటార్నీ రవీ బత్రా పీటీఐకి ఈ మేరకు వెల్లడించారు. ముంబై దాడులకు తెగబడ్డ పాకిస్తానీ ఉగ్ర సంస్థ లష్కరే తొయిబాకు సాయపడటమే గాక డెన్మార్క్‌లో ఉగ్ర దాడికి అన్నివిధాలా మద్దతిచ్చారంటూ రాణాపై అమెరికాలో దాఖలైన అభియోగాలు ఇప్పటికే రుజువయ్యాయి. ప్రస్తుతం అతను లాస్ ఏంజెలెస్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్లో ఖైదీగా ఉన్నాడు. రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా కోర్టులు ఇప్పటికే అనుమతించాయి. కోర్టు విచా రణ ఎదుర్కొనేందుకు అతన్ని త్వరలో భారత్ పంపనున్నట్టు టంప్ కూడా వెల్లడించారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు

15 మంది దుర్మరణం • వారిలో ఇద్దరు జర్నలిస్టులు

డెయిర్ అల్–బలాహ్: గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఆదివారం తెల్లవారుజామున ఖాన్ యూనిస్‌లోని నాజర్ ఆసుపత్రి వెలుపల ఉన్న టెంట్లపై జరిపిన దాడిలో పాలస్తీనా టుడే టీవీ స్టేషన్ రిపోర్టర్ యూసుఫ్ అల్ ఫకావితోపాటు మరో రిపోర్టర్ మృతి చెందారు. ఆరుగురు విలేకరులు గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వారిలో ఒకరికి తీవ్ర కాలిన గాయాలు కాగా, మరొకరికి తలకు తూటా గాయమైనట్టు పాలస్తీనా మీడియా తెలిపింది. ఖాన్ యూనిస్ లోని ఓ ఇంటిపై ఇజ్రాయెల్ బాంబు దాడి చేసి తొమ్మిది మందిని హతమార్చిన కొన్ని గంటల్లోనే ఈ దాడి జరిగింది. వెస్ట్ బ్యాంక్‌లోని టర్మస్ అయా సమీపంలో రాళ్లు విసిరిన ఉగ్రవాదిని హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. కానీ బాధితుడు 14 ఏళ్ల పాలస్తీనా–అమెరికన్ అని హమాస్ పేర్కొంది. సోమవారం ఈ ప్రాంతంలో వేర్వేరు దాడుల్లో పదిహేను మంది మృతి చెందగా 9 మందికి పైగా గాయపడ్డట్టు నాజర్ ఆస్పత్రి తెలిపింది. రాత్రి వరకే ఆరుగురు మహిళలు, నలుగురు చిన్నారులు సహా మరో 13 మంది మృతదేహాలు వచ్చినట్టు వెల్లడించింది. డెయిర్ అల్–బలాహ్‌లోని అల్–అక్సా అమరవీరుల ఆసుపత్రి అంచున ఉన్న గుడారాలపై ఇజ్రాయెల్ దాడిలో ముగ్గురు గాయపడ్డారని ఆసుపత్రి తెలిపింది. ఓ ఇంటిపై జరిగిన దాడిలో ఇద్దరు మృతి చెందారని, ముగ్గురు గాయపడ్డారని వెల్లడించింది. 2023 అక్టోబర్ 7 నుంచి ఇజ్రాయెల్ దాడుల్లో వారానికి సగటున 13 మంది చొప్పున ఇప్పటిదాకా 232 మంది జర్నలిస్టులు మృతి చెందినట్టు అమెరికాకు చెందిన థింక్ ట్యాంక్ నివేదిక వెల్లడించింది. రెండు ప్రపంచ యుద్ధాలు, వియత్నాం యుద్ధం, యుగోస్లేవియా యుద్ధాలు, అఫ్గానిస్తాన్‌లో అమెరికా యుద్ధం కంటే గాజాలోనే ఎక్కువ మంది జర్నలిస్టులు మరణించారు. తాము హమాస్‌పై మిలిటెంట్ల టెంట్‌పైనే దాడి చేశామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ''పౌరులకు హాని జరగకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నాం. కానీ మిలిటెంట్లు నివాస ప్రాంతాల్లో లోతుగా పాతుకుపోయారు. పౌరుల మరణాలకు హమాసే కారణం'' అని ఆరోపించింది.



మియాపూర్‌లో షెల్టర్!
నగరంలోని అఫ్జల్‌గంజ్‌లో తుపాకులతో విరుచుకుపడిన ఇద్దరు దుండగులు అమన్ కుమార్, అలోక్ కుమార్ ఈ నేరాలు చేయడానికి ముందు మియాపూర్‌లో బస చేశారు. -8లో



బిగ్‌స్క్రీన్‌లో.. చూసేద్దాం..
నగరంలో ఐపీఎల్ ఫీవర్ పీక్ స్థాయికి చేరింది. ఈ మేరకు పెద్ద పెద్ద రెస్టారెంట్లలో మ్యాచ్‌ల వీక్షణం కోసం అతి పెద్ద తెరలు ఏర్పాటు చేసి ఆకర్షిస్తున్నారు. -సిటీప్లస్‌లో...

వాతావరణం
గరిష్టం/కనిష్టం 37.0/23.0
నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

యువతలో నైపుణ్యాన్ని వెలికితీయాలి



యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

రాయదుర్గం: తెలంగాణలోని యువతలో నైపుణ్యాన్ని వెలికితీసి వారిని ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ ప్రాంగణాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులకు చిరునామాగా తెలంగాణ రాష్ట్రాన్ని మార్చాలనే సంకల్పంతోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ యువతకు కొదవ లేదని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ అందిస్తే మరింత మెరుగ్గా తయారవుతారన్నారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు సాఫ్ట్ స్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆయన సూచించారు. రాష్ట్రంలోని ప్రముఖ విద్యా, పరిశోధన, టాస్క్, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ)తదితర సంస్థలతో సమన్వయం చేసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీ శాఖా ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, డిప్యూటీ సెక్రెటరీ భవేష్‌మిశ్రా, స్కిల్ యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ సుబ్బారావు, ఓఎస్‌డీ చమాన్ మెహతా, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎమ్మెల్సీ బరిలో ఎంఐఎం, బీజేపీ

ఇండిపెండెంట్ల నామినేషన్లు తిరస్కరణ



'స్క్రూటినీ'కి హాజరైన అభ్యర్థులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఇద్దరు ఇండిపెండెంట్ల నామినేషన్లు స్క్రూటినీలో తిరస్కరించారు. ఈ ఎన్నికలో పోటీ చేసే వారిని పది మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంది. నిర్ణీత వ్యవధిలోగా తమను ప్రతిపాదిస్తున్న వారి వివరాలు తెలియజేయకపోవడంతో వారి నామినేషన్లు తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి పేర్కొన్నారు. దీంతో బీజేపీ అభ్యర్థి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ బరిలో మిగిలారు. పార్టీల బలాల దృష్ట్యా ఈ ఎన్నిక ఏకగ్రీవం కాగలదని అందరూ భావించినప్పటికీ, అనూహ్యంగా బీజేపీ తమ అభ్యర్థిని రంగంలోకి దింపడంతో పోటీ రసవత్తరంగా మారింది. ఓటర్ల కొనుగోలుకు బేరసారాలు కూడా జరుగుతున్నాయనే ప్రచారం మొదలైంది. ఈ నేపథ్యంలో క్రాస్ ఓటింగ్ చర్చనీయాంశంగా మారింది.

యువతిపై లైంగిక దాడికి యత్నం

మేడ్చల్ రూరల్: ఓ దుండగుడు యువతిపై లైంగిక దాడికి యత్నించగా..ఎదురు తిరిగిన యువతి రాయితో అతడిపై దాడి చేసి తప్పించుకున్న ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఒడిశాకు చెందిన ఓ యువతి (19) కొంత కాలంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఓ యువకుడితో కలిసి సహజీవనం చేస్తుంది. కాగా ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో యువతి గుండ్లపోచంపల్లి నుండి రైల్వే ట్రాక్‌పై మేడ్చల్ వైపు నడుచుకుంటూ వస్తుండగా గౌడవెల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. దీంతో యువతి అతన్ని ఎదురించి సమీపంలోని ఓ రాయిని తీసుకుని తలపై బాదింది. అనంతరం అక్కడి నుంచి తప్పించుకుని వచ్చి మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న మేడ్చల్ పోలీసులు సంఘటన స్థలికి వెళ్లి పరిశీలించారు. రైల్వే ట్రాక్‌పై ఘటన జరగడంతో మేడ్చల్ పోలీసులు కేసును సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు బదలాయించారు. కాగా దీనిపై ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేపట్టామని, కేసును రైల్వే విభాగానికి బదిలీ చేశామని మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

మే 3, 4 తేదీల్లో మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో

సాక్షి, సిటీబ్యూరో: మోహిదీపట్నంలోని కింగ్స్ క్రౌన్ కన్వెన్షన్‌లో మే 3, 4 తేదీల్లో మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎజాజ్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో ఎక్స్‌పో వివరాలు వెల్లడించారు. తొలిసారిగా టెన్త్ నుంచి సివిల్స్ విద్యార్థుల వరకు ప్రత్యేక విభాగాలుగా ఈ ఎక్స్‌పో ఉంటుందన్నారు. ఒకే గొడుగు కింద విద్యాసంస్థలు, పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ స్టాల్లు అందుబాటులో ఉంటాయన్నారు. 150 విద్యా సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. విద్యార్థులకు అవకాశమున్న కోర్సులు, మౌలిక సదుపాయాల గురించి అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ ఎక్స్‌పోలో ఎస్ఎస్‌సీ, సీబీఎస్ఈ, ఐసీఎస్‌సీ, ఐజీఎస్‌సీ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు, పబ్లిషర్లు, స్టేషనరీ, ఓవర్సీస్ ఎడ్యుకేషన్ స్టాల్లు ఉంటాయన్నారు. పది విభిన్న అంశాలపై సెమినార్లు కూడా ఉంటాయని చెప్పారు. ఎక్స్‌పోలో పాల్గొనదలచిన వారు 8858845599/8858843344 నంబర్లలో సంప్రదించాలని కోరారు.





నాటక ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

పిల్లలే పెద్దలై..

- ఘనంగా ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ థియేటర్ ఫెస్టివల్ మరూ
- ఆలోచింపజేసిన చిన్నారుల నాటక ప్రదర్శనలు..

గన్‌ఫౌండ్రి: రంగస్థల నాటక రంగాన్ని కాపాడుకునేందుకు చిన్నారులు నడుం బిగించారు. ఈ మేరకు మొట్టమొదటి ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ థియేటర్ ఫెస్టివల్ సోమవారం రవీంద్రభారతిలో ప్రారంభించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిశుంబిత స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో ఈ ఉత్సవం నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయి పిల్లలకు నాటక పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ వేడుకల్ని మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ రామ్ తెలిపారు. మొదటి రోజు జపాన్‌కు చెందిన రంగస్థల కళాకారులు 'లూనర్' అనే అంశంపై ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు 'మార్పు రావాలి' అనే అంశంపై ప్రదర్శించిన నాటకం ఆహూతులను ఆలోచింపచేసింది. ది జంగిల్‌బుక్, అయ్యో పాపం, కుయ్యోముర్రో నాటకాలు కూడా అలరించాయి. ఈ సందర్భంగా జపాన్ థియేటర్ డైరెక్టర్ ఎరీనా సాజి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రంగస్థల నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచే థియేటర్ ఆర్ట్స్‌ను ఒక పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ నగరంలో మొట్టమొదటి అంతర్జాతీయ బాలల ఉత్సవాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. కాగా రెండవ రోజు నుంచి నేపాల్, భూపాల్, కోల్‌కత్తా, కేరళ వంటి ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శనలను ఇవ్వనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.



పోస్టులెక్కువ.. పనులు తక్కువ!

జీహెచ్ఎంసీలో వింత పరిస్థితి

చీఫ్ ఇంజనీర్ల పోస్టులు రెండు.. పదవుల్లో మాత్రం ఆరుగురు
- అదనపు కమిషనర్లలో కొందరికి అదనపు పనులు..
- మరికొందరికి నామమాత్రమే..
- ఇష్టారాజ్యంగా మారిన పని విభజన



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో ఉన్న పోస్టులు..అధికారుల హోదాలు, పని విభజన తదితరమైనవి ప్రస్తుతం చర్చనీయాంశాలుగా మారాయి. ఏ ప్రభుత్వ విభాగంలో నైనా ఎన్ని పోస్టులుంటే సంబంధిత పోస్టుల్లో, సదరు హోదాల్లో అంతమంది మాత్రమే ఉంటారు. జీహెచ్ఎంసీలో మాత్రం ప్రభుత్వంతో సంబంధం లేకుండా 'స్థానికం'గానే హోదాలు పెంచుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- ఉదాహరణకు జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో అత్యున్నత హోదా అయిన చీఫ్ఇంజనీర్ పోస్టులు రెండున్నాయి. ప్రస్తుతం ఆ హోదాతో పనిచేస్తున్నవారు మాత్రం ఆరుగురున్నారు. అదెలా సాధ్యమో పై వారికే తెలియాలి. ఇది ఒక వైపు దృశ్యం. మరోవైపు కమిషనర్ తర్వాత అంతటి పోస్టు అయిన అడిషనల్/జోనల్ కమిషనర్ బాధ్యతలు కొందరికి మాత్రం లెక్కకు మిక్కిలిగా ఉండగా, కొందరికి మాత్రం నామ్‌కే వాస్తేగా ఉన్నాయి. దీంతో చేసేవారికి పని భారం మరింత పెరుగుతుండగా, చేయని వారికి మాత్రం టైమ్‌పాస్‌గా మారింది.
- ఎక్కడైనా అధికారుల సంఖ్యను బట్టి పని విభజన చేస్తారు. కొన్ని పనుల్లో ఉండే క్లిష్టత దృష్ట్యా కొంత వరకు మినహాయింపు ఉండవచ్చు. జీహెచ్ఎంసీలో మాత్రం ఇందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. ఉదాహరణకు ఖైరతాబాద్ జోన్ అనేది నగరంలో రాజకీయ నేతలు, సినీ సెలబ్రిటీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, తదితర వీవీఐపీలు ఎక్కువగా ఉండే జోన్. ఆ జోన్‌లో పనిచేసే జోనల్ కమిషనర్‌కు జోన్‌లోని పనులు చూసుకోవడమే కష్టం. కానీ, జీహెచ్ఎంసీలో మాత్రం సదరు జోన్‌తోపాటు ప్రధాన కార్యాలయంలోనూ కీలకమైన, పని ఒత్తిడి ఎక్కువగా ఉండే రెవెన్యూ, ఐటీ విభాగాలప్పగించారు. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాధ్యతలు సైతం అప్పగించారు.
- అలాగే ప్రధాన కార్యాలయంలోని ఒక అడిషనల్ కమిషనర్‌కు ఏకంగా ఐదు విభాగాల బాధ్యతలప్పగించారు. వాస్తవానికి మిగతా వారికంటే ఎక్కువ బాధ్యతలున్న వీరి విభాగాల్లోనే పనులు పెండింగ్‌లో లేకుండా, కొత్త సంస్కరణలూ అమలు చేస్తున్నారు. వారు సైతం తమ పనుల్ని అదనంగా భావించడం లేదు. ఐఏఎస్‌లైన తాము జిల్లాల్లోని కలెక్టర్లతో పోలిస్తే ఇవేం ఎక్కువ కావని వారు భావిస్తున్నప్పటికీ.. మిగతా వారికి స్వల్ప బాధ్యతలు మాత్రమే అప్పగించడంలో ఆంతర్యమేమిటో తెలియదు. మరో అడిషనల్ కమిషనర్‌కు ఎలాంటి పోస్టు లేకుండా ఎంతోకాలంగా ఖాళీగానే ఉంచుతున్నారు.

జీహెచ్ఎంసీ ముఖ్య విభాగాల్లోని అధికారులు, వారికున్న విభాగాలను ఓమారు పరిశీలిస్తే..

- **అనురాగ్ జయంతి:** ఖైరతాబాద్ జోనల్ కమిషనర్, అడిషనల్ కమిషనర్ (రెవెన్యూ), అడిషనల్ కమిషనర్(ఐటీ) అడిషనల్ కమిషనర్ (ట్రేడ్ లైసెన్స్).
- **కె.శివకుమార్‌నాయుడు:** అడిషనల్ కమిషనర్ (ఎలక్ట్రికల్), అడిషనల్ కమిషనర్ (లేక్స్), అడిషనల్ కమిషనర్ (హౌసింగ్), అడిషనల్ కమిషనర్ (భూసేకరణ), అడిషనల్ కమిషనర్(ఎస్ఎన్‌డీపీ).
- **సీఎన్ రఘుప్రసాద్:** అడిషనల్ కమిషనర్ (శానిటేషన్), అడిషనల్ కమిషనర్ (ట్రాన్స్‌పోర్ట్).
- **వేణుగోపాల్‌రెడ్డి:** అడిషనల్ కమిషనర్ (అడ్వర్టయిజ్‌మెంట్స్), అడిషనల్ కమిషనర్ (ట్రాఫిక్), జాయింట్ కమిషనర్ (శానిటేషన్).
- **ఉపేందర్ రెడ్డి:** శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, అడిషనల్ కమిషనర్ (సీఎస్సార్).
- వీరికి ఒకటి కంటే ఎక్కువగా ఉన్న ఈ పోస్టుల్లో ఒకటి రెండు మినహాయిస్తే అన్నీ కీలకమైనవే.
- మిగతా వారికి కీలకమైన ఒక్కో విభాగం ఉండగా, ఇంకొందరికి అది సైతం లేదు. హోదా ఉంది కనుక అన్నట్లు ఆయా పోస్టుల్లో కొనసాగుతున్నారు.

ఇంజనీరింగ్ విభాగంలో..

- **ఎస్. భాస్కర్‌రెడ్డి:** జీహెచ్ఎంసీలో చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), చీఫ్ ఇంజనీర్(పరిపాలన). రాష్ట్రంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ (పబ్లిక్‌హెల్త్, తెలంగాణ)
- **కోటేశ్వరరావు:** చీఫ్ ఇంజనీర్ (ఎస్ఎన్‌డీపీ), చీఫ్ ఇంజనీర్ (లేక్స్), సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఘనవ్యర్థాల నిర్వహణ), సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఎన్‌డీపీ).
- **సహదేవ్ రత్నాకర్:** చీఫ్ ఇంజనీర్(మెయింటనెన్స్), సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఖైరతాబాద్ జోన్).
- **ఎస్.ఎస్.నిత్యానందం:** చీఫ్ ఇంజనీర్(హౌసింగ్), సూపరింటెండింగ్ ఇంజనీర్ (క్వాలిటీ కంట్రోల్)
- **శ్రీలక్ష్మి:** ప్రాజెక్ట్స్ విభాగం సూపరింటెండింగ్ ఇంజనీర్ శేరిలింగంపల్లి జోన్, కూకట్‌పల్లి జోన్, ఖైరతాబాద్ జోన్.
- ప్రాజెక్ట్స్ విభాగంలో వీరు ఇన్నేసి ఉన్నత పోస్టుల్లో కొనసాగుతున్నప్పటికీ, పనులు మాత్రం ముందుకు కదలడం లేవనే ఆరోపణలున్నాయి.

ఇందరు జేసీ లెందుకో ?

జీహెచ్ఎంసీలో ఉన్న దాదాపు 15 మంది జాయింట్ కమిషనర్ల (జేసీ)లో ఒకరిద్దరు తప్ప మిగతా వారు ఏం పనిచేస్తారో తెలియదు. వాని పనులకు సంబంధించి సర్వసభ్య సమావేశంలో సభ్యులడిగిన ప్రశ్నకు సైతం సంబంధిత విభాగం అడిషనల్ కమిషనర్‌తో విభాగంలోని ఉద్యోగులతో సమావేశాలు ఏర్పాటు చేసేందుకని పేర్కొన్నారంటే వారు చేస్తున్న పనులేమిటో అంచనా వేసుకోవచ్చు. జీహెచ్ఎంసీలో జేసీలకు సైతం వాహనాలు, చాంబర్లు, ఇతరత్రా సదుపాయాలుండటం తెలిసిందే. ఇలా అదనపు పోస్టులు, అధిక హోదా పోస్టులతో జీహెచ్ఎంసీ ఖజానాకు భారం తప్ప, ఆ మేరకు ప్రయోజనం లేదనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

పోస్టుల్లో చీఫ్‌లు..

వాస్తవానికి జీహెచ్ఎంసీలో ఉన్నదే రెండు చీఫ్ఇంజనీర్ పోస్టులు. కానీ ఇంతమంది ఎలా చీఫ్ ఇంజనీర్లయ్యారో పై వారికే తెలియాలి అంటున్నారు పరిపాలన విభాగం గురించి తెలిసిన వారు. ఎస్ఈ హోదాలోని వారే చీఫ్ ఇంజనీర్లుగా వ్యవహరిస్తుండటం నాణేనికి మరోవైపు చిత్రం. హౌసింగ్ విభాగంలో ప్రస్తుతానికి చేసేపనులేమీ లేకున్నా హోదాకోసమే నన్నట్లు ఆ విభాగం చీఫ్ఇంజనీర్ పోస్టు తయారైంది. గతంలోనూ ఒక ఎస్ఈ రిటైరయ్యేముందు ఆ హోదాలో కూర్చొని రిటైరయ్యారు.

గ్లోబల్ గ్రీన్ మార్కెట్ 'కోహెడ'

దేశంలో రెండో అతిపెద్ద పండ్ల విపణి ఇదే..

- 199.12 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణం
- ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.2900 కోట్లు
- డీపీఆర్ రెడీ చేసిన తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ



సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే విస్తీర్ణంలో రెండో అతిపెద్ద మార్కెట్ తెలంగాణలో నిర్మితమవుతోంది. ప్రస్తుతం 200 ఎకరాల్లో హర్యానాలోని ఐఐహెచ్ఎం గనౌర్ అంతర్జాతీయ ఉద్యానవన మార్కెట్ నిర్మాణంలో ఉంది. రూ.2 వేల కోట్ల వ్యయంతో పబ్లిక్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో దీన్ని నిర్మిస్తున్నారు. ఇంచుమించు ఇదే స్థాయిలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలో 199.12 ఎకరాల విస్తీర్ణంలో 'కోహెడ గ్లోబల్ గ్రీన్ మార్కెట్'ను నిర్మిస్తున్నారు. మొత్తం రూ.2900.43 కోట్ల అంచనా వ్యయంతో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 33 శాతం నిధులను వెచ్చిస్తుండగా..మిగిలిన 67 శాతం నాబార్డ్ నుంచి టర్మ్ లోన్ రూపంలో సమీకరించనుంది. ఈ మేరకు తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ విభాగం కోహెడ హోల్‌సేల్ మార్కెట్ డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను రూపొందించి, న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ స్టేట్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ బోర్డుకు అందజేసింది.

- ప్రతిపాదిత కోహెడ గ్లోబల్ గ్రీన్ మార్కెట్‌లో పండ్లు, పూలు, పాలు, మాంసం, కోళ్ల వ్యాపారంతో పాటు సముద్ర ఉత్పత్తులను విక్రయిస్తారు. దీన్ని ఈపీసీ (ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్), పీపీపీ రెండు విధానాల్లో అభివృద్ధి చేయనున్నారు. ఈపీసీ విధానానికి 167.85 ఎకరాలు, పీపీపీ విధానంలో 31.27 ఎకరాలను కేటాయించారు. ఈపీసీలో వేలం హాళ్లు, షెడ్లు, విదేశీ ఫ్లాగ్‌షిప్ పెవిలియన్, రిటైల్ జోన్లు, మినీ డేటా సెంటర్, కార్మికుల విశ్రాంతి గదులు, పాలీ క్లినిక్, పోలీసు ఔట్ పోస్టు, పార్కింగ్, ఎస్‌టీపీలు, రహదారులు వంటివి నిర్మిస్తారు. పీపీపీ విధానంలో పెట్రోల్ పంపులు, టవర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఛార్జింగ్ స్టేషన్, శీతల గిడ్డంగులు, షాపులు, ప్రాసెసింగ్ సెంటర్లు వంటివి ఉంటాయి. ఈపీసీ అభివృద్ధి పనులకు రూ.2,044 కోట్లు, పీపీపీ విధానంలో రూ.856.43 కోట్ల అభివృద్ధి పనుల వ్యయాన్ని అంచనా వేశారు.
- ఫ్రాన్స్‌లోని రుంగిస్ మార్కెట్, లండన్‌లోని న్యూ కోవెంట్ గార్డెన్ మార్కెట్, బర్మింగ్‌హమ్‌లోని బర్మింగ్‌హామ్ హోల్‌సేల్ మార్కెట్, ఆమ్‌స్టర్‌డ్యామ్‌లోని ఫుడ్ సెంటర్, అమెరికాలోని యూనియన్ స్క్వేర్ గ్రీన్ మార్కెట్, ఫెర్రీ ప్లాజా ఫార్మర్ బజార్, దుబాయ్‌లోని వాటర్ ఫ్రంట్ మార్కెట్, కువైట్‌లోని ఆల్ఫోర్డ్ మార్కెట్లను అధ్యయనం చేసిన వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు కోహెడ మార్కెట్‌ను డిజైన్ చేశారు. మొత్తం స్థలంలో 71.58 ఎకరాలను రహదారులు, నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, ఘన వ్యర్థాల నిర్వహణ, విద్యుత్ సబ్ స్టేషన్ వంటి మౌలిక సదుపాయాల కోసమే కేటాయించారు.

విదేశీ ఉత్పత్తుల కోసం ప్రత్యేకం..

2047 నాటికి మార్కెట్ సామర్థ్యం సుమారు 13.6 లక్షల మెట్రిక్ టన్నులకు పెరుగుతుందని అంచనా. కోహెడ్ మార్కెట్ యార్డ్‌లో 8 షెడ్లు ఉంటాయి. రెండు సోలార్ రూఫ్ టాప్‌లతో కూడిన మెజనైన్ హాళ్లు, మరో రెండు సోలార్ రూఫ్ టాప్ హాళ్లు ఉంటాయి. అంతర్జాతీయ వ్యాపారస్తులకు ప్రత్యేకంగా ఫ్లాగ్‌షిప్ పెవిలియన్ ఉంటుంది. ఇందులో విదేశీ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు చేసుకోవచ్చు.

కోహెడ మార్కెట్‌లో దేనికి ఎంత ఖర్చంటే? (రూ.కోట్లలో)

- భూ సమీకరణ: 350
- భవన నిర్మాణాలు:1,324.5
- యంత్రాలు: 211.65
- ఇతర స్థిరాస్తులు: 66.15
- కంప్యూటర్, నెట్‌వర్కింగ్: 1.76
- నిర్వహణ: 73.37
- టెక్నాలజీ నవీకరణ, ఎస్కలేషన్: 15.25
- మిగిలినవి సెక్యూరిటీ డిపాజిట్లు, ఇతరత్రాల వ్యయం

స్మార్ట్ మండి..

కోహెడ మార్కెట్‌ను ఆధునిక స్మార్ట్ మండిగా అభివృద్ధి చేయనున్నారు. స్మార్ట్ వీధి దీపాలు, ఎలక్ట్రానిక్ సైన్‌బోర్డ్‌లు, ఎన్విరాన్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్, ఇన్ఫర్మేషన్ కియోస్క్‌లు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, వీడియో మేనేజ్‌మెంట్, అనలిటిక్స్‌తో కూడిన నిఘా వ్యవస్థ, సీసీటీవీ కెమెరాలు, సెంట్రల్ మానిటరింగ్ సిస్టమ్, మినీ డేటా సెంటర్ ఉంటుంది. ఇక్కడ మౌలిక సేవలన్నీ సాంకేతికతో అనుసంధానమై ఉంటాయి.

రోజుకు 3 లక్షల లీటర్ల నీటి సరఫరా..

ఔటర్ రింగ్ రోడ్ నుంచి కోహెడ మార్కెట్ వరకు నాలుగు లైన్ల రహదారిని నిర్మించారు. 3.61 ఎకరాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ల కోసం కేటాయించారు. మిషన్ భగీరథ నుంచి రోజుకు 3 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయనున్నారు. రూ.5.2 కోట్ల వ్యయంతో ప్రత్యేక పైప్‌లైన్ వేయనున్నారు. మార్కెట్‌లో ప్రైవేట్ శీతల గిడ్డంగులు, రిటైల్ షాప్‌లతో పాటు ఆఫీసులు, అంతర్జాతీయ ఎగ్జిబిషన్ సెంటర్, సాలిడ్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఈవీ చార్జింగ్ స్టేషన్లు, వాటర్ అండ్ వేపర్ హీట్ ట్రీట్‌మెంట్లు ప్లాంట్లు వంటివన్నీ ఉంటాయి. సిబ్బంది, కార్మికులకు గృహాలను సైతం నిర్మించనున్నారు.

బండ బాదుడు!

సిలిండర్ ధర పెంపుతో గ్రేటర్ వాసులపై నెల వారీగా రూ.19.59 కోట్ల భారం
- 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధర ఇక రూ.905

సాక్షి, సిటీబ్యూరో: వంట గ్యాస్ ధర భగ్గుమంది. సరిగ్గా ఏడాది తర్వాత ఎల్పీజీ సిలిండర్ ధర పెరగడంతో సామాన్యులకు షాక్ తగిలినట్లయింది. తాజాగా 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్‌పై రూ.50 పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో హైదరాబాద్‌లో సిలిండర ధర రూ.905కు చేరింది. పెరిగిన ధరలు మంగళవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే నిత్యావసర సరుకుల పెంపుతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బంది పడుతుండగా, తాజాగా పెరిగిన ధరలతో ఆ భారం మరింత పడనుంది. ఇక పెరిగిన ధర ఉజ్వల సిలిండర్లకు కూడా వర్తించనుంది.

అదనపు భారం రూ.19.59 కోట్లపైనే

సిలిండర్ ధర పెరుగుదల కారణంగా హైదరాబాద్ మహానగర వాసుల పై నెలకు అదనంగా రూ.19.59 కోట్ల భారం పడనుంది. మొత్తం మీద సుమారు 30.18 లక్షల గృహ ఉపయోగ కనెక్షన్లు ఉండగా, అందులో హైదరాబాద్ పరిధిలోనిలోని 14.22 లక్షలు, ఉమ్మడి రంగారెడి జిల్లా పరిధిలో 15.96 లక్షల గృహ వినియోగ కనెక్షన్లు ఉన్నట్లు చమురు సంస్థల అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మూడు ప్రధాన చమురు సంస్థలకు చెందిన 125 ఏజెన్సీలు ఉండగా ప్రతిరోజు 80 వేల నుంచి లక్ష వరకు కుటుంబాలు గ్యాస్ బుకింగ్ చేస్తుండగా, 60 వేలనుంచి 80 వేల వరకు తగ్గకుండా సరఫరా చేస్తున్నట్లు ఆయిల్ కంపెనీల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

మియాపూర్‌లో షెల్టర్!

'అఫ్జల్‌గంజ్ కాల్పుల' నిందితులు ఉన్నది అక్కడే

- శ్రీ సాయి గ్రాండ్ ఇన్ హోటల్‌లో ఐదు రోజుల పాటు
- బీదర్‌లో నేరం చేసి వచ్చి గది ఖాళీ చేసిన ద్వయం
- దర్యాప్తులో ఇది గుర్తించిన హైదరాబాద్ పోలీసులు





నిందితులు అమన్ కుమార్, అలోక్ కుమార్

సాక్షి, సిటీబ్యూరో: కర్నాటకలోని బీదర్, నగరంలోని అఫ్జల్ గంజ్‌లో తుపాకులతో విరుచుకుపడిన ఇద్దరు దుండగులు అమన్ కుమార్, అలోక్ కుమార్ ఈ నేరాలు చేయడానికి ముందు మియాపూర్‌లో బస చేసినట్లు వెలుగులోకి వచ్చింది. అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసును వివిధ కోణాల్లో దర్యాప్తు చేసిన హైదరాబాద్ పోలీసులు ఈ విషయం గుర్తించారు. దీనికి సంబంధించిన రికార్డులను సైతం స్వాధీనం చేసుకున్నారు. నగరంలో నేరం చేసిన తర్వాత దేశ సరిహద్దులు దాటి నేపాల్ పారిపోయినట్లు ఈ ద్వయం ప్రస్తుతం నేపాల్‌లో ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు సేకరించారు.

జనవరి 12న నగరానికి రాక...

బీహార్‌లోని వైశాలీ జిల్లా ఫతేపూర్ పుల్వారియాకు చెందిన అమన్ కుమార్, అలోక్ కుమార్ ఏటీఎం మిషన్లలో నగదు నింపే వాహనాలనే టార్గెట్‌గా చేసుకున్నారు. ఈ గ్యాంగ్ 2023 సెప్టెంబర్ 12న ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్‌లో సెక్యూరిటీ గార్డు జై సింగ్‌ను హత్య చేసి రూ.40 లక్షలు దోచుకుపోయింది. నేపాల్ పారిపోయిన ఈ గ్యాంగ్ యూపీ పోలీసుల హడావుడి తగ్గిన తర్వాత బీహార్ చేరుకుంది. అక్కడ నుంచి తమ స్వస్థలానికి వెళ్లి... ఈ ఏడాది జనవరిలో నగరానికి వచ్చింది. బీదర్‌ను టార్గెట్‌గా చేసుకున్న అమన్, అలోక్ ఆ నెల 12న మియాపూర్‌లోని శ్రీ సాయి గ్రాండ్ ఇన్ హోటల్‌లో బస చేసింది. అక్కడ నుంచి బీదర్‌కు రాకపోకలు సాగించడం తేలికనే ఉద్దేశంతోనే అక్కడ షెల్టర్ ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులు చెప్తున్నారు. అమిత్ కుమార్, మహేష్ కుమార్ పేర్లతో నకిలీ ఆధార్ కార్డులు తయారు చేసిన దుండగులు వాటి ఆధారంగానే రూమ్ తీసుకున్నారు.

మూడు రోజుల పాటు రెక్కీ...

బీదర్‌లో ఎస్‌బీఐ ఏటీఎం మిషన్లలో నగదు నింపే సీఎంఎస్ సంస్థ వ్యాన్‌ను దోచుకోవడానికి ముందు మూడు రోజుల పాటు పక్కాగా రెక్కీ చేసింది. తమ వెంట తెచ్చుకున్న ద్విచక్ర వాహనంపై జనవరి 13, 14, 15 తేదీల్లో అక్కడకు వెళ్లి వస్తూ ఈ పని పూర్తి చేసింది. చివరకు ఆ నెల 16న నేరం చేయడానికి బీదర్ వెళ్లిన ఈ ద్వయం సీఎంఎస్ సంస్థ ఉద్యోగుల్లో గిరి వెంకటేష్‌ను చంపి, శివకుమార్‌ను గాయపరిచి రూ.83 లక్షలు దోచుకుంది. అక్కడ నుంచి డబ్బు నింపిన బ్యాగ్‌లు తీసుకుని నేరుగా తాము బస చేసిన హోటల్‌కే వచ్చారు. రూమ్ ఖాళీ చేయడంతో పాటు తమ వస్తువుల్నీ తీసుకుని ద్విచక్ర వాహనంపై బయలుదేరి మియాపూర్ నుంచి ఎంజీబీఎస్‌కు వచ్చారు. నేరం చేయడానికి వాడిన ద్విచక్ర వాహనాన్ని ఎంజీబీఎస్ పార్కింగ్‌లో ఉంచారు. అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ నుంచి ప్రైవేట్ బస్సులో రాయ్‌పూర్ వెళ్లేందుకు అమిత్‌కుమార్ పేరుతో టిక్కెట్ బుక్ చేసుకున్నారు.

నేపాల్‌లో ఉండటంతో పటిష్ట నిఘా...

ఈ ట్రావెల్స్ వద్ద జరిగిన పరిణామాలతో మేనేజర్ జహంగీర్‌ను కాల్చిన ఇద్దరూ అక్కడ నుంచి పారిపోయారు. అఫ్జల్‌గంజ్ నుంచి ఆటోలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లిన వీళ్లు... అక్కడ నుంచి గజ్వేల్ వెళ్లడానికి మరో ఆటో మాట్లాడుకున్నారు. అనివార్య కారణాలతో తిరుమలగిరిలో దిగేసి... ఇంకో ఆటోలో మియాపూర్ వెళ్లారు. ఆపై తిరుపతి వెళ్లే ఏపీఎస్ఆర్టీసీ ఎక్కి కడపలో దిగిపోయారు. మరో బస్సులో నెల్లూరు, అట్నుంచి చెన్నై వెళ్లారు. చెన్నై నుంచి రైలులో కోల్‌కతా చేరుకున్న ఈ ద్వయం పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి ప్రాంతం నుంచి నేపాల్ వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. మీర్జాపూర్ నేరం తర్వాత ఇలా వెళ్లిన ఈ ద్వయం కొన్నాళ్లకు తమ స్వస్థలాలకు తిరిగి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం సిటీ పోలీసులు వారి కదలికలపై పటిష్ట నిఘా ఉంచారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

రూ.92వేల నగదు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం

రాంగోపాల్‌పేట్: వెబ్‌సైట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు నిందితులను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, మహంకాళి పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ సౌత్‌జోన్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపిన మేరకు.. ఢిల్లీకి చెందిన అడెం బెట్టింగ్ కోసం రాణీగంజ్‌కు చెందిన సందీప్ కుమార్ గోదెల (30), గోషామహాల్‌కు చెందిన సదానంద్ అభిషేక్ (31), మంగళ్‌హాట్‌కు చెందిన పద్మావార్ యశ్వంత్ గుప్తా(32), అదే ప్రాంతానికి చెందిన గంగారాం వినయ్ (32)లను బెట్టింగ్ కోసం నియమించుకున్నాడు. పాన్‌బజార్‌లోని ఓ ఇంట్లో కంప్యూటర్ పెట్టుకుని ఆన్‌లైన్‌లో ఐపీఎల్ ఖేలో డాట్ కామ్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఇందులో సందీప్ సబ్ బుకీ కాగా సదానంద్ అభిషేక్, పద్మావర్ యశ్వంత్‌లు పంటర్లు, గంగారాం వినయ్ సింగ్ కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్-గుజరాత్ టైటాన్స్ మధ్య జరుగుతున్న మ్యాచ్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సౌత్‌జోన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఎస్సైలు మహేష్, నర్సింహులు, ఆంజనేయులు, నవీన్, మహంకాళి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సంయుక్తంగా కలిసి దాడులుచేసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.92,120తో పాటు 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసికున్నారు. ప్రధాన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

బాలుడికి పాముకాటు..'గాంధీ'లో చికిత్స

జీడిమెట్ల: పాము కరవడంతో ఓ బాలుడు అపస్మారకస్థితికి చేరుకుని గాంధీలో చికిత్స పొందుతున్నాడు. సుభాష్‌నగర్‌కు చెందిన శివకుమార్ (5) ఉదయం 11 గంటలకు ఆరు బయట అడుకుంటున్నాడు. అదే సమయంలో పక్కనే ఉన్న నాలా నుండి బయటకు వచ్చిన పాము బాలుడిని కరిచింది. దీంతో తల్లిదండ్రులు వెంటనే షాపూర్‌నగర్‌లోని పీహెచ్‌సీ సెంటర్‌కి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో 108లో గాంధీ అస్పత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మహ్మద్ గౌస్ (ఫైల్)

జవహర్‌నగర్: కౌకూర్ దర్గాకు దర్శనానికి వచ్చి చెరువులో స్నానానికి వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఫలక్‌నుమాకి చెందిన మహ్మద్ గౌస్ (35) శనివారం కౌకూర్ దర్గాకు వచ్చి చెరువులో స్నానానికి వెళ్లి గల్లంతైన సంఘటన తెలిసిందే. జవహర్‌నగర్ పోలీసులు, డీఆర్‌ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం రాత్రి గౌస్ మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని గాంధీ అస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

యూసుఫియన్ దర్గాలో కత్తిపోట్లు

ఒకరికి తీవ్ర గాయాలు

నాంపల్లి: యూసుఫియన్ దర్గాలో ఇద్దరు యువకులు గంజాయి మత్తులో ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఒకరికి కత్తిపోట్లకు గురయ్యారు. బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. శాంతినగర్‌కు చెందిన రెహాన్(18), సుభాన్‌పురాకు చెందిన హుస్సేన్‌లు చిన్న చిన్న చోరీలు చేస్తూ ఉంటారు. ఇద్దరూ దర్గా యూసుఫియన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ ఉంటారు. సోమవారం ఇద్దరూ గంజాయిని సేవించారు. డబ్బు పంపకాల విషయంలో ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో హుస్సేన్ కత్తి తీసుకుని రెహాన్‌ను పొడిచాడు. దీంతో రెహాన్‌కు తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన హుస్సేన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బెదిరించి దోపిడీ..ముగ్గురి అరెస్ట్

అంబర్‌పేట: రాత్రివేళ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకులను ముగ్గురు యువకులు అడ్డగించి దారి దోపిడీకి పాల్పడ్డారు. వారిని గాయపరిచి రూ.7 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ మల్లీశ్వరి తెలిపిన మేరకు.. గోల్నాక లాల్‌బాగ్‌లో నివసించే అభిషేక్ యాదవ్, షేక్‌హుస్సేన్, మూసాంబిసాలు స్నేహితులు. ముగ్గురూ ఒకే రూమ్ ఉంటున్నారు. సోమవారం తెల్లవారుజామున కేటరింగ్ పనులకు వెళ్లి లాల్‌బాగ్ వైపు వస్తున్నారు. అదే సమయంలో లాల్‌బాగ్ మసీద్ ప్రాంతంలో నివసించే మహ్మద్ ఖాజ(21), సయ్యద్ యునూస్(20), సయ్యద్ అమీర్(21)లు వీరిని అడ్డగించారు. వారి వద్దనున్న డబ్బులివ్వాలని బెదిరించారు. అడ్డుకోబోయిన అభిషేక్ యాదవ్‌పై కత్తితో దాడి చేశారు. అనంతరం వారి వద్ద ఉన్న రూ.7 వేల నగదును ఎత్తుకెళ్లారు. గాయపడ్డ అభిషేక్ యాదవ్ స్నేహితులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. దర్యాప్తులో మహ్మద్ ఖాజా, సయ్యద్ యూసుఫ్, సయ్యద్ అమీర్‌లు దోపిడీకి పాల్పడ్డట్లు తేలింది. వారిని వారిళ్ల వద్ద అదుపులోకి తీసుకొని నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న అంబర్‌పేట డీఐ మల్లీశ్వరి

నేటి నుంచి ఓయూ డిగ్రీ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో మంగళవారం నుంచి డిగ్రీ రెగ్యులర్ కోర్సుల సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏలతో పాటు ఇతర డిగ్రీ కోర్సుల 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా గత మూడు సంవత్సరాలుగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు మంజూకానందున పరీక్షలను వాయిదా వేయాలని ప్రవేటు కాలేజీల యజమానులు సోమవారం ఓయూ అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు నమోదు

అబిడ్స్: శ్రీరామ నవమి శోభాయాత్రలు నిర్వహించిన గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్, భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి అధ్యక్షులు భగవంతరావు, పల్లకి శోభాయాత్ర నిర్వాహకులు ఆనంద్‌సింగ్‌లపై మంగళ్‌హాట్ పోలీసులు కేసులు నమోదు చేశారు. శోభాయాత్రలో నిబంధనలను అతిక్రమించినందుకు బీఎన్ఎస్ 223 సెక్షన్ కింద కేసులు నమోదు చేసినట్లు మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ తెలిపారు. శోభాయాత్ర అనుమతి కోసం ఇచ్చిన నిబంధనల్లో డీజే సిస్టమ్ వాడడం, ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా వేరే ప్రాంతం నుంచి ఊరేగింపును కొనసాగించడం, టపాకాయలు కాల్చడం పట్ల పోలీసులు ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా శోభాయాత్రలో దొంగలు చేతివాటం చూపారు. బంగారు గొలుసులు, సెల్‌ఫోన్లు, పర్సులను మాయం చేశారు. దీంతో బాధితులు మంగళ్‌హాట్, షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

ఒవైసీ బ్రదర్స్‌పై మండిపడ్డ రాజాసింగ్

అబిడ్స్ : మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ, మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీలపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆదివారం రాత్రి సిద్దింబర్‌బజార్ చౌరస్తాలో జరిగిన శోభాయాత్రలో రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక్కడి తిండి తింటూ అన్నీ అనుభవిస్తున్న ఓవైసీ బ్రదర్స్ భారతమాత పేరు చెప్పేందుకు వెనుకడుగు వేస్తున్నారన్నారు. భారతదేశంలో పుట్టి వందేమాతరం పాట పాడటానికి సిగ్గుపడుతున్నారని అన్నారు. దేశంలో ఉండాలంటే భారత్‌మాతాకి జై అని ఎవరైనా అనాల్సిందేనన్నారు. భారతదేశంలో ఉండి యుద్ధం చేస్తానంటే తెలంగాణలో పప్పులుడకవన్నారు. భారతదేశాన్ని హిందూ అఖండ రాష్ట్రంగా చేద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ వచ్చిన వెంటనే దేశద్రోహుల భరతం పడతామన్నారు.

ఆసిఫ్‌నగర్‌లో లిఫ్ట్ ప్రమాదం

ముగ్గురికి తీవ్ర గాయాలు

విజయనగర్‌కాలనీ: లిఫ్ట్ కుప్పకూలడంతో అందులోని ముగ్గురు వ్యక్తులకు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు.. లంగర్‌హౌస్‌కు చెందిన సయ్యద్ నసిరుద్దీన్(40) వాహనాల పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతని భార్య సికినాబేగం (35), మరదలు మైమునాబేగం (34)లు ఈ నెల 6న ఆసిఫ్‌నగర్ ప్రియా కాలనీలోని నాకో శ్యామ్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌కు రాత్రి 11.20 గంటలకు వచ్చారు. 5వ అంతస్తులో ఉన్న బంధువుల ఇంటికి లిఫ్ట్‌లో వెళ్తుండగా 4వ అంతస్తు వద్దకు చేరుకోగానే లిఫ్ట్ ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతోవారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వైద్య చికిత్స నిమిత్తం అత్తాపూర్‌లోని జర్మన్‌టైన్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్‌హుస్సేన్ ఘటనా స్థలానికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. లిఫ్ట్ భద్రత ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కత్తులతో తిరుగుతున్న ఇద్దరి అరెస్ట్



నిందితులు సయ్యద్ నవాజ్, ఖాజా మొయినుద్దీన్ ఖాన్

గోల్కొండ: కత్తితో బెదిరించి మామూళ్లు వసూళ్లు చేస్తున్న ఇద్దరిని సౌత్‌వెస్ట్‌జోన్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గోల్కొండ పోలీసులతో కలిసి అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏడీసీ అందె శ్రీనివాసరావు తెలిపిన మేరకు.. గోల్కొండకు చెందిన సయ్యద్ నవాజ్ గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్. మూసా బంజారాదర్వాజాకు చెందిన స్నేహితుడు ఖాజా మొయినుద్దీన్‌తో కలిసి కత్తులతో బెదిరించి వ్యాపారుల నుంచి మామూళ్లు వసూలు చేసేవారు. ఇద్దరూ కలిసి ఈ నెల 5వ తేదీన గోల్కొండ బడాబజార్‌లో బీఫ్ షాప్‌లోకి వెళ్లి బెదిరించారు. సయ్యద్ నవాజ్ తనవద్ద ఉన్న కత్తిని చూపించి డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గోల్కొండ పోలీసులతో కలిసి వీరిని అదుపులోకి తీసుకున్నారు.

అనుమతి లేని స్టెరాయిడ్స్ విక్రయాలు

ముగ్గురి అరెస్ట్

గోల్కొండ: స్టెరాయిడ్ ఇంజక్షన్స్, టాబ్లెట్స్, క్యాప్సూల్స్ విక్రయిస్తున్న ముఠాను కమిషనర్ టాస్క్‌ఫోర్స్ సౌత్‌వెస్ట్ జోన్ టీమ్ హుమయూన్‌నగర్ పోలీసులతో కలిసి అదుపులోకి తీసుకున్నారు. బాడీ బిల్డింగ్‌కు వాడే ఈ పదార్థాలను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏడీసీ అందె శ్రీనివాసరావు తెలిపిన మేరకు.. మహ్మద్ నజీర్ యాకుత్‌పురాలో సప్లిమెంట్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. శరీర ధారుఢ్యం పెంచేందుకు స్టెరాయిడ్స్, ట్యాబ్లెట్స్ అమ్ముతున్నాడు. కాగా గౌలిపురాకు చెందిన ఆర్.సంజీవ్ స్టెరాయిడ్ల సబ్ సప్లయర్‌గా హకీంపేట్‌కు చెందిన ఇమ్రాన్ ఖాన్‌కూడా మహ్మద్ నజీర్‌కు సబ్ సప్లయర్‌గా వ్యవహరిస్తున్నారు. మొత్తం 23 రకాల స్టెరాయిడ్స్‌ను వివిధ ప్రాంతాల్లో సరఫరా చేస్తున్నారు. నిరుద్యోగి అయిన ఇమ్రాన్‌ఖాన్ జిమ్ ట్రైనర్. కాగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అతను మహ్మద్ నజీర్, ఆర్.సంజీవ్ వద్ద పనిచేస్తూ స్టెరాయిడ్స్‌ను వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడు. ఇదిలా ఉండగా పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం మెహిదీపట్నం ఎన్‌ఎండీసీ వద్ద ఇమ్రాన్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా వీటిని తాను సంజీవ్ వద్ద తీసుకున్నానని అంతేకాకుండా మహ్మద్ నజీర్ ప్రధాన సరఫరాదారుడు అని పోలీసులకు తెలిపాడు. అతని వద్ద నుండి రూ.1.80 లక్షల విలువ గల స్టెరాయిడ్స్ ఇంజక్షన్లు, ట్యాబ్లెట్స్, క్యాప్సూల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత నజీర్,సంజీవ్‌లను గోల్కొండ వద్ద అదుపులోకి తీసుకున్నారు.

ఏడడుగుల కండక్టర్‌కు త్వరలో విముక్తి



గోల్కొండ: అధిక ఎత్తు కారణంగా విధుల నిర్వహణకు అహ్మద్ అనే కండక్టర్ ఇబ్బంది పడుతున్నాడని ఇటీవల వచ్చిన వార్తలపై మంత్రి పొన్నం స్పందించారు.ఏడు అడుగుల ఎత్తు ఉన్న అహ్మద్ మెహిదీపట్నం డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. బస్సు 6.4 అడుగులు ఎత్తు మాత్రమే ఉండడటంతో మెడ వంచి ఉద్యోగం చేయాల్సి వస్తోంది. దీంతో ఆయన మెడ, వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. వచ్చి ఆసుపత్రి పాలవుతున్నారు. ఈ విషయం సీఎం రేవంత్ దృష్టికి వచ్చిందని, అతనికి ఆర్టీసీలో వేరే బాధ్యతలు ఇవ్వాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు సూచించారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు

- పుట్టమన్ను తెచ్చి హోమగుండాల ఏర్పాటు
- విశ్వక్సేనుడి ఆరాధనతో ఉత్సవాలు ప్రారంభించిన అర్చకులు



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

మొయినాబాద్: కలియుగదైవం.. చిలుకూరు బాలాజీ స్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అంకురార్పణ చేశారు. ఆలయ ప్రధాన మండపంలో స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి బ్రహ్మోత్సవాల పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదట సెల్వర్ కూత్తు.. వేద మంత్రోచ్ఛరణతో దేవాలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం పుట్ట బంగారం (పుట్టమన్ను) తీసుకొచ్చి హోమగుండాలు ఏర్పాటు చేశారు. అందులో నవధాన్యాలు, పాలికలు కలిపి హోమాలను వెలిగించారు. తరువాత విశ్వక్సేనుడి ఆరాధన, పుణ్యాహవచన కార్యక్రమాలు చేపట్టారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ఊరేగించిన అనంతరం యజ్ఞం చేపట్టారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. పూజా కార్యక్రమాలు తిరుమల కిరణాచారి, రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, నరసింహన్, కన్నయ్య, కిట్టు, మురళి, కృష్ణమూర్తి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండోరోజు ధ్వజారోహణం, శేషవాహనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ధ్వజారోహణం సందర్భంగా గరుత్మంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభానికి గరుడ పతాన్ని ఆరోహణం చేస్తారు. ఈసారి గరుడ ప్రసాదం పంపిణీ ఉండదని.. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని ఆలయ అర్చకుడు రంగరాజన్ స్పష్టం చేశారు.

బావను చంపిన బావమరిది



ముఖీత్ మృతదేహం

గోల్కొండ: డబ్బు పంపకాల విషయంలో తేడా రావడంతో సొంత బావను ఓ బావమరిది కత్తితో పొడిచి చంపాడు. ఈ సంఘటన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.సైదులు తెలిపిన మేరకు.. గోల్కొండ అట్టారాసిటీకి చెందిన ముఖీద్, సమీర్ బావమరుదులు. పాత నేరస్తుడైన ముఖీత్ ద్విచక్ర వాహనాలను దొంగలించేవాడు. ఈ ద్విచక్ర వాహనాలను అతని బావమరిది అయిన సమీర్ అమ్మేవాడు. వచ్చిన డబ్బులను ఇద్దరూ పంచుకునేవారు. ఇదిలా ఉండగా మూడు రోజుల క్రితం ముఖీత్ సనత్‌నగర్ ప్రాంతం నుంచి ఓ బైక్‌ను దొంగలించి తెచ్చాడు. దీనిని విక్రయించాలని ఆదివారం సమీర్‌కు ఇచ్చాడు. కాగా బైక్ అమ్మితే చెరిసగం తీసుకుందామని సమీర్ అన్నాడు. అయితే దొంగలించింది నేను... నీకు సమాన వాటా ఎందుకు ఇవ్వాలని ముఖీత్ తన బావమరిదితో అన్నాడు. ఇరువురి మధ్య టూంబ్స్ రోడ్డు సనా హోటల్ వద్ద తీవ్ర వాగ్వాదం జరిగింది. మాటా మాటా పెరగడంతో సమీర్ తన వెంట తెచ్చుకున్న కత్తితో ముఖీత్‌పై దాడి చేశాడు. ముఖీత్ కిందపడిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సమీర్‌తో కలిసి గాయపడిన ముఖీత్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే ముఖీత్ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఇదిలా ఉండగా సమీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

మొరాయించిన బస్సు.. పక్కకు నెట్టిన పోలీసులు



బస్సును తోస్తున్న పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: పంజగుట్ట ప్రధాన రహదారిలో మోడల్ హౌస్ వద్ద సోమవారం సాయంత్రం అత్యంత రద్దీ సమయంలో నగరం నుంచి బీదర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు మొరాయించింది. ముందుకు వెళ్లలేక రోడ్డు మధ్యలోనే నిలిచిపోవడంతో అప్పటికే ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయిన ఈ రహదారి పూర్తిగా జామ్ అయ్యింది. సమాచారం అందుకున్న పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు బస్సును పంజగుట్ట చౌరస్తా వరకు నెట్టుకొచ్చారు. దీంతో ట్రాఫిక్ సజావుగా సాగింది.

తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు


శ్రీనగర్‌కాలనీ: ప్రతిఒక్కరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ దేవానంద్, డాక్టర్ సమీర, డాక్టర్ లావణ్య, కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ పవన్‌కుమార్ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పంజగుట్ట నెక్స్ గెలేరియా మాల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 500మంది బ్లడ్, షుగర్, ఈసీజీ, 2డీ, కంటి పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం వైద్యులు మందులను అందించారు. నేటి ఆధునిక యుగంలో జీవనశైలి మార్చుకొని నిత్యం వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ అప్పుడప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

టౌన్‌ప్లానింగ్ సమస్యలపై ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య

బంజారాహిల్స్: టౌన్‌ప్లానింగ్ సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదులను సంబంధిత అధికారులు స్వీకరించారు. జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీఎంసీ సమ్మయ్య సోమవారం ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధికారులు ప్రజావాణిలో పాల్గొన్నారు.

సంస్కార్ స్కూల్‌లో శ్రీరామనవమి వేడుకలు



శ్రీనగర్‌కాలనీ: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మోతీనగర్ సంస్కార్ స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సీతా, రామ, లక్ష్మణ, హనుమ వేషధారణలో శ్రీరామచరితను తెలియజేస్తూ నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్నతనంలోనే సంస్కృతి– సంప్రదాయాలు, పండుగల విశిష్టత తెలియజేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సనత్‌నగర్: సామాజిక బాధ్యతలో భాగంగా బేగంపేటలోని సత్యం వెంచర్ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (సట్వెన్) వేసవిని దృష్టిలో పెట్టుకుని బేగంపేట ప్రధాన రహదారిలోని అశోక భూపాల్ చాంబర్స్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సట్వెన్ సీఈఓ వడ్లమూడి శ్రీనివాసరావు, బేగంపేట ట్రాఫిక్ ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులంతా సద్వినియోగం చేసుకోండి

- ఆఫ్‌లైన్‌లోనూ రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తులు
- వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు
- రేషన్‌కార్డు లేకపోతే ఆదాయ ధ్రువీకరణ పత్రం
- అర్హులు దరఖాస్తు చేసుకోవాలంటున్న అధికారులు
- ఖైరతాబాద్‌లో విస్తృత ప్రచారం


జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను అందజేస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అర్హులైన వారికి కుల, ఆదాయ ధృవపత్రాలు సకాలంలో అందకపోవడంతో ఈ నెల 14వ తేదీ వరకు గడువు పొడిగించింది. మీ–సేవా కేంద్రాల్లో సాంకేతిక, ఇతర సమస్యలతో దరఖాస్తుదారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు తలెత్తడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించలేని వారి కోసం ప్రత్యేకంగా జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన అర్జీ పత్రాలను పూరించి అవసరమైన ధృవపత్రాలను జత చేసి ఈ ప్రత్యేక కేంద్రాల్లో అందజేసే అవకాశం కల్పించారు. అనంతరం సదరు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో వెంకటేశ్వర కాలనీ డివిజన్‌కు సంబంధించిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో ఉన్న సర్కిల్–18 కార్యాలయంలో అందించవచ్చు.
- ఖైరతాబాద్ డివిజన్‌కు సంబంధించిన దరఖాస్తులను ఖైరతాబాద్ వార్డు కార్యాలయంలో అందజేయాలి.
- సోమాజిగూడ డివిజన్ దరఖాస్తులను సోమాజిగూడ వార్డు కార్యాలయంలో తీసుకుంటారు.
- బంజారాహిల్స్ డివిజన్‌కు సంబంధించిన దరఖాస్తుదారులు రోడ్డు నంబర్–12లోని సీఎంపీసీ కార్యాలయంలో అందించవచ్చు.
- జూబ్లీహిల్స్ డివిజన్ పరిధి దరఖాస్తుదారులు జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయంలో అందించాలి.

నమూనా పత్రాల విడుదల

ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు అందించేవారికి ప్రభుత్వం నమూనా పత్రాలను విడుదల చేసింది. ఈ ఫారంలో 27 కాలమ్స్‌లో అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేయాలి. ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రం, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువపత్రం రెండింట్లో ఏదైనా ఒకటి జత చేయాలి. కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులైతే సదరం పత్రం జత చేయాలి. లబ్ధిదారుల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించి అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సిబ్బందిని నియమించారు. ఇందుకోసం వార్డుల వారీగా ఈ పథకంపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రంలో ఏదైనా ఒకటి తప్పనిసరిగా ఉండాలి. రేషన్‌కార్డు లేనివారు ఆదాయ ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేసుకుంటే రెండు రోజుల్లో ఇస్తారు. ఈ పథకానికి కుటుంబంలో ఒక్కరే అర్హులు. ఆన్‌లైన్‌లో తీసుకోకుంటే ఆఫ్‌లైన్‌లో తీసుకునే వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్‌లో ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని వార్డు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 14 తర్వాత ఈ దరఖాస్తులను పరిశీలిస్తారు. జూన్ 2–9వ తేదీలోగా యూనిట్లు మంజూరు చేస్తారు. దరఖాస్తుకు ఇంకా గడువు ఉన్నందున ఆదాయ ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు.

రాయితీ ఇలా..

రూ.50 వేల వరకు వంద శాతం రాయితీ ఉండగా, రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు 90 శాతం రాయితీ, 10 శాతం బ్యాంక్ రుణం, రూ.1,00001 నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ, 20 శాతం బ్యాంక్ రుణం, రూ.2,00001 నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం రాయితీ, 30 శాతం బ్యాంక్ రుణం అందజేయనుంది. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి విచారణ అనంతరం అర్హులైన లబ్ధిదారులకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న రుణం మంజూరు పత్రాలను అందజేయనున్నారు.

జలమండలిలో 13 ఫిర్యాదులు


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జలమండలి డివిజన్–6 జీఎం హరిశంకర్

బంజారాహిల్స్: జలమండలి డివిజన్–6 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి సోమవారం 13 ఫిర్యాదులు అందాయి. డివిజన్–6 జీఎం హరిశంకర్‌తో పాటు ఇతర అధికారులు ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 13 ఫిర్యాదులు అందుకున్నారు. ఇందులో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆరు, నీటి బిల్లులకు సంబంధించి రెండు, మిగతా ఫిర్యాదులు సీవరేజీకి సంబంధించినవి వచ్చాయని జీఎం హరిశంకర్ తెలిపారు. డివిజన్–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, తట్టిఖానా, సోమాజిగూడ, ఎల్లారెడ్డిగూడ, వెంగళరావునగర్, ఎస్పీఆర్ హిల్స్, బోరబండ, ఫిలింనగర్ వాటర్ సెక్షన్ల పరిధిలో ఈ ఫిర్యాదులు అందాయని ఆయన తెలిపారు.

కేర్ హాస్పిటల్స్ 'సంగం' ప్రత్యేక మెంబర్‌షిప్ కార్డు


సంగం మెంబర్‌షిప్ కార్డు ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న కేర్ ఆస్పత్రి వైద్యులు

బంజారాహిల్స్: వరల్డ్ హెల్త్ డే సందర్భంగా కేర్ హాస్పిటల్స్ 'సంగం' అనే ప్రత్యేక మెంబర్‌షిప్ కార్డును ప్రారంభించింది. బంజారాహిల్స్‌లోని ఆస్పత్రిలో క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌ఖన్నా ఈ కార్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రోగ్రాంతో అవసరానికి అనుగుణంగా ఆరోగ్య సేవలు అందరికీ అందడం ప్రతిఒక్కరికీ హక్కుగా ఉండాలన్నారు. సంగం ప్రారంభం ద్వారా కేర్ హాస్పిటల్స్ ఆధునిక వైద్యం అందరికీ అందించే దిశగా ముందడుగు వేసిందన్నారు. అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్లకు 24/7 సేవలు అందించడమే సంగం మెంబర్‌షిప్ కార్డు ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి గ్రూప్ సీఎఫ్‌ఓ విశాల్ మహేశ్వరి, సీఈఓ జస్‌దీప్‌సింగ్, చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ శలభ్ డాంగ్, మెడికల్ సర్వీసెస్ చీఫ్ డాక్టర్ నిఖిల్ మాథూర్, సీహెచ్‌ఆర్‌ఓ డాక్టర్ అమిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

14న గిరిజన శక్తి రాజ్యాంగ రక్షణ ర్యాలీ

- గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్



మాట్లాడుతున్న గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్

హిమాయత్‌నగర్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీన బషీర్‌బాగ్ చౌరస్తా బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ సచివాలయం సమీపంలోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వరకు గిరిజన శక్తి రాజ్యాంగ రక్షణ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ తెలిపారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, కళాకారులతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. నేడు భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేద అణగారిన, గిరిజన, దళిత, బహుజన వర్గాలకు అన్యాయం చేస్తూ భవిష్యత్తులో వారికి రిజర్వేషన్లు లేకుండా చేయాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. గిరిజనుల భాషను గుర్తించకుండా అవమానిస్తోందని అన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి బంజారాభాష 'గోర్ భోలి'ని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ రాజేష్ నాయక్, గిరిజన శక్తి నేతలు కార్తీక్ నాయక్, భరత్, చిరంజీవి, మున్నా నాయక్, శంకర్ నాయక్, శ్రీమాన్, ప్రవీణ్, శివ చౌహాన్, కొండ్రపల్లి రమేష్, సందీప్, నరేందర్, వేమూలూరి అనిల్ చారి, తరుణ్, నిఖిల్, భరత్, ఉమేష్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలా నడవాలి సారూ..!


కేబీఆర్ పార్కు ఫుట్‌పాత్‌పై అడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ఫుట్‌పాత్‌లు ఫ్లెక్సీలకు అడ్డాగా మారాయి. పాదచారులు నడవడానికి వీల్లేకుండా ఫ్లెక్సీలను ఫుట్‌పాత్‌లపైనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కేబీఆర్ పార్కుకు వచ్చే వాకర్లు, సందర్శకులు, ఇతర పాదచారులు ఫ్లెక్సీలను దాటుకుని ముందుకు వెళ్లలేక రోడ్డును ఆశ్రయిస్తున్నారు. కొంతకాలంగా కేబీఆర్ పార్కు ముందు ఇష్టానుసారంగా పలు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ఒకవైపు ఫుట్‌పాత్‌లపై, మరోవైపు రోడ్డును ఆక్రమించి ఈ ఫ్లెక్సీలు రోజుల తరబడి ఏర్పాటు చేస్తున్నారు. పట్టించుకునేవారు లేకపోవడంతో రెండు వారాల వరకు ఇవి అలాగే ఉండిపోతుండటంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఫ్లెక్సీలు కూలిపోకుండా వైర్లతో ఫుట్‌పాత్‌పై వేసిన దిమ్మెలకు, ఫెన్సింగ్‌కు కడుతున్నారు. దీంతో అటు నుంచి నడుచుకుంటూ వచ్చేవారికి ఈ వైర్లు కనిపించకపోవడంతో కిందపడుతున్నారు. జీహెచ్‌ఎంసీకి స్పష్టమైన వైఖరి లేకపోవడంతో ఫ్లెక్సీల ఏర్పాటుకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టిలో పడాలనే ఉద్దేశ్యంతో చాలామంది కేబీఆర్ పార్కు, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద అడ్డదిడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. కేబీఆర్ పార్కు ప్రధాన గేటు వద్ద ఫ్లెక్సీ రహిత ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయాలని వాకర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగువంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జిమిర్చి 35, క్యాప్సికం 35, పచ్చికాకరకాయ 35, పందిరిబీర 35, క్యాబేజీ 08, క్యారెట్ 23, దొండకాయ 28, గుండు బీన్నీస్ 55, గింజచిక్కుడు 55, గోకరకాయ 33, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 80, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 09, పొట్లకాయ 18, అరటికాయ 09, మునగకాయ 4, మామిడికాయ 30, ముల్లంగి 4–5, ఉల్లిపొరక 28 ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిపై కేసు

వెంగళరావునగర్: మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం హెచ్‌ఎఫ్ నగర్ నివాసి అఫ్రోజ్‌ఖాన్ కారు డ్రైవర్. మోతీనగర్ నివాసి దిలీప్‌వర్ధన్ వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం రాత్రి ఇద్దరూ మద్యం తాగి తమ వాహనాలపై రాజీవ్‌నగర్‌వైపు వెళ్తున్నారు. కళ్యాణ్‌నగర్ సమీపంలోకి రాగానే రెండు వాహనాలు ఢీకొట్టుకున్నాయి. దాంతో ఇరువురి వాహనాలు దెబ్బతిన్నాయి. పోలీసులకు విషయం తెలియడంతో ఘటనా స్థలానికి చేరుకుని వారికి ఆల్కాహాల్ పరీక్షలు నిర్వహించారు. ఇద్దరూ మద్యం తాగి ఉన్నట్లు గుర్తించారు. దాంతో వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగింత

వెంగళరావునగర్: ఇంట్లో దొంగతనానికి వచ్చిన యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సిద్ధార్థనగర్‌లో నివాసం ఉంటున్న పి.సందీప్ ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి అతడి ఇంట్లోకి చొరబడి ఫుడ్ డెలివరీ బాయ్ అని చెప్పాడు. అనంతరం ఇంట్లో ఉన్న పర్స్‌ను చోరీ చేసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దాంతో సందీప్ అతడిని పట్టుకున్నాడు. చుట్టుపక్కల వారి సాయంతో పోలీసులకు అప్పగించాడు. జీడిమెట్ల ప్రాంతానికి చెందిన డ్రైవర్ రాహుల్ రాథోడ్‌గా గుర్తించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డేకేర్ సెంటర్ల నిర్వహణ మరింత మెరుగుపర్చాలి

సనత్‌నగర్: సీనియర్ సిటిజన్స్ డేకేర్ సెంటర్ల నిర్వహణను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి పేర్కొన్నారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సర్కిల్‌లో కనీసం 5 డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. గుర్తింపు పొందిన డేకేర్ సెంటర్‌కు మాన్యువల్ ట్రెడ్‌మిల్ స్థానంలో ఎలక్ట్రానిక్ ట్రెడ్ మిల్‌ను అందజేయాలన్నారు. డేకేర్ సెంటర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని రూ.6 వేల నుంచి 10 వేలకు పెంచాలని కోరారు. సీనియర్ సిటిజన్స్ కోసం ఆఫీసర్ల నంబర్లతో డైరెక్టరీని ప్రచురించాలన్నారు.

హోమియో ఫెస్ట్ 2కే-25 బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డా.గోపాలకృష్ణ, డా.దుర్గాప్రసాద్

హిమాయత్‌నగర్: హోమియోపతి వైద్య సృష్టికర్త డా.శామ్యూల్ హానిమన్ జయంతిని ఈ నెల 30న ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహిస్తామని హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(హెచ్ఎంఏటీ) అధ్యక్షుడు డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు హిమాయత్‌నగర్‌లోని జూపల్లి బాలమ్మ ఆడిటోరియంలో 'హోమియో ఫెస్ట్ 2కే–25' బ్రోచర్‌ను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ దుర్గాప్రసాద్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వేడుకల్లో ఒక్కరోజు సైంటిఫిక్ సెషన్ 'హోమియో ఫెస్ట్ 2కె–25' నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని హోమియో వైద్య కళాశాలల విద్యార్థులు, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ వివిధ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ డా.వేణుగోపాల్ గౌరి, ఉపాధ్యక్షులు డా.మధు వారణాశి, డా.మాణిక్ ప్రభు, డా.ఆనంద్‌రావు మేన్ని, డా.రాజశ్రీ షా, సహాయ కార్యదర్శులు డా.ఎస్ఎస్.రఘురాం, డా.గణేష్ ఆచార్య, డా.అన్నపూర్ణ మంతా, డా.సాయి శృతి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు డా.గౌతమ్ రాళ్లబండి, డా.చాముండేశ్వరి, మెంబర్లు డా.సతీష్ కృష్ణ, అరుణ్‌కాంత్, డా.హర్షిత, డా.మహేక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌దే..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వెంగళరావునగర్: తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. హన్మకొండలో ఈ నెల 27న తేదీన నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ యూసుఫ్‌గూడ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ సభకు నియోజకవర్గం నుంచి దాదాపు 3 వేల మందితో కార్యకర్తలు హాజరవుతారని పేర్కొన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగు చెందారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే సత్తాలేని కాంగ్రెస్ అబద్ధాలతో జనాన్ని నమ్మించేందుకు ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్, పార్టీ సీనియర్ నేతలు విజయ్ కుమార్, సంజీవ, జావెద్, షరీఫ్, కృష్ణమోహన్, రమేష్‌యాదవ్, కేఎస్ రెడ్డి, ఫయాజ్, అప్పుఖాన్, మధుయాదవ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులను ఆదుకోవాలి



సనత్‌నగర్: ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో ముగ్గురు పేద విద్యార్థులకు సనత్‌నగర్‌కు చెందిన సంకేత్ సోషల్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ.2.45 లక్షల ఆర్థిక సహాయాన్ని గిర్కాల శ్రావణి ఎంఎస్ ఫస్టియర్ కోసం రూ.2 లక్షలు, దత్తా, వీరు ఇంటర్ చదువుల కోసం రూ.20 వేలు, రూ.25 వేల చొప్పున చెక్కులను విద్యార్థులకు సోమవారం అందజేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


వీడ్కోలు సభలో జాస్మిన్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: పదో తరగతి వరకు తమ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు స్కూల్‌కు వీడ్కోలు పలకడం కొద్దిపాటి బాధగా ఉన్నప్పటికీ వారు భవిష్యత్‌తో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నట్లు జాస్మిన్ హైస్కూల్ చైర్మన్ పి.జగన్నాథం అన్నారు. రాజీవ్‌నగర్‌కాలనీలోని జాస్మిన్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పదో తరగతితో అడుగు పెట్టిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.వి జయలక్ష్మి, ప్రొఫెసర్స్ సాయికృష్ణ, రామకృష్ణ, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అష్టావధానం కార్యక్రమం


తెలుగు వెలుగు కార్యక్రమంలో అష్టావధానం కార్యక్రమం

ఖైరతాబాద్: యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, ఐఐఎంసీ కళాశాల, సాధన సాహితీ స్రవంతి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు వెలుగు కార్యక్రమంలో భాగంగా లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో ఆరో సమావేశంలో భాగంగా అష్టావధానం కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ వంగపల్లి విశ్వనాథం సభను ప్రారంభించి మాట్లాడారు. రామాయణంలో రాముడికి ఏ విధంగా వానరులు సాయం చేశారో తాము తలపెట్టిన తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాల నిర్వాహణకు ఎంతో మంది ఉడతా భక్తిగా ఆర్థిక సహకారం అందజేస్తూ తెలుగు భాషా రథాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారని వారికి ధన్యవాదాలు తెలిపారు. సాధన సాహితీ స్రవంతి సంస్థ అధ్యక్షుడు సాధన నరసింహాచార్య మాట్లాడుతూ చిన్న వయసులో అవధానం చేపట్టడం నేటి విద్యార్థులకు ఆదర్శమని తెలిపారు. సభాధ్యక్షుడు విశ్వనాథం, ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్, రవీంద్ర, నవీన్, నారాయణరెడ్డి, రామకృష్ణ, శ్యామ్, యువభారతి సభ్యులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 24మంది మైనర్లు


మైనర్ డ్రైవింగ్‌పై తనిఖీలు నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్


తనిఖీలు నిర్వహిస్తున్న పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్

బంజారాహిల్స్: మైనర్ డ్రైవింగ్‌పై సోమవారం నుంచి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 10 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు 4, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు 10 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు. మైనర్లు నడుపుతున్న వాహనాలను గుర్తించి వాటిని జప్తు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు, వాహన యజమానులపై కూడా చర్యలు తీసుకోనున్నారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు లైసెన్స్‌లు తనిఖీ చేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ స్పెషల్ డ్రైవ్ జరిగింది.

తెలుగు వర్సిటీ గ్రంథాలకు ప్రత్యేక రాయితీ

నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన గ్రంథాలను ప్రత్యేక రాయితీతో విక్రయించడానికి పుస్తక ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నాంపల్లి ప్రాంగణంలోని పుస్తక విక్రయ కేంద్రంలో ప్రత్యేక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ప్రాచీన గ్రంథాలు, సాహిత్యం, నిఘంటువులు, సంగీత, నృత్య గ్రంథాలు, భారత, భాగవతాలు, ప్రబంధాలు, పురాణాలు, పంచకావ్యాలు, ఇతిహాసాలు, చరిత్ర గ్రంథాలు, పోటీ పరీక్షలకు ఉపయుక్తమయ్యే పుస్తకాలు తగ్గింపు ధరలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ పరశురామ్

పంజగుట్ట: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రత కల్పించే వరకు ఆ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయొద్దని తెలంగాణ స్టేట్ యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ డిమాండ్ చేసింది. యూనివర్సిటీల్లో దాదాపు 80 శాతం కాంట్రాక్ట్ అధ్యాపకులే ఉన్నారని, వారిని పట్టించుకోకుండా ఉద్యోగాల భర్తీకి జీవో 21 విడుదల చేసి తమ జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ పరుశురామ్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే 1,270 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు పట్టించుకోలేదని అన్నారు. వెంటనే కాంట్రాక్ట్ అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని చేసిక్, డీఏ, హెచ్ఆర్ఏ పెంచాలని డిమాండ్ చేశారు. కొంతమంది వైస్ చాన్స్‌లర్లు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉమ్రాయాత్రకు బయలుదేరిన 60 మంది



శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అరవై మంది సోమవారం ఉదయం ఉమ్రా యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో యాత్రికుల కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇరవై రోజులపాటు యాత్ర ఉంటుందని నిర్వాహకులు ఫయాజ్ అలీ తెలిపారు.

కోర్టుకు మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి గైర్హాజరు

సిటీ కోర్టులు: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సోమవారం నాంపల్లి కోర్టుకు గైర్హాజరయ్యారు. 2019 హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో ఆయనపై పోలీసులు నమోదు చేసిన కేసు విచారణ సోమవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. అయితే న్యాయవాదుల ధర్నా కార్యక్రమం ఉండటంతో విచారణ ఏప్రిల్ 16కు వాయిదా పడింది. ఉప ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో నిమిత్తం 300 మందికి పర్మిషన్ ఇవ్వాలని అప్పటి ఎమ్మెల్యే అభ్యర్థి సైదిరెడ్డి అక్టోబర్ 2న పోలీసులను కోరారు. ఈ మేరకు పోలీసులు అనుమతి ఇచ్చారు. అయితే 4వ తేదీ సాయంత్రం సుమారు 5 వేల మంది కార్యకర్తలు, అభిమానులతో రోడ్ షో నిర్వహించారని, ఈ కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారని, అంతేకాకుండా ఎన్నికల నియామవళిని ఉల్లంఘించారని సైదిరెడ్డిపై కేసు నమోదు చేశారు. రెండు పెద్ద డీజేలు, 15 మైకులు, 80 వాహనలతో రోడ్‌షో తీశారని, పోలీస్ యాక్ట్ అమలులో ఉండగా ప్రజా రవాణాకు ఇబ్బంది కలిగించారని పలువురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై గత విచారణలోనే సైదిరెడ్డి వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసుకుంది.

రిజర్వాయర్లు నిర్మిస్తేనే ఎలివేటెడ్‌కు క్లియరెన్స్

- శామీర్‌పేట్ కారిడార్‌కు రక్షణ శాఖ పీటముడి
- కోల్పోయే నిర్మాణాలను తిరిగి పూర్తి చేయాలని షరతు
- హెచ్ఎండీఏ తర్జనభర్జన



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ ఔటర్ రింగ్ రోడ్డు వరకు హెచ్ఎండీఏ నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌కు రక్షణ శాఖ పీటముడి వేసింది. సుమారు 18.10 కిలోమీటర్ల మార్గంలో చేపట్టనున్న ఈ కారిడార్ కోసం తిరుమలగిరి, అల్వాల్ మార్గంలో రక్షణ శాఖకు చెందిన భూములను సేకరించాల్సి ఉంది. ఈ క్రమంలో కొన్ని నిర్మాణాలను కూడా తొలగించే అవకాశం ఉంది. దీంతో తొలగించనున్న వాటిని తిరిగి నిర్మించి ఇచ్చిన తరువాతే కారిడార్‌కు భూమిని అందజేస్తామని రక్షణశాఖ అధికారులు మెలిక పెట్టారు. దీంతో హెచ్ఎండీఏ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ మార్గంలో రక్షణ శాఖకు చెందిన రెండు భారీ రిజర్వాయర్లు ఉన్నాయి. 5 లక్షల లీటర్ల గ్యాలన్‌ల సామర్థ్యంతో ఒకటి, 2.5 లక్షల గ్యాలన్‌లతో మరో రిజర్వాయర్ నుంచి కంటోన్మెంట్ ప్రాంతానికి తాగునీరు లభిస్తోంది. ఈ రెండింటిని ఎలివేటెడ్ కారిడార్ కోసం తొలగించాల్సి వస్తోంది. దీంతో ఈ భారీ రియర్వాయర్లకు మరోచోట స్థలం కేటాయించి నిర్మించి ఇవ్వాలని రక్షణ శాఖ హెచ్ఎండీఏను కోరింది. ఈ మార్గంలో తొలగించే భవనాలకు భూమి మాత్రమే పరిహారంగా కాకుండా భవనాలను కూడా తిరిగి నిర్మించి ఇవ్వాలని అధికారులు అంటున్నారు. ఈ మేరకు హెచ్ఎండీఏ, రక్షణ శాఖల మధ్య వివిధ అంశాలపై సంప్రదింపులు జరుగుతున్నాయి. అన్ని అంశాలపై ఇరు వర్గాలు ఒక అవగాహనకు వస్తే తప్ప ఈ ప్రాజెక్టు ముందుకు కదిలే అవకాశం లేదు. ఈ ప్రాజెక్టు కోసం సుమారు 197 ఎకరాల భూమి సేకరణకు అధికారులు ప్రణాళికలను రూపొందించారు. ఇందులో 113.48 ఎకరాలు రక్షణ శాఖ నుంచి సేకరించాల్సి ఉంది. సుమారు రూ.2 వేల కోట్ల (పరిహారం చెల్లింపుసహా) నిర్మాణ అంచనాలతో ఈ కారిడార్‌ను ప్రతిపాదించారు.

15వ తేదీ వరకు గడువు

ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌కు ఈ నెల 15న బిడ్డింగ్ గడువు ముగియనుంది. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తులను అందజేయవచ్చని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఈ కారిడార్ నిర్మాణం కోసం ఆసక్తి గల సంస్థల నుంచి గత నెలలో టెండర్‌లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి డెయిరీఫామ్ ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతి లభించిన నేపథ్యంలో హెచ్ఎండీఏ అధికారులు నిర్మాణ పనులపై దృష్టి సారించారు. ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్ వరకు 5.4 కిలోమీటర్ల కారిడార్‌లో బేగంపేట్ విమానాశ్రయం వద్ద సుమారు 600 మీటర్ల పొడవుతో సొరంగ మార్గాన్ని నిర్మించనున్నారు. విమానాల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని ఎలివేటెడ్‌కు ప్రత్యామ్నాయంగా సొరంగమార్గం నిర్మించాల్సి ఉంది. ప్యారడైజ్ నుంచి సికింద్రాబాద్, తాడ్‌బండ్, బోయిన్‌పల్లి మీదుగా డెయిరీఫామ్ వరకు నిర్మించనున్న ఈ ఎలివేటెడ్ కారిడార్ కోసం రూ.652 కోట్ల వ్యయంతో ప్రణాళికలను రూపొందించారు. భూసేకరణ కోసం అయ్యే ఖర్చులతో కలిపి ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.1,550 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ కారిడార్ నిర్మాణంతో నగరానికి ఉత్తరం వైపు 44వ జాతీయ రహదారి మార్గంలో మేడ్చల్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ వైపు నుంచి నగరానికి వాహనాల రాకపోకలకు అంతరాయాలు తొలగనున్నాయి.

రూ.110 కోట్ల పనులకు శంకుస్థాపనలు



మన్సూరాబాద్‌లోని వివేకానంద విగ్రహం వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల తదితరులు

- ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఉద్రిక్తత

హస్తినాపురం: ఎల్‌బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రూ.110 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిలతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కొత్తపేట డివిజన్ సప్తగిరి కాలనీలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమం రసాభాస చోటుచేసుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఒకరినొకరు తోసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. నినాదాలతో హోరెత్తించారు. పోలీసులు జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని మన్సూరాబాద్, నాగోలు, బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్ నాలుగు డివిజన్ల పరిధిలో రూ.21.17 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. అనంతరం హస్తినాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఎనిమిది వందల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మండలి విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్త, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ముద్దగొని రామ్మోహన్‌గౌడ్ కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, సుజాతానాయక్, వెంకటేశ్వరరెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, బద్దుల వెంకటేశ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెంది శివధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

- దాడులు అరికట్టాలని, రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్

సిటీ కోర్టులు: నాంపల్లి, సిటీ సివిల్ కోర్టుతోపాటు సిటీలోని అన్ని కోర్టుల న్యాయవాదులు సోమవారం రోడ్డెక్కారు. తమపై దాడులను అరికట్టి, రక్షణ చట్టం తీసుకురావాలని విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముజ్జబా అలీ అనే న్యాయవాదిపై పలువురు వ్యక్తులు కత్తులతో దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసు రాజీ కోసం ప్రయత్నిస్తుండగా ఈ ఘటన జరిగిందన్నారు. గతవారమే నగరంలో ఒక న్యాయవాది హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎంతమంది న్యాయవాదులు ప్రాణాలు పోయిన తర్వాత రక్షణ చట్టం తీసుకువస్తారని పలువురు ప్రశ్నించారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికిశోర్, మాజీ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో న్యాయవాదులు ఎల్.ప్రభాకర్, గంప వెంకటేశం, డి.వెంకటేష్, కొండారెడ్డి, కె.నరేందర్, జక్కుల లక్ష్మణ్, తిరుపతివర్మ, సుదర్శన్, మల్లేశ్, మామిడాల రమేశ్‌తోపాటు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



నాంపల్లి కోర్టు ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

'ప్రజావాణి' సమస్యలపై సత్వర స్పందన

- అధికారులను ఆదేశించిన కమిషనర్ ఇలంబర్తి

లక్డీకాపూల్: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన విన్నపాల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగరం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి విన్నపాలు స్వీకరించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అక్కడికక్కడే పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ..నగర ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. పరిష్కారం కాని సమస్యలపై కారణాలను స్పష్టంగా వారికి తెలియజేయాలన్నారు. ప్రజావాణిలో 41 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 19, ట్యాక్స్ సెక్షన్ 5, ఇంజినీరింగ్ విభాగం , అడ్మినిస్ట్రేషన్, ఎస్టేట్స్, విజిలెన్స్, వెటర్నరీ, ఫైనాన్స్, హౌసింగ్ విభాగాలకు ఒకటి చొప్పున, ల్యాండ్ అక్విజిషన్, స్పోర్ట్స్ విభాగాలకు మూడు చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు అందాయి. అదే విధంగా జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 79 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణుగోపాల్, రఘు ప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గీతా రాధిక, అడిషనల్ సీసీపీ ప్రదీప్, వాటర్ వర్క్స్ జీఎం సాయి రమణ, డిప్యూటీ సీఈలు పనస రెడ్డి, సంపద, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, వాల్యూయేషన్ అధికారి మహేష్ కులకర్ణి, యబీడీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

ఎఫ్‌టీఎల్ నిర్ధారణపై అభ్యంతరాలకు ప్రాధాన్యం

- సాంకేతికంగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తాం
- స్పష్టం చేసిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ



సాక్షి, సిటీబ్యూరో: చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్) నిర్ధారణకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నామని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఈ ప్రక్రియలో ప్రజల అభ్యంతరాలకు ప్రాధాన్యం ఇస్తామని, వీలైనంత త్వరలో నిర్ధారణ పూర్తవుతుందని స్పష్టం చేశారు. ఈ దిశలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎఫ్‌టీఎల్‌లు ఖరారైతే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఎఫ్‌టీఎల్ ఖరారు ప్రక్రియలో గ్రామ, రెవెన్యూ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, సర్వే ఆఫ్ ఇండియా రికార్డులతోపాటు ఎన్ఆర్ఎస్‌సీ శాటిలైట్ ఇమేజీలను పరిగణనలోకి తీసుకుంటున్నామని అన్నారు. దీనికోసం రూపొందిస్తున్న సీలేక్ ఎన్యుమరేషన్ యాప్‌లో ప్రజలు అభ్యంతరాలు చెప్పడానికి ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన 57 ఫిర్యాదుల్లో ఎఫ్‌టీఎల్‌పైనే ఎక్కువ ఫిర్యాదులు ఉన్నాయి. చెరువుల్లో ఓ వైపు నుంచి మట్టిని నింపడంతో పాటు మురుగు నీరు నిరంతరాయంగా వచ్చి చేరడంతో ఎఫ్‌టీఎల్ పరిధులు మారిపోతున్నాయని, ఈ నేపథ్యంలో వేగంగా నిర్ధారణ జరగాల్సి ఉందని రంగనాథ్ అన్నారు. దీనికోసం ప్రత్యేకంగా నిపుణుల కమిటీ వేసి అపోహలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు.

- కుత్బుల్లాపూర్ మండలం మెట్టుకానిగూడ, గాజులరామారంలోని సర్వే నం.161లో ఉన్న పార్కు స్థలంతోపాటు ఆ పక్కనే ప్రభుత్వ స్థలాన్ని కూడా కొందరు కబ్జా చేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- కాప్రా చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ అయిందని, ఫెన్సింగ్‌ను తొలగించి కబ్జా చేస్తున్నారని హైడ్రాకు ఫిర్యాదు అందింది.
- దుండిగల్ మున్సిపాలిటీలోని మల్లంపేటలో పీవీఆర్ మెడోస్ యజమానులు ఇతర కాలనీలకు వెళ్లే మార్గాలను మూసేశారని మల్లంపేట నివాసితులు హైడ్రాను ఆశ్రయించారు.
- పటాన్‌చెరువులో తిమ్మక్క చెరువుకు నీరందించే పెద్దవాగును ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జా చేసిందని, 30 మీటర్ల వెడల్పు వాగుకు తోడు ఇరువైపులా 9 మీటర్ల చొప్పున బఫర్ ఉండాలని హైడ్రా దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విస్తీర్ణం కుంచించుకుపోయిందని ఫిర్యాదు చేశారు.
- ఫిర్జాదిగూడ మున్సిపాలిటీ పార్వతిపురి గ్రామంలో మూడు ఎకరాల సమాధుల భూమి తమదంటూ పట్టాలు సృష్టించిన కొందరు కబ్జా చేస్తున్నారని హైడ్రాకు ఫిర్యాదు అందింది.

ట్రైకార్ రుణాలను వెంటనే విడుదల చేయాలి

గిరిజన సంఘాల జేఏసీ నేతలు డిమాండ్



డీఎస్ఎస్ భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల జేఏసీ నేతలు

నాంపల్లి: పెండింగ్‌లో ఉన్న రూ.219 కోట్ల ట్రైకార్ రుణాలను వెంటనే విడుదల చేయాలని గిరిజన సంఘాల జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంజూరైన చెక్కులను వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్య నాయక్, తెలగాణ గిరిజన సంఘం నేత ఆర్.శ్రీరామ్ నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాంబల్ నాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులు బి.రఘు మాట్లాడారు. రుణాలు మంజూరై బ్యాంకు ఖాతాల్లో చెక్కులు జమకాని వారు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి వెళితే ఇప్పటికే రుణాలు తీసుకున్నట్లుగా చూపిస్తూ తిరస్కరణకు గురవుతున్నాయని తెలిపారు. ట్రైకార్ సంస్థలో యూనిట్ కాస్ట్ రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉండగా, రాజీవ్ యువ వికాసంలో రూ.4 లక్షల వరకే రుణ సౌకర్యాలు కల్పించడం అన్యాయమని అన్నారు. మంజూరైన రుణాలను రద్దు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రుణాలను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయని యెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

శాస్త్రీయ కళలను కాపాడుకోవాలి



గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ సంగీత కళలను కాపాడడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకమని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్ అకాడమీ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న చిన్నారులకు బాలరాముని పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో సంగీత కళలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల స్థాయి నుంచి శాస్త్రీయ కళలపై మక్కువ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీవీ నటుడు నాగబాల సురేష్‌కుమార్, నటి శైలజ, భారత ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకురాలు లలిత తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించాలి

నేషనల్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ



సమావేశంలో బీసీ నేతలతో కలిసి అభివాదం చేస్తున్న ఆళ్ల రామకృష్ణ

హిమాయత్‌నగర్: విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లులను ఆమోదించాలని, వాటిని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని నేషనల్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ బీసీ బిల్లులను ఆమోదించిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీ బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరుతూ బీసీ ఆజాది జేఏసీ చైర్మన్ బత్తుల సిద్దేశ్వర్ పటేల్ ఢిల్లీలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావం తెలియజేశారు. దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో కులగణనను కూడా చేర్చాలని కోరారు. బీసీలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుకూలమా.. వ్యతిరేకమా అనేది స్పష్టం చేయాలని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పందించాలన్నారు. సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్, బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్ గౌడ్, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు పర్వత సతీష్ కుమార్ పటేల్, బండారి గంగాధర్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అక్షర నీరాజనం' పుస్తకావిష్కరణ


సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వరంగల్ జిల్లాకు చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ నెల్లుట్ల నవీన్ చంద్ర గురించి 30 మంది రచయితలు రాసిన అక్షర నీరాజనం పుస్తకాన్ని సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డాక్టర్ నవీన్ చంద్ర భౌతిక శాస్త్రవేత్తగా కెనడాలో 50 ఏళ్ల ప్రవాస భారతీయుడిగా ఉండి తెలుగుభాష పట్ల ఎనలేని గౌరవంతో కవులను ప్రోత్సహించారని అన్నారు. అనేక పుస్తకాలను సమాజానికి అందించారని కొనియాడారు. టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొంపల్లి కామేశ్వర రావు, నెలుట్ల ఇంద్రశ్రీ, గోపాలక్రిష్ణమూర్తి, పి.వి.శర్మ, లలిత, కిరణ్మయి, పాలడగు రాణి పాల్గొన్నారు.



అక్షర నీరాజనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అత్తలూరి విజయలక్ష్మి

సర్వే సరే.. పారితోషికం ఏది?

- ఎన్యుమరేటర్లు, పర్యవేక్షకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల ఎదురుచూపులు
- ఒక్కొక్కరికి రూ. 10 వేల నుంచి రూ.12 వేలు ఇస్తామన్న సర్కారు
- ఐదు నెలల గడిచినా వాటి ఊసెత్తని వైనం
- 3 వేల మంది ఎన్యుమరేటర్లకు రూ.3.99 కోట్ల బకాయిలు



సాక్షి,సిటీబ్యూరో: ఐదు నెలలు గడిచినా పారితోషికం ఊసెత్తని అధికారులు.. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఎన్యూమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు... మూడు వేల మందికి రావాల్సిన బకాయిలు 3,99 కోట్లు.. ఇదీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పరిస్థితి. ఇంటింటి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అంశాలపై సర్వే చేపట్టిన ఎన్యుమరేటర్ల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఐదు నెలల క్రితం15 రోజులకు పైగా సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. సర్వే చేసిన వారికి రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు పారితోషికం చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు అందజేయలేదు.

సర్వే కోసం..

సామాజిక గణన సర్వే కోసం ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, ఎన్యుమరేటర్లుగా విధులు నిర్వహించారు. వీరిపై పర్యవేక్షకులుగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇతర శాఖల జిల్లా అధికారులు పని చేశారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులను డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా నియమించారు. కాగా, ఎన్యుమరేటర్లకు రూ.10 వేలు, పర్యవేక్షకులకు రూ.12 వేల చొప్పున పారితోషికం అందిస్తామని చెప్పారు. ఆపరేటర్లకు ఒక్కో కుటుంబ ఫారానికి రూ.25 చొప్పున చెల్లిస్తామన్నారు. వారందరికీ నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా పారితోషికం చెల్లిస్తామని ఉన్నతాధికారులు వివరాలు తీసుకున్నారు. ఐదు నెలలు గడిచినా నయాపైసా జమ కాలేదు.

3 వేల మందికి ...రూ.3.99 కోట్ల బకాయి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని నాలుగు నగర పాలక సంస్థలు, తొమ్మిది మున్సిపాలిటీలు, ఐదు మండలాల పరిధిలో 2,780 మంది సిబ్బంది ఎన్యుమరేటర్లగా విధులు నిర్వహించగా, 270 మంది ఉద్యోగులు సూపర్‌వైజర్లుగా పర్యవేక్షించారు. ఒక్కో ఎన్యుమరేటర్ 150 కుటుంబాలను రోజుకు 10 కుటుంబాల చొప్పున సర్వే చేయాలని లక్ష్యంగా నిర్దేశించి సర్వే చేయించారు. సర్వే కార్యక్రమంలో విధులు నిర్వహించిన వారందరికీ రూ.3.99 కోట్ల పారితోషికం ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అయితే పారితోషికం కోసం రెండు, మూడు పర్యాయలు జిల్లా అధికార యంత్రాంగానికి, కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో కూడా విన్నవించుకున్నా పట్టించుకునేనాథుడులేదు.

ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే...



సామాజిక గణన సర్వే కోసం ప్రభుత్వం విడుదల చేసిన డబ్బులు ట్రెజరీలో ఉండగా, బిల్లులు చేసి, నివేదించామని సంబంధిత అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే సంబంధిత సిబ్బంది ఖాతాకు డబ్బులు బదిలీ అవుతాయంటున్నారు. సర్వే చేసినవారికి పారితోషికం చెల్లించాలని ఐదు నెలలుగా జిల్లా అధికార యంత్రాంగానికి మొర పెట్టుకుంటున్నా రేపు, మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి ఉన్నికృష్ణన్ ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పారితోషికం చెల్లించకపోతే సీఐటీయూ అధ్వర్యంలో ఎన్యుమరేటర్లంతా ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌, మంగళవారం, 8, ఏప్రిల్‌, 2025



ఆ నగరం.. ఒకప్పుడు చెత్త కుప్పలతో నిండి ఉండేది, విచ్చలవిడిగా పందులు, కుక్కలు తిరుగుతుండేవి.. వాటి విసర్జన కుప్పలు ఈగల సమూహాలతో వీధులు నిండిపోయేవి.. ఇలాంటి అత్యంత అపరిశుభ్ర పరిస్థితుల మధ్య నుంచి.. తనను తాను మార్చుకుంటూ.. కొత్తగా మలుచుకుంటూ ఇప్పుడు అత్యంత పరిశుభ్ర నగరంగా అవతరించింది ఇండోర్‌. మధ్యప్రదేశ్‌ రాష్ట్రంలో ఉన్న ఈ క్లీనెస్ట్‌ సిటీ ఆఫ్‌ ఇండియా.. ఇండోర్‌ సక్సెస్‌ సీక్రెట్స్‌ ఏంటి? ఈ స్థానంలో మన నగరం కూడా చోటు దక్కించుకోగలదా? - సాక్షి, సిటీబ్యూరో



మరో ఇండోర్‌.. కాగలమా?

ఎనిమిదేళ్లుగా క్లీనెస్ట్‌ నగరాల్లో నెం.1 స్థానంలో

- పట్టుదలతో 25వ స్థానం నుంచి మొదటి స్థానానికి
- అధికారులు, నగరప్రజల సమష్టి కృషితో విజయం
- తరచూ ఇండోర్‌ రాకపోకలు సాగించే నగరవాసి అభిప్రాయం

దేశంలోని 471 పట్టణాలు, నగరాల్లో అత్యంత పరిశుభ్రమైన నగరం అనే అవార్డును ఎనిమిది సంవత్సరాలుగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌ నగరం గెలుస్తూనే ఉంది. ఇదే ఇండోర్‌ నగరం 2017కి ముందు, పరిశుభ్రత ర్యాంకింగ్స్‌లో 25వ స్థానంలో ఉంది. దీనికి కారణాలేమిటి? మన ఇండియాలోనే ఉన్నామా? 'మనం విమానాశ్రయం నుంచి బయటకు వచ్చినప్పుడు, రోడ్లు చూడగానే భారతదేశంలో లేమేమో అనిపిస్తుంది, అంత పరిశుభ్రంగా ఉంటుంది అని నగరం నుంచి ఉద్యోగ బాధ్యతల నిమిత్తం తరచూ ఇండోర్‌కు రాకపోకలు సాగించే కార్పొరేట్‌ ఎగ్జిక్యూటివ్‌ నితీష్‌ అంటున్నారు. మన నగరంలో పలు కుటుంబాలు తమ ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకుంటాయి. కానీ ముందు తలుపు నుంచి కొన్ని అడుగుల దూరంలో చెత్త కుప్పలుగా పోగుబడి ఉంటుంది. 'ఆ కుప్ప ప్రాంతం వేరొకరి బాధ్యతగా భావిస్తారు. దీంతో తమ పరిశుభ్రమైన ఇంటికి దుర్వాసనతో కూడిన ఆ చెత్త కుప్ప మీదుగా వెళ్లడంలో ఎవరూ ఎటువంటి ఇబ్బందీ పడరు' అయితే ఇండోర్‌లో దీనికి భిన్నమైన దృశ్యం కనిపిస్తుందని చెప్పారాయన. ఈ సందర్భంగా ఆయన పంచుకున్న కొన్ని ఇండోర్‌ 'విజయ'విశేషాలు..


క్లీన్‌ టూ విన్‌..

పేవ్‌మెంట్‌లు, రోడ్‌ డివైడర్‌లు రీసైకిల్‌ చేసిన నీటి గొట్టాలను కలిగి ఉంటాయి. అక్కడి చెత్త వ్యాన్‌లు ఇండోర్‌ నంబర్‌ వన్‌గా మారింది అనే జింగిల్‌ను పదే పదే ప్లే చేస్తుంటాయి. ఆ శబ్దం తమను సమీపిస్తుండగానే జనం తమ ఇళ్లలో నుంచి తమ చెత్త బుట్టలతో బయటపడతారు. అతి చిన్న సందులో ఉండే వేలాది విభిన్న రంగుల డబ్బాల నుంచి వ్యర్థాలను తొలగించి, శుద్ధి చేసే విధానం అమలు చేసేందుకు దాదాపు 850 మంది పారిశుధ్య సిబ్బంది సైన్యం తరహాలో సిద్ధంగా ఉంటుంది.



ఇవీ కీలకాంశాలు..

- జీపీఎస్‌ ట్రాకింగ్‌ ఉపయోగించి, ఓ ప్రత్యేక బృందం చెత్త వ్యాన్‌ల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తుంది, వారు తమ పనిని నిర్దేశించిన విధంగా చేస్తున్నారో లేదో సునిశితంగా పరిశీలిస్తారు.
- గృహస్థుల వ్యర్థాలను తడి, ఎలక్ట్రానిక్స్‌, ప్లాస్టిక్స్‌, నాన్‌ప్లాస్టిక్‌, బయోమెడికల్‌, ప్రమాదకర పదార్థాలుగా విభజన జరుగుతుంది.
- వ్యర్థాలను ఇంధనంగా, కంపోస్టుగా మార్చి రైతులకు ఎరువుగా విక్రయిస్తున్నారు. చాలా రెస్టారెంట్లు మొబైల్‌ కంపోస్టింగ్‌ వ్యాన్‌లను రెస్టారెంట్స్‌ బయట ఉంచుతాయి.
- పండ్లు, కూరగాయల మార్కెట్‌లో వివిధ రకాల వ్యర్థాల కోసం వేర్వేరు డబ్బాలు ఏర్పాటు చేసి ఉంటాయి. అక్కడ ఒక యంత్రం కూడా ఉంది. ఇది వ్యర్థాలను సిటీ బస్సుల కోసం వాడే, అలాగే వంటకు ఉపయోగించే ఇంధనంగా మారుస్తుంది.





- నివాసితులు నగర పరిశుభ్రతను తమ వ్యక్తిగత బాధ్యతగా తీసుకున్నారు. 'చెత్తను ఎడా పెడా ఎవరైనా వేస్తే వారిని ఇతరులు అడ్డుకుంటారు. దారిలో కనబడిన చెత్తను యజమానులు అక్కడే ఆగి తమ కారును ఆపి మరీ తొలగించడం మనం చూడవచ్చు.
- తమ నగరం పరిశుభ్రత పరంగా దేశంలోనే నెంబర్‌ వన్‌ అనే టైటిల్‌ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిచ్చే ఒక ఇంధనంగా మారింది. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని పాఠశాల విద్యార్థులు ప్రతి రోజూ ప్రతిజ్ఞ చేస్తారు.
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎవరైనా చెత్త వేసినట్లు గుర్తిస్తే వెంటనే జరిమానాలు విధించడం లాంటి కట్టుదిట్టమైన చట్టాలు ఉన్నాయి.
- స్థానిక ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో పరిశుభ్రత పోటీలను నిర్వహిస్తున్నారు. మతపరమైన గ్రంథాలను ఆధారం చేసుకుని, పరిశుభ్రత అవసరాన్ని తలకెక్కించడానికి, మత పెద్దలను కూడా ఈ కార్యక్రమంలో భాగం చేశారు. హోలీ వంటి పండుగల సందర్భంగా, వీధులు, భవనాలు రంగులతో తడిసినప్పుడు, అదనపు వాహనాలు నీటి ట్యాంకర్లు నగరాన్ని శుభ్రం చేయడానికి శరవేగంగా బయటకు వస్తాయి.



- ప్రజలు ప్రభుత్వాలు తలచుకుంటే ఇండోర్‌ విజయాన్ని మన నగరంలో కూడా పునరావృతం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. 'స్వచ్ఛందంగా ముందుకొచ్చే ప్రజానీకం, దృఢమైన చిత్తశుద్ధి కలిగిన ప్రభుత్వం ఉంటే తరతరాలుగా వస్తున్న కొన్ని 'చెత్త' అలవాట్లు మారతాయి' అంటున్నారాయన.

హై-వోల్టేజ్‌ స్టాలియన్‌ పవర్‌ లిఫ్టింగ్‌..

ఘనంగా ముగిసిన పవర్‌లిఫ్టింగ్‌ ఛాంపియన్‌షిప్‌

అథ్లెట్లకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా నిర్వహణ





సాక్షి, సిటీబ్యూరో: నగర వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్టాలియన్‌ పవర్‌లిఫ్టింగ్‌ ఛాంపియన్‌షిప్‌ మానసిక-శారీరక వంటి స్ఫూర్తిదాయక ప్రదర్శనలతో ముగిసింది. వెయ్యికి పైగా ఔత్సాహికులతో, 30 రోజులకు పైగా నిర్వహించిన ఈ ఛాంపియన్‌షిప్‌ ఫిట్‌నెస్‌ ఔత్సాహికులను హై-వోల్టేజ్‌ ఫినాలేతో అలరించింది. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా చైర్మన్‌ డాక్టర్‌ నరసయ్య, తెలంగాణ ప్రభుత్వ స్పోర్ట్స్‌ స్కూల్‌ హకీంపేట అధికారి సుధాకర్‌, వెయిట్‌ లిఫ్టింగ్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ శ్రుతి రావు, లైఫ్‌స్పాన్‌ చైర్మన్‌ డా.నరేంద్ర రామ్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.నరేంద్ర రామ్‌ మాట్లాడుతూ.. అధునాతన పోషక ఉత్పత్తులతో మాత్రమే కాకుండా, ఫిట్‌నెస్‌ ప్రాముఖ్యతతో ఆరోగ్య సమాజ వేదికగా అథ్లెట్లకు సాధికారత కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు. స్టాలియన్‌ పవర్‌లిఫ్టింగ్‌ ఛాంపియన్‌షిప్‌కు మద్దతు ఇవ్వడం సంతోషంగా ఉందని, ఇందులో పాల్గొనే వారి ఫిట్‌నెస్‌ ప్రయాణానికి దోహదపడటానికి గర్వపడుతున్నానని పేర్కొన్నారు. విభిన్న బరువు విభాగాల్లోని ఎనిమిది మంది విజేతలకు లైఫ్‌స్పాన్‌ లక్ష రూపాయల విలువైన బహుమతులను అందించినట్లు తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో విభిన్న విభాగాల్లో అనిషా, రమ్య, సంతోష్‌, కార్తీక్‌, కలీమ్‌, విక్రమ్‌, హర్ష, శ్రీనివాస్‌ విజేతలుగా నిలిచారు.



బిగ్‌ స్క్రీన్‌లో.. చూసేద్దాం..

- నగరంలో ఐపీఎల్‌ హంగామా
- మ్యాచ్‌ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- 20 శాతం ఆక్యుపెన్సీ పెరిగిందంటున్న యాజమాన్యాలు

సాక్షి, సిటీబ్యూరో: వేసవి వచ్చిందంటే క్రికెట్‌ ప్రియులకు పండగే. ఈ రెండు నెలలూ ఐపీఎల్‌ ఫీవర్‌ కొనసాగుతుంది. దొరికితే స్టేడియంకి వెళ్లి ఎంజాయ్‌ చేయడం, లేకుంటే బల్క్‌ నంబర్‌ క్రౌడ్‌లో బిగ్‌ స్క్రీన్‌పై మ్యాచ్‌ తిలకించి చిల్‌ అవ్వడం.. ఇప్పుడిదే ట్రెండ్‌. ఫ్యాన్‌ క్రికెటర్‌ కొట్టే ఫోర్లు, సిక్సులు, వికెట్లకు కేరింతలు కొట్టి గోల చేయడంలో ఉన్న కిక్కే వేరప్పా అంటున్నారు పలువురు నగర యువత. అయితే టికెట్లు కొని స్టేడియంకు వెళ్లి మ్యాచ్‌ చూడటం అందరికీ సాధ్యమయ్యేది కాదు. దీంతో ఆ అనుభూతిని పొందడానికి పెద్ద స్క్రీన్లు, ఎక్కువ మంది జనం ఉన్న చోటును క్రికెట్‌ అభిమానులు ఎంచుకుంటున్నారు. దీనికి అనుగుణంగానే నగరంలోని పలు హోటళ్లు, సినిమా థియేటర్లు, పబ్బులు, రెస్టారెంట్లు, బార్లలో పెద్దపెద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌లు, ప్రొజెక్టర్లను ఏర్పాటు చేశారు. విశాలమైన ప్రదేశంలో లైవ్‌ మ్యాచ్‌లను చూస్తూ కూల్‌ డ్రింక్స్‌, నచ్చిన ఫుడ్‌ ఆర్డర్‌ చేసుకుని సాయంత్రం ఎంజాయ్‌ చేస్తున్నారు. దీంతో నిర్వాహకులకు, బిజినెస్‌కు, బిజినెస్‌ క్రికెట్‌ ఫ్యాన్స్‌కు థ్రిల్లింగ్‌. సినిమా థియేటర్లు, కొన్ని చోట్ల నామమాత్రంగా టికెట్‌ ఉంటుంది. ఇతర ప్రదేశాల్లో ఉచితంగానే చూడొచ్చు. ఐపీఎల్‌ షెడ్యూల్‌ విడుదలైనప్పటి నుంచి అభిమాన జట్లు, ఫ్యాన్‌ క్రికెటర్ల మ్యాచ్‌లు ఎప్పుడు ఉన్నాయో షెడ్యూల్‌ సిద్ధం చేసుకుంటున్నారు. వాటికి అనుగుణంగా తమ వర్క్‌, బిజినెస్‌ లైఫ్‌ను సర్దుబాటు చేసుకుంటున్నారు. వారాంతం వచ్చిందంటే ఓపెన్‌ ఎయిర్‌ ప్రాంతాలకు క్రౌడ్‌ క్యూకడుతోంది. గెస్ట్‌ హౌస్‌, ఫాం హౌస్‌లో స్నేహితుల బృందంతో మ్యాచ్‌ తిలకించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.



స్టేడియంకు వెళ్లిన ఫీల్‌..

స్టేడియంలో మ్యాచ్‌ చూద్దామంటే టికెట్లు దొరకడం కష్టంగా మారింది. దీనికి తోడు ఒక్కో మ్యాచ్‌ ఒక్కో నగరంలో జరుగుతోంది. టీవీలో ఒకరిద్దరం కూర్చుని చూడటంలో పెద్ద కిక్కేముంది. ఫ్రెండ్స్‌తో కలసి ఓపెన్‌ ఎయిర్‌లో ప్రొజెక్టర్‌, బిగ్‌ స్క్రీన్‌పై చూసి ఎంజాయ్‌ చేస్తున్నాం. మ్యాచ్‌ సమయంలో ఫుడ్‌, సాఫ్ట్‌ డ్రింక్స్‌ సప్లై ఉంటుంది. బాల్‌ బౌండరీ దాటినా.. వికెట్‌ పడినా ఆ ఎమోషన్స్‌ మనలో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి. అందులోనే స్టేడియం ఫీల్‌ ఉంటుంది.

– చంద్రశేఖర్‌ వారణాసి, సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌, రాయదుర్గం



20 శాతం ఆక్యుపెన్సీ పెరుగుతోంది..

ఫ్రెండ్స్‌ గ్రూప్స్‌, ఫ్యామిలీ సభ్యులు డిన్నర్‌కు వచ్చినట్లే వచ్చి పెద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ఐపీఎల్‌ క్రికెట్‌ ఎంజాయ్‌ చేస్తున్నారు. ఫీడ్‌బ్యాక్‌ తీసుకుంటున్నాం. క్రికెట్‌ ఫ్యాన్స్‌ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. సాధారణ రోజులతో పోల్చితే ఐపీఎల్‌ మొదలైన తరువాత సీట్‌ ఆక్యుపెన్సీ రేటు 20 శాతం వరకూ పెరిగింది.

– రాఘవేందర్‌రెడ్డి, అర్బన్‌ మాయాబజార్‌ నిర్వాహకులు, ఎల్‌బీనగర్‌


శిలా నిశ్శబ్దం..

స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీ వేదికగా ప్రత్యేక ప్రదర్శన



- కాకతీయ శిల్పకళా వైభవంపై లైవ్‌ స్కెచ్చింగ్‌
- వాటిని సంరక్షించడానికి శిల్ప కళా విశిష్టతను ప్రతిబింబించిన 50 మంది కళాకారులు
- ఈ నెల 12 నుంచి 14 వరకూ ప్రదర్శన ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ వారసత్వ సంపద, సాంస్కృతిక వైభవం, కళలను పరిరక్షించి భావితరాలకు అందించాలనే లక్ష్యంతో కళాయజ్ఞ బృందం, టార్చ్‌ సంస్థ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. గత చరిత్ర వైభవాన్ని, విశిష్టతను తెలియజెప్పే మాధ్యమాలుగా ఎన్నో పుస్తకాలు, ఆడియో, వీడియో, గ్రంథాలు ఇలా అనేక రూపాల్లో అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా ఇక్కడి నేలపై ఘన చరిత్ర కలిగిన కాకతీయ సామ్రాజ్యపు విశిష్టత, కళా సాంస్కృతిక వైభవం, ఈ కట్టడాలు, శిల్పాలపైనే ప్రతిబింబించి ఉంది. కానీ మన చరిత్రలో భాగమైన పురాతన కట్టడాలు శిథిలావస్థకు చేరి వాటి వాస్తవ రూపాలను, కళను కోల్పోనివి ఎన్నో ఉన్నాయి. ఆ శిల్ప కళ ప్రస్తుతం ఏ పరిస్థితుల్లో ఉంది, వాటి సంరక్షణ, పరిరక్షణ ఎంత వరకూ అవసరం అనే నేపథ్యంలో కళాయజ్ఞ బృందం, టార్చ్‌ సంస్థ ఆధ్వర్యంలో శిథిలమైన పురాతన కట్టడాలు, ఆలయాలు ప్రస్తుత పరిస్థితిని కళ్లకు కట్టేలా లైవ్‌ స్కెచింగ్‌, పెయింటింగ్స్‌ గీశారు. ఈ ప్రాజెక్టులో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారుగా 50 మంది కళాత్మక నైపుణ్యం కలిగిన సభ్యులు కాకతీయుల అద్భుత కట్టడాల పరిస్థితిని లైవ్‌స్కెచింగ్‌, పెయింటింగ్‌ ద్వారా ఈ తరానికి తెలియజేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా జనవరి నెల్లో పెద్దపల్లి జిల్లా మంథనిలోని చెంద్రవెల్లి దేవాలయాలు, ఘనపురం కోటగుళ్లు, రామప్ప దేవాలయాలకు టార్చ్‌ కళాయజ్ఞలో భాగంగా కళాత్మక రూపాన్ని అందించారు. శిథిలావస్థలో ఉన్న ఇక్కడి సాంస్కృతిక కళా వైభవానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. కొందరు ఆర్టిస్టులు ఈ కళాసంపద శిథిలం కాకముందు ఎలా ఉండేదో అని ఊహాజనిత చిత్రాలను సైతం గీశారు. ఈ చిత్రాలను 'శిలా నిశ్శబ్దం' పేరుతో ఈ నెల 12 నుంచి 14 వరకూ మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీలో ప్రదర్శించనున్నారు. ఈ ప్రయత్నానికి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రోత్సాహాన్ని అందిస్తోంది.



చరిత్రకు సాక్ష్యాలుగా..

కళా సంపద పరిరక్షణ ప్రాధాన్యతను ప్రజలకు, ప్రభుత్వానికి తెలియజేసేలా చేపట్టిన ఈ ప్రాజెక్టులో కళాకారులు వినూత్న పంథాను ఎంచుకున్నారు. కళా వైభవమున్న ఆ ఆలయాల వద్దకే వెళ్లి ధ్వంసమైన ఈ నిర్జీవ కళలను వారి కళాత్మక రేఖలతో ఈ తరానికి చేరువ చేశారు. అంతేకాకుండా ఈ కళా ప్రయోగాన్ని పుస్తక రూపంలో తీసుకొచ్చే ఆలోచన ఉన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారంతో పోలిస్తే కాకతీయులకు సంబంధించి తెలియని ఘన చరిత్రే ఎక్కువ. ఈ మేరకు అన్వేషణ కొనసాగిస్తున్న కళాయజ్ఞ-టార్చ్‌ బృందం తమ పరిశోధనలో వెలుగులోకి వచ్చిన సమాచారాన్ని భద్రపరిచి ముందుతరాలకు అందిస్తుంది. కోల్పోయింది ఎంతైనా.. మిగిలుంది ఈ తరానికి ఘనమైనవారసత్వ సంపదే. దానిని భవిష్యత్‌ తరాలకు మరింత భద్రంగా అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుంది.





దశాబ్దాల క్రితమే వైభవంగా..

అద్భుతమైన వారసత్వ కళా సంపదకు నెలవు ఈ తెలంగాణ నేల. ఎన్ని దండయాత్రలు జరిగినా ఇప్పటికీ సగర్వంగా అప్పటి కళా వైభవాన్ని ప్రదర్శిస్తున్నాయి ఆ రూపాలు. కానీ సంరక్షణ, భద్రత లేకపోవడంతో శిథిలావస్థలో అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. ఒక కళాకారుని దృష్టి, కళాత్మక కోణం ప్రత్యేకంగా ఉంటుంది. అందుకే మేమంతా కలిసి ఈ ప్రాజెక్ట్‌ చేపట్టి, ఆ చిత్రాలను 'శిలా నిశ్శబ్దం'గా స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీలో ప్రదర్శిస్తున్నాం. ప్రస్తుతం విదేశాలు గొప్పగా ఉన్నాయని చర్చించుకుంటాం.. కానీ శతాబ్దాల క్రితమే మన నేల యావత్‌ ప్రపంచానికే స్ఫూర్తిదాయకంగా ఉందనే సత్యాన్ని మన శిల్పకళ చెబుతోంది. ఆ ఆనవాళ్లను కాపాడుకుందాం.

– శేషబ్రహ్మం, ప్రముఖ చిత్ర కళాకారులు

క్లుప్తంగా...

ఎక్సైజ్ ఆదాయం రూ.34,600 కోట్లు

- 2024–25లో 7 శాతం అమ్మకాల పెరుగుదల
- 5.31 కోట్ల కేసుల బీర్లు, 3.69 కోట్ల కేసుల లిక్కర్ అమ్మకాలు



సాక్షి, హైదరాబాద్: గత ఆర్థిక సంవత్సరంలో (2024–25) ఎక్సైజ్ శాఖకు రూ.34,600 కోట్ల ఆదాయం సమకూరింది. అంతకుముందు ఏడాది (2023–24)లో రూ.34,800 కోట్ల మేర ఆదాయం రాగా, ఆ సంవత్సరం కొత్త మద్యం దుకాణాల దరఖాస్తుల రూపంలో రూ.2వేల కోట్లు సమకూరాయి. కాగా, మద్యం అమ్మకాలు పెరగడంతో గత ఏడాది ఆదాయం కూడా పెరిగిందని ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2023–24తో పోలిస్తే 2024–25లో మద్యం అమ్మకాలు 7 శాతం పెరిగాయి. 2023–24లో 5.48 కోట్ల కేసుల బీర్లు అమ్ముడుపోగా, 2024–25లో 5.31 కోట్ల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. అంటే అంతకుముందు సంవత్సరం కంటే గత ఆర్థిక సంవత్సరంలో బీర్ల అమ్మకాలు తగ్గాయి. కానీ, బీర్ల ధరల్లో మార్పుల కారణంగా ఆదాయం ఎక్కువగా వచ్చిందని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక, లిక్కర్ అమ్మకాలు మాత్రం పెరిగాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2023–24లో 3.62 కోట్ల కేసుల లిక్కర్ అమ్మకాలు జరగ్గా, 2024–25లో 3.69 కోట్ల కేసుల లిక్కర్ అమ్ముడుపోయింది. గత పదేళ్లుగా ఎక్సైజ్ ఆదాయంలో ఏటా వృద్ధి కనిపిస్తోందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

రిటైర్డ్ అధికారులను మళ్లీ తీసుకోవద్దు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేనికి స్త్రీనిధి సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో తొలగించిన రిటైర్డ్ ఉద్యోగుల్లో ఎవరినీ తిరిగి తీసుకోకుండా ప్రభుత్వానికి సూచించాలని స్త్రీనిధి ఉద్యోగ సంఘం నాయకులు.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కోరారు. సోమవారం వారిని వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందించారు. స్త్రీనిధి సమాఖ్యలో తొలగించిన ఎండీ విద్యాసాగర్ రెడ్డిని తిరిగి కొనసాగించే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఈ సంస్థలో 14 ఏళ్లుగా ఎండీగా కొనసాగి ఇప్పుడు బాధ్యతల నుంచి తొలగినా.. వాటిని పూర్తిస్థాయిలో వేరొకరికి అప్పగించకపోవడం సరికాదని పేర్కొన్నారు. మళ్లీ ఎండీగా వచ్చే ప్రయత్నాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారని తెలియజేశారు. విద్యాసాగర్‌రెడ్డి రెన్యువల్‌కు అవకాశం ఇవ్వకుండా స్త్రీనిధి సంస్థకు ఎండీగా ఐఏఎస్ అధికారికి పూర్తి బాధ్యతలు అప్పజెప్పేలా ప్రభుత్వానికి సూచించాలని కిషన్‌రెడ్డి, సాంబశివరావును కోరారు.

నేడు ఇందిరాపార్కు వద్ద ఎమ్మెల్సీ కవిత దీక్ష

అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటుకు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం దీక్ష చేపట్టనున్నారు. ఇందిరాపార్కు వద్ద తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంస్థలు కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ దీక్ష కొనసాగుతుంది. తెలంగాణ జాగృతి నాయకుడు నవీన్ ఆచారి, యూపీఎఫ్ కో కన్వీనర్ బొల్ల శివశంకర్ సోమవారం దీక్ష శిబిరం ఏర్పాట్లను పరిశీలించారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కవిత ఇటీవలి కాలంలో వరుస కార్యక్రమాలు చేపడుతున్నారు.

దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసులో నేడు హైకోర్టు తీర్పు

సాక్షి, హైదరాబాద్: దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించనుంది. 2013లో జరిగిన ఈ పేలుళ్లలో 18 మంది మృతి చెందగా, 130 మంది వరకు గాయపడ్డారు. ఈ కేసులో కీలక నిందితుడు యాసిన్ భత్కల్ సహా ఐదుగురికి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌ఐఏ) ఫాస్ట్ ట్రాక్ కోర్టు 2016లో ఉరి శిక్ష విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ముద్దాయిలు హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించనుంది. 2013, ఫిబ్రవరి 21న హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో పేలుళ్లు సంభవించాయి. ఎన్‌ఐఏ రంగంలోకి దిగి దర్యాప్తు చేసింది. 157 మంది సాక్ష్యాలను నమోదుచేసింది. ఈ ఘటనలో ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రసంస్థ సహ వ్యవస్థాపకుడు యాసిన్ భత్కల్ ప్రధాన నిందితుడిగా తేలింది. అసదుల్లా అక్తర్, వకాస్, తెహసీన్ అక్తర్, ఎజాజ్ షేక్, సయ్యద్ మక్బూల్‌ని నిందితులుగా గుర్తించారు. మూడేళ్లు ఈ కేసులు విచారించిన ఎన్‌ఐఏ స్పెషల్ కోర్టు.. నిందితులకు మరణశిక్షను విధించింది. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన యాసిన్ భత్కల్‌ను 2013లో నేపాల్ సరిహద్దుల్లో పట్టుకున్నారు. ఢిల్లీ, దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసు సహా పలు కేసుల్లో దోషిగా తేలగా తిహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు.

రైళ్లకు నిడివి చిక్కు..!



- రైళ్లలో కచ్చితంగా 4 జనరల్ కోచ్‌లుండాలని నిర్ణయం
- వీటిని జతచేస్తే.. రైలు పొడవు పెరిగి వేరే కోచ్‌లకు కోత
- లేదంటే లూప్‌లైన్ నిడివిని మించిపోనున్న రైలు పొడవు

సాక్షి, హైదరాబాద్: ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో కూడిన ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య కనీసం నాలుగుకు పెంచాలన్న నిబంధన ఇప్పుడు కొంత సమస్యలకు కారణమవుతోంది. అల్పాదాయ ప్రయాణికుల కోసం తీసుకున్న ఈ నిర్ణయం వారికి మేలు చేసేదే అయినా, ఈ కోచ్‌ల సంఖ్య పెంచినప్పుడు నిర్ధారిత పొడవును రైలు మించి పోతోంది. దీంతో అంతే సంఖ్యలో ఇతర కేటగిరీ కోచ్‌లను తొలగించాల్సి వస్తోంది. దీని వల్ల ఆయా కేటగిరీల్లో బెర్తుల సంఖ్య తగ్గి కొత్త సమస్యకు కారణమవుతోంది. రద్దీ ఎక్కువగా ఉండే అతికొద్ది రైళ్లలో తప్ప మిగతా వాటిలో అన్‌రిజర్వ్‌డ్ జనరల్ కోచ్‌లు రెండు మాత్రమే ఉంటున్నాయి. దీంతో ముందుగా సీట్లు రిజర్వ్ చేసుకోలేని సాధారణ ప్రయాణికులు బోగీలో టాయిలెట్ల వద్ద కూడా కూర్చొని ప్రయాణిస్తున్నారు. వారికి వెసులుబాటు కల్పిస్తూ అన్‌రిజర్వ్‌డ్ జనరల్ కోచ్‌ల సంఖ్య నాలుగుకు తగ్గకుండా ఉండాలని రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. పూర్తి ఏసీ, వందేభారత్, రాజధాని, దురంతో, డబుల్ డెక్కర్ లాంటి సాధారణ ఎల్‌హెచ్‌బీ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య నాలుగుకు పెంచుతున్నారు.

లూప్‌లైన్‌లో 'క్లియర్ స్టాండింగ్' పరిధి మించిపోవటమే సమస్య

ప్రతి స్టేషన్‌లో లూప్‌లైన్ ఉంటుంది. వెనక వచ్చే ముఖ్య రైళ్లకు రూట్ క్లియర్ చేసేందుకు కొన్ని రైళ్లను లూప్‌లైన్లలో నిలుపుతారు. ఆ లూప్‌లైన్‌లో రైలు నిలిచే 'క్లియర్ స్టాండింగ్ ఏరియా దాదాపు 600 మీటర్ల పొడవు ఉంటుంది. దానికి ప్రారంభ-ముగింపు సిగ్నళ్లు ఉంటాయి. లూప్‌లైన్‌లో నిలిపే రైలు ప్రారంభ సిగ్నల్, ముగింపు సిగ్నల్ మధ్యలో మాత్రమే నిలవాలి. అప్పుడే ఈ రైలు వెనక సిగ్నల్ ఎరుపు రంగులోకి మారుతుంది. లేదంటే వెనుక సిగ్నల్ గ్రీన్‌గానే ఉంటుంది. లైన్ల అనుసంధానంలో ఏదైనా పొరపాటు జరిగినప్పుడు వెనక రైలు లోకోపైలట్ ఆ గ్రీన్‌ను చూసి బ్రేక్ వేయడు. దీంతో రైళ్లు పరస్పరం ఢీకొనే ప్రమాదం ఉంటుంది.

☛ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో కూడిన ఓ రైలులో గరిష్టంగా 22 కోచ్‌లు ఉంటాయి. ఈ రేక్ నిడివి 535 మీటర్ల వరకు ఉంటుంది. ముందు, వెనుక ఉండే సిగ్నల్ జాయింట్లకు, రైలుకు మధ్య కొంత దూరం ఉంటుంది. ఆ దూరంతో కలుపుకొంటే లూప్‌లైన్ క్లియర్ స్టాండింగ్ ఏరియా పరిధి సరిపోతుంది.

☛ రైలు పొడవు అంతకంటే ఎక్కువ పెరిగేందుకు వీలుపడదు. ఇప్పటికే 22 కోచ్‌లతో ఉండే రైలులో మరో రెండు అన్‌రిజర్వ్‌డ్ జనరల్ కోచ్‌లను చేరిస్తే దాని పొడవు పెరిగి ప్రమాదాలకు కారణమవుతుంది. ఇప్పుడు జనరల్ కోచ్‌లు 4 ఉండాల్సి వస్తే, అంతమేర వేరే కేటగిరీ కోచ్‌లను తొలగించక తప్పదు. దీంతో కొన్ని రైళ్లలో స్లీపర్ కోచ్‌లను, కొన్నింటిలో ఏసీ మూడో శ్రేణి కోచ్‌లను తొలగిస్తున్నారు.

☛ దీనివల్ల ఆయా కేటగిరీ ప్రయాణికులకు బెర్తులు తగ్గిపోతాయి. ఇప్పటికే చాలా రైళ్లలో స్లీపర్ కోచ్‌లలో బెర్తులు దొరకటంలేదు. వాటి సంఖ్య తగ్గితే ఆ సమస్య మరింత పెరుగుతుంది.

63 జతల రైళ్లలో

దక్షిణ మధ్య రైల్వేలో 126 (63 జతలు) ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో కూడిన రైళ్లు తిరుగుతున్నాయి. వీటిల్లో 18 జతల రైళ్లు ప్రీమియం కేటగిరీలో ఉన్నాయి. మిగతా 45 జతలకుగాను 6 జతల్లో ఇప్పటికే నాలుగు, అంతకంటే ఎక్కువ జనరల్ కోచ్‌లు ఉన్నాయి. మిగతా 39 జతల రైళ్లలో దశలవారీగా కోచ్‌ల సంఖ్య నాలుగుకు పెంచనున్నారు. మొదటి దశలో 12 రైళ్లలో 26 జనరల్ కోచ్‌లను అదనంగా చేర్చారు. రెండో దశలో 54 రైళ్లలో 96 జనరల్ కోచ్‌లను అదనంగా కలిపారు. మరో 12 రైళ్లకు వీటిని చేర్చాల్సి ఉంది.

ఈ పాపం.. ఎవరిది పవన్?

విశాఖలో డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో కఠిన ట్రాఫిక్ ఆంక్షలు

- ట్రాఫిక్ స్తంభించి అందులో చిక్కుకున్న విద్యార్థులు
- జేఈఈ మెయిన్స్ పరీక్షకు రెండు నిమిషాలు ఆలస్యం
- 23 మందిని పరీక్షకు అనుమతించని నిర్వాహకులు



విశాఖలోని పరీక్షా కేంద్రం వద్ద విలపిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పెందుర్తి: వారంతా తన కలను సాకారం చేసుకునేందుకు నిద్రాహారాలు మాని తపించారు. జీవిత లక్ష్యం నెరవేరే రోజు వచ్చింది.. కానీ ఎన్నో ఆశలతో పరీక్షకు సిద్ధమైన ఆ విద్యార్థులకు సోమవారం విశాఖలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన శాపంగా మారింది. ఉదయం నుంచే కూటమి నేతల కోలాహలం.. కఠినమైన ఆంక్షల కారణంగా ట్రాఫిక్‌లో చిక్కుకుని 23 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షకు దూరమయ్యారు. పవన్ కల్యాణ్ కాన్వాయ్ కోసం ఎన్‌ఏడీ నుంచి పెందుర్తి వరకు వాహనాలను నిలిపివేయడంతో జేఈఈ మెయిన్ పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులంతా చిక్కుకుపోయారు. రెండు నిమిషాలు ఆలస్యం కావడంతో నిర్వాహకులు వారిని పరీక్షకు అనుమతించలేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కన్నీళ్లు పెట్టుకున్నారు. అయితే పవన్‌కల్యాణ్ రాక సందర్భంగా ట్రాఫిక్‌ను ఆపలేదని.. బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో ఆయన వెళ్లారని.. మిగిలిన సర్వీస్ రోడ్లపై ఇతర వాహనాలు యథావిధిగా ముందుకు సాగాయని విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అసలేం జరిగింది..!

అల్లూరి జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన నేపథ్యంలో ఎన్‌ఏడీ కొత్త రోడ్డు నుంచి పెందుర్తి వరకు ఉదయం నుంచి పోలీసులు ట్రాఫిక్‌ను పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకున్నారు. పవన్‌కల్యాణ్ ప్రత్యేక విమానంలో ఉదయం 8.15 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకోగా 6.30 నుంచే ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ వచ్చారు. పవన్‌కల్యాణ్ కాన్వాయ్‌కు కేటాయించిన బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో ఇతర వాహనాలను పూర్తిగా నిలిపివేయగా.. ఎడమ, కుడి మార్గాల్లో ఆంక్షలు విధించడంతో ట్రాఫిక్ మందకొడిగా సాగింది. పవన్‌కల్యాణ్ వచ్చే సమయంలో 7.30 నుంచి ట్రాఫిక్‌ను పూర్తిగా నియంత్రించారు. దీంతో పరీక్షకు హాజరు కావాల్సిన విద్యార్థులు అందులో చిక్కుకుపోయారు. దాదాపు 2 గంటల పాటు ట్రాఫిక్‌ను కఠినంగా నియంత్రించడం.. జనసేన కార్యకర్తలు ఎక్కడికక్కడ వాహనాలను నిలిపివేయడంతో బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డుపై రద్దీ పెరిగిపోయి విద్యార్థులు జేఈఈ పరీక్షకు ఆలస్యమైనట్లు స్పష్టమవుతోంది. పవన్‌కల్యాణ్ వెళుతున్న రోడ్డులోనే ఉన్న చిముషిడివాడలోని అయాన్ డిజిటల్ కేంద్రంలో 1,350 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్ పరీక్షకు హాజరవుతున్నారని తెలిసి కూడా పోలీస్ అధికారులు దానిపై ప్రత్యేక దృష్టి సారించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని మండిపడుతున్నారు. కాగా, పెందుర్తి ప్రాంతంలో జేఈఈకి కొందరు విద్యార్థులు హాజరుకాలేకపోవడానికి ఉప ముఖ్యమంత్రి కాన్వాయి కారణమని వచ్చిన వార్తా కథనాలను పరిగణనలోకి తీసుకుని వాస్తవాలపై విచారణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశించారు.

జనసేన ఎమ్మెల్యే ఓవరాక్షన్ వల్లే..!

విద్యార్థులు జేఈఈ పరీక్ష రాసే అవకాశం కోల్పోవటానికి పెందుర్తి జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కూడా కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పవన్‌కల్యాణ్ ఎయిర్‌పోర్టులో ఉదయం 8.21 గంటలకు బయలు దేరగా వేపగుంట నుంచి పెందుర్తి మార్గంలో అన్ని వైపులా ఉదయం 8.10 గంటలకే ట్రాఫిక్‌ను నిలిపివేసేలా ఎమ్మెల్యే పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు 30 నిమిషాల పాటు బీఆర్‌టీఎస్ రోడ్డులో వాహనాలు కదల్లేదు. దీంతో వేపగుంట నుంచి చినముషిడివాడ కేంద్రానికి కేవలం 10 నిమిషాల లోపు చేరుకోవాల్సిన విద్యార్థులు ఆలస్యమయ్యారు.



అరకులోయలో అద్భుతం

- 21,850 మంది విద్యార్థులతో 108 సూర్య నమస్కారాలు
- ప్రపంచ రికార్డు సొంతం

సాక్షి, పాడేరు: అందాల అరకులోయలో అద్భుతం ఆవిష్కృతమయింది. మహా సూర్యవందనాల్లో స్థానిక గిరిజన విద్యార్థులు సత్తాచాటారు. ప్రపంచ రికార్డ్ సొంతం చేసుకున్నారు. అరకు లోయ డిగ్రీ కళాశాల మైదానం ఈ ఘట్టానికి వేదికగా నిలిచింది. జిల్లా అధికారులు, శిక్షకుల మూడు నెలల కష్టానికి ఫలితం లభించింది.

ఐదు మండలాల పరిధిలోని గిరిజన విద్యాలయాలకు చెందిన 21,850 మంది విద్యార్థులు ఉత్సాహంగా 108 సూర్య నమస్కారాల కార్యక్రమంలో పాల్గొన్నారు. పతంజలి శ్రీనివాస్ శంఖం పూరించి యోగాసనాలను ప్రారంభించారు. ఒకే వేదికపై విద్యార్థులు 2 గంటల పాటు 108 సూర్య నమస్కారాలు చేయడంతో మైదానంలో ఆధ్యాత్మిక వాతావరణం శోభిల్లింది. ఈ యోగాసనాలను 200 మంది పీడీలు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. లండన్‌కు చెందిన ప్రపంచ రికార్డుల యూనియన్ మేనేజర్ అలిస్ రేనాడ్, ఇతర ప్రతినిధులంతా 108 సూర్య నమస్కారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దృశ్యాలను తమ కెమెరాలలో బంధించారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రి వరకు సూర్య నమస్కారాలు విజయవంతంగా కొనసాగాయి. అలిస్ రేనాడ్ సూర్య నమస్కారాల ప్రక్రియకు వరల్డ్ రికార్డును ప్రకటించారు. ఈ మేరకు ధ్రువపత్రాన్ని కలెక్టర్, జేసీలకు అందించారు.

నైజీరియా ముఠాపై ఈడీ ఆరా

- అమెరికాలో డ్రగ్స్ అమ్మకాల సొమ్మును భారత్ ద్వారా మనీలాండరింగ్ చేస్తున్నట్టు ఇప్పటికే గుర్తించిన టీజీఏఎన్‌బీ
- ఆ ఆధారాలతో 'ఎన్‌ఫోర్స్‌మెంట్' రంగంలోకి దిగే చాన్స్

సాక్షి, హైదరాబాద్ : నైజీరియా డ్రగ్స్ ముఠా కార్యకలాపాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దృష్టి సారించారు. హైదరాబాద్‌తోపాటు అమెరికాలో డ్రగ్ పెడ్లర్‌ల ద్వారా కొకైన్, ఎండీఎంఏ మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ఈ ముఠా.. పలు మ్యూల్ బ్యాంక్ ఖాతాల ద్వారా, హవాలా మార్గంలో డబ్బును నైజీరియాకు తరలిస్తున్నట్టు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) ఇప్పటికే గుర్తించిన విషయం తెలిసిందే. ఈ ముఠా విదేశాల్లో డ్రగ్స్ అమ్మకం ద్వారా వచ్చిన సొమ్మును ఎంతో చాకచక్యంగా భారత్ నుంచి విదేశాలకు తరలిస్తూ మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నట్టు టీజీఏఎన్‌బీ అధికారులు కీలక ఆధారాలు సేకరించారు. గడిచిన ఏడేళ్లలో ఈ ముఠా రూ.125 కోట్లు మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ప్రాథమిక ఆధారాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు ఫోకస్ పెట్టారు. ఇప్పటికే వారు టీజీఏఎన్‌బీ అధికారుల నుంచి ప్రాథమిక సమాచారం సేకరించినట్టు తెలిసింది. వీటి ఆధారంగా ఈడీ అధికారులు రంగంలోకి దిగే అవకాశముంది. కింగ్‌పిన్ డివైన్ ఎబుకా సుజీ అలియాస్ లెవల్ నైజీరియాలో ఉంటూ ఈ మొత్తం ముఠాను నడుపుతున్నట్టు టీజీఏఎన్‌బీ అధికారులు పేర్కొంటున్నారు. స్థానికంగా కొందరిని ఏర్పాటు చేసుకున్న ఎబుకా..ఇక్కడి ఫారెక్స్ ఏజెంట్ల సాయంతో అమెరికాలోని వారి బ్యాంకు ఖాతాల్లోకి డ్రగ్స్ కొనుగోళ్ల సొమ్మును తరలించడం, ఇక్కడ వారి బంధువుల నుంచి డబ్బులు తీసుకొని, వాటిని ముంబైకి వ్యాపార నిమిత్తం వచ్చే నైజీరియన్ల ద్వారా కూడా దేశం దాటిస్తున్నట్టు వెల్లడైంది. కమీషన్ల ఆశచూపి మరికొందరు స్థానికులను వాడుకొని హవాలా మార్గంలో డబ్బులు నైజీరియాలోని కింగ్‌పిన్ ఎబుకా సుజీకి చేరవేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో డ్రగ్స్ సరఫరాతోపాటు అనధికారిక ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. టీజీఏఎన్‌బీ నుంచి సేకరించే సాక్ష్యాలను ఆధారంగా చేసుకొని ఈడీ అధికారులు త్వరలోనే ఈసీఐఆర్ నమోదు చేయనున్నట్టు తెలిసింది. హైదరాబాద్‌కు చెందిన వెస్టర్న్ మనీ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్లను కూడా విచారించే అవకాశముంది.

వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట

- తదుపరి ఉత్తర్వులిచ్చేవరకు ఆయన్ని అరెస్ట్ చేయకండి
- సీఐడీకి సుప్రీంకోర్టు ఆదేశం..



సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్‌సీపీ ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డికి సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. మద్యం కొనుగోళ్ల వ్యవహారంలో ఆయనకు మధ్యంతర రక్షణ కల్పించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు అరెస్ట్ చేయవద్దని సీఐడీని ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. మద్యం కొనుగోళ్ల వ్యవహారంలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ మిథున్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను ఇటీవల హైకోర్టు కొట్టేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ మిథున్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం సోమవారం విచారించింది. మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ మూడుసార్లు ఎంపీ అని తెలిపారు. పారిపోయే అవకాశం ఎంతమాత్రం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలతో ఆయనకు ఎలాంటి సంబంధం ఉండదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసిన సత్యప్రసాద్ ఇచ్చిన వాంగ్మూలంతో పాటు ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి ఇచ్చిన వాంగ్మూలాన్ని సీఐడీ నమోదు చేసినట్లు పత్రికల్లో వచ్చిందని చెప్పారు. వీటిలో పిటిషనర్ ప్రస్తావన ఉన్నట్లు కూడా కథనాలు వచ్చాయన్నారు. అందుకే అరెస్ట్ విషయంలో ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోర్టును కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు.. తదుపరి ఉత్తర్వులు జారీచేసేంత వరకు మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయవద్దని సీఐడీని ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని మిథున్ రెడ్డికి స్పష్టం చేసింది.

బనకచర్ల నిర్మాణం అక్రమం

▶ మొదటి పేజీ తరువాయి

గోదావరి ట్రిబ్యునల్ అనుమతించగా, ఇప్పటికే చెరో 17,500 క్యూసెక్కుల సామర్థ్యంతో రెండు కాల్వలను నిర్మించి ఉల్లంఘనలకు పాల్పడ్డారు. గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా కుడికాల్వ సామర్థ్యాన్ని 40 వేల క్యూసెక్కులకు పెంచాలని ప్రతిపాదించడం ట్రిబ్యునల్ అవార్డును కాలరాయడమే. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)లోని టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ (టీఏసీ) పలు సమావేశాల్లో చేసిన తీర్మానాలకు సైతం పూర్తి విరుద్ధం..'అని తెలంగాణ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పనులు చేశారు.. సొరంగాలు నిర్మించారు

'ఈ ప్రాజెక్టులో అంతర్భాగమైన పల్నాడు కరువు నివారణ పథకం కింద ఇప్పటికే రూ.1000 కోట్ల విలువైన పనులు చేశారు. 20వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న రెండు సొరంగాలను సైతం నిర్మించినట్టుగా సమాచార హక్కు చట్టం కింద ఏపీ ప్రభుత్వమే మాకు సమాచారం ఇచ్చింది. సత్వరమే ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని తాజాగా జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. దీనికోసం అమరావతి జల హారతి పేరుతో కార్పొరేషన్‌ను సైతం స్థాపించింది..'అని తెలిపారు. 'బనకచర్ల'ప్రాజెక్టు డీపీఆర్‌ను తమకు సమర్పించాలని, అనుమతులొచ్చాకే పనులు జరపాలని గోదావరి బోర్డు చైర్మన్ ఏకే ప్రధాన్ చెప్పగా, డీపీఆర్ తయారీ పూర్తైన తర్వాత సమర్పిస్తామని ఏపీ ఈఎన్‌సీ బదులిచ్చారు.

గోదావరి బోర్డులో గోప్యత ఎందుకు?

'బనకచర్ల'ప్రాజెక్టులో భాగంగా పోలవరం ప్రాజెక్టు నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున గోదావరి జలాలను గుంటూరు జిల్లాలో నిర్మించనున్న బొల్లపల్లి రిజర్వాయర్‌కు తరలిస్తామని ఏపీ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. మరోవైపు తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసే ఈ అక్రమ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు, నిధులు ఇవ్వరాదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ..కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రులకు ఫిర్యాదు చేశారు. ఏపీ ప్రతిపాదనలతో పాటు తెలంగాణ ఫిర్యాదులను కేంద్ర ప్రభుత్వం గోదావరి బోర్డుకు తదుపరి చర్యల కోసం పంపిస్తే, ఆ వివరాలను మాకు తెలియజేయలేదు. మా రాష్ట్రంలోని ప్రాజెక్టులకు తీవ్ర నష్టాన్ని కలిగించనున్న 'బనకచర్ల'విషయంలో గోదావరి బోర్డు పారదర్శకతను పాటించలేదు..'అని తెలంగాణ అధికారులు ధ్వజమెత్తారు. బోర్డులో సభ్యులైన తమకు ఇలాంటి విషయాలను తెలియజేయాల్సిన అవసరం ఉందని రాహుల్ బొజ్జా స్పష్టం చేయగా, ఆ అవసరం లేదని బోర్డు సభ్య కార్యదర్శి ఎ.అజగేషన్ వాదించారు. ఏపీ సైతం ఆయనకు మద్దతు తెలిపింది.



సమావేశానికి వస్తున్న నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా

పెద్దవాగు మరమ్మతులకు ఓకే..

గతేడాది వర్షాలతో గండిపడిన రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు పెద్దవాగుకి రూ.15 కోట్లతో 5 అదనపు గేట్లను ఏర్పాటు చేసి రెండు నెలల్లోగా తాత్కాలిక మరమ్మతులు నిర్వహించేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి.

సభ్య కార్యదర్శిపై విచారణకు త్రిసభ్య కమిటీ

గోదావరి బోర్డులో రెండు రాష్ట్రాల నుంచి డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఉద్యోగులను బోర్డు సభ్య కార్యదర్శి అజగేషన్ తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారంటూ సమావేశంలో తెలంగాణ, ఏపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అంతర్రాష్ట్ర జల విభాగాల చీఫ్ ఇంజనీర్లు, గోదావరి బోర్డు నుంచి మరో అధికారితో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి నిజనిర్ధారణ జరిపించాలంటూ తెలంగాణ చేసిన ప్రతిపాదనకు బోర్డు చైర్మన్ అంగీకారం తెలిపారు. సమావేశం ఎజెండాలో బోర్డు పెట్టిన పరిపాలన, ఆర్థికపరమైన ప్రతిపాదనలతో రెండు రాష్ట్రాలు తీవ్రంగా విభేధించాయి. 2021 జూలై 15న కేంద్రం జారీ చేసిన గజిట్ నోటిఫికేషన్ అమలులో భాగంగా 16 ప్రాజెక్టుల నిర్వహణను తమకి అప్పగించాలని గోదావరి బోర్డు కోరగా, రెండు రాష్ట్రాలూ అంగీకరించలేదు. సమావేశంలో తెలంగాణ తరఫున అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ మోహన్ కుమార్, డీడీ సుబ్రమణ్యం ప్రసాద్ కూడా పాల్గొన్నారు.

ప్రభాకర్‌రావే కీలక నిందితుడు

- దర్యాప్తునకు సహకరించకుండా అమెరికాకు పరారీ
- హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన పోలీసులు.. రెడ్ కార్నర్ నోటీసులతో దిగివచ్చి హైకోర్టులో పిటిషన్ వేసిన ప్రభాకర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్‌ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావే (ఏ–1) కీలక నిందితుడని పోలీసులు హైకోర్టుకు తెలిపారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్‌ఐబీ)లో స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్‌వోటీ)ని ఏర్పాటు చేసింది ఆయనేనని చెప్పారు. ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు ఎస్‌వోటీ కార్యకలాపాలు సాగించిందని, ఐపీఎస్ అధికారిగా పదవీ విరమణ పొంది చట్టానికి సహకరించకుండా అమెరికాకు పారిపోయాడని తెలిపారు. ఈమేరకు పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు కౌంటర్ దాఖలు చేశారు. అనంతరం న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది. తనను అన్యాయంగా కేసులో ఇరికించారని, అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ ఉత్తర్వులు జారీ చేయాలంటూ ప్రభాకర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 65 ఏళ్ల సీనియర్ సిటిజన్‌నని, తన ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు సోమవారం మరోసారి విచారణ చేపట్టారు.

ఓఎస్డీ పోస్టు ఇవ్వడం ఇదే తొలిసారి

'ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలోనే ఎస్‌వోటీ పని చేసింది. సంఘ విద్రోహ శక్తులు, నక్సల్స్ ఆపరేషన్ కోసం పనిచేయాల్సిన ఎస్‌ఐబీ అధికారులు ఫోన్ ట్యాపింగ్ కోసమే విధులు నిర్వర్తించారు. వ్యాపారులు, రియల్టర్లను బెదిరించి కోట్లాది రూపాయలు వసూలు చేశారు. 2020లో పదవీ విరమణ పొందిన ప్రభాకర్‌రావును ఓఎస్డీగా తీసుకున్నారు. ఇలా ఓఎస్డీ పోస్టు సృష్టించి ఇవ్వడం దేశంలో ఇదే తొలిసారి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అయి ఉండి అర్హత, అధికారం లేకున్నా తప్పుడు డాక్యుమెంట్లతో ఏ–2కు పదోన్నతి కల్పించారు. శాసనసభ్యుల ఫోన్ ట్యాప్ చేసి రూ.10 కోట్ల వరకు డిమాండ్ చేశారు. చట్టాన్ని పక్కకు పెట్టి అంతా మా ఇష్టం అన్నట్లు వ్యవహరించారు. హరీశ్‌రావు కూడా ఫోన్ ట్యాపింగ్‌ను వినియోగించుకున్నారు. ఎన్నికల ముందే 50 సీట్లకు మించి రావని శ్రవణ్‌రావు చెప్పారు. బీఆర్‌ఎస్ పెద్దలకు సాగిలపడి ఎస్‌వోటీ అధికారులు విధులు నిర్వర్తించారు. నాటి అధికార పెద్దలు తమ కులం వారితోనే ఎస్‌వోటీ ఏర్పాటు చేశారు. 2024లో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే.. తాను హైదరాబాద్ వస్తున్నానని, దర్యాప్తునకు సహకరిస్తానని అఫిడవిట్ వేశారు. కానీ, నెలలు గడిచినా రాలేదు. ఇప్పుడు ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయడం, అమెరికా వీడక తప్పని పరిస్థితితో విధిలేక హైకోర్టును ఆశ్రయించారు. ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్‌కు ఎంతమాత్రం అర్హుడు కాదు. అతన్ని అరెస్టు చేసి విచారిస్తేనే దీని వెనుకున్న పెద్దలెవరో తెలుస్తుంది'అని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు.



సముద్రంపై సాహస సంతకం



55 రోజుల 'సముద్ర ప్రదక్షిణ' యాత్రకు బయలుదేరిన 11 మంది మహిళా బృందంతో త్రివిధ దళాల అధికారులు

నారీ శక్తి

'జీరో' అంటే చాలామందికి చిన్న చూపు. అయితే ఎంత పెద్ద విజయమైనా 'జీరో' తోనే మొదలవుతుంది. హీరోలను చేస్తుంది. తాజా విషయానికి వస్తే.... త్రివిధ దళాలకు చెందిన 11 మంది మహిళా అధికారులు హిందూ మహాసముద్రంలో 55 రోజుల 'సముద్ర ప్రదక్షిణ'కు శ్రీకారం చుట్టారు. గతంలో వీరికి సముద్ర సాహస యాత్ర అనుభవం లేదు. జీరో నుంచి మొదలు పెట్టి ప్రతి విషయాన్నీ ఓపికగా నేర్చుకొని సాహసయాత్రకు కదిలారు.

హిందూ మహాసముద్రం స్త్రీ శక్తికి వేదిక కానుంది. త్రివిధ దళాలకు చెందిన పదకొండు మంది మహిళా అధికారులు నిన్నటి (సోమవారం) నుంచి హిందూ మహాసముద్రంలో 'సముద్ర ప్రదక్షిణ' మొదలుపెట్టారు. ముంబైలోని ఇండియన్ నేవల్ వాటర్ మ్యాన్‌షిప్ ట్రెనింగ్ సెంటర్ (ఐఎన్‌డబ్ల్యూటీసీ) ఈ యాత్ర ప్రారంభ కేంద్రం. 55 రోజుల్లో హిందూ మహాసముద్రంలోని 4,000 నాటికల్ మైళ్లను ఈ బృందం అధిగమించనుంది. వీరిలో ఆరుగురు ఆర్మీ అధికారులు, ఒక నేవీ అధికారి, నలుగురు వైమానిక దళ అధికారులు ఉన్నారు.

త్రివిధ దళాల నుంచి...

భారత సైన్యం నుంచి లెఫ్టినెంట్ కల్నల్ అనుజ, మేజర్ కరంజీత్, మేజర్ తాన్యా, కెప్టెన్ ఒమితా, కెప్టెన్ దాలీ, కెప్టెన్ ప్రజక్త, భారత వైమానిక దళం నుంచి స్క్వాడ్రన్ లీడర్ విభా, స్క్వాడ్రన్ లీడర్ శ్రద్ధ, స్క్వాడ్రన్ లీడర్ అరువి, స్క్వాడ్రన్ లీడర్ వైశాలి, భారత నావికాదళం నుంచి లెఫ్టినెంట్ కమాండర్ ప్రియాంక ఈ బృందంలో ఉన్నారు.

కఠినమైన ఎంపిక ప్రక్రియ

ఈ సాహస యాత్రకు ఎంపిక ప్రక్రియ ఏడాది పాటు కొనసాగింది. ఎంపికకు ఫిజికల్ ఫిట్‌నెస్, టీమ్ అండ్ లీడర్‌షిప్ క్వాలిటీస్, అకడమిక్ నాలెడ్జ్, బోట్–హ్యాండ్లింగ్ కేపబిలిటీస్... మొదలైన వాటిని ప్రామాణికంగా తీసుకున్నారు.

త్రివిధ దళాలకు చెందిన 41 మంది మహిళా అధికారుల బృందం నుంచి 11 మంది మహిళా అధికారులను సముద్ర సాహస యాత్ర కోసం ఎంపిక చేశారు.

పుణెలోని కాలేజ్ ఆఫ్ మిలిటరీ ఇంజనీరింగ్ పరిధిలోని 'ఆర్మీ అడ్వెంచర్ నోడల్ సెంటర్ ఫర్ బ్లూ వాటర్ సెయిలింగ్'లో త్రివిధ దళాల మహిళా అధికారులు రెండు సంవత్సరాల పాటు కఠోర శిక్షణ పొందారు, ఈ బృందం జీరో నుంచి శిక్షణ మొదలుపెట్టింది. నౌకాయానానికి సంబంధించిన సైద్ధాంతిక, ఆచరణాత్మక అంశాలలో ప్రావీణ్యం సాధించారు. సముద్రయానానికి అవసరమైన శారీరక బలాన్ని సమకూర్చుకున్నారు. నావిగేషన్, వాతావరణ శాస్త్రం, సీమన్‌షిప్ గురించి తెలుసుకున్నారు.

ఎమర్జెన్సీ రెస్పాన్స్, రిపేర్ అండ్ మెయింటెనెన్స్‌లాంటి సెయిలింగ్ నైపుణ్యాలను సొంతం చేసుకున్నారు. రూట్ ప్లానింగ్, వెదర్ ఫోర్‌కాస్టింగ్, ఎక్విప్‌మెంట్ మెయింటెనెన్స్, స్టాకింగ్ అండ్ సేఫ్టీ ప్రోటోకాల్స్‌తోపాటు అంతర్జాతీయ సముద్ర చట్టాల గురించి కూడా తెలుసుకున్నారు.

పంచభూతాల సందేశం



సముద్రంలో ప్రపంచాన్ని చుట్టి వచ్చిన సాహసికులుగా త్రివిధ దళాల మహిళా జట్టు ప్రపంచ రికార్డ్ నెలకొల్పనుంది. ఈ యాత్ర కేవలం సముద్రయానం మాత్రమే కాదు మహిళా సాధికారతకు శక్తిమంతమైన ప్రతీక. మహిళలకు అవకాశం ఇచ్చినప్పుడు వారు మహా సముద్రాలను కూడా జయించగలరు అని పంచభూతాల సాక్షిగా ఇచ్చే శక్తిమంతమైన సందేశం.

యాత్ర లక్ష్యం



ముంబై నుంచి సీషెల్స్ వరకు మా మొదటి అంతర్జాతీయ యాత్ర మొదలైంది. రోజుల తరబడి, వారాల తరబడి భూమికి దూరంగా లోతైన జలాల్లో సాగే ఈ యాత్ర మా సహనానికి, నావిగేషన్ నైపుణ్యాలకు పరీక్ష.

మహిళా సాధికారతలో బలాన్ని చూపించడమే ఈ యాత్ర లక్ష్యం.

– కెప్టెన్ దాలీ

చిన్న అడుగులతో పెద్ద సాహసం వైపు...

మొదట షార్ట్ డే ట్రిప్స్ చేసేవారు. భవిష్యత్ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని తమలోని నైపుణ్యాలకు పదును పెట్టడానికి, సముద్ర ప్రయాణానికి సిద్ధం కావడానికి ముంబై నుండి గోవా, కొచ్చి, పోర్‌బందర్, లక్షద్వీప్ వరకు ఎన్నో యాత్రలకు వెళ్లారు. అయితే ఊహించని వాతావరణ పరిస్థితుల నుంచి సాంకేతిక సమస్యల వరకు సముద్ర యాత్రలో అడుగడుగునా ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ప్రతి సవాలు నుంచి పాఠం నేర్చుకున్నారు.

అధికారిక నౌక ఇండియన్ ఆర్మీ సెయిలింగ్ వెసెల్(ఐఎఎస్వీ)'త్రివేణి' నుంచి మొదలైన ఈ ప్రపంచ యాత్ర చరిత్ర సృష్టించనుంది.'నారీశక్తి' స్ఫూర్తితో మొదలైన ఈ ప్రయాణం చారిత్రాత్మకమే కాకుండా భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవనుంది.

న్యూస్‌మేకర్

'నేను బాగుంటే చాలు' అనుకునే ఈ రోజుల్లో నలుగురి కోసం పోరాటానికి దిగడం మామూలు విషయం కాదు. పశ్చిమ బెంగాల్ టీచర్ల నియామకంలో అవక తవకలున్నాయని 25,752 ఉద్యోగాలని తొలగించింది సుప్రీంకోర్టు - ఒక్క ఉద్యోగం తప్ప. ఆ ఉద్యోగం సోమా దాస్‌ది. ఈ బెంగాలీ టీచర్ తనకు ఉద్యోగం రానందుకు పోరాడింది. ఉద్యోగం రాని వాళ్ల కోసం పోరాడింది. ఈలోపు కేన్సర్ వస్తే దానిపై పోరాడింది. హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ఆమె పోరాటాన్ని గౌరవించి ఉద్యోగాన్ని నిలబెట్టాయి. కాని ఇప్పుడు ఈ తీర్పు వల్ల కూడా ఎందరో రోడ్డున పడతారని పోరాటానికి సిద్ధమైంది సోమాదాస్. ఇలా ఎవరున్నారని?



సోమా దాస్

కోర్టులు ఆమెను గౌరవించాయి

'మళ్లీ కొత్త పోరాటం చేయాలేమో' అంది సోమా దాస్.

మొన్నటి ఏప్రిల్ 3వ తేదీకి ముందు, తర్వాత ఆమె జీవితం ఒకేలా ఉంది. ఎందుకంటే ఆమె ఉద్యోగం పోలేదు.

కాని ఆమెతో పాటు ఉద్యోగంలో చేరిన వారంతా సుప్రీంకోర్టు తీర్పుతో భవిష్యత్తు తెలియని స్థితిలో పడ్డారు.

'సుప్రీంకోర్టు తీర్పు ఇలా వెలువడటంలో ప్రభుత్వ వైఫల్యం ఉంది. నియామకాల్లో ప్రతిభ చూపి నిజాయితీగా ఉద్యోగాలు సాధించినవారు ఉన్నారు. వారి లిస్ట్ ప్రభుత్వం దగ్గర ఉంది. సుప్రీంకోర్టుకు ఆ లిస్టు ఇచ్చి వారి ఉద్యోగాలను కాపాడాల్సింది' అందామె.

ఈ గొడవ 2016 నుంచి మొదలైంది. వెస్ట్ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ (డబ్ల్యు.బి.ఎస్.ఎస్.సి.) 2016లో భారీగా పరీక్షలు నిర్వహించి స్కూల్, కాలేజీ స్థాయిలో చేసిన టీచింగ్, నాన్ టీచింగ్ నియామకాలు చేసింది. 25,725 మంది ఉద్యోగులు చేరారు. అయితే ఆనాటి నుంచి గొడవలు మొదలయ్యాయి. దొడ్డిదారిన చాలామంది ఉద్యోగాల్లో చేరారంటూ అర్హులైనవారు రోడ్డెక్కారు. నిరసనలు చేశారు. వారిలో సోమాదాస్ ముందు వరుసలో ఉంది.

'నా పేరు మెరిట్ లిస్ట్‌లో ఉంది. కాని నాకు ఉద్యోగం ఇవ్వలేదు. నా బదులు ఎవరో దొంగ పద్ధతిలో చేరారు' అని ఆమె కోల్‌కతా హైకోర్టులో కేసు వేసింది. ఆ కేసు నడుస్తుండగానే విపరీతంగా నిరసన ప్రదర్శనల్లో ముందు వరుసలో కనిపించింది. రోజుల తరబడి నిరాహార దీక్షల్లో కూచోవడం వల్ల ఆమె పేరు ప్రచారంలోకి వచ్చింది. ఇంతలో ఆమెకు కేన్సర్ వచ్చింది. అయినా సరే కేన్సర్‌తో పోరాడుతూనే తన కోసం, సాటి వారి కోసం పోరాటం చేసింది. ఇది కోల్‌కతా హైకోర్టు జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ్ దృష్టికి వచ్చి ఆయన ఆమెను కోర్టుకు పిలిపించారు.

'ఇంకొక ఉద్యోగం ఇవ్వమని ప్రభుత్వానికి చెప్తాను. చేస్తావా?' అని అడిగారు.

'టీచర్ కావడం నా జీవిత లక్ష్యం' అని కరాఖండీగా చెప్పింది సోమాదాస్.

దాంతో 2022లో ఆమెకు బెంగాలి భాషను బోధించే టీచరుగా ఉద్యోగం వేయించారు జడ్జి. కాని అదే జడ్జి 2024, ఏప్రిల్ 12న మొత్తం నియామకాలు చెల్లవు అని తీర్పు చెప్పారు. కాని ఒక్క సోమాదాస్ ఉద్యోగం మాత్రం ఉంటుంది అని పేర్కొన్నారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వెళితే న్యాయమూర్తులు దేబాంశు, మహమ్మద్ షబ్బార్ కూడా 'నియామకాలు చెల్లవు. సోమాదాస్ ఉద్యోగం ఉంటుంది' అని తీర్పు చెప్పారు. కేసు సుప్రీం కోర్టుకు వచ్చాక న్యాయమూర్తులు సంజీవ్‌ఖన్నా, సంజయ్ కుమార్‌లు తీర్పు చెప్తూ 'ఉద్యోగాలు చెల్లవు. కాని సోమాదాస్ ఉద్యోగం కొనసాగుతుంది' అన్నారు.

> నా ఉద్యోగం ఉందని సంతోషంగా ఏమీ లేను. ఇన్నాళ్లలో ఎంతోమంది ఈ ఉద్యోగాల వల్ల స్థిరపడ్డారు. ఇప్పుడు వారి ఉద్యోగాలు పోతే కుటుంబాలను ఎలా నడుపుతారు. వారి న్యాయం కోసం ఏదైనా చేయాలి.
> – సోమాదాస్

ఇంతమంది న్యాయమూర్తులు సోమాదాస్‌కు వెన్నంటి నిలిచి ఆమె ఉద్యోగం కాపాడటం చాలా అరుదు. దానికి కారణం సోమాదాస్ నిరుపేద కుటుంబం నుంచి రావడం, న్యాయం కోసం వెరవక పోరాడటం, ఆమె అర్హతలన్నీ సరిగ్గా ఉండటం, కేన్సర్ వచ్చినా దానిపై పోరాడుతూ ఉద్యోగం కోసం పోరాటాన్ని కొనసాగించడం.

దీనిని బట్టి పోరాటం చేసే వారికి... న్యాయం కోసం ఎలుగెత్తే వారికి గౌరవం ఉంటుంది అని అర్థం చేసుకోవాలి. సాధారణంగా ఈ పని చేయడానికి చాలామంది వెరుస్తూ ఉంటారు.

'నా ఉద్యోగం ఉందని సంతోషంగా ఏమీ లేను. ఇన్నాళ్లలో ఎంతో మంది ఈ ఉద్యోగాల వల్ల స్థిరపడ్డారు. ఇప్పుడు వారి ఉద్యోగాలు పోతే కుటుంబాలను ఎలా నడుపుతారు. వారి న్యాయం కోసం ఏదైనా చేయాలి' అంది సోమా దాస్.

నిజమే. దాదాపు ఎనిమిదేళ్లుగా ఉద్యోగం చేస్తూ ఇప్పుడు ఆ ఉద్యోగం పోగొట్టుకోవాలంటే దొడ్డిదారిన చేరిన వాళ్ల కంటే నిజమైన అర్హతలతో చేరినవారు కుదేలవుతారు.

'త్వరలో ఏదో ఒక దారి దొరుకుతుంది. మేం పోరాడతాం' అంటోంది సోమాదాస్.

కొందరు అలా ఉంటారు మరి.

సాగుబడి

రేవతి కార్తె: ఏప్రిల్ 13 వరకు

కొరకరాని కొయ్యగా మారిన సమస్య ఒక్కోసారి చిన్న ఉపాయంతో తీరిపోతుంది. ఈ రైతు ఆవిష్కరణ కూడా అలాంటిదే. వరి పొలంలో ఎలుకల సమస్య రైతులకు పెద్ద తలనొప్పి. విషపు గుళికలు, బొరియల్లోకి పొగ పెట్టటం వంటి పనులేవీ పెద్దగా సత్ఫలితాలు ఇవ్వట్లేదు. ధాన్యం దిగుబడి నష్టం 10–50% వరకు ఉంటుంది. ఈ జటిల సమస్యకు వేముల కరుణాకర్ రెడ్డి అనే రైతు వినూత్నమైన పరిష్కారం కనుగొన్నాడు. విష రసాయనాలు, ఖర్చు లేకుండానే ఎలుకలను పారదోలుతున్నారు! కేవలం ఎండు తాటాకుల శబ్దాలతో ఎలుకలను సమర్థవంతంగా అరికట్టి అందర్నీ ఆశ్చర్య పరుస్తున్నారు!!

తాటాకులు పెడితే ఎలుకలు పోయాయి!

వరి పొలంలో ఎలుకల సమస్యకు చిట్కా పరిష్కారం

ఎకరాకు 4–5 క్వింటాళ్ల వరకు ధాన్యం నష్ట నివారణ



> భారతీయ పంట పొలాల్లో ఎలుకల వల్ల వరిలో 1.1–44.5%, గోధుమలో 2.7–21.3%, చెరకులో 2.1–31.0%, వేరుశనగలో 2.9–31%, కొబ్బరిలో 4.5–55% పంట నష్టం జరుగుతోంది. మాగాణి పొలాల్లోనే కాదు వర్షాధార/ఆరుతడి పంటలు, తోటల్లో కూ డా ఎలుకల విధ్వంసం కొనసాగుతోంది.
> – ఎన్.ఐ.పి.హెచ్.ఎం. (హైదరాబాద్) అధ్యయనం (2013)

(పి.కరుణాకరరెడ్డి, సాక్షి, జగిత్యాల)

వరిలో నారు మడి నుంచి పంట కోసే దశ వరకు ఎలుకలు నష్టం కలిగిస్తుంటాయి. ప్రధానంగా, సార్వా/వానాకాలం పంట గింజ దశలో ఉండే అక్టోబర్–నవంబర్ నెలల్లో, దాళ్వా/యాసంగిలోని మార్చి–ఏప్రిల్ నెలల్లో తీవ్ర నష్టం చేస్తుంటాయి. ముఖ్యంగా, వరి పంట దుబ్బు దశ నుంచి కోత దశ వరకు ఎలుకలు పొలాల్లో వీర విహారం చేస్తుంటాయి. ఎలుకలు త్వరితగతిన సంతానోత్పత్తి చేయగలవు. ఒక జత ఎలుకల నుంచి ఏడాదికి ఏకంగా 1,250 ఎలుకలు పుట్టుకొస్తాయి. అందువల్ల నియంత్రించలేకపోతే పంట నష్టం అపారంగా ఉంటుంది. బొరియల్లో ఉండి, రాత్రి పూట 30–100 మీటర్ల దూరంలోని పంటను ఆరగిస్తాయి. వరి పొలం కోత దశలో నీరు తగ్గించినప్పుడు ఎలుకలు తమ ప్రతాపాన్ని చూపిస్తాయి.

వినూత్నంగా తాటి కమ్మలతో..

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని తీగల ధర్మారం రైతు వేముల కరుణాకర్ రెడ్డి స్వస్థలం. ఇతర రైతుల మాదిరిగానే వరి పొలంలో ఎలుకల నివారణకు జింక్ సల్ఫైడ్‌ను వాడారు. పెద్దగా ఉపయోగం కనబడలేదు. దాంతో సంప్రదాయ పద్ధతిలోనే పరిష్కారం వెదికారు. పంట పొట్ట దశకు పెరిగిన సమయంలో తాటి ఆకులను మట్టలతో పాటు (తాటి కమ్మలు) నరికి పొలంలో ఎలుకలు తిరిగే ఆస్కారం ఉన్న చోట్ల పాతారు. గాలికి తాటి ఆకుల నుంచి వచ్చే చప్పుడుకు భయపడి ఎలుకలు పారిపోతున్నాయి. దీనికి తోడు, తాటాకులపై పక్షులు వాలుతున్నాయి. గతంలో ఎలుకల వల్ల ఎకరాకు 4–5 క్వింటాళ్ల ధాన్యం నష్టం వచ్చేది. తాటాకులు పెట్టిన ఈ సీజన్‌లో పంట నష్టం పెద్దగా లేదని కరుణాకర్‌రెడ్డి సంతోషంగా చెప్పారు. ఆయనను చూసి బీర్‌పూర్, సారంగాపూర్ మండల రైతులు సైతం ఇదే చిట్కాను ప్రయోగిస్తూ మంచి ఫలితం పొందుతున్నారు.



ఎకరానికి 15 తాటాకులు చాలు!

తాటాకు కమ్మలు ఎకరానికి 15 చొప్పున వరి పొలంలో పెడుతున్నాను. ఆ తాటాకుల శబ్దాలతో పాటు, వాటిపై వాలే పక్షులు చేసే శబ్దాలకు ఎలుకలు బొరియల నుంచి బయటకు రావట్లేదు. వరి కోతలయ్యే వరకు తాటాకులను పొలంలోనే ఉంచుతాను. గతంలో డబ్బు ఖర్చు చేసి ఏమి చేసినా ఎలుకల సమస్య తీరలేదు. ఎలాంటి ఖర్చు లేకుండా తాటాకులతోనే సమస్య ఇప్పుడు తీరింది.

– వేముల కరుణాకర్ రెడ్డి (84979 72225) తీగల ధర్మారం, ధర్మపురి(మం), జగిత్యాల జిల్లా



వేరుశెనగ పంటను ఆరబెడుతున్న నాంచారమ్మ



అంతర పంటలను పరిశీలిస్తున్న నాంచారమ్మ



అంతర పంటగా వేయడానికి 20 రకాల విత్తనాలు సిద్ధం చేస్తున్న నాంచారమ్మ

పుడమి మిత్ర



అవార్డులతో నాంచారమ్మ

చదువు పాఠశాల దాటక ముందే ఆమెకు పెళ్లయింది. ముగ్గురు పిల్లలకు జన్మ ఇచ్చింది. ఆ గృహిణి అంతటితో ఆగిపోలేదు. భర్త తోడ్పాటుతో ముందడుగు వేసి ప్రైవేటుగా చదువు కొనసాగించింది. డిగ్రీ పూర్తి చేసింది. మహిళా స్వయం సహాయక సంఘంలో చేరి, అంచెలంచెలుగా ఎదిగింది. ఆ క్రమంలోనే ప్రకృతి వ్యవసాయం నేర్చుకుంది. తమ పొలంలో ఆచరిస్తూ పట్టు సాధించింది. ప్రకృతి సేద్య శిక్షకురాలిగా ఎదిగింది. హిందీ నేర్చుకుంది. ఇతర రాష్ట్రాలకు వెళ్లి ప్రకృతి వ్యవసాయంలో రైతులకు శిక్షణ ఇచ్చి వచ్చింది. పట్టుదల, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటే మారుమూల గ్రామానికి చెందిన సాధారణ మహిళా రైతు ఎంత ఎత్తుకు ఎదగగలరో నిరూపించిన నాంచారమ్మకు జేజేలు!

చిత్తూరు జిల్లా సోమల మండలం పొదల గుంటపల్లె పంచాయతీ తుగడం వారి పల్లెకు చెందిన ఈశ్వరమ్మ, చెంగ్రాయులు దంపతుల రెండో సంతానం నాంచారమ్మ. ఆమెకు అక్క సుధారాణి, తమ్ముడు విజయ్‌కుమార్, చెల్లెలు రజని ఉన్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. నాంచారమ్మకు చిన్ననాటి నుంచే సేద్యంపై మక్కువ. 9వ తరగతి చదివే రోజుల్లోనే ఆమెకు వెంకటరత్నంతో వివాహమైంది. ముగ్గురు పిల్లల్ని కన్న తర్వాత భర్త సహకారంతో ఆమె చదువు పునఃప్రారంభించారు. ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఆ తర్వాత ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. 3 నెలల పాటు కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందారు.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో 2000వ సంవత్సరంలో మహిళా స్వయం సహాయక సంఘంలో చేరారు. మండల సమాఖ్య కార్యదర్శిగా, జిల్లా సమాఖ్య ఈసీగా పనిచేశారు. మార్కెటింగ్ కమిటీ సభ్యురాలిగా, మార్కెటింగ్ విభాగంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ గా విధులు నిర్వర్తించారు.



చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయం స్టాల్‌లో తమ పొలంలో పండిన కూరగాయాలను విక్రయిస్తున్న నాంచారమ్మ

తదనంతర కాలంలో ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేశారు.

ప్రధాన పంటలో 20 అంతర పంటలు

స్వగ్రామంలో తమ రెండెకరాల్లో ప్రకృతి సేద్యం చేపట్టారు. ఆ పొలంలో అప్పటికే ఏడాది క్రితం నాటిన మామిడి మొక్కలకు 400 కేజీల ఘన జీవామృతం వేసి, అంతరపంటగా వేరుశనగ సాగు చేశారు. ప్రధాన పంటలతో పాటు 20 రకాల అంతర పంటలను సాగు చేస్తున్నారు. వేరుశనగ, అనప, అలసంద, కంది, పొద్దుతిరుగుడు, పెసర, మినుము, ఆముదం, బెండ, టమాటా, గోరుచిక్కుడు, మొక్కజొన్న, జొన్న, సజ్జ, గుమ్మడి, బీర, కాకర, సొర, కీర, ఉలవ తదితర పంటలను పండిస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

- 'ప్రకృతి వ్యవసాయంలో మొదటి సంవత్సరమే సాధారణ లాభాలు వచ్చాయని, రెండో ఏడాది నుంచి 10 శాతం అధిక దిగుబడి సాధించినట్లు నాంచారమ్మ తెలిపారు.
- ప్రకతి వ్యవసాయంలో పెట్టుబడి తక్కువగా ఉంటుందని నాంచారమ్మ చెబుతున్నారు. రసాయన ఎరువులు వాడి వేరుశనగ పంట సాగు చేస్తే ఎకరాకు విత్తనకాయలు, కూలీలు, ఎరువులు మొత్తం కలిపి రూ.35 నుంచి రూ.40 వేలు ఖర్చవుతుంది. అదే ప్రకృతి వ్యవసాయం చేస్తే రూ.10–20 వేలు చాలన్నారు.
- పట్టభద్రురాలై ఉండటం, అనంత మహిళా సమాఖ్య గ్రూపుల సహకారంతో హిందీ భాషపై పట్టు సాధించటంతో ప్రకృతి వ్యవసాయ విస్తరణ కార్యక్రమాల్లో ఆమెకు ప్రాధాన్యం దొరికింది.

- యెండ్లూరి మోహన్, సాక్షి తిరుపతి డెస్క్, సహకారం: తుడుము తులసీరామ్, పాకాల

5 రాష్ట్రాల్లో ప్రకృతి సేద్యంపై శిక్షణ

- 2017లో ఝార్ఖండ్ వెళ్లి అక్కడి మహిళా సంఘాల సభ్యులకు ప్రకతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. 2018లో వైఎస్సార్ జిల్లాకు మహిళా సంఘాల సమన్వయకర్తగా నియమితులయ్యారు. అదే ఏడాది వైఎస్సార్ జిల్లాలో ఒక ఎకరం కౌలుకు తీసుకొని ప్రకృతి వ్యవసాయం ప్రారంభించారు. ఒకవైపు తన వ్యవసాయం చూసుకుంటూనే ఇతర రాష్ట్రాల్లో రైతులకు శిక్షణ ఇవ్వటం కొనసాగించారు. నాంచారమ్మ ఇప్పటి వరకు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లి అక్కడి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇవ్వటం విశేషం.
- వైఎస్సార్ జిల్లా సీకేదిన్నె మండలంలో 25 మంది రైతులకు, అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలో 70 మందికి, తిరుపతి జిల్లా శ్రీరామపురం, వీరిశెట్టివారిపల్లెలో 10 మందికి, చిత్తూరు మండలంలో 10 మందికి, నగరి, నింద్ర మండలాల్లో 20 మందికి ఆమె ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. రైతు సాధికారిక సంస్థ మార్కెటింగ్ విభాగంతో సమన్వయం చేసుకొని ఆహారోత్పత్తులను అమ్మటంపై అవగాహన కల్పిస్తున్నారు.
- ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తూ, పలువురు రైతులకు శిక్షణ ఇస్తూ ఆ దిశగా అడుగులు వేయిస్తున్న నాంచారమ్మ వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి పురస్కారాలను అందుకున్నారు. ఉత్తమ మహిళా ప్రతిభా పురస్కారం (2022), సమగ్ర వ్యవసాయ విజ్ఞాన సదస్సులో పుడమిమిత్ర పురస్కారం (2024) తదితర అవార్డులను అందుకున్నారు.



ఆరో స్థానంలో భారత షూటర్ నర్మద

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో సోమవారం భారత షూటర్లు పతకం గెలవడంలో విఫలమయ్యారు. అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ఇద్దరు భారత షూటర్లు నర్మద నితిన్ రాజు, సోనమ్ ఉత్తమ్ మస్కర్ ఫైనల్లో పోటీపడ్డారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో నర్మద 145.9 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంలో, సోనమ్ 124.4 పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంలో నిలిచారు.

ఇషాంత్ శర్మపై జరిమానా



గుజరాత్ టైటాన్స్ పేసర్ ఇషాంత్ శర్మపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఉప్పల్ స్టేడియంలో ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో క్రికెట్ సామాగ్రిని నష్టపరిచి అతను నిబంధనలు ఉల్లంఘించాడు. దీనికిగాను ఇషాంత్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా శిక్షగా విధించారు. ఈ మ్యాచ్‌లో టైటాన్స్ గెలిచినా... పేలవ ఫామ్‌లో ఉన్న ఇషాంత్ 4 ఓవర్లలో 53 పరుగులిచ్చి చెత్త ప్రదర్శన నమోదు చేశాడు. ఇదే అసహనంతో అతను డ్రెస్సింగ్ రూమ్ వద్ద తన ఆగ్రహాన్ని ప్రదర్శించినట్లు సమాచారం.

రోహన్ బోపన్న రికార్డు

ఏటీపీ మాస్టర్స్ టోర్నీ చరిత్రలో విజయం సాధించిన అతిపెద్ద వయస్కుడిగా గుర్తింపు




మోంటెకార్లో (మొనాకో): భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న తన కెరీర్‌లో మరో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) మాస్టర్స్-1000 స్థాయి టోర్నీలో సింగిల్స్ లేదా డబుల్స్ విభాగం మ్యాచ్‌లో విజయం సాధించిన అతిపెద్ద వయస్కుడిగా బోపన్న (45 ఏళ్ల 32 రోజులు) రికార్డు సృష్టించాడు. మొనాకోలో జరుగుతున్న మోంటెకార్లో మాస్టర్స్ సిరీస్ టోర్నీలో బోపన్న ఈ ఘనత సాధించాడు. పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-బెన్ షెల్టన్ (అమెరికా) జోడీ ప్రీక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో బోపన్న-షెల్టన్ ద్వయం 6-3, 7-5తో ఫ్రాన్సిస్కో సెరుండులో (అర్జెంటీనా)-అలెజాండ్రో టబిలో (చిలీ) జంటపై గెలిచింది. 69 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-షెల్టన్ ఐదు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. మాస్టర్స్ సిరీస్ టోర్నీ మ్యాచ్‌లో నెగ్గిన అతిపెద్ద వయస్కుడిగా డానియల్ నెస్టర్ (కెనడా; 44 ఏళ్ల 8 నెలలు) పేరిట ఉన్న రికార్డు బోపన్న బద్దలు కొట్టాడు. 2017లో మాడ్రిడ్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ తొలి రౌండ్‌లో బోపన్న-పాబ్లో క్యువెస్ (ఉరుగ్వే) జోడీపై నెగ్గడంతో ద్వారా నెస్టర్ (కెనడా)-ఫాబ్రిస్ మార్టిన్ (ఫ్రాన్స్) జంట ఈ రికార్డు నెలకొల్పడం గమనార్హం.

పోరాడి ఓడిన యూకీ జోడీ

మోంటెకార్లో మాస్టర్స్ సిరీస్‌లోనే పోటీపడుతున్న భారత డబుల్స్ నంబర్‌వన్ యూకీ బాంబ్రీకి నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా) ద్వయం 7-5, 5-7, 5-10తో 'సూపర్ టైబ్రేక్'లో అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)-జాన్ స్ట్రఫ్ (జర్మనీ) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. యూకీ-పాపిరిన్ జంటకు 14,350 యూరోల (రూ. 13 లక్షల 48 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

కార్ల్‌సన్‌పై అర్జున్ విజయం





పారిస్: ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ సంచలనం సృష్టించాడు. ర్యాపిడ్ ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి రోజు సోమవారం నార్వే దిగ్గజం, ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను అర్జున్ బోల్తా కొట్టించాడు. రెండో రౌండ్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన ప్రపంచ నాలుగో ర్యాంకర్ అర్జున్ 29 ఎత్తుల్లో కార్ల్‌సన్‌ను ఓడించడం విశేషం. అంతకుముందు తొలి రౌండ్ గేమ్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)పై అర్జున్ 35 ఎత్తుల్లో గెలుపొందాడు. 12 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఈనెల 14 వరకు ఈ టోర్నీ జరగనుంది. 11 రౌండ్ రాబిన్ గేమ్‌లు ముగిశాక టాప్-8లో నిలిచిన ప్లేయర్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. తొలి రోజు ఆరు రౌండ్‌లు ముగిశాక కార్ల్‌సన్ 5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. 3.5 పాయింట్లతో అర్జున్ ఆరో స్థానంలో, 2.5 పాయింట్లతో భారత మరో గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద ఏడో స్థానంలో ఉన్నారు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ 1.5 పాయింట్లతో పదో స్థానంలో, విదిత్ ఒక పాయింట్‌తో 12వ స్థానంలో నిలిచారు. నేడు మరో ఐదు రౌండ్‌లు జరుగుతాయి.

ఆర్‌సీబీ అదరహో


ముంబై విజయలక్ష్యం 222 పరుగులు... ఆర్‌సీబీ చక్కటి బౌలింగ్‌తో స్కోరు 99/4 వద్ద నిలిచింది. ముంబై గెలిచేందుకు 8 ఓవర్లలో 123 పరుగులు చేయడం అసాధ్యంగా అనిపించింది. అయితే అసాధారణ ఆటతో తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా పోరాడారు. కేవలం 34 బంతుల్లో 89 పరుగులు జోడించి విజయం దిశగా నడిపించారు. అయితే ఆరు పరుగుల వ్యవధిలో వీరిద్దరిని అవుట్ చేసి బెంగళూరు చివరకు మ్యాచ్‌పై పట్టు నిలబెట్టుకుంది. అంతకుముందు కెప్టెన్ రజత్ పాటీదార్, విరాట్ కోహ్లి, జితేశ్ శర్మ దూకుడుతో బెంగళూరు ప్రత్యర్థికి సవాల్ విసిరింది.

ఉత్కంఠ పోరులో బెంగళూరు విజయం
- 12 పరుగులతో ఓడిన ముంబై ఇండియన్స్
- రాణించిన పాటీదార్, కోహ్లి
- తిలక్, హార్దిక్ పోరాటం వృథా


పాటీదార్


కోహ్లి

ముంబై: వాంఖెడే మైదానంలో పదేళ్ల తర్వాత ముంబైపై బెంగళూరు విజయం సాధించింది. సోమవారం చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఆర్‌సీబీ 12 పరుగులతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రజత్ పాటీదార్ (32 బంతుల్లో 64; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (42 బంతుల్లో 67; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించగా... జితేశ్ శర్మ (19 బంతుల్లో 40 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), దేవదత్ పడిక్కల్ (22 బంతుల్లో 37; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 209 పరుగులు చేసింది. తిలక్ వర్మ (29 బంతుల్లో 56; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ చేయగా, హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 42; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించాడు.


తిలక్ వర్మ

సమష్టి ప్రదర్శన...

ఇన్నింగ్స్ రెండో బంతికే ఫిల్ సాల్ట్ (4) వెనుదిరగ్గా... కోహ్లి, పడిక్కల్ కలిసి దూకుడుగా స్కోరుబోర్డును నడిపించారు. బౌల్ట్ ఓవర్లో వీరిద్దరు కలిసి 16 పరుగులు రాబట్టారు. చహర్ ఓవర్లో పడిక్కల్ వరుసగా 6, 6, 4 బాదగా పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 73 పరుగులకు చేరింది. చక్కటి షాట్లు ఆడిన కోహ్లి 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి పడిక్కల్ వెనుదిరగడంతో 91 పరుగుల (52 బంతుల్లో) రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. ఆ తర్వాత సాంట్నర్ ఓవర్లో 2 సిక్స్‌లతో పాటీదార్ జోరు ప్రదర్శించాడు. హార్దిక్ ఒకే ఓవర్లో కోహ్లి, లివింగ్‌స్టోన్ (0)లను అవుట్ చేయగా, బౌల్ట్ ఓవర్లో ఆర్‌సీబీ బ్యాటర్లు పాటీదార్, జితేశ్ కలిసి 18 పరుగులు సాధించారు. 16 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 169/4. ఆఖరి 4 ఓవర్లలో బెంగళూరు 52 పరుగులు సాధించింది.

భారీ భాగస్వామ్యం...

భువనేశ్వర్ వేసిన తొలి ఓవర్లో 6, 4తో దూకుడుగా ఆటను మొదలు పెట్టిన రోహిత్ శర్మ (9 బంతుల్లో 17; 2 ఫోర్లు, 1 సిక్స్)... దయాళ్ తర్వాతి ఓవర్లో వరుసగా 2 ఫోర్లు కొట్టి తర్వాతి బంతికి బౌల్డయ్యాడు. రికెల్టన్ (17), జాక్స్ (22) కూడా మెరుగ్గానే ఆరంభించినా ఎక్కువ సేపు నిలవలేకపోయారు. బౌలర్ దయాళ్, కీపర్ జితేశ్ సమన్వయలోపంతో సులువైన క్యాచ్‌ను వదిలేయడంతో బతికిపోయిన సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 28; 5 ఫోర్లు)ను అదే ఓవర్లో మరో రెండు బంతుల తర్వాత పెవిలియన్ పంపించి దయాళ్ సంబరాలు చేసుకున్నాడు. ఆ తర్వాత సుయాశ్ ఓవర్లో తిలక్ 2 ఫోర్లు, సిక్స్...హాజెల్‌వుడ్ వేసిన తర్వాతి ఓవర్లో హార్దిక్ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు బాది విజయంపై ఆశలు రేపారు. గత మ్యాచ్‌లో 'రిటైర్డ్ అవుట్'గా పంపించిన కసి తిలక్ బ్యాటింగ్‌లో కనిపించింది. తర్వాతి మూడు ఓవర్లలో కూడా ఈ జోరు కొనసాగి 43 పరుగులు వచ్చాయి. అయితే తిలక్ వికెట్‌తో ఆట మళ్లీ బెంగళూరు వైపు మొగ్గింది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (బి) బౌల్ట్ 4; కోహ్లి (సి) నమన్ (బి) హార్దిక్ 67; పడిక్కల్ (సి) జాక్స్ (బి) పుతూర్ 37; పాటీదార్ (సి) రికెల్టన్ (బి) బౌల్ట్ 64; లివింగ్‌స్టోన్ (సి) బుమ్రా (బి) హార్దిక్ 0; జితేశ్ (నాటౌట్) 40; డేవిడ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 221.** **వికెట్ల పతనం:** 1-4, 2-95, 3-143, 4-144, 5-213. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-57-2, చహర్ 2-0-29-0, బుమ్రా 4-0-29-0, జాక్స్ 1-0-10-0, సాంట్నర్ 4-0-40-0, హార్దిక్ 4-0-45-2, విఘ్నేశ్ 1-0-10-1.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) దయాళ్ 17; రికెల్టన్ (ఎల్బీ) (బి) హాజెల్‌వుడ్ 17; జాక్స్ (సి) కోహ్లి (బి) కృనాల్ 22; సూర్యకుమార్ (సి) లివింగ్‌స్టోన్ (బి) దయాళ్ 28; తిలక్‌వర్మ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 56; హార్దిక్ (సి) లివింగ్‌స్టోన్ (బి) హాజెల్‌వుడ్ 42; నమన్ ధీర్ (సి) దయాళ్ (బి) కృనాల్ 11; సాంట్నర్ (సి) డేవిడ్ (బి) కృనాల్ 8; దీపక్ చహర్ (సి) డేవిడ్ (బి) కృనాల్ 0; బౌల్ట్ (నాటౌట్) 1; బుమ్రా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 209.** **వికెట్ల పతనం:** 1-21, 2-38, 3-79, 4-99, 5-188, 6-194, 7-203, 8-203, 9-209. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-48-1, యశ్ దయాళ్ 4-0-46-2, హాజెల్‌వుడ్ 4-0-37-2, సుయాశ్ శర్మ 4-0-32-0, కృనాల్ పాండ్యా 4-0-45-4.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
ఢిల్లీ	3	3	0	6	1.257
గుజరాత్	4	3	1	6	1.031
బెంగళూరు	4	3	1	6	1.015
పంజాబ్	3	2	1	4	0.074
కోల్‌కతా	4	2	2	4	0.070
లక్నో	4	2	2	4	0.048
రాజస్తాన్	4	2	2	4	-0.158
ముంబై	5	1	4	2	-0.010
చెన్నై	4	1	3	2	-0.891
హైదరాబాద్	5	1	4	2	-1.629

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా X లక్నో
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

పంజాబ్ X చెన్నై
వేదిక: ముల్లాన్‌పూర్
రాత్రి 7: 30 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

భయాన్నే భయపెట్టేవాడు!


● అజిత్

''ఏకే సార్... ఇప్పుడే తమరి చరిత్ర తవ్వి చూశా... నువ్వు పెద్ద విలన్ అని విన్నాను... కానీ నా గేమ్‌లో నేనేరా నీకు విలన్'' అంటూ మొదలైంది 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా తెలుగు ట్రైలర్. అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందిన బహుభాషా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. త్రిషా కృష్ణన్ హీరోయిన్‌గా నటించారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్‌ల సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా తెలుగు, హిందీ ట్రైలర్స్‌ను సోమవారం విడుదల చేశారు (ఆల్రెడీ తమిళ ట్రైలర్ విడుదలైంది). 'దమ్ము నా కోసం వదిలి పెట్టా... మందు నా వైఫ్ కోసం వదిలిపెట్టా... వయొలెన్స్ నా కొడుకు కోసం వదిలిపెట్టా... కానీ కొడుకుకే ఆపద వస్తే... వదలింది పట్టుకోవాలిగా..', 'ఏకే వస్తున్నారు... దారి వదలండ్రా..', 'వాడు భయాన్నే భయపెట్టేవాడు..' అనే డైలాగ్స్ తెలుగు ట్రైలర్‌లో ఉన్నాయి.

ఓ ట్యాక్సీ డ్రైవర్ కథ


● మోహన్ లాల్

మోహన్‌లాల్, శోభన ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం 'తుడరుమ్'. తరుణ్ మూర్తి దర్శకత్వంలో ఎమ్. రంజిత్ ఈ క్రైమ్ డ్రామా మూవీని నిర్మించారు. ఈ సినిమాను తొలుత జనవరి 30న విడుదల చేయాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల విడుదల కాలేదు. దీంతో 'తుడరుమ్' సినిమా మే చివర్లో విడుదల కానుందనే వార్తలు తెరపైకి వచ్చాయి. కానీ ఈ వార్తలు అవాస్తవమని, ఈ సినిమాను ఈ నెల 25న రిలీజ్ చేస్తున్నామని పేర్కొన్నారు మోహన్‌లాల్. ఈ సినిమాలో ట్యాక్సీ డ్రైవర్‌గా కనిపిస్తారాయన. ఇక దాదాపు పదిహేనేళ్ల తర్వాత మోహన్‌లాల్, శోభన మళ్లీ ఈ సినిమా కోసం స్క్రీన్ షేర్ చేసుకున్నారు.

తల్లి పాత్రలో..?


● దీపికా పదుకోన్

స్క్రీన్‌పై షారుక్ ఖాన్ తనయ సుహానా ఖాన్‌కు తల్లిగా నటించనున్నారట దీపికా పదుకోన్. షారుక్ ఖాన్ హీరోగా ఆయన కుమార్తె సుహానా మరో లీడ్ రోల్‌లో నటించనున్న చిత్రం 'కింగ్' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ సినిమాకు సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించనున్నారని బాలీవుడ్ టాక్. అభిషేక్ బచ్చన్ విలన్‌గా నటించనున్నారు. తాజాగా ఈ మూవీలో దీపికా పదుకోన్ ఓ లీడ్ చేయనున్నారనే టాక్ తెర పైకి వచ్చింది. సుహానా ఖాన్‌కు తల్లిగా కనిపిస్తారట దీపికా పదుకోన్. ఈ పాత్ర కథకు చాలా కీలకంగా ఉంటుందట. మే లేదా జూన్‌లో 'కింగ్' సినిమా చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారు. ఇదిలా ఉంటే... ఈ చిత్రదర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ 'ఎక్స్' వేదికగా 'ఫాల్స్' అని పేర్కొన్నారు. మరి... 'అవాస్తవం' అని ఆయన పేర్కొన్నది దీపికా పదుకోన్ తల్లి పాత్ర గురించా? లేదా వేరే ఏదైనా సినిమా గురించా లేక వేరే ఏ విషయం గురించా అనేది తెలియాల్సి ఉంది.

నన్ను వెంటాడే ఎమోషన్... - ఎన్టీఆర్


● ఎన్టీఆర్, సుకుమార్

హీరో ఎన్టీఆర్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన యాక్షన్ అండ్ ఎమోషనల్ ఫిల్మ్ 'నాన్నకు ప్రేమతో..'. బీవీఎస్‌ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం 2016 జనవరి 13న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత ఎన్టీఆర్-సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమా రాలేదు. తాజాగా వీరిద్దరూ కలిసి సరదాగా కొంత సమయం గడిపారు. ఆ ఫొటోలను సుకుమార్ సతీమణి, నిర్మాత తబితా తన ఇన్‌స్టా స్టేటస్‌లో 'తారక్‌కి ప్రేమతో..' అనే క్యాప్షన్‌తో షేర్ చేసి, ఎన్టీఆర్ పేరును ట్యాగ్ చేశారు. తబితా షేర్ చేసిన ఈ ఫొటోలను ఎన్టీఆర్ తన ఇన్‌స్టా స్టేటస్‌లో షేర్ చేసి, 'నన్ను ఎప్పుడూ వెంటాడే ఎమోషన్' ('నాన్నకు ప్రేమతో..' సినిమాలో ఎన్టీఆర్ డైలాగ్) అనే క్యాప్షన్‌తో సుకుమార్ ఇన్‌స్టా ఐడీని మెన్షన్ చేశారు. ఎన్టీఆర్ స్టేటస్‌ను సుకుమార్ తన ఇన్‌స్టా స్టేటస్‌లో షేర్ చేసి, 'మై అభిరామ్' ('నాన్నకు ప్రేమతో..' సినిమాలో ఎన్టీఆర్ పాత్ర పేరు) అని పేర్కొన్నారు. ఇక ఈ ఇద్దరూ హఠాత్తుగా ఇలా కలిసింది తమ కాంబినేషన్ సినిమా గురించి చర్చించడానికే అనే ఊహాగానాలు మొదలయ్యాయి.

కథ విన్నారా?


● హృతిక్ రోషన్

బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్, దర్శకుడు బాబీ (కేఎస్ రవీంద్ర) కాంబినేషన్‌లో ఓ మూవీ రూపొందించడానికి సన్నాహాలు మొదలయ్యాయనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఇటీవల హృతిక్ రోషన్‌ను కలిసి ఓ కథ వినిపించారట బాబీ. ఈ స్టోరీ లైన్‌కు ప్రాథమికంగా అంగీకారం తెలిపారట హృతిక్. దీంతో ప్రస్తుతం స్క్రిప్ట్‌కు మరింత మెరుగులుదిద్దే పనిలో దర్శకుడు బాబీ బిజీగా ఉన్నారని సమాచారం. మరోసారి హృతిక్ రోషన్‌ను కలిసి, బాబీ ఫైనల్ స్క్రిప్ట్ నరేషన్ ఇవ్వనున్నారట. అప్పుడు ఈ స్టోరీకి హృతిక్ రోషన్ ఫైనల్ గ్రీన్‌సిగ్నల్ ఇస్తే, ఈ కాంబినేషన్ సెట్ అయినట్లేనని ఫిల్మ్‌నగర్ టాక్. ఇక ఈ మూవీని భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్నారని భోగట్టా. మరి.. హృతిక్ రోషన్ కథ విన్నారా? హృతిక్-బాబీల కాంబినేషన్ సెట్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.
ఇదిలా ఉంటే హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి నటించిన స్పై యాక్షన్ డ్రామా 'వార్ 2' చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మించారు.


● టామ్ క్రూజ్


హాలీవుడ్ హిట్ సిరీస్ 'మిషన్ ఇంపాజిబుల్'లో రానున్న ఎనిమిదో చిత్రం 'మిషన్ ఇంపాజిబుల్: ది ఫైనల్ రెకానింగ్'. టామ్ క్రూజ్ హీరోగా ఈ అమెరికన్ స్పై యాక్షన్ ఫిల్మ్‌కి క్రిస్టోఫర్ మెక్ క్వారీ దర్శకత్వం వహిస్తున్నారు. టామ్ క్రూజ్, మెక్ క్వారీ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది మే 23న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా కొత్త ట్రైలర్, కొత్త స్టిల్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.

గోదారి గట్టుపైన...


● సుమంత్ ప్రభాస్, నిధి

హీరో వెంకటేశ్-దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లోని బ్లాక్ బస్టర్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం'లోని 'గోదారి గట్టుపైన రామసిలకవే..' పాట బాగా పాపులర్. ఇప్పుడు ఈ పాటలోని పదాలతోనే 'గోదారి గట్టుపైన..' అనే సినిమా రానుంది. సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ హీరో హీరోయిన్లుగా, సుభాష్ చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'గోదారి గట్టుపైన..' టైటిల్‌ను ఖరారు చేశారు. అభినవ్ రావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీ టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''గోదావరి జిల్లాలు వేల్పూరు, రేలంగి, భీమవరం నేపథ్యంలో సాగే ఈ సినిమాకు 'గోదారి గట్టుపైన' అని టైటిల్ పెట్టాం. సాయంత్రం వేళ గోదావరి ఒడ్డున ఫ్రెండ్స్‌తో కూర్చొని సమయం గడిపితే ఎంత ప్రశాంతంగా ఉంటుందో అంత ప్రశాంతంగా మా సినిమా ఉంటుంది'' అని సుభాష్ చంద్ర పేర్కొన్నారు.

వచ్చాడు గౌతమ్


● అశ్విన్

స్టెతస్కోప్ పట్టుకున్న చేతి నిండా రుధిరం, కళ్లల్లో రౌద్రం చూస్తుంటే ప్రాణాలు పోయాల్సిన డాక్టర్ హత్య చేశాడా? అనేలా ఉంది 'వచ్చిన వాడు గౌతమ్' పోస్టర్. అశ్విన్ బాబు హీరోగా మామిడాల ఎం.ఆర్. కృష్ణ దర్శకత్వంలో టి. గణపతి రెడ్డి నిర్మిస్తున్న చిత్రం ఇది. వచ్చాడు గౌతమ్ అంటూ ఈ చిత్రంలో అశ్విన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ''అరుణశ్రీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై గణపతి రెడ్డి నిర్మిస్తున్న మూడో చిత్రం ఇది. గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ చిత్రంలో సాయి రోనక్ అతిథి పాత్రలో కనిపిస్తారు'' అని చిత్రబృందం పేర్కొంది. రియా సుమన్, అయేషా ఖాన్, మురళీ శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గౌర హరి, కెమేరా: ఎం.ఎస్. బాల్ రెడ్డి.

సాక్షి **బిజినెస్**
మంగళవారం
8-4-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▼	నిఫ్టీ ▼
2,227	743
73,138	22,162

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	15,734	▲ 148
డోజోన్స్	37,841	▼ 474
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,702	▼ 353
డాక్స్	19,790	▼ 852
షాంఘై	3,097	▼ 245
నికాయ్	31,139	▼ 2,644

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	89,085
బంగారం (99.5 స్వచ్ఛత)	88,728
వెండి (కేజీ)	90,392

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ రూపాయి	84.05	87.68
£	బ్రిటన్ పౌండ్	భారతీయ రూపాయి	107.73	112.68
€	యూరో	భారతీయ రూపాయి	91.93	96.50
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ రూపాయి	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ రూపాయి	49.69	54.63
S$	సింగపూర్ డాలర్	భారతీయ రూపాయి	61.39	66.12
SAR	సౌదీ రియాల్	భారతీయ రూపాయి	21.99	23.55
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ రూపాయి	22.48	24.26
¥	చైనా యువాన్	భారతీయ రూపాయి	10.87	12.69

బ్లాక్ మండే..



ప్రపంచ మార్కెట్లపై 'టారిఫ్' బేర్ పంజా

ట్రంప్ టారిఫ్ వార్‌తో ప్రపంచ మార్కెట్లను బేర్ చీల్చిచెండాడింది. ఆసియా నుంచి అమెరికా దాకా బ్లాక్ మండే దెబ్బకు ఇన్వెస్టర్లు కుదేలయ్యారు. అమెరికా సుంకాలకు చైనా ప్రతీకార టారిఫ్‌లు విధించడం.. ఇతర దేశాలూ అదే బాటలో వెళ్తుండటంతో వాణిజ్య యుద్ధం మరింత ముదురుతోంది. దీంతో ద్రవ్యోల్బణం ఎగబాకి ఆర్థిక మాంద్యానికి దారి తీయొచ్చనే భయాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలో అమ్మకాల సునామీ వెల్లువెత్తింది. ఈ ప్రభావం దేశీయ ఈక్విటీ మార్కెట్‌పైనా విరుచుకుపడింది. ఫలితంగా భారత స్టాక్ సూచీలు పది నెలల్లో (2024 జూన్ 4 తర్వాత) అతిపెద్ద నష్టాన్ని చూశాయి. సెన్సెక్స్ 2,227 పాయింట్లు క్షీణించి 73,138 వద్ద, నిఫ్టీ 743 పాయింట్లు నష్టపోయి 22,162 వద్ద నిలిచింది. ఈ క్రాష్‌తో ఇన్వెస్టర్ల సంపదగా భావించే, బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ సోమవారం ఒక్కరోజే రూ.14.09 లక్షల కోట్లు ఆవిరై రూ.389 లక్షల కోట్ల (4.54 ట్రిలియన్ డాలర్ల)కు పడిపోయింది. ఒకానొక దశలో సంపద రూ.20.16 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది.

- సెన్సెక్స్ 2,227 పాయింట్లు క్రాష్
- ఇంట్రాడేలో 72,000 కిందికి సూచీ...
- 743 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- ఆసియా సూచీలు 4-15 శాతం ఢమాల్
- యూరప్ మార్కెట్లో బ్లడ్ బాత్
- బేర్ గుప్పిట్లోకి అమెరికా సూచీలు
- ఒక్క రోజే రూ.14 లక్షల కోట్లు ఆవిరి

ముంబై: గత వారాంతంలో అమెరికా మార్కెట్లు కుప్పకూలడంతో సోమవారం ఆసియా మార్కెట్లు అతలాకుతలం అయ్యాయి. ఆ సెగతో మన సూచీలు కూడా భారీ నష్టాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ ఏకంగా 3,915 పాయింట్ల క్షీణతతో 71,450 వద్ద, నిఫ్టీ 1,146 వద్ద పతనంతో 21,758 వద్ద మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 3,940 పాయింట్లు, నిఫ్టీ 1160 పాయింట్లు దిగజారాయి. జాతీయ, అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావంతో రోజంతా భారీ నష్టాల్లో కదలాడాయి. అయితే కనిష్టాల వద్ద కొన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాలు కొంత భర్తీ అయ్యాయి.

➜ సెన్సెక్స్ సూచీలో ఒక్క హెచ్‌యూఎల్ (0.25%) మినహా మిగిలిన 29 షేర్లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీగా సూచీల్లో మెటల్ 6.22%, రియల్టీ 5.69%, కమోడిటీస్ 4.68%, ఇండస్ట్రియల్ 4.57%, కన్జూమర్ డిస్క్రెషనరీ 4%, ఆటో 3.77%, బ్యాంకెక్స్ 3.37%, ఐటీ, టెక్ మూడు శాతాలు క్షీణించాయి. బీఎస్‌ఈలో 3,515 షేర్లు నష్టపోయాయి. 570 స్టాక్స్ లాభపడ్డాయి. మిగిలిన 140 షేర్లలో ఎలాంటి మార్పు లేవు. 775 స్టాక్స్ ఏడాది కనిష్టాన్ని, 59 షేర్లు ఏడాది గరిష్టాన్ని తాకాయి.

ఐటీ షేర్లు.. హాహాకారాలు...

ఆర్థిక మాంద్య భయాలతో అమెరికా నుంచి అధిక ఆదాయాలు ఆర్జించే ఐటీ షేర్లు భారీ క్షీణించాయి. ఆస్పర్ట్ టెక్నాలజీస్ 14%, జెనెసిస్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ 11% క్షీణించాయి. క్విక్ హీల్ టెక్నాలజీస్ 10%, జాగిల్ ప్రీపెయిడ్ ఓషియన్ సర్వీసెస్, డేటామాటిక్స్ గ్లోబల్ సర్వీసెస్ 9%, న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ 8%, హ్యాపియెస్ట్ మైండ్స్, సొనాటా సాఫ్ట్‌వేర్, టాటా టెక్నాలజీ, ఎంఫసిస్ 6% క్షీణించాయి. అధిక వెయిటేజీ ఇన్ఫోసిస్ 4%, హెచ్‌సీఎల్ టెక్ 3%, టెక్ మహీంద్రా 2.50%, ఎల్‌టీఐమైండ్‌ట్రీ 2%, విప్రో ఒకశాతం, టీసీఎస్ అరశాతం నష్టపోయాయి. బీఎస్‌ఈ ఐటీ ఇండెక్స్ గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో 8 శాతం క్షీణించింది.

టాటా.. టప టపా!



టెక్నాలజీ, స్టీల్, ఆటోమొబైల్స్ రంగాల్లో అధిక భాగం వ్యాపారాలు కలిగిన టాటా గ్రూప్ షేర్లు డీలా పడ్డాయి. టాటా ట్రెంట్ షేరు 15%, టాటా స్టీల్ 9%, టాటా మోటార్స్, టాటా టెక్నాలజీ 6%, టీసీఎస్, టాటా కెమికల్స్, టైటాన్, ఇండియన్ హోటల్స్ షేర్లు 5-2% నష్టపోయాయి. ఈ గ్రూప్‌లో మొత్తం 16 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.90,000 కోట్లు హరించుకుపోయి రూ.25.3 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఒకానొక దశలో రూ.2.3 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ కోల్పోయింది.


మెటల్స్ విలవిల...

మార్కెట్ పతనంలో భాగంగా మెటల్ షేర్లు మండిపోయాయి. నాల్కో, టాటా స్టీల్ 8%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 7.50%, సెయిల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, వేదాంత 7% పతనమయ్యాయి. జిందాల్ స్టెయిన్‌లెస్, హిందాల్కో, ఎన్‌ఎండీసీ 6%, హిందుస్తాన్ జింక్, ఏపీఎల్ అపోలో ట్యూబ్స్ 5% నష్టపోయాయి.

అప్రమత్తత అవసరం: నిపుణులు

తీవ్ర అనిశ్చితులతో ప్రస్తుతం ఈక్విటీ మార్కెట్లో భయాందోళనలు భారీగా పెరిగాయి. ట్రంప్ సుంకాల విధింపుతో నెలకొన్న అల్లకల్లోల పరిస్థితులు ఎప్పుడు సద్దుమణుగుతాయో ఎవరికి సరైన స్పష్టత లేదు. అయినప్పటికీ..., ప్రపంచ మార్కెట్లతో పోలిస్తే మన మార్కెట్లపై ప్రభావం తక్కువగా ఉంది. క్షీణత వేళ అప్రమత్తతతో వ్యవహరిస్తూ మంచి షేరు విలువ ఆకర్షణీయంగా కనిపిస్తే కొనుగోలు చేయొచ్చు. రక్షణాత్మక రంగాల్లో పెట్టుబడి మరీ మంచిది అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వ్యూహకర్త వి.కే. విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రపంచ మార్కెట్లు కుదేల్



ట్రంప్ సుంకాల విధింపు 'అంచనాలకు మించి' ఉన్నాయంటూ ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ పేర్కొంటూ ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణంపై గణనీయమైన ప్రభావం చూపొచ్చంటూ ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా అంతర్జాతీయ పెట్టుబడి సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ ట్రంప్ టారిఫ్ విధించిన తర్వాత అమెరికాలో మాంద్యం వచ్చే అవకాశాలను 60%కు పెంచింది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మరింత తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని తెలిపింది. దీంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లో అమ్మకాలు వెల్లువెత్తాయి.

అమెరికా మార్కెట్లు ఢమాల్

అమెరికా స్టాక్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగుతోంది. ట్రంప్ టారిఫ్‌ల బాంబ్‌తో గత వారాంతంలో భారీ నష్టాల మూటగట్టుకున్న సూచీలు.. తాజా సోమవారమూ భారీ నష్టాలబాట పట్టాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే యూఎస్ మార్కెట్ 5% మేర కుదేలైంది. భారత వర్తమాన కాలం ప్రకారం రాత్రి 10 గంటలకు నాస్‌డాక్ ఒకటిన్నర నష్టంతో 15,366 వద్ద, డోజోన్స్ రెండున్నర శాతం క్షీణతతో 37,462 వద్ద, ఎస్ అండ్‌పీ 2% పతనంతో 4,993 వద్ద ట్రేడవుతోంది. కోవిడ్ తర్వాత ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఇటీవల గరిష్ఠం నుంచి 20 శాతానికి పైగా క్షీణించి నాస్‌డాక్ శుక్రవారం అధికారికంగా 'బేర్ మార్కెట్' జోన్‌లో ప్రవేశించింది.

పతనం ఇలా..	
హాంకాంగ్ హాంగ్‌సెంగ్	15%
తైవాన్ వెయిటెడ్	11%
జపాన్ నికాయ్	8%
సింగపూర్ స్ట్రెయిట్ టైమ్స్	8%
చైనా షాంఘై	7%
కొరియా కాస్పీ	6%
ఫ్రాన్స్ సీఏసీ	4%
జర్మనీ డాక్స్	4%
బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ	4%

బంగారానికి ట్రేడ్ వార్ సెగ

దేశ రాజధానిలో రూ. 1,550 డౌన్



న్యూఢిల్లీ: టారిఫ్‌లపరమైన యుద్ధ భయాలు స్టాక్ మార్కెట్లతో పాటు బులియన్ మార్కెట్‌ను కలవరపెడుతున్నాయి. సోమవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పసిడి ధర రూ. 1,550 మేర క్షీణించింది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం 99.9 స్వచ్ఛత బంగారం 10 గ్రాముల రేటు రూ. 91,450 వద్ద క్లోజయ్యింది. ఈక్విటీ, ఇతరత్రా అసెట్లతో పాటు సురక్షితమైన పెట్టుబడి సాధనంగా పరిగణించే విలువైన లోహాల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ ఆనలిస్టు సౌమిల్ గాంధీ తెలిపారు.

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్ ధర 56 డాలర్లు పతనమై 2,979 వద్ద ట్రేడవుతోంది. మరోవైపు, వెండి ధరలు వరుసగా అయిదో రోజూ తగ్గాయి. కేజీ వెండి రేటు సోమవారం మరో రూ. 3,000 క్షీణించి రూ. 92,500 వద్ద ముగిసింది. గత 5 సెషన్లలో వెండి ధర కేజీకి రూ. 10,500 తగ్గింది.

రూపాయి 32 పైసలు పతనం

డాలర్ మారకంలో రూపాయి విలువ 32 పైసలు బలహీనపడి 85.76 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 85.57 వద్ద గరిష్టాన్ని, 85.90 వద్ద కనిష్టాన్ని తాకింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఎగుమతిదార్లకు కేంద్రం దన్ను..
ఇక ఐటీ రంగానికి సవాళ్లు

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, నాగ్‌పూర్‌లో 1,007 అప్రెంటిస్‌లు

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే నాగ్‌పూర్ డివిజన్, మోతీబాగ్ వర్క్‌షాప్(నాగ్‌పూర్)లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 1,007.
- » **ట్రేడులు:** ఫిట్టర్, కార్పెంటర్, వెల్డర్, పీవోపీఏ, ఎలక్ట్రీషియన్, స్టెనోగ్రాఫర్, ప్లంబర్, పెయింటర్, వైర్‌మ్యాన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డీజిల్ మెకానిక్, మెషినిస్ట్, టర్నర్ తదితరాలు.
- » **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 05.04.2025 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్ష మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.05.2025.
- » **వెబ్‌సైట్:** https://secr.indianrailways.gov.in

ఎన్‌పీసీఐఎల్‌లో 122 అప్రెంటిస్‌లు

తమిళనాడు రాష్ట్రం చెంగల్పట్టు జిల్లాలో ఉన్న న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్)లో ట్రేడ్, డిప్లొమా, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 122.
- » **ఖాళీల వివరాలు:** ట్రేడ్ అప్రెంటిస్‌లు-92, డిప్లొమా అప్రెంటిస్‌లు-14, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు-16.
- » **ట్రేడులు:** ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, వెల్డర్, మెకానికల్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, కార్పెంటర్, కంప్యూటర్ ఆపరేటర్, మెకానికల్ తదితరాలు.
- » **విభాగాలు:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, హ్యూమన్ రిసోర్సెస్, కాంట్రాక్ట్స్ అండ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, హెచ్‌పీయూ, కెమికల్ ల్యాబ్.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 30.04.2025 నాటికి ట్రేడ్ అప్రెంటిస్‌కు 18 నుంచి 24 ఏళ్లు, డిప్లొమా అప్రెంటిస్‌కు 18 నుంచి 25 ఏళ్లు, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **స్టైపెండ్:** నెలకు ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.7,700 నుంచి రూ.8,050, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ. 8000, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000.
- » **శిక్షణా కాలం:** ఏడాది.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ మేనేజర్(హెచ్‌ఆర్‌ఎం), న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మద్రాస్ అటామిక్ పవర్ స్టేషన్, కల్పకం, తమిళనాడు చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 30.04.2025.
- » **వెబ్‌సైట్:** https://npcilcareers.co.in

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సూపర్‌వైజర్ పోస్టులు

సివాన్(బీహార్) రీజియన్‌లో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బిజినెస్ కరస్పాండెంట్ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
- » **పోస్టుల వివరాలు:** సివాన్-02, సరన్-03, గోపాల్‌గంజ్-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, ఎంఎస్సీ, ఎంబీఏ, పీజీడీఎం, ఎంసీఏ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 21 నుంచి 65 ఏళ్లు ఉండాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఫస్ట్ ఫ్లోర్, పటేల్ చౌక్, హెచ్‌పీవో దగ్గర, సివాన్, పిన్-841226 చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 15.04.2025.
- » **వెబ్‌సైట్:** http://centralbankofindia.co.in

సివిల్స్.. ప్రిలిమ్స్ దాటే వ్యూహం!

- » మే 25న సివిల్స్-2025 ప్రిలిమ్స్ పరీక్ష
- » జాతీయ స్థాయిలో దాదాపు పది లక్షల మంది దరఖాస్తు!
- » తెలుగు రాష్ట్రాల నుంచి లక్ష వరకు అభ్యర్థులు
- » వ్యూహాత్మక ప్రిపరేషన్‌తోనే విజయం

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్..! ఐఏఎస్, ఐఎఫ్‌ఎస్, ఐపీఎస్ సహా.. 23 కేంద్ర సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే ఎంపిక ప్రక్రియలో తొలిదశ! ఈ ఉన్నత స్థాయి పరీక్షకు దేశ వ్యాప్తంగా దాదాపు పది లక్షల మంది పోటీ పడుతుంటారు! తీవ్ర పోటీ నెలకొన్న సివిల్స్ ప్రిలిమ్స్‌లో గట్టెక్కి.. మలి దశ మెయిన్స్‌కు ఎంపికవ్వాలంటే.. అభ్యర్థులు వ్యూహాత్మకంగా ప్రిపరేషన్ సాగించాలి. సివిల్స్ ప్రిలిమ్స్-2025 పరీక్షను మే 25న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో అనుసరించాల్సిన ప్రిపరేషన్ వ్యూహాలు, దృష్టిసారించాల్సిన ముఖ్యాంశాలపై ప్రత్యేక కథనం..



సివిల్స్ ప్రిలిమ్స్-2025

మే 25న పరీక్ష

ఈ ఏడాది సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష మే 25న నిర్వహించనున్నారు. అంటే ఇప్పటి నుంచి అభ్యర్థులకు అందుబాటులో ఉన్న సమయం దాదాపు యాభై రోజులు. ప్రిలిమ్స్‌లో గట్టెక్కాలంటే.. ఈ సమయంలో తీవ్రంగా కృషి చేయాల్సి ఉంటుంది. ఈ వ్యవధిలో విశ్లేషణాత్మక అధ్యయనం,పునశ్చరణ,సమయ పా లన,ప్రాక్టీస్ అనే నాలుగు వ్యూహాలను పాటించడం ద్వారా విజయావకాశాలు మెరుగు పరచుకోవచ్చు.

సమయ పాలన

ప్రస్తుత సమయంలో అభ్యర్థులు టైం మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. జనరల్ స్టడీస్ పేపర్ 1 సిలబస్‌లో పేర్కొన్న అంశాలను పరిశీలించి.. ప్రతి టాపిక్‌ను నిరంతరం చదివేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ప్రతి రోజు కనీసం ఎనిమిది నుంచి పది గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించాలి. దీంతోపాటు తమకు లభించిన సబ్జెక్ట్ అవగాహనను స్వీయ విశ్లేషణ చేసుకునే విధంగా సెల్ఫ్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా ఉపకరిస్తుంది.

కోర్ + కరెంట్ అఫైర్స్

ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు అనుసరించాల్సిన మరో ప్రధాన వ్యూహం.. సిలబస్‌లో పేర్కొన్న కోర్ టాపిక్స్‌ను సైతం కరెంట్ అఫైర్స్‌తో సమ్మిళితం చేసుకుంటూ చదవడం. కారణం.. ఇటీవల కాలంలో ప్రిలిమ్స్‌లో అడుగుతున్న ప్రశ్నలు కరెంట్ అఫైర్స్ సమ్మిళితంగా ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు ఈ ఏడాది ఏప్రిల్ ముందు నుంచి ఏడాది, ఏడాదిన్నర కాలంలోని ముఖ్యమైన కరెంట్ అఫైర్స్‌పై దృష్టిపెట్టాలి. వాటిని సంబంధిత సబ్జెక్ట్ అంశాలతో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. నేపథ్యం,ప్రభావం,ప్రస్తుత పరిస్థితి,భవిష్యత్తు అంచనా,ఫ్యాక్ట్స్ తదితర కోణాల్లో అధ్యయనం చేయాలి.

అనుసంధానం చేసుకుంటూ

అభ్యర్థులు ప్రిపరేషన్‌లో భాగంగా ఆయా సబ్జెక్ట్‌లను అనుసంధానం చేసుకుంటూ చదవాలి. ఎకానమీ-పాలిటీ, ఎకానమీ-జాగ్రఫీ, జాగ్రఫీ-ఎకాలజీ, జాగ్రఫీ-సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది. దీన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రిపరేషన్ పరంగా ఎంతో విలువైన సమయం కలిసొస్తుంది. ఈ సమయాన్ని క్లిష్టంగా భావించే ఇతర అంశాలపై దృష్టి పెట్టేందుకు అవకాశం లభిస్తుంది.

ముఖ్యాంశాల గుర్తింపు

ప్రస్తుత సమయంలో సబ్జెక్ట్ వారీగా ముఖ్యాంశాలను గుర్తించి.. వాటిపై ప్రత్యేక దృష్టి సారించడం ఎంతో మేలు చేస్తుంది. గత నాలుగైదేళ్ల ప్రశ్న పత్రాలను పరిశీలించి ఆయా సబ్జెక్ట్‌ల నుంచి అడుగుతున్న ప్రశ్నల సంఖ్య.. ఏఏ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుందో గుర్తించాలి. ఉదాహరణకు చరిత్రనే పరిగణనలోకి తీసుకుంటే.. సాంస్కృతిక చరిత్ర, రాజ వంశాలు, విదేశాలతో వాణిజ్యం, సామాజిక, ఆర్థిక పరిణామాలు వంటి వాటిని ముఖ్యమైనవిగా పేర్కొనొచ్చు.

ఇంటర్నేషనల్ ఈవెంట్స్‌లో గత ఏడాది కాలంలో సంభవించిన ముఖ్యమైన పరిణామాలపై దృష్టి సారించాలి. ప్రధానంగా అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక, ట్రంప్ టారిఫ్స్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-గాజా ఘర్షణలు, ఆఫ్రికాలో తిరుగుబాట్లు తదితర అంశాలను విశ్లేషించాలి. అదే విధంగా జీ 20, బ్రిక్స్, బిమ్‌స్టెక్, క్వాడ్, ఇండో పసిఫిక్, ఈస్ట్ ఏసియా, మిడిల్ ఈస్ట్ పరిణామాలు, ముఖ్య దేశాలతో భారత్ ఒప్పందాలు-యూఎస్‌వో, నాటో, ఈయూ వంటి అంతర్జాతీయ సంస్థలపైనా అవగాహన పెంచుకోవాలి.

కనీసం రెండుసార్లు రివిజన్

ప్రస్తుత సమయంలో అభ్యర్థులు ప్రతి సబ్జెక్ట్‌ను కనీసం రెండుసార్లు పునశ్చరణ చేసుకునేలా ప్లాన్ చేసుకోవాలి. ఆయా సబ్జెక్ట్‌ల సిలబస్‌ను మే మొదటి వారానికి పూర్తి చేసుకునే విధంగా సమయ పాలన పాటించాలి. ఇలా చేయడం వల్ల రెండు సార్లు రివిజన్ చేసేందుకు సమయం లభ్యత పరంగా ఎలాంటి ఇబ్బంది ఉండదు. రివిజన్ చేసేందుకు ఉపకరించే విధంగా ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్‌నోట్స్ రూపొందించుకోవాలి.

కొత్త అంశాలు వద్దు

ప్రస్తుత సమయంలో కొత్త అంశాలను చదవడం సరికాదని నిపుణులు సూచిస్తున్నారు. కొత్త అంశాల ప్రిపరేషన్ వల్ల అనవసరపు ఆందోళనకు గురవడం, ఇది మొత్తంగా ప్రిపరేషన్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుదని పేర్కొంటున్నారు. కాబట్టి ప్రస్తుత సమయంలో తాము ఇప్పటికే పట్టు సాధించిన అంశాలపై మరింత లోతైన అవగాహన పెంచుకునేలా కృషి చేయాలి.

గత ప్రశ్న పత్రాల సాధన

ప్రిపరేషన్ కోణంలో అభ్యర్థులు అనుసరించాల్సిన మరో వ్యూహం.. గత ప్రశ్న పత్రాల సాధన. పరీక్షకు నెల రోజుల ముందు నుంచి ప్రతి రోజు ఒక ప్రీవియస్ పేపర్ ప్రాక్టీస్ చేసేలా సమయం కేటాయించుకోవాలి. దీని ద్వారా తమ బలాలు, బలహీనతలపై అవగాహన ఏర్పడుతుంది.

పేపర్-2 ముఖ్యమే

అభ్యర్థులు పేపర్-2 (సీశాట్)కు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. అర్హత పరీక్ష పేపర్‌గానే పేర్కొన్నప్పటికీ.. ఇందులో 33 శాతం మార్కులు సాధిస్తేనే పేపర్-1 మూల్యాంకన చేస్తారు. దాని ఆధారంగానే మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. పేపర్-2లో ఈ అర్హత మార్కులు సాధించేందుకు ప్రధానంగా మ్యాథమెటిక్స్, లాజికల్ రీజనింగ్ స్కిల్స్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

సివిల్స్.. ప్రిలిమ్స్-2025 ముఖ్యాంశాలు

- ✦ మొత్తం పోస్టులు 979
- ✦ మే 25న ప్రిలిమినరీ ఎగ్జామినేషన్
- ✦ రెండు పేపర్లుగా 400 మార్కులకు పరీక్ష (ఒక్కో పేపర్‌కు 200 మార్కులు)
- ✦ దాదాపు పది లక్షల మంది దరఖాస్తు
- ✦ ప్రతి ఏటా 46 నుంచి 50% మధ్యలో హాజరు
- ✦ ప్రిలిమ్స్‌లో ప్రతిభ ఆధారంగా 1:12 లేదా 1:12.5 నిష్పత్తిలో మలి దశ మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక.

దృష్టి పెట్టాల్సిన ముఖ్యాంశాలు

కరెంట్ అఫైర్స్: అంతర్జాతీయ సంక్షోభ పరిస్థితులు; అమెరికా ట్రంప్ 2.0 ప్రభావం; జాతీయ స్థాయిలో అమల్లోకి వచ్చిన కీలక ఆర్థిక విధానాలు; ప్రభుత్వ పథకాలు-లక్ష్యం-లబ్ధిదారులు; గత ఏడాది కాలంలో ఆర్థిక ప్రగతికి సంబంధించిన గణాంకాలు; అంతర్జాతీయంగా పలు సంస్థల నివేదికల్లో భారత్‌కు సంబంధించిన గణాంకాలు.

చరిత్ర: ఆధునిక భారత దేశ చరిత్ర, జాతీయోద్యమం, ప్రాచీన, మధ్యయుగ చరిత్రకు సంబంధించి సాహిత్యం, కళలు, మత ఉద్యమాలు, రాజకీయ-సామాజిక-ఆర్థిక చరిత్ర అంశాలు, ఆధునిక చరిత్రలో బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన-పరిపాలన విధానాలు, బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు-ఉద్యమాలు, సంస్కరణోద్యమాలు.

పాలిటీ: రాజ్యాంగం; రాజకీయ వ్యవస్థ; పంచాయతీరాజ్ వ్యవస్థ; ప్రభుత్వ విధానం; కేంద్ర-రాష్ట్ర సంబంధాలు

ఎకానమీ: ఆర్థికాభివృద్ధిలో సహజ వనరులు-మూలధన వనరుల పాత్ర. ✦ ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల ప్రగతి(వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, సేవారంగం). ✦ ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో దేశంలో ఆర్థిక-సాంఘికాభివృద్ధి ✦ పారిశ్రామిక తీర్మానాలు-వ్యవసాయ విధానం. ✦ పంచవర్ష ప్రణాళికలు, ప్రణాళిక రచన-వనరుల కేటాయింపు ✦ 10,11 పంచవర్ష ప్రణాళికలు. ✦ బ్యాంకింగ్ రంగం ప్రగతి -సంస్కరణలు-ఇటీవల కాలంలో బ్యాంకింగ్ రంగంలో స్కామ్‌లు, ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావం. ✦ తాజా మానవాభివృద్ధి, ప్రపంచ అభివృద్ధి నివేదికలు.

సైన్స్ అండ్ టెక్నాలజీ: గత ఏడాది కాలంలో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు, ఇటీవల కాలంలో సంభవిస్తున్న వ్యాధులు-కారకాలు, సైబర్ సెక్యూరిటీ యాక్ట్, రక్షణ రంగంలో కొత్త మిస్సైల్స్ ప్రయోగాలు, జాతీయ ముఖ్యమైన వన్య మృగ సంరక్షణ కేంద్రాలు. ✦ పర్యావరణ పరిరక్షణ ఒప్పందాలు, చర్యలు, వివిధ ఐటీ పాలసీలు.

జాగ్రఫీ: 2011 జన గణనకు సంబంధించిన ముఖ్యాంశాలు; అత్యధిక, అత్యల్ప జనాభా ఉన్న రాష్ట్రాలు; అత్యధిక, అత్యల్ప జన సాంద్రత గల రాష్ట్రాలు; స్త్రీ,పురుష నిష్పత్తి; స్త్రీ, పురుష అక్షరాస్యత శాతం, గత పదేళ్లలో జనన, మరణ రేట్లు, పర్యావరణ సమస్యలు-ఎక్కువగా కేంద్రీకృతమైన ప్రాంతాలు, దేశాలు. సౌర వ్యవస్థ, భూమి అంతర్ నిర్మాణం, శిలలు, జియలాజికల్ టైం స్కేల్, రుతు పవనాలు, ప్రపంచ పవనాలు, చక్రవాతాలు, ఉష్ణోగ్రత విలోమం, లానినా, ఎల్‌నినో, భూకంపాలు, సునామీలు. మన దేశ పరిస్థితుల నేపథ్యంలో నగరీకరణ, రుతుపవనాలు, నదీ జలాల పంపిణీ-వివాదాలు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-ఇంగ్లిష్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్- జాగ్రఫీ » పోటీ పరీక్షల ప్రత్యేకం-బయాలజీ

క్లుప్తంగా...

త్వరలోనే కార్మికుల కనీస వేతనాల సవరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ కేటగిరీల్లోని కార్మికుల కనీస వేతనాల సవరణను త్వరలోనే ఖరారు చేయాలని తెలంగాణ కనీస వేతనాల సలహా మండలి నిర్ణయించింది. సోమవారం కార్మిక భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు సమావేశం జరిగింది. చైర్మన్ జనక్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శి శ్యామ్ సుందర్ జాజు, సభ్యులు ఎస్.నర్సింహారెడ్డి, యర్రం పిచ్చిరెడ్డి, ఎండీ యూసుఫ్, కె.శ్రీనివాస్‌రెడ్డి, నాథెట్ల రాజు ముదిరాజ్, ప్రొఫెసర్ సి.రవి, బసాని చంద్రప్రకాశ్ పాల్గొన్నారు. బోర్డు ఏర్పాటు తర్వాత ఏడోసారి భేటీ అయింది. ఐక్రాయిడ్ ఫార్ములా ఆధారంగా వేతనాల పెంపు చేపట్టాలని నిర్ణయించారు. ఐదు కేటగిరీల్లోని కార్మికుల వేతనాలను లెక్కించి రానున్న బోర్డు సమావేశంలో వాటిని పరిశీలించనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఇతర రాష్ట్రాల గెజిట్లు, వేతనాల వెయిటేజీని పరిశీలించి భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవాలని చర్చించారు.

3 ఈఎస్ఐ ఆస్పత్రులకు నోడల్ కమిటీల ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ విభాగంలోని ఈఎస్ఐ ఆస్పత్రుల్లో మందులు, ఇతర పరికరాల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోడల్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈఎస్ఐ నాచారం ఆస్పత్రితో పాటు రామచంద్రాపురం, వరంగల్ ఆస్పత్రుల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేస్తూ కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆస్పత్రికి అవసరమైన మందుల కొనుగోలు, డిస్పెన్సరీలకు పంపిణీ, ఇతర పరికరాల కొనుగోలుకు సంబంధించిన అన్ని రకాల చర్యలు ఈ నోడల్ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

సర్వీస్ బ్రేక్ కుట్ర నుంచి రక్షించండి

సీఎంకు ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగుల లేఖలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల ప్రాజెక్టు డైరెక్టర్ అన్యాయంగా వ్యవహరిస్తున్నారని, తమ సర్వీస్‌ను కోల్పోయేలా అటెండెన్స్ మార్చారని ఆ సంస్థ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఉద్యోగులు జేఏసీగా ఏర్పాటై సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్పీడ్ పోస్టు ద్వారా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో జరుగుతున్న పరిణామాలను తెలియజేస్తూ లేఖలు పంపించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఎనిమిది వందల మంది ఉద్యోగులు తమకు న్యాయం చేయాల్సిందిగా ఆ లేఖల్లో కోరారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో)కింద పనిచేస్తున్న తమకు ఉద్యోగాల విషయంలో అప్రైజల్, బాండ్ అగ్రిమెంట్‌లో అన్యాయం చేసేలా ప్రాజెక్టు డైరెక్టర్ వ్యవహరించారని లేఖలో పేర్కొన్నారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు అన్ని రాష్ట్రాలకు అప్రైజల్, బాండ్ రెన్యూవల్ ఉంటుందని, ఆ విధంగా లెటర్ పంపిస్తే తాము క్రమం తప్పకుండా విధుల్లో ఉన్నట్లు ఉంటుందని పేర్కొన్నారు. కానీ ప్రాజెక్టు డైరెక్టర్ ఒకరోజు సర్వీస్ బ్రేక్ చేసి, 30వ తేదీ వరకే విధులు నిర్వహించినట్లు చూపారని తెలిపారు.

డిగ్రీలో ఉత్తీర్ణత కోసం జేఎన్‌టీయూ వన్‌టైమ్ చాన్స్

సాక్షి, హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) అనుబంధ కాలేజీల్లో కాలవ్యవధి పూర్తి చేసుకున్నా డిగ్రీ కోర్సు పూర్తి చేయలేని విద్యార్థులకు వన్‌టైమ్ చాన్స్ కింద అవకాశం కల్పిస్తున్నట్లు జేఎన్‌టీయూ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. గడువు పూర్తయినప్పటికీ డిగ్రీ ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు అవసరమైన అన్ని సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. 2025 మే, జూన్ నెలల్లో అన్ని కోర్సుల విద్యార్థుల కోసం పరీక్షలు నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారం వర్సిటీ వెబ్‌సైట్ www.jntuh.ac.inలో ఉంది.

అమ్మకు రక్ష..



తెలంగాణ, ఏపీలో తగ్గిన ప్రసవ మరణాలు

- దక్షిణాదిలో కేరళ తర్వాత ఈ రెండు రాష్ట్రాలే
- తెలంగాణలో కేసీఆర్ కిట్, ఏపీలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఫలితం
- ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలో వెల్లడి.. ఆఫ్రికా దేశాల్లో మాతృ మరణాల రేటు ఎక్కువ

సాక్షి, హైదరాబాద్: ప్రసవం సమయంలో మాతృ మరణాల సంఖ్య (ఎంఎంఆర్)ను తగ్గించడంలో తెలంగాణ అద్భుత పనితీరు కనబరిచింది. కేరళ తరువాత దేశంలో తెలంగాణలోనే ఎంఎంఆర్ గణనీయంగా తగ్గినట్లు తేలింది. తెలంగాణ తరువాత స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉంది. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సోమవారం విడుదల చేసిన 'ట్రెండ్స్ ఇన్ మెటర్నల్ మోర్టాలిటీ' నివేదికలో ఈ విషయం వెల్లడైంది.

నివేదికలోని ముఖ్యాంశాలు

- 2023లో ప్రపంచవ్యాప్తంగా సుమారు **2,60,000** మంది మహిళలు గర్భం, ప్రసవ సంబంధిత సమస్యలతో మరణించారు. అంటే రోజుకు **700** కంటే ఎక్కువ, ప్రతి రెండు నిమిషాలకు ఒక మరణం సంభవించింది.
- మనదేశంలో ఎంఎంఆర్ తగ్గింపులో దక్షిణాదిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు మెరుగైన స్థితిలో ఉన్నాయి. ప్రతి లక్ష ప్రసవాల్లో మరణాల రేటును ఎంఎంఆర్ అంటారు.
- భారత ప్రభుత్వం విడుదల చేసిన 'స్పెషల్ బులెటిన్ ఆన్ మెటర్నల్ మోర్టాలిటీ ఇన్ ఇండియా 2018–20' ప్రకారం ఎంఎంఆర్‌ను తగ్గించడంలో దక్షిణాదిలో కేరళ మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ ఎంఎంఆర్ 19గా ఉంది. తరువాత స్థానాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి.

తెలంగాణలో ఎంఎంఆర్ 2014-16లో 92 నుంచి 2018-20 నాటికి 43కు, ఆంధ్రప్రదేశ్‌లో 74 నుంచి 45కు తగ్గింది.



తెలంగాణలో కేసీఆర్ కిట్ పథకం గర్భిణులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించిందని నివేదిక పేర్కొంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంస్థాగత ప్రసవాలు 97% వరకు పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' వంటి పథకాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంస్థాగత ప్రసవాలను (94%) పెంచడంతో పాటు ఆరోగ్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయని నివేదికలో తెలిపారు. అయినప్పటికీ ప్రసవానికి ముందు సంరక్షణ (ఏఎన్‌సీ) అందుకునే వారి సంఖ్య రెండు రాష్ట్రాల్లో తక్కువగానే ఉంది.

- డబ్ల్యూహెచ్‌ఓ నివేదిక ప్రకారం 2000 నుంచి 2023 వరకు ప్రపంచవ్యాప్తంగా మాతృ మరణాలు 40% తగ్గాయి. అయితే, 2016 తర్వాత ఈ పురోగతి తగ్గింది.
- ప్రపంచ ప్రసవ మరణాల్లో సబ్–సహారన్ ఆఫ్రికా, దక్షిణ ఆసియా ప్రాంతాల్లోనే 2023లో 87 శాతం ఉన్నాయి. వీటిలో సబ్–సహారన్ ఆఫ్రికా 70% (1,82,000), దక్షిణ ఆసియా 17% (43,000) మరణాలతో ముందున్నాయి.

2030 నాటికి ప్రపంచ ఎంఎంఆర్ 70 కంటే తక్కువకు చేరాలంటే, ప్రస్తుత తగ్గింపు రేటు పదిరెట్లు పెరగాలని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎంఎంఆర్ ఇప్పటికే 70 కంటే తక్కువగా ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సౌకర్యాలు, నైపుణ్యం కలిగిన సిబ్బంది లభ్యత, పోషకాహార లోపాలు సవాళ్లుగా ఉన్నాయి. ఏపీలోని తూర్పు గోదావరి, విజయనగరం వంటి జిల్లాల్లో ఎంఎంఆర్ రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా ఉంది. తెలంగాణలో ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి జిల్లాల్లో ఆరోగ్య సేవలు ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉందని నివేదికలో పేర్కొన్నారు.

చందుర్తిలో రెండు నెలల్లో 30కి పైగా భ్రూణహత్యలు

ఒక్కో కేసుకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు వసూలు

ఆర్ఎంపీ నిర్వాకం.. ఓ తల్లికి గర్భశోకం

చందుర్తి(వేములవాడ): లింగ నిర్ధారణ చేయడం నేరమని అధికారులు చెబుతున్నా, రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో యథేచ్ఛగా భ్రూణ హత్యలు జరుగుతున్నాయి. కొందరు ఆర్ఎంపీల క్లినిక్‌లే అడ్డాలుగా ఈ దందా సాగుతోంది. స్కానింగ్ నుంచి అబార్షన్ వరకు అంతా తామై ఆర్ఎంపీలు చూసుకుంటున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఒక్కో కేసుకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్న ఆర్ఎంపీల దందాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. చందుర్తి కేంద్రంగా పనిచేస్తున్న ఓ ప్రైవేట్ ఉద్యోగి భార్య ఏడాదిన్నర క్రితం తొలికాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆమె రెండోసారి గర్భం దాల్చగా, ఈ విషయాన్ని మండలంలోని మూడపల్లికి చెందిన ఓ ఆర్ఎంపీకి చెప్పాడు. గర్భంలో ఉన్నబిడ్డ ఆడనో, మగనో తెలుసుకోవచ్చని ఆర్ఎంపీ చెప్పగా, సదరు ఉద్యోగికి తెలుసుకోవాలన్న ఆతృత మొదలైంది. ఆర్ఎంపీని ఆశ్రయించి రూ.16 వేలకు మాట్లాడుకొని తన భార్యకు స్కానింగ్ చేయించాడు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు ఆడబిడ్డ అని చెప్పగా, అబార్షన్ చేయించాలనుకున్నాడు. దీనికి అతని భార్య ఒప్పుకోలేదు. కడుపులో ఉన్న బిడ్డ అవయవాలు సరిగ్గా ఎదగలేవని.. అవిటిగా పుడితే ఇబ్బంది పడాల్సి వస్తుందని నమ్మించాడు. అదే ఆర్ఎంపీ సహాయంతో రూ.20 వేలు ఖర్చు చేసి అబార్షన్ చేయించాడు. తీరా మగ పిల్లవాడు కావడంతో అతని మానసిక వేదనకు అంతులేకుండా పోయింది. కాగా ఈ విషయాన్ని బయటకు చెబితే ఆర్ఎంపీతోపాటు నీవు కూడా జైలుకు పోతావని మండలంలోని మరికొందరు ఆర్ఎంపీలు ఆ ప్రైవేట్ ఉద్యోగిని బ్లాక్ మెయిలింగ్ చేస్తున్నట్టు సమాచారం. ఇలాంటి సంఘటనలు రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో కోకొల్లలు. రెండు నెలల్లోనే 30కి పైగా అబార్షన్‌లు చేయించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రెండు లక్షల మంది ఏఐ ఇంజనీర్లు



తెలంగాణలో తయారుచేస్తాం

- ఎమర్జింగ్ టెక్నాలజీల హబ్‌గా తెలంగాణ.. ఏడాదిలోనే వివిధ రంగాల్లో 700 జీసీసీలు
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- మంత్రిని కలిసిన సింగపూర్ బృందం

సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్‌కు జ్ఞాపిక ఇస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి రెండు లక్షల మంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇంజినీర్లను తయారు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఎమర్జింగ్ టెక్నాలజీలకు హబ్‌గా తెలంగాణను మార్చడంతో పాటు రాష్ట్రంలోని యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ, ఏఐ యూనివర్సిటీని నిర్మిస్తున్నామని వారికి మంత్రి వివరించారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు హైదరాబాద్ కీలక కేంద్రంగా మారుతోందన్నారు. ఏడాది వ్యవధిలోనే ఐటీ, ఆతిథ్యం, ఇతర రంగాలకు చెందిన 70 జీసీసీలు ప్రారంభమయ్యాయని వివరించారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలపై సింగపూర్ పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సింగపూర్ కాన్సుల్ వైష్ణవి వాసుదేవన్, ఫస్ట్ సెక్రటరీ (ఎకానమిక్) వివేక్ రఘురామన్, ఎంటర్‌ప్రైజ్ సింగపూర్ రీజనల్ డైరెక్టర్ (ఇండియా సౌత్) డేనిస్ టామ్ పాల్గొన్నారు.

అత్యుత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దుతాం

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అన్ని రంగాల్లో అత్యుత్తమ నైపుణ్యం గల మానవ వనరులుగా తీర్చి దిద్దుతామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సోమవారం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ)లో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణాన్ని శ్రీధర్‌బాబు పరిశీలించారు. అనంతరం యూనివర్సిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ యువతలో ప్రతిభకు కొదవ లేదని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మెరుగైన నైపుణ్య శిక్షణ అందిస్తే సరిపోతుందని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సుల రూపకల్పన చేయాలని, అధిక డిమాండ్ ఉన్న కోర్సులపై దృష్టి సారించాలని సూచించారు.

గురుకుల ప్రవేశాలకు ముందస్తు ప్రణాళిక

- మే నెలాఖరులోనే అడ్మిషన్లు పూర్తి చేసేలా సొసైటీల చర్యలు
- ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్ అప్లికేషన్లు షురూ.. డిగ్రీ ప్రవేశాలకూ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ప్రవేశాల ప్రక్రియను వేగంగా పూర్తిచేసేలా గురుకుల సొసైటీలు చర్యలు తీసుకుంటున్నాయి. గురుకుల అధికారులు ఐదోతరగతితో పాటు 6,7,8,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంతో పాటు డిగ్రీ మొదటి సంవత్సరం సీట్ల భర్తీకి వేర్వేరు నోటిఫికేషన్లతో అర్హత పరీక్షలు నిర్వహించి మెరిట్ అభ్యర్థులకు సీట్లు కేటాయించనున్నారు. సాధారణంగా జూన్ 12 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండగా.. ఆగస్టు వరకు అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. కాగా, అడ్మిషన్ల ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగడం వల్ల బోధన, అభ్యసన కార్యక్రమాల్లో జాప్యం జరుగుతుండడంతో ఈసారి ముందస్తుగా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టేలా గురుకుల సొసైటీలు కార్యాచరణ సిద్ధం చేసుకున్నాయి. మే నెలాఖరు కల్లా వీలయినంత మేర అడ్మిషన్లు పూర్తి చేసేలా ప్రణాళిక తయారు చేశాయి. ఇందులో భాగంగా ఐదోతరగతి ప్రవేశాల ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించాయి. గతేడాది వరకు ఐదోతరగతి ప్రవేశాలను సెప్టెంబర్ వరకు నిర్వహించారు. కానీ 2025–26 విద్యా సంవత్సరం నుంచి మాత్రం పాఠశాలలు తెరిచే నాటికే అడ్మిషన్లు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే ఐదోతరగతి ప్రవేశాలకు అర్హత పరీక్ష నిర్వహించిన అధికారులు.. ఫలితాలు కూడా విడుదల చేసి తొలివిడత జాబితా ప్రకటించారు. అర్హత పొందిన విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల మొదటి వారంలోగా మొదటి విడత అడ్మిషన్లు పూర్తి చేసి.. నెలాఖరు కల్లా పూర్తిస్థాయిలో అడ్మిషన్లు చేపట్టనున్నారు. అదేవిధంగా బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ సైతం మే నెలలోనే నిర్వహించనున్నారు.

టెన్త్ ఫలితాలు రాగానే..

టెన్త్ ఫలితాలు రాగానే జూనియర్ కాలేజీల్లో ఫస్టియర్ అడ్మిషన్లకు సంబంధించి ప్రక్రియను ప్రారంభిస్తారు. గురుకులాల్లో పదోతరగతి చదివిన వారికి నేరుగా ఇంటర్‌లో అడ్మిషన్ ఇస్తారు. అదేవిధంగా ఇతరులకు అవకాశం ఇచ్చేందుకుగాను సొసైటీలు ఇప్పటికే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించాయి. మే నెలాఖరు కల్లా ఇంటర్ ప్రవేశాలు సైతం పూర్తి చేయనున్నారు. డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను మాత్రం జూన్ నెలాఖరు కల్లా పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఇంటర్ ఫలితాలతో పాటు జనరల్ డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియకు గురుకుల డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ముడి పడి ఉండడంతో సమన్వయం చేసుకుంటూ అడ్మిషన్లు చేపట్టనున్నారు.



మండు వేసవిలో మత్తడి దూకుతున్న చెరువు

శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన కందికుంట చెరువు పూర్తిస్థాయిలో నిండి మత్తడి దూకుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో భారీ అకాల వర్షం కురవడంతో ఆ నీరంతా మూసీనది ద్వారా యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ వద్ద నిర్మితమై ఉన్న హెడ్ రెగ్యులేటర్ నుంచి శాలిగౌరారం మండలంలోని వివిధ చెరువులకు చేరుతోంది. శాలిగౌరారం మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లి కందికుంట చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు (మత్తడి) పోస్తోంది. మండే వేసవిలోనూ చెరువు అలుగుపోస్తూ చూపరులకు ఆహ్లాదం పంచుతోంది.

రెండ్రోజులు తేలికపాటి వానలు

- ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు
- రెండు రోజులు ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రానున్న రెండు రోజులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు, ఒకట్రెండు చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా బలపడి సోమవారం ఉదయానికి దక్షిణ బంగాళా ఖాతం మధ్య ప్రాంతంలో అల్పపీడనంగా మారింది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల చక్రవాత ఆవర్తనం సముద్రమట్టం నుంచి సగటున 5.8 కి.మీ. ఎత్తువరకు విస్తరించింది. రానున్న 24 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో వాయవ్య దిశ నుంచి ఉత్తర దిశవైపు, ఆ తర్వాత 48 గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతానికి చేరుకుంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావం తెలంగాణలో పెద్దగా ఉండదని చెప్పింది. ప్రస్తుతం తూర్పు బిహార్ నుంచి ఈశాన్య జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఉత్తర తెలంగాణ ఉపరితల ద్రోణి ఏర్పడింది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 1.5 కి.మీ. ఎత్తు వరకు ఉంది. మరోవైపు ఉత్తర మధ్య మహారాష్ట్ర నుంచి ఉత్తర అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 0.9 కి.మీ. ఎత్తులో ఉంది. వీటి ప్రభావంతో రానున్న 2 రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా ఉత్తర ప్రాంత జిల్లాల్లో ఈ వర్షాలు నమోదు కావొచ్చని, ఒకట్రెండు చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

పెరగనున్న ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. వాతావరణంలో నెలకొన్న మార్పులతో గతవారం గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టగా... సోమవారం పెరిగాయి. రానున్న 2 రోజులు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. సోమవారం చాలా చోట్ల గరిష్ట ఉష్ణోగ్రత 1–3 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదైంది. రానున్న రెండు రోజులు కూడా ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు ఆ శాఖ తెలిపింది.

సోమవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

నిజామాబాద్	42.5
ఆదిలాబాద్	42.3
మెదక్	39.6
మహబూబ్‌నగర్	39.0
భద్రాచలం	39.0
రామగుండం	39.0
ఖమ్మం	38.8
హనుమకొండ	38.5
నల్లగొండ	38.0
హైదరాబాద్	37.7

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

దండకారణ్యంలో శాంతి సాధ్యమేనా?

- చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టుల లేఖ
- ఆపరేషన్ కగార్ ఆపేస్తే.. కాల్పుల విరమణకు ఓకే అని ప్రకటన
- మావోల ప్రతిపాదనపై మల్లగుల్లాలు పడుతున్న భద్రతాదళాలు ?
- కీలక నేతలు సరెండర్ అయితేనే చర్చలంటూ షరతు !



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు సెంట్రల్ కమిటీ తరఫున అభయ్ పేరుతో లేఖ విడుదలైన నేపథ్యంలో..దండకారణ్యంలో శాంతి సాధ్యమేనా అన్న చర్చ మొదలైంది. ఆపరేషన్ కగార్ ఆపేసి, విప్లవోద్యమ ప్రాంతాల్లో కొత్తగా భద్రతా బలగాలు క్యాంపులు ఏర్పాటు చేయకపోతే తాము కాల్పుల విరమణ పాటిస్తామని మావోయిస్టులు ఆ లేఖలో పేర్కొన్న విషయం తెలిసిందే. ప్రకటన వెలువడి ఐదు రోజులైనా, ఇటు కేంద్రంగానీ, అటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదు. విశ్వసనీయవర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో పాల్గొంటున్న భద్రతాదళాలు శాంతి చర్చల ప్రతిపాదన పట్ల అంత సానుకూలంగా లేనట్టు తెలుస్తోంది. ఒకవేళ శాంతి చర్చలకు వెళ్లాల్సి వస్తే మావోయిస్టులకు కొన్ని షరతులు విధించాలని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం.

తీవ్ర నిర్బంధంతో..

ఆపరేషన్ కగార్ తర్వాత పెద్ద సంఖ్యలో మావోయిస్టులు చనిపోవడం, వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లే సప్లై చైన్లు చెల్లాచెదురయ్యాయి. పైగా మావోలకు మద్దతుగా నిలిచిన వర్గాల నుంచి లొంగుబాట్లు, అరెస్టులు పెరిగాయి. చివరకు అనారోగ్యంతో ఉన్న సీనియర్ కామ్రేడ్లకు వైద్య చికిత్స అందించడం కూడా కష్టంగా మారింది. దీంతో శాంతి చర్చలకు మావోలు సై అన్నట్టు తెలుస్తోంది. రెండేళ్లుగా బస్తర్ అడవుల్లో మావోలపై భద్రతాదళాలు పైచేయి సాధిస్తున్నాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్టు 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులు లేకుండా చేయడం ఖాయమని భద్రతా దళాలు విశ్వసించే స్థాయికి చేరుకున్నాయి. ఆయుధాలు వీడటం తప్ప మరో మార్గం లేదంటూ అమిత్‌షా పలుమార్లు హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. ఈ తరుణంలో మావోయిస్టులు శాంతి చర్చల కోసం కాల్పుల విరమణ ప్రతిపాదన తీసుకురావడం ప్రభుత్వ వర్గాలను ఆలోచనలో పడేసింది.

'ఖాకీ'షరతులు

- యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్ చేపడుతున్న భద్రతాదళాలను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టు మిలటరీ వింగ్ అయిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ అనేకసార్లు దాడులు చేసింది.
- చింతల్నార్ ఘటనలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు, రెండేళ్ల క్రితం జరిగిన తెర్రం దాడిలో 22 మంది జవాన్లు చనిపోయారు.
- ఈ ఏడాది ఆరంభంలో డీఆర్‌జీ కాన్వాయ్ లక్ష్యంగా ఐఈడీ పేల్చడంతో 8 మంది జవాన్లు చనిపోయారు. దీనికి ముందు వెనుకా పదిసార్లకు పైగా భద్రతాదళాల క్యాంపుల మీదకు వందలాదిగా మావోలు దండెత్తి వచ్చారు.
- ఎప్పుడు ఏ వైపు నుంచి దాడి జరుగుతుందో అని కంటి మీద కునుకు లేకుండా భద్రతా దళాలు అప్రమత్తంగా ఉంటూ వస్తున్నాయి. ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్లు ఎదుర్కొంటూ పోరాటం చివరిదశకు చేరుకుంది అనే తరుణంలో శాంతి చర్చలు ఎందుకనే అభిప్రాయాన్ని పోలీసులు, భద్రతా దళాలు వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది.
- ఒకవేళ చర్చలకు వెళ్లాల్సి వస్తే దాడుల వ్యూహకర్తలుగా పేర్కొనే పీఎల్‌జీఏ కంపెనీ వన్ కమాండ్ హిడ్మా మడావితోపాటు మరో ఇద్దరు మావోయిస్టు అగ్రనేతలు తమకు సరెండర్ కావాలనే ప్రతిపాదనను పోలీసులు తెస్తున్నట్టు తెలుస్తోంది.

సంఘాలపై బాధ్యత..

శాంతి చర్చల విషయంలో ప్రభుత్వం/పోలీసులు తెస్తున్న కొత్త ప్రతిపాదన మావోలకు సైతం చేరిందని, అందువల్లే శాంతి చర్చలకు ప్రభుత్వంపై మేధావులు, రచయితలు, పలు సంఘాల నాయకులు ఒత్తిడి తేవాలంటూ బహిరంగ లేఖను జారీ చేసినట్టు సమాచారం.





'కళ'క్టరేట్

పెద్దపల్లి రూరల్: మెయిన్ గేట్ దాటి లోనికి వెళ్లగానే గుబాళించే రంగురంగుల పూల పరిమళాలు.. ఆహ్లాదం పంచే పచ్చనిచెట్లు.. అల్లుకున్న తీగజాతి మొక్కలు.. సుమారు 22 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో విస్తరించిన పెద్దపల్లి కలెక్టరేట్ అందాలు అద్భుతం. చూస్తేగానీ తనివి తీరదు. ఇందులో రాయల్‌పామ్, ఫ్లామినియా, సైకస్ గ్రీన్, అలమంద, క్యాన తదితర ఆకర్షణీయ, నందివర్ధన, వెరిమెర, గోల్డెన్ ధ్రువ తదితర పూలరకాలు.. నీడనిచ్చే, పండ్లచెట్లు సీతాఫలం, అల్లనేరేడు, జామ, సపోట, మామిడి, పనస, చింత, వేప చెట్లు.. పచ్చదనం పరిచే గడ్డి తదితర సుమారు రెండు వేలకు పైగా మొక్కలు, చెట్లు హైలైట్‌గా నిలుస్తున్నాయి. వీటికోసం 2017–18లో సుమారు రూ.1.30 కోట్లకు పైగా వెచ్చించారు. అయితే, అందంగా కనిపించడం, ఆహ్లాదం, పచ్చదనం పంచడం, సువాసనలు వెదజల్లడం, నీడనివ్వడంతోపాటు నిర్వహణ తీరులో తెలంగాణ రాష్ట్రంలోనే సిద్దిపేట తర్వాత పెద్దపల్లి కలెక్టరేట్ అగ్రస్థానంలో నిలుస్తోంది.





'గూడుకట్టుకున్న' అందం



చెట్లకొమ్మలపై సామూహికంగా వలలు కట్టి నివసించే కీటకాలివి. వేసవి చివరలో చెట్లకొమ్మలపై గూళ్ల మాదిరిగా (వెబ్‌వార్మ్) అల్లుకుపోతాయి. అందులో గుడ్లు పెట్టి అంగుళం పొడవున స్రావంతో ఆ చెట్లను కప్పేస్తాయి. అయితే తెగుళ్లుగా భావించినా చెట్లకు వీటితో ఎలాంటి అపాయమూ ఉండదని ఉద్యానవన శాఖ అధికారులు అంటున్నారు. టెంట్ గొంగళి పురుగులుగా పిలిచే ఈ కీటకాలు చెట్లఆకులను తింటూ డేరా లాంటి వెబ్‌ను సృష్టించి గుడ్లు పొదిగే వరకూ రక్షణ కవచాన్ని ఏర్పరుస్తాయి. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రాజీవ్‌రహదారిపై ఓ మొక్క వెబ్‌వార్మ్‌తో అల్లుకుపోయి 'సాక్షి'కెమెరాకు ఇలా కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



సోమవారం రవీంద్రభారతిలో జరిగిన మొట్టమొదటి ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ థియేటర్ ఫెస్టివల్‌లో చిన్నారుల ప్రదర్శన


పాత పార్లమెంటులో లక్కీషా బంజారా విగ్రహం పెట్టాలి

కాంగ్రెస్ నేత రవీంద్రనాయక్ డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: పాత పార్లమెంట్ భవనంలో 125 అడుగుల లక్కీషా బంజారా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నేత రవీంద్రనాయక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీ రైసినా హిల్స్‌లో ఉన్న 350 ఆస్తులు లక్కీషా బంజారాకి చెందినవే అని ఆయన గుర్తుచేశారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్కీషా బంజారాకు అనేక భూములు, ఆస్తులు ఉన్నాయని, బంజారాల భూముల పరిరక్షణ కోసం హెరిటేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలో 16 వర్గాలుగా ఉన్న బంజారాలను ఒకే జాతిగా గుర్తించాలన్నారు. బంజారా భాషను షెడ్యూల్ 8లో చేర్చాలని ఆయన ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. బంజారా భాషను రాజ్యాంగంలో చేర్చాలని కోరుతూ, అసెంబ్లీలో తీర్మానం చేసినందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జగిత్యాలకు ఐకాన్ ఈ 'ఖిల్లా'

వందల ఏళ్లయినా ఇప్పటికీ చెక్కు చెదరని కోట
వంద ఫిరంగులకు పైగానే ఏర్పాటు
శత్రువుల దాడి నుంచి తట్టుకునేందుకు లోతైన కందకం




జగిత్యాల ఖిల్లా ముఖద్వారం






ఖిల్లాలో వరుసగా ఏర్పాటు చేసిన ఫిరంగులు, చెక్కు చెదరని ఫిరంగి



లోపల ముఖద్వారం





ఖిల్లాలోని కందకాలు



నక్షత్రాకారంలో ఖిల్లా


జగిత్యాల: ఈ ఖిల్లా జగిత్యాలకే ఐకాన్. దాదాపు 20 ఎకరాల స్థలంలో ఫ్రెంచ్ ఇంజనీర్ల పర్యవేక్షణలో ఈ కోటను నిర్మించినట్లు చెబుతుంటారు. నక్షత్రాకారంలో నిర్మించిన ఈ కోట చుట్టూ కందకాలను తవ్వారు. శత్రువులు కోటపై దాడిచేస్తే అడ్డుకునేందుకు దాదాపు వందకు పైగా ఫిరంగులు ఏర్పాటు చేశారు. సైనికుల కోసం ప్రత్యేక గదులు, అలాగే ఫిరంగులు, ఆయుధాల నిల్వ కోసం కూడా ప్రత్యేకమైన గదులు, తాగునీటి కోసం నిర్మించిన బావి, కోనేరు సైతం ఇందులో ఉన్నాయి. దాదాపు మూడు వందల సంవత్సరాలు గడుస్తున్నా ఈ కోట ఇంకా చెక్కు చెదరకుండా ఉంది. 1930 వరకు జగిత్యాల రెవెన్యూ కార్యాలయాలు ఈ కోటలోనే ఉండేవని చెబుతుంటారు. ఎలగందుల కోట పాలకులైన జుల్‌ముల్క్ జాఫరుద్దౌలా, మీర్జా ఇబ్రహీం ఖాన్‌లు ఈ కోటను నిర్మించినట్లు చెబుతుంటారు. ఫ్రెంచ్ ఇంజనీర్లు దీనిని ప్రత్యేకంగా నిర్మించారు. దీనిని పైనుంచి చూస్తే తప్ప ఇది నక్షత్రాకారంలో ఉన్నట్లు తెలియదు.

చెక్కుచెదరని గోడలు.. కందకాలు..

వందల సంవత్సరాల కిందట నిర్మించిన ఈ ఖిల్లా ముఖద్వారం గానీ, సైనికుల కోసం ఏర్పాటు చేసిన గదులు గానీ ఇప్పటికీ చెక్కు చెదరలేదు. శత్రువులు కోటలోనికి రావాలంటే లోతైన ఆ కందకాన్ని దాటి రావాల్సి ఉంటుంది. అప్పట్లో ఆ కందకంలో మొసళ్లను కూడా పెంచేవారని చెబుతుంటారు. సైనికులు రాకపోకలు సాగించడానికి కొన్ని చోట్ల కందకాల వద్ద చెక్క తలుపులు ఉండేవి. అవసరం ఉన్నప్పుడు వారు బయటకు వెళ్లేవారు. కోటలో ఏనుగులు కూడా ఉండేవని చెబుతుంటారు. అలాగే ఇప్పటికీ ప్లస్ ఆకారంలో నిర్మించిన కోనేరులో ఎంత ఎండలు మండినా నీరు ఎండిపోదు. ఈ కోట నుంచి ఒక సొరంగం కరీంనగర్ జిల్లాలోని ఎలగందుల కోటకు సైతం వెళ్తుందని చరిత్రకారులు చెబుతుంటారు.

పట్టించుకోని పురావస్తు శాఖ..

ఈ ఖిల్లాను అభివృద్ధి చేస్తే మంచి పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. పురావస్తు శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. జగిత్యాల జిల్లాగా ఏర్పాటైన అనంతరం అప్పటి కలెక్టర్ శరత్.. జగిత్యాల ఖిల్లాలోనే స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో ఖిల్లాకు పూర్వ వైభవం వచ్చింది. ఈ వేడుకలకు ఖిల్లాను పూలు, మొక్కలతో ఎంతో అందంగా తీర్చిదిద్దేవారు. అయితే కరోనా వచ్చినప్పటి నుంచి వేడుకలను ఇందులో నిర్వహించడం బంద్ చేశారు. మళ్లీ ఖిల్లా పూర్వ వైభవం కోల్పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దానిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.



సొరంగమార్గం





సైనికులు ఉండే ప్రత్యేక గదులు



ఖిల్లాలో స్వాతంత్య్ర వేడుకలు (ఫైల్)

వేసవి సాగు పంటలకు ఈ-పంట నమోదు

వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు వెల్లడి

సాక్షి, అమరావతి: రబీ తర్వాత వేసే మినుము, పెసర తదితర వేసవి పంటలను ఈ-పంట ద్వారా నమోదు చేయాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకుడు ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ - పంట నమోదు.. వేసవి పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనాలు, సాగు విధానంలో వరుస పంటల సరళిపై అధ్యయనానికి, గణాంకాల సేకరణకు దోహద పడుతుందని తెలిపారు. వేసవి పంటల సాగు ద్వారా నేలలోని తేమ, పోషకాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవచ్చునని పేర్కొన్నారు.

ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్


సాక్షి, అమరావతి: విదేశాల్లో ఉంటూ స్వగ్రామంలో స్థిరాస్తి, ఇతర ఆర్థిక లావాదేవీల సమస్యలను ఎదుర్కొంటున్న ప్రవాసాంధ్రుల కోసం ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తూ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు.తహసీల్దార్ స్థాయి అధికారి, అలాగే జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐ లేదా సీఐ స్థాయి అధికారులతో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించడమే లక్ష్యంగా సింగిల్ విండో విధానం ఏర్పాటు చేయాలని ప్రవాసాంధ్ర తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్టీఎస్) చేసిన విజ్ఞప్తికి అనుగుణంగా ఈ సెల్ ఏర్పాటయ్యింది. ఇందులో భాగంగా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ వెసులుబాటు కల్పిస్తారు.

రిటైనింగ్ వాల్ పనులకు ఆమోదం

సాక్షి, అమరావతి: నాగార్జునసాగర్ ఎడమ కాలువలో అంతర్భాగమైన వేంపాడు మేజర్ బ్రాంచ్ కెనాల్‌లో 97.750 కిలోమీటర్ల నుంచి 101.950 కిలోమీటర్ల వరకు రూ.44.60 కోట్లతో నిర్మించిన రిటైనింగ్ వాల్ పనులను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

విశాఖ ఉక్కు ఉత్పత్తులకు మార్కెట్‌లో ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. వినియోగదారులు విశాఖ ఉక్కు బ్రాండ్‌ను విశ్వసించి కొనుగోలు చేయడానికి ప్రధాన కారణం ఆ కంపెనీ బ్రాండ్ ఇమేజ్. స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తులపై లోగో ముద్రణ వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. ఉక్కు ఉత్పత్తుల తయారీలో రోల్స్ కీలక పాత్ర పోషిస్తాయి. ఈ రోల్స్‌పైనే వైజాగ్ స్టీల్ టీఎంటీ ముద్రను వేస్తారు. రీబార్స్, రౌండ్స్, యాంగిల్స్, చానల్స్, బీమ్స్ వంటి వివిధ ఉత్పత్తులపై 6 ఎం.ఎం నుంచి 36 ఎం.ఎం. వరకు వివిధ పరిమాణాల్లో ఈ బ్రాండింగ్ ప్రక్రియ జరుగుతుంది. మొదట్లో పెద్ద సైజు నంబర్ పంచ్ అనే సాధనంతో బ్రాండింగ్ చేసేవారు. 2002 తర్వాత నేరుగా ఉత్పత్తి మీద ముద్రపడేలా ఏర్పాట్లు చేశారు. – ఉక్కునగరం

ఇదీ సార్.. వైజాగ్ స్టీల్ బ్రాండ్



స్టీల్‌ప్లాంట్‌లో వైర్ రాడ్ కాయిల్స్ తయారీ

నాణ్యమైన ఉక్కు ఉత్పత్తులు స్టీల్‌ప్లాంట్‌కే సొంతం

6 నుంచి 36 మి.మీ వరకు రీబార్స్, చానల్స్, ఐబీమ్స్‌కు రోల్స్ తయారీ ఇక్కడే..

- ప్రతి ఉత్పత్తిపై వైజాగ్ స్టీల్ టీఎంటీ ముద్ర
- 2002 నుంచి బ్రాండ్ మార్క్‌తో మార్కెట్‌లోకి ఉత్పత్తులు

ఉత్పత్తుల మార్కెటింగ్‌లో ప్రధాన భూమిక వహించేది బ్రాండ్ ఇమేజ్. బ్రాండ్‌ను చూసే వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేస్తారనేది విశ్వజనీనం. అందుకే ప్రతీ సంస్థ తమ ఉత్పత్తుల నాణ్యతతో పాటు బ్రాండ్ ఇమేజ్‌కు అధిక ప్రాధాన్యమిస్తాయి. దేశీయ ఉక్కు పరిశ్రమలో తమ బ్రాండ్‌ను ముద్రించడంలో విశాఖ ఉక్కు కర్మాగారం తనదైన ప్రత్యేకత కలిగి ఉంది. అలాగే మార్కెట్‌లో ప్రతిష్ట కలిగి ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు.

స్టీల్‌ప్లాంట్ తుది ఉత్పత్తులు రోలింగ్ మిల్స్ విభాగాలైన లైట్ అండ్ మీడియం మర్చంట్ మిల్(ఎల్.ఎం.ఎం.ఎం), మీడియం మర్చంట్ అండ్ స్ట్రక్చరల్ మిల్(ఎం.ఎం.ఎస్.ఎం), వైర్ రాడ్ మిల్స్(డబ్ల్యూ.ఆర్.ఎం), స్పెషల్ బార్ మిల్(ఎస్.బి.ఎం), వైర్ రాడ్ మిల్(డబ్ల్యూఆర్ఎం)-2, స్ట్రక్చరల్ మిల్ (ఎస్టీఎం)లలో తయారవుతాయి. ఆయా విభాగాల్లో రీబార్స్, రౌండ్స్, యాంగిల్స్, చానల్స్, బీమ్స్ తదితర వస్తువులను ఉత్పత్తి చేస్తారు. ఆ ఉత్పత్తుల తయారీకి అవసరమైన గైడ్‌ల తయారీని రోల్ షాప్ అండ్ రిపేర్ షాప్(ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్) విభాగం చేపడుతుంది. 6 మిల్లీమీటర్ల వ్యాసం నుంచి 36 మిల్లీమీటర్ల వరకు ఉన్న రీబార్లు, చానల్స్, ఐబీమ్స్‌లకు రోలింగ్ అవసరమైన రోల్స్‌ను ఇక్కడే తయారు చేస్తారు. నిర్ణీత పరిమాణంలో ఆ రోల్స్‌ను సిద్ధం చేసిన తర్వాత, దానిపై విశాఖ ఉక్కుకు ప్రతిష్టగా నిలిచే వైజాగ్ స్టీల్ టీఎంటీ(థర్మో మెకానికల్ ట్రీట్‌మెంట్) ముద్రను ముద్రిస్తారు.

కీలక విభాగాలకు రోల్స్ తరలింపు

కర్మాగారంలో తయారయ్యే ఉత్పత్తులపై ముద్ర వేసేందుకు సిద్ధం చేసిన రోల్స్‌ను ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్-1, 2 విభాగాల నుంచి ఉత్పత్తులు తయారయ్యే మిల్స్ విభాగాలకు సరఫరా చేస్తారు. అక్కడ తయారవుతున్న ఉత్పత్తులపై విశాఖ ఉక్కు లోగో అయిన వైజాగ్ స్టీల్, విశాఖ ఉక్కు వంటి లోగోలను ముద్రిస్తారు.

నకిలీకు ఆస్కారం లేకుండా..

జాతీయ, అంతర్జాతీయ విపణిలో విశాఖ ఉక్కు ఉత్పత్తులకు ఉన్న గిరాకీని బట్టి తరచూ నకిలీ ఉత్పత్తులు తయారవుతున్నట్లు యాజమాన్యం గుర్తించింది. దీంతో ఎక్కడా డూప్లికేటింగ్ జరగకుండా బ్రాండింగ్ చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఇప్పుడు ఉత్పత్తి గ్రేడును కూడా తెలిపే విధంగా ఎంతో సాంకేతిక పరిజ్ఞానంతో ఈ బ్రాండింగ్ చేస్తున్నారు. వైజాగ్ టీఎంటీ 500డి, వైజాగ్ టీఎంటీ హెచ్‌సీఆర్‌డీ అనేవి ఇప్పటి వరకు ముద్రిస్తూ వచ్చారు. కొత్తగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వైజాగ్ టీఎంటీ ఎఫ్ఈ 550డి, 500డి 6686 59, 8568 66 అనే బ్రాండ్ నంబర్లు ముద్రించడం ఇటీవల ప్రారంభించారు. 16ఎంఎం నుంచి 36 ఎంఎం వరకు ఉన్న సైజు ఊచలపై, రైల్వే సంస్థకు పంపే ఉత్పత్తులపై హెచ్‌సీఆర్‌డీ(హై కరోజన్ రెసిస్టెంట్ డక్టైల్)ను ముద్రిస్తున్నారు. రోలింగ్ మిల్స్‌లో ఆయా ఉత్పత్తులపై బ్రాండింగ్ చేయడంలో ఉక్కు ఉద్యోగుల పనితీరు ప్రశంసనీయం.



లోగో ఎలా ముద్రిస్తారంటే?

రోల్స్‌ను సీఎన్‌సీ లేత్ మిషన్ మీద కావాల్సిన పరిమాణంలో గాడి(గ్రూవ్స్) చేసి, గ్రూవ్స్‌లో రీబార్ నాచ్ చేసి అనంతరం స్పార్కోనిక్స్ బ్రాండింగ్ మిషన్ మీదకు రోల్‌ను ఎక్కిస్తారు. స్పార్కోనిక్స్ బ్రాండింగ్ మిషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (పుణే) సరఫరా చేసిన ఈ మిషన్‌ను కంప్యూటర్ ద్వారా అనుసంధానం చేస్తారు. తద్వారా రోల్ మీద సుమారు 1.3 ఎం.ఎం నుంచి 1.9 ఎం.ఎం లోతులో అక్షరం ముద్ర పడుతుంది. అలా ఒక్కో అక్షరం ముద్రిస్తారు. కొన్ని సందర్భాల్లో నాలుగైదు అక్షరాలను ముద్రించే అవకాశం ఉన్నట్లు మిషన్ ఆపరేటర్ తెలిపారు. ఇక్కడ 16 ఎం.ఎం రీబార్ నుంచి 36 ఎం.ఎం రీబార్ వరకు బ్రాండింగ్ చేస్తారు. ఒక్కో రోల్‌కు సుమారు 5 గంటల సమయం, ఇటీవల మార్చిన లోగోకు 6-7 గంటలు పడుతోందని ఉద్యోగులు తెలిపారు. అదే విధంగా చానల్స్, యాంగిల్స్ మీద కూడా ముద్రిస్తారు.

బ్రాండింగ్ ఎలా పారంభమైంది?




సీఎన్‌సీ మిషన్‌పై నాచ్ తయారీ

విశాఖ ఉక్కు ఉత్పత్తులను మొదట్లో ఇతర కంపెనీల ఉత్పత్తుల్లాగే మార్కెట్‌లో అమ్మేవారు. ఇతర ఉత్పత్తుల్లో విశాఖ ఉక్కు ఉత్పత్తులను వినియోగదారులు గుర్తించడం కష్టంగా ఉండేది. దీంతో అప్పటి సీఎండీ శివసాగర్‌రావు ఏదైనా గుర్తు ఉంటే బాగుంటుందని ఆలోచించి.. రీబార్స్ మధ్యలో ఆంగ్ల అక్షరం 'వి'ఉండేలా చేశారు. అది ఎంతో కష్టపడితే తప్ప స్పష్టంగా కనిపించేది కాదు. ఆ తర్వాత, ఉత్పత్తులపై ప్రారంభంలో బ్రాండింగ్ కోసం పెద్ద సైజు నంబర్ పంచ్ అనే సాధనంతో 'వైజాగ్ స్టీల్'అని కొట్టేవారు. ఇది చాలా శ్రమతో కూడుకున్న పని. అన్ని ఉత్పత్తుల మీద ముద్రించాలంటే ఎక్కువ శ్రమ, సమయం పట్టేది. 2002 తర్వాత నేరుగా ఉత్పత్తి మీద ముద్రపడేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.



రోల్‌పై ముద్రలు తయారీ



- చాలామందికి సమస్యగా మారిన నిద్రలేమి
- వేధిస్తున్న మానసిక సమస్యలు
- సమస్య జటిలంగా ఉందంటోన్న నిపుణులు
- జీవనశైలి మార్చుకోవడం మినహా మరో మార్గం లేదని వెల్లడి

డబ్ల్యూహెచ్ఓ సూచనల మేరకు వయసు వారీగా అవసరమైన నిద్ర ఇలా..

వయసు	రోజుకు నిద్ర (గంటలు)
4-12 నెలలు	12-16
1-2 ఏళ్లు	11-14
3-5	10-13
6-12	9-12
13-18	8-10
18 ఏళ్లు నిండితే	7 గంటలు తగ్గకుండా..



నిద్ర పట్టట్లేదు.. బ్రో

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రకరకాల వ్యసనాలు ప్రజలను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. కష్టపడి నాలుగు డబ్బులు సంపాదించినా రకరకాల ఒత్తిళ్లు, రుగ్మతలతో రాత్రి ఒంటిగంట దాటినా నిద్ర పట్టడం లేదు. యాభై ఐదేళ్లు దాటిన వారి సంగతి అటుంచితే నిండా ముప్పై కూడా లేని కుర్రాళ్లు కూడా ఇబ్బంది పడుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

30– 40 ఏళ్ల వారిలో ఎక్కువ..

వాస్తవానికి యువకులకు నిద్రలేమి ఉండకూడదు. కానీ మొబైల్ వ్యసనం, బెట్టింగ్‌లు, ఆర్థిక పరిస్థితులు, ఆల్కహాల్, ఉద్యోగాల్లో ఒత్తిడి వెరసి రాత్రి పొద్దు పోయే వరకూ నిద్ర ఉండటం లేదు. మొబైల్‌కు అతుక్కుపోతుండటం అతిపెద్ద సమస్యగా మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 8 లక్షల మందికి పైగా ముప్పై ఏళ్లలోపు యువత చేతుల్లో ఆండ్రాయిడ్ ఫోన్‌లు ఉన్నట్టు అంచనా. సామాజిక మాధ్యమాల్లో గంటల కొద్దీ ఉండిపోతూ సమయం సంగతే మరిచిపోయిన పరిస్థితి. దీంతో నలభై ఏళ్లు దాటే లోపే జీవనశైలి జబ్బుల బారిన పడుతున్నట్టు తేలింది. 30 నుంచి 40 ఏళ్లలోపు వారికి నిద్రలేమి సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఇటీవల నిర్వహించిన ఓ పరిశీలనలో వెల్లడైంది.



నిద్రలేమితో వచ్చే సమస్యలు

- హైపర్ టెన్షన్ (రక్తపోటు)
- ఒత్తిడి పెరిగి మధుమేహం
- మతిమరుపు
- గుండె సంబంధిత సమస్యలు
- ఊబకాయం
- మెదడుపై ఒత్తిడి పెరిగి బ్రెయిన్ స్ట్రోక్

జీవనశైలి మార్చుకోవాలి

నిద్రలేమితో బాధపడుతున్న వారు వ్యసనాలను వదులుకోవాలి. జీవనశైలిని మార్చుకుంటేనే పరిష్కారం లభిస్తుంది. వేళకు తినడం, సమయానికి పడుకోవడం, మొబైల్ వినియోగం తగ్గించడం, రోజూ వ్యాయామం వంటివే దీనికి సరైన మందు. ఒక దశ వరకూ నిద్రలేమికి మందులు ఓకే గానీ, మోతాదు మించి వాడకూడదు. దైనందిన జీవితంలో మార్పులు చేసుకుంటే ఫలితం ఉంటుంది.

–డా.జాషువా కాలెబ్, న్యూరో ఫిజీషియన్



60 శాతం మందిలో సమస్య

నిద్రలేమిని వైద్య పరిభాషలో 'స్లీప్ డిప్రెషన్' అంటాం. దీన్ని చాలామంది గుర్తించడం లేదు. సకాలంలో గుర్తించి డాక్టర్ కౌన్సెలింగ్ తీసుకుంటే నియంత్రించవచ్చు. దీర్ఘకాలంగా ఇలా స్లీప్ డిప్రెషన్‌లో ఉంటే పనిచేసే సామర్థ్యం కోల్పోతారు. కుటుంబ, ఆర్థిక, ఉద్యోగ ఒత్తిళ్లతో స్లీప్ డిప్రెషన్ వస్తుంది. 60 శాతం మందిలో ఈ సమస్య కనిపిస్తోంది. ఇది అత్యంత ప్రమాదకర పరిస్థితి. మొబైల్‌ను వీలైనంతగా తగ్గించడం మంచిది.

–డా.విశ్వనాథరెడ్డి, మానసిక వైద్యనిపుణులు, జాతీయ హెల్త్ మిషన్



- తిరుపతి నగరంలోని కొర్లగుంటకు చెందిన పదేళ్ల బాలుడికి అడిగినవన్నీ తల్లిదండ్రులు కొనిచ్చేవారు. పాఠశాలకు వెళ్లి వస్తూ మార్గమధ్యంలో బేకరీ వద్ద చిప్స్, కేక్‌లు, బిస్కెట్లు కొని తెచ్చుకునేవాడు. దీంతో పాటు కావాల్సినప్పుడల్లా ఆన్‌లైన్‌లో పిజ్జాలు, బర్గర్లు తెప్పించుకుని తినేవాడు. దీంతో స్థూలకాయం పెరిగింది. మైదానానికి తీసుకెళ్లినా ఎక్కువసేపు నడవలేకపోయేవాడు. దీనికితోడు తరచూ రోగాల బారినపడేవాడు. ఏం చేయాలో తెలియక తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.
- తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన 12 ఏళ్ల బాలుడికి కొంత కాలం క్రితం ఊబకాయం వచ్చింది. తరచూ కడుపు నొప్పి వస్తుండడంతో వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. వైద్యపరీక్షల్లో బాలుడికి ఫ్యాటీ లివర్‌తో పాటు షుగర్ ఉన్నట్లు తేలింది. ఆటలు ఆడకుండా నిత్యం వీడియోగేమ్స్ ఆడుకుంటూ ఉండడం వల్ల ఈ సమస్య వచ్చిందని వైద్యులు తేల్చారు.

.. ఇది ఈ ఇద్దరి సమస్యే కాదు. పట్టణాల్లోని పిల్లలకు ఇప్పుడు అధిక బరువు ఒక సమస్యగా మారిపోయింది. ఒకప్పటిలా పాఠశాలల్లో ఇప్పుడు ఆటపాటలు లేవు. ఉదయం నుంచి రాత్రి వరకు చదువు పేరుతో ఒకేచోట కూర్చుంటున్నారు. ఇంటికి వచ్చాక భోజనం చేసి... వీడియోగేమ్స్ ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. దీని కారణంగా చిన్న వయస్సులోనే ఊబకాయం వస్తోంది. ఫలితంగా షుగర్, రక్తపోటు, గుండె జబ్బులు, పీసీఓఎస్ వస్తున్నాయి. చిన్నతనం నుంచే మందులతో జీవితాన్ని నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. – తిరుపతి తుడా



బాల్యానికి బరువు గాయం!

తిరుపతి జిల్లాలో బరువెక్కుతున్న బాల్యం

- ప్రతి ఐదుగురిలో ఇద్దరికి ఊబకాయం
- 50 వేల మందికి పైగా బాధిత పిల్లలు
- చిన్న వయసులోనే రోగాల బారిన పడుతున్న వైనం
- మారిన ఆహారపు అలవాట్లే కారణం!
- అప్రమత్తత లేకుంటే ప్రమాదమేనంటున్న వైద్య నిపుణులు

పెరుగుతున్న 'ఊబకాయం'!

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం ఐదేళ్లలోపు పిల్లల్లో అధిక బరువు సమస్య 2015-16లో 2.1శాతం ఉండగా 2013లో 3.4 శాతానికి పెరిగింది. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ప్రతి ఐదుగురిలో ఇద్దరు ఊబకాయంతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో 2015లో 22వేల మంది పిల్లలు ఊబకాయంతో బాధ పడుతుండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 50వేల దాకా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా ఈ సమస్య గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లో అధికంగా ఉంది. పండ్లు, కూరగాయలు, చిరు దాన్యాలు వాడే సంప్రదాయం నుంచి ఎక్కువ కొవ్వ గల పదార్థాలు, చెక్కెర, ఉప్పు అధికంగా ఉండే ఆహా రం వైపు మారడమే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు.

ఆటలకు దూరం..బరువు ఖాయం!

జిల్లాలో 30 ఏళ్ల క్రితం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడలకు అంతే ప్రాధాన్యం ఇచ్చేవారు. ఈ మేరకు అన్ని పాఠశాలల్లో మైదానాలు ఉండేవి. క్రీడల కోసం ప్రత్యేకంగా ఒక పీరియడ్ ఉండేది. సాయంత్రం వేళల్లో పిల్లలను మైదానంలో ఆడనిచ్చేవారు. సాయంత్రం 5 గంటలకంతా పిల్లలు ఇళ్లకు చేరుకునేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కార్పొరేట్ విద్యాసంస్థల రాకతో విద్య రూపురేఖలు మారిపోయాయి.

ఆహారపు అలావట్లతోనే ప్రమాదం

నగరాలు, పట్టణాల్లో ఎక్కడపడితే అక్కడ ఫాస్ట్ ఫుడ్ లభిస్తోంది. ఇందులో పానీపూర్, కట్లెట్, కచోరి వంటి ఆహార పదార్థాలు తినేందుకు పిల్లలు ఆసక్తి చూపిస్తున్నారు. పిల్లల కోరికను కాదనలేక తల్లితండ్రులు సాయంత్రం వేళల్లో వాటిని తినిపిస్తున్నారు. ప్రధానంగా ఇందులో నిషేధిత రంగులతో పాటు చైనా సాల్ట్ కలుపుతుండడంతో హార్మోన్ల అసమతుల్యత పెరుగుతోంది. అలాగే రెస్టారెంట్లు, హోటళ్లల్లోని బిర్యానీలు, గ్రేవీ, ఫ్రై చేసిన ఆహార పదా ర్థాల్లోనూ నిషేధిత రంగులు, చైనా సాల్ట్ విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో పాటు జంక్ ఫుడ్ (పిజ్జాలు, బర్గర్లు) లో అధిక శాతం కొవ్వు ఉంటోంది. దీన్ని ఎక్కువ తినడం వల్ల త్వరగా ఊబకాయులు మారిపోతున్నారు.

ఊబకాయంతో దుష్పరిణామాలు

- అధిక రక్తపోటు. గుండె జబ్బులు సర్వసాధారణం
- విటమిన్ల లోపం, డిప్రెషన్
- క్రీడల్లో చురుగ్గా పాల్గొనలేకపోవడం

ఇలా చేస్తే మంచిది

- పిల్లలను ఫాస్ట్, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. పండ్లు, కూరగాయల సలాడ్ అలవాటు చేయాలి.
- పాఠశాలకు వెళ్లేటప్పుడు టిఫిన్ బాక్సులో పండ్లను చేర్చాలి.
- పిల్లలను ఆటల్లో ప్రోత్సహించాలి. వారంతాల్లో మైదానాలకు తీసుకెళ్లి ఆడించాలి.
- క్రీడలకు ప్రాధాన్యమిచ్చే పాఠశాలల్లో చేర్పించాలి.
- తినేటప్పుడు టీవీ, కంప్యూటర్, మొబైల్ ఫోన్ చూడడం మాన్పించాలి.

క్షేత్రస్థాయి విధుల నుంచి దివ్యాంగ ఉద్యోగులను మినహాయించండి

వినతిపత్రం అందజేసిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాలు

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో వివిధ కేటగిరీల్లో పనిచేసే దివ్యాంగ ఉద్యోగులను క్షేత్ర స్థాయి విధుల నుంచి మినహాయించాలంటూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు ఇటీవల మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామితో పాటు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్‌కు వినతిపత్రాలు అందజేశారు. దీనికి స్పందించిన గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్.. దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాశారు. తమ వినతిపై అధికారులు స్పందించడం పట్ల గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జాని పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

గోదావరి-బనకచర్ల అనుసంధానం ఆపండి..

- తెలంగాణ డిమాండ్
- అసలు ప్రారంభించనేలేదన్న ఆంధ్రప్రదేశ్
- హైదరాబాద్‌లో వాడివేడిగా గోదావరి బోర్డు సమావేశం
- అనుమతులు వచ్చాకే ప్రారంభించాలన్న బోర్డు చైర్మన్

సాక్షి, అమరావతి: గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్-తెలంగాణ అధికారుల మధ్య వాడివేడి చర్చ జరిగింది. హైదరాబాద్‌లోని జలసౌధలో సోమవారం గోదావరి బోర్డు 17వ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ ప్రాజెక్టు గోదావరి ట్రిబ్యునల్ అవార్డుకు పూర్తి విరుద్ధమని, దీనిని తక్షణం నిలుపుదల చేయాలని తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు ఈ సందర్భంగా ఆరోపించారు. ప్రాజెక్టు ఇంకా ప్రతిపాదన దశలో ఉందని, నిర్మాణం ప్రారంభించలేదని ఏపీ జలవనరుల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) ఎం.వెంకటేశ్వర రావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దీనిపై తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 20వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న రెండు సొరంగాలను సైతం నిర్మించారని సమాచార హక్కు చట్టం కింద ఏపీ ప్రభుత్వం స్వయంగా సమాచారం ఇచ్చిందని తెలిపారు. దీనితోసహా ప్రాజెక్టు ప్రారంభమయ్యిందని పేర్కొంటూ పలు అంశాలు ప్రస్తావించారు. ఈ క్రమంలో బోర్డు చైర్మన్ ఏకే ప్రధాన్ జోక్యం చేసుకుంటూ.. । ప్రాజెక్టు సమగ్ర ప్రాజెక్టు నివేదికను(డీపీఆర్) తమకు సమర్పించాలని, అనుమతులొచ్చాకే పనులు చేపట్టాలని ఏపీ అధికారులను ఆదేశించారు. ఇందుకు ఏపీ అధికారులు అంగీకరించారు.

సమావేశంలో మరికొన్ని అంశాలు..

- ఉమ్మడి ప్రాజెక్టు పెద్దవాగుకి రూ.15 కోట్లతో 5 అదనపు గేట్లను ఏర్పాటు చేసి రెండు నెలల్లోగా తాత్కాలిక మరమ్మతులు నిర్వహించేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. ఆ తర్వాత శాశ్వత మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించాయి. రూ.92.5 కోట్లతో ప్రాజెక్టు పునరుద్ధరణను సైతం చేపట్టాలని అంగీకరించాయి.
- గోదావరి బోర్డులో రెండు రాష్ట్రాల నుంచి డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉద్యోగులను బోర్డు సభ్యకార్యదర్శి ఎ.అజగేషన్ వేధింపుల ఆరోపణలపై నిజనిర్ధారణకు త్రిసభ్య కమిటీ ఏర్పాటయ్యింది. బోర్డు ప్రతిపాదిత పాలన, ఆర్థిక పరమైన ప్రతిపాదనలపై కూడా ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది.
- బోర్డు నిర్వహణకు చెరో రూ.200 కోట్ల సీడ్ మనీ చెల్లించాలనే ప్రతిపాదనను రెండు రాష్ట్రాలు వ్యతిరేకించాయి. గోదావరి బోర్డు పరిధిలో పెద్దవాగు ఒక్కటే ఉమ్మడి ప్రాజెక్టు ఉండగా, దాని నిర్వహణకు అంత డబ్బు అవసరం లేదని స్పష్టం చేశాయి.
- 2021 జూలై 15న కేంద్రం జారీ చేసిన గజిట్ నోటిఫికేషన్ అమలులో భాగంగా 16 ప్రాజెక్టుల నిర్వహణను తనకు అప్పగించాలని గోదావరి బోర్డు కోరగా, రెండు రాష్ట్రాలూ అంగీకరించలేదు.

కాకాణి ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు

రేపు నిర్ణయం వెలువరిస్తామన్న హైకోర్టు

సాక్షి, అమరావతి: అక్రమ మైనింగ్ ఆరోపణలతో నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. బుధవారం తీర్పు వెలువరిస్తామని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. అంతకుముందు పోలీసుల తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాసరావు వాదనలు వినిపించారు. కాకాణి తరపున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కేవలం రాజకీయ కారణాలతోనే ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారని చెప్పారు. హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన తరువాత ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని జతచేశారన్నారు. గిరిజనులను ఎవరు, ఎప్పుడు దూషించారన్న వివరాలేవీ నిర్దిష్టంగా లేవని, అయినా కేసు నమోదు చేశారని చెప్పారు. కాకాణి అల్లుడు, కుమార్తెకు నోటీసులిచ్చి విచారణకు రావాలంటూ పోలీసులు వేధిస్తున్నారని తెలిపారు. అందువల్ల ముందస్తు బెయిల్ మంజూరు చేసి అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. బుధవారం తీర్పు వెలువరిస్తామని ప్రకటించారు.

ప్రతి తల్లి, పిల్లల సమాచారం నమోదు చేయాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మాతా, శిశు సంరక్షణ చర్యల్లో భాగంగా ప్రతి గర్భిణి, తల్లి, పిల్లల సమాచారం నమోదు చేయాలని జిల్లా అధికారులను మాతా, శిశు సంరక్షణ అదనపు డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ ఆదేశించారు. హెచ్ఎంఐఎస్, ఆర్సీహెచ్ కార్యక్రమాలపై జిల్లాస్థాయి అధికారులకు మంగళగిరిలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. పటిష్టమైన వివరాల నమోదు వ్యవస్థకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

సాక్షి ప్లస్
మంగళవారం ॥ 8-4-2025

హెల్త్



సాధారణంగా పెద్దవయసులోని వారు పడిపోయారనీ, బాత్‌రూమ్‌లో జారిపడ్డారనీ... లాంటి మాటలు తరచూ వినవస్తూ ఉంటాయి. దాదాపు 65 ఏళ్లు దాటిన చాలామంది ఇలా పడిపోతుంటారనే న్యూస్ వింటుండటం మామూలే. పెద్దవారు ఇలా పడిపోతుండటం వల్ల ఒక్కోసారి ఎముకలు విరగడం (ఫ్రాక్చర్స్), తలకు గాయాలు (హెడ్ ఇంజురీస్) కావడం లాంటి అనర్థాలెన్నో జరుగుతుంటాయి. వీటిల్లో బాత్‌రూముల్లో జారిపోవడం మినహాయించి మిగతాచోట్ల పడిపోవడానికి చాలా కారణాలే ఉంటాయి. పెద్దవాళ్లు అలా ఎందుకు పడిపోతుంటారో, అందుకు రకరకాల కారణాలేమిటో, వాళ్లు అలా పడిపోవడాన్ని నివారించడమెలాగో చూద్దాం.

పడిపోయే అవకాశాలు ఎవరిలో ఎక్కువ...

- చిన్న చిన్న అడుగులు వేస్తూ, రెండు కాళ్ల మధ్య ఖాళీ తక్కువగా ఉంచేవారు.
- నిల్చున్నప్పుడు రెండు కాళ్ల మధ్య ఖాళీ తక్కువగా ఉంచేవారు.
- నడిచే సమయంలో కళ్లు మూసుకునేలా ముఖం ఎక్కువగా రుద్దుకునే వారు.

చికిత్స

- **ఫాల్ క్లినిక్స్ :** ఇటీవల చాలా ఆసుపత్రుల్లో 'ఫాల్ క్లినిక్స్' ప్రారంభిస్తున్నారు. వీటిలో పడిపోయిన వాళ్లకు ఇవ్వాల్సిన చికిత్స అందిస్తుంటారు.
- పడిపోయాక తలకు దెబ్బతగిలినప్పుడు తక్షణం న్యూరో సర్జన్ చేత చికిత్సలు అందించాల్సిన అవసరముంటుంది.
- ఫ్రాక్చర్స్ వంటివి అయితే ఆర్థో నిపుణులతో చికిత్స అందించాల్సి ఉంటుంది.

ఆరోపడిలో పడిపోతే...



డాక్టర్ పి. రంగనాథమ్
సీనియర్ న్యూరో సర్జన్

ప్రస్తుతం మనదేశంలో 60 ఏళ్లు పైబడిన పెద్దవాళ్ల సంఖ్య 15 కోట్లు. అంటే మొత్తం జనాభా అయిన 140 కోట్లలో దాదాపు 10.5% మంది పెద్దవాళ్లే. వీళ్లలో దాదాపు 60 నుంచి 70 ఏళ్ల వాళ్లలో 25-30 శాతం మంది పడిపోతూ ఉండగా... 70 నుంచి 80 ఏళ్ల మధ్యవాళ్లలో పడిపోయే వారి శాతం 35%గా ఉంది. మామూలుగా పదిమందిలో ఆరుగురు ఇండ్లలోనే పడుతుంటారు. పడిపోవడం మెల్లగానే పడిపోయినట్లు కనిపించినా ఆ పడటం తాలూకు పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉండవచ్చు. ఉదాహరణకు అలా పడినప్పుడు మెదడులోని రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడాన్ని 'సబ్‌డ్యూరల్ హిమటోమా' అంటారు. దీనికి శస్త్రచికిత్స అవసరం పడుతుంది. ఇక తుంటి ఎముక ఫ్రాక్చర్ అయిపోయి మంచానికే పరిమితం కావడం చాలామంది ఎదుర్కొనే సమస్య.

అప్పుడప్పుడూ పెద్దవారే కాదు... కొందరు మధ్యవయస్కులూ పడిపోవడం ఇటీవల సాధారణంగా జరుగుతోంది. ఇలా పడిపోడానికి కారణాలేమిటో తెలుసుకుందాం.

కారణాలివే...

- కొందరు పెద్ద వయసువారిలో వయసు పెరుగుతున్న కొద్దీ వాళ్ల పాదాల్లో స్పర్శ కొంతమేర తగ్గవచ్చు. దాంతో తాము పడిపోతున్నామనే సంగతి కూడా వాళ్లకు తెలియకుండానే వాళ్లు పడిపోవచ్చు.
- వయసు పెరుగుతున్న కొద్దీ ఎముకల సాంద్రతతో పాటు మజిల్ మాస్ కూడా క్రమంగా తగ్గుతూ పోతుంది. దాంతో కండరాల్లోని శక్తి కూడా క్షీణించడంతో పడిపోవడానికి అవకాశాలు పెరుగుతాయి. అలాగే మోకాలు, చీలమండ, తుంటి ఎముకల కీళ్లలోనూ కొన్ని మార్పులు రావడం కారణంగా పడిపోవడాలు జరగవచ్చు.
- పెరుగుతున్న వయసుకు తగ్గట్లు చూపు మందగించడం, వినికిడి శక్తి కూడా క్షీణించడం వంటి అంశాలు కూడా ఒక్కోసారి అకస్మాత్తుగా పడిపోవడానికి కారణాలు కావచ్చు.
- వయసు పెరుగుతున్న కొద్దీ వారిలో నిటారుగా నిలబడి ఉండే శక్తి తగ్గుతుంది. వయసు పెరిగిన పెద్దవాళ్లు పడిపోకుండా ఉండటానికి ప్రకృతి ఆ వృద్ధుల్ని కాస్త ముందుకు ఒంగిపోయేలా చేస్తుంది. పడిపోయేవాళ్లలో ఇలాంటివాళ్లే ఎక్కువ.
- కొన్నిసార్లు గుండె / మెదడు / శరీరంలోని ఇతర అవయవాలు లేదా వివిధ వ్యవస్థల్లోని ఆరోగ్య సమస్యలు నయం కావడం కోసం వాళ్లు వాడే మందుల కారణంగా కూడా వాళ్లు తూలిపడిపోయే ప్రమాదమూ ఉంటుంది.
- కొన్నిసార్లు నరాలకు సంబంధించిన కారణాలతోనూ పడిపోయే అవకాశాలుంటాయి.
- ఒక్కోసారి కారణాలేమీ లేకుండానే ముందుకో వెనక్కో పడిపోయే ప్రమాదం ఉంది. మాట్లాడుతూ నడుస్తున్నప్పుడు ఇలాంటి ప్రమాదం జరగవచ్చు. అందుకే పెద్దవయసు వారు మాట్లాడుతూ నడవకూడదు. నడుస్తూ మాట్లాడకూడదు.



- **పోష్చరల్ హైపోటెన్షన్ (లో బీపీ) :** అకస్మాత్తుగా బీపీ తగ్గిపోయే కండిషన్ ఇది. ఇలా జరగడానికి అనేక కారణాలు ఉంటాయి. సాధారణంగా శరీరంలోని ద్రవాలూ లేదా ఖనిజ లవణాల మోతాదులు తగ్గడం వల్ల ఇలా జరగవచ్చు. అలాగే కొందరిలో ఏదైనా మందు/ఔషధం తీసుకోగానే ఇలా జరగడానికి అవకాశముంది. ఒక్కోసారి పెద్దవాళ్లు తాము కూర్చున్న స్థితి నుంచి అకస్మాత్తుగా పైకి లేవడం లేదా ఉన్నట్టుండి పక్కపై నుంచి లేవడం జరిగినప్పుడు అకస్మాత్తుగా బీపీ పడిపోవచ్చు. ఇలాంటప్పుడు బీపీ 20 హెచ్‌జీ/ఎంఎం కంటే తక్కువగా ఉన్నప్పుడు మెదడుకు చేరాల్సిన రక్తం మోతాదులు కాస్తా అకస్మాత్తుగా తగ్గడం వల్ల పడిపోవచ్చు.
- కొందరు నిలబడి మూత్రవిసర్జన చేసేవాళ్లలో ఆ సమయంలోనూ లేదా కొందరిలో అకస్మాత్తుగా దగ్గు రావడం వల్ల కూడా ఒక్కోసారి బీపీ హఠాత్తుగా పడిపోయే ప్రమాదం ఉంది.
- **సింకోప్ :** కొందరు అకస్మాత్తుగా కొద్దిసేపు స్పృహ కోల్పోయినట్లుగా అయిపోతారు. కళ్లు తిరుగుతూ, చూపు తాత్కాలికంగా మసకబారుతుంది. ముఖంలో రక్తపు చుక్కలేనట్లుగా పాలిపోతారు. శరీరమంతా చల్లబడి, ఒళ్లంతా చెమటలు పట్టవచ్చు. దాంతో ఉన్నవారు ఉన్నట్టుగా అకస్మాత్తుగా పడిపోయి, ఎముకలు విరగడం, తలకు గాయం కావడం వంటి ప్రమాదం జరగవచ్చు. ఇలాంటి వాళ్లలో కొందరు ఒక్కోసారి తమ మూత్రవిసర్జనపై నియంత్రణ కోల్పోయే ప్రమాదమూ ఉంది. ఇలా అకస్మాత్తుగా కళ్లు తిరుగుతూ పడిపోవడాన్ని 'సింకోప్' అంటారు. మానసికంగా ఒత్తిడి తీవ్రమైనప్పుడు, మనకు అంతగా ఇష్టం లేని దృశ్యాలనూ / అంశాలనూ చూసినప్పుడు (ఎవరైనా గాయపడటం లేదా రక్తస్రావం అవుతుండటం, ఇంకెవరైనా తీవ్రమైన నొప్పితో బాధపడుతుండటం వంటి తమకు ఆమోదం కాని అన్‌ప్లెజెంట్ విజువల్ స్టిములై కారణంగా) ఇలా జరగవచ్చు.
- **వర్టిగో :** ఒక్కోసారి కొందరిలో కళ్లు తిరిగినట్లుగా అయిపోయి ఒళ్లు స్వాధీనం తప్పి పడిపోవచ్చు. సాధారణంగా లోపలిచెవి లేదా బ్రెయిన్ స్టెమ్‌లో ఉన్న వ్యాధుల కారణంగా ఇలా జరగడానికి అవకాశాలెక్కువ.
- **ఫిట్స్ :** ఒక్కోసారి కొందరిలో ఫిట్స్ రావడం / స్పృహ కోల్పోవడం / శరీరమంతా కుదుపునకు (జెర్క్) లోనుకావడం వల్ల.
- **ట్రాన్సియెంట్ ఇస్కిమిక్ ఎటాక్ (టీఐఏ) :** ఒక్కోసారి కొందరిలో తక్కువ తీవ్రతతో పక్షవాతం వచ్చి, మళ్లీ వెంటనే సాధారణ స్థితికి వచ్చేస్తారు. ఈ కండిషన్‌ను వైద్య పరిభాషలో 'ట్రాన్సియెంట్ ఇస్కిమిక్ ఎటాక్' అంటారు. అకస్మాత్తుగా పడిపోవడానికి ఇది కూడా ఒక కారణం. ఇలాంటి సందర్భాల్లో కొందరిలో సరిగా మాట రాకపోవడం, మాటలు ముద్దగా రావడం, కాళ్లూ, చేతులు తాత్కాలికంగా బలహీనంగా మారడం జరగవచ్చు.
- **పార్కిన్‌సన్ డిసీజ్ :** ఈ ఆరోగ్య సమస్య ఉన్నవాళ్లలో వణుకు కారణంగా శరీరానికి సరైన బ్యాలెన్స్ లేకపోవడంతో పడిపోవడం జరుగుతుంది. వీళ్లలో శరీరం కదలికలు నెమ్మదించడం వల్ల కూడా వారు పడిపోయే ప్రమాదముంటుంది.
- వెన్నెముక / నరాలు / కండరాల వ్యాధుల వల్ల ఒక్కోసారి కాళ్లూ చేతులు బలహీనమైపోయినప్పుడు.
- దేహంలో సోడియమ్, పొటాషియమ్ వంటి లవణాలూ లేదా చక్కెర మోతాదులు తగ్గిపోయినప్పుడు.
- చాలా అరుదుగా మెదడులో కణుతులు, మతిమరపు, సైకోసిస్ వంటి అంశాలు కూడా పడిపోడానికి కారణాలు కావచ్చు.

అకస్మాత్తుగా పడిపోవడాన్ని నివారించండి ఇలా...

- పడిపోవడానికి సరైన కారణాలను తెలుసుకొని... వాటిని సరిదిద్దుకోవాలి. అంటే... పడుకున్నవారు / కూర్చున్నవారు అకస్మాత్తుగా లేవడం వల్ల పడిపోవడం జరుగుతున్నా అలా ఉన్నపళంగా లేవడం సరికాదు. పడుకున్న వారు తాము పక్క నుంచి లేస్తున్నప్పుడు మొదట మెల్లగా ఒక పక్కకు ఒరుగుతూ... ఆ తర్వాత లేచి కూర్చుని... అప్పుడు మెల్లగా నిల్చోవాలి. కూర్చున్న వారు కూడా ఒకేసారి కుర్చీలోంచి లేవకుండా... మెల్లగా లేచి నిలబడాలి.
- ఆరోగ్య కారణాల వల్ల ఇలా పడిపోయే మెడికల్ హిస్టరీ ఉన్నవారు అందుకు కారణాన్ని తెలుసుకోడానికి అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకుని, సమస్యను గుర్తించి అందుకు అవసరమైన చికిత్స తీసుకోవడం ద్వారా.
- అకస్మాత్తుగా పడిపోవడానికి నరాలకు సంబంధించిన (న్యూరలాజికల్) కారణాలుంటే అవేమిటో తెలుసుకుని, తగిన చికిత్స తీసుకోవాలి.
- **ఉపకరణాలు వాడటం :** అకస్మాత్తుగా పడిపోయే వారు తమకు అవసరమయ్యే ఉపకరణాలు... అంటే చేతికర్ర (వాకింగ్ స్టిక్) / వాకర్ / కళ్లజోడు వంటివి దూరంగా పెట్టుకోకుండా, ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలి.
- కాస్తంత పెద్ద వయసు మహిళలు హైహీల్స్ తొడగడం సరికాదు. తమకు సురక్షితంగా ఉండే ఫ్లాట్ హీల్ పాదరక్షలు వాడాలి.
- కాలి కండరాల బలాన్ని పెంచే వ్యాయామాలు, వాకింగ్ వంటివి చేయడం చాలా రకాల పడిపోవడాలను (ఫాల్స్‌ను) నివారిస్తాయి.

ఇతరత్రా మరికొన్ని మార్గాలివి...

చాలా సార్లు పడిపోవడం అన్నది ఇండ్లలోనే జరుగుతుంటుంది. అందువల్ల ఇంటివాతావరణాన్ని పెద్దవారికి ఫ్రెండ్లీగా మార్చడం చాలా మేలు చేస్తుంది. పడకుండా నివారిస్తుంది. ఇందుకు చేయాల్సిన కొన్ని పనులు...

- నాన్‌స్టిక్ మ్యాట్స్ వాడటం.
- ఫ్రిక్షన్ బాగా ఉంటే ఫ్లోరింగ్ వేయించడం.
- కాలుజారనివ్వని కార్పెట్స్ పరవడం.
- గదిలో మంచి వెలుతురు / గాలి వచ్చేలా చేసుకోవడం.
- టాయిలెట్స్, బాత్‌రూమ్స్‌లో మంచి పట్టు ఉండటానికి వీలుగా హ్యాండ్ రెయిల్స్ అమర్చుకోవడం, బాత్‌రూమ్ బయట కాలుజారనివ్వని మ్యాట్స్ వాడటం
- మరీ అవసరమైతే తప్ప ఎక్కడా ఎక్కకుండా ఉండటం...వంటి జాగ్రత్తలతో పెద్దవారు పడిపోయే ప్రమాదాలను నివారించవచ్చు.

నైట్‌షిఫ్టుల్లో ఆహారం ఇలా!



ఇటీవల చాలామంది నైట్ డ్యూటీలు చేస్తున్నారు. గతంలో కేవలం కొద్దిమంది స్థానంలో ఇటీవల అమెరికా టైమ్‌కు తగ్గట్లుగా పనిచేయాల్సి రావడంతో రాత్రిళ్లు పనిచేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. సాధారణంగా ప్రతిరోజూ పగలు పని చేసి, రాత్రి నిద్రపోయే వారి ఆహారపు అలవాట్లతో పోలిస్తే... నైట్ షిఫ్టులలో పనిచేసేవారు తమ ఆహారపు అలవాట్లలో కొద్దిపాటి మార్పులు చేసుకోవాల్సి వస్తోంది. లేకపోతే వారికి కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశాలెక్కువ. నైట్ షిఫ్టుల్లో పనిచేసేవారు తమ ఆహారపు అలవాట్లలో చేసుకోవాల్సిన మార్పులేమిటో చూద్దాం.

నైట్ షిఫ్టుల్లో పనిచేసేవారికి సాధారణంగా కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదురుకావచ్చు. ఉదాహరణకు అవి... ఛాతీలో మంట, అజీర్ణం, మలబద్ధకం, ఆకలి తగ్గడం వంటి గ్యాస్ట్రోఇంటస్టినల్ సమస్యతో పాటు రక్తపోటు, గుండెజబ్బులు, యాంగ్జైటీ, ఒత్తిడి, డిప్రెషన్, నిద్రలేమి వంటివి రాత్రి షిఫ్టుల్లో పనిచేసేవారిలో కాస్తంత ఎక్కువగా కనిపించవచ్చు.

బరువు పెరిగే అవకాశాలూ ఎక్కువే...

నైట్ షిఫ్టుల్లో పనిచేసేవాళ్లలో బరువు పెరిగి స్థూలకాయం (ఒబేసిటీ) వచ్చే అవకాశాలూ ఎక్కువే. ఇందుకు కారణాలు ఏమిటంటే... సాధారణంగా పగటి డ్యూటీలు చేసేవారు రాత్రంతా నిద్రపోవడం వల్ల మళ్లీ ఉదయం వరకు భోజనం తీసుకోరు. కానీ రాత్రి డ్యూటీలు చేసేవారు రాత్రంతా మెలకువతో ఉండాల్సి రావడంతో మధ్య మధ్య ఆకలేస్తూ ఉంటుంది. దాంతో రాత్రివేళ్లలోనూ తినాల్సి వస్తుంటుంది.

సాధారణంగా ఇలా రాత్రి వేళల్లో తినే ఆహారం కాస్తా మామూలు భోజనంలా కాకుండా కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహారాలు, ఫాస్ట్‌ఫుడ్స్, జంక్‌ఫుడ్స్ వంటివే ఎక్కువ. అందుకే రాత్రివేళ పనిచేసేవారు తీసుకునే అసమతౌల్య ఆహారపు అలవాట్ల (అన్ బ్యాలెన్స్‌డ్ డయటరీ పాటర్న్) కారణంగా ఒకపక్క కొవ్వుపదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటూ ఉండటం, మరో పక్క శారీరక శ్రమ లేకపోవడంతో ఊబకాయం వచ్చే అవకాశాలు ఎక్కువ. దాంతో ఆ ఒబేసిటీ కారణంగా వచ్చే ఆరోగ్యపరమైన ముప్పులు (హెల్త్ రిస్కులు) ఎక్కువే.

అలాంటి ముప్పు రాకూడదంటే ఆహార పరంగా పాటించాల్సి సూచనలివి...

రాత్రివేళల్లో ఉద్యోగాలు / పనులు చేసేవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వారికి వచ్చేందుకు అవకాశమున్న చాలా రకాల ఆరోగ్య సమస్యలనూ, ఇతరత్రా ముప్పుల ప్రమాదాన్ని నివారించుకోవచ్చు. అందుకు అనువైన ఆహారపు అలవాట్లు ఇవి...

- నైట్‌షిఫ్టుల్లో పనిచేయడానికి వెళ్లేవారు... డ్యూటీకి వెళ్లే ముందర భోజనం చేసి వెళ్తుంటారు. వాళ్లు పెద్ద పెద్ద పరిమాణాల్లో తక్కువ సార్లు కాకుండా... చిన్న చిన్న మోతాదుల్లో ఎక్కువసార్లు ఆహారం తీసుకుంటూ ఉండాలి. చిన్న పరిమాణంలో తీసుకునే ఆహారాలు జీర్ణం కావడం తేలిక. దాంతో చాలారకాల గ్యాస్ట్రో ఇంటస్టినల్ సమస్యలు తేలిగ్గా నివారితమవుతాయి.
- తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్లు, కొవ్వులు తక్కువగా ఉండాలి. పీచుపదార్థాలు (డయటరీ ఫైబర్) ఎక్కువగా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.
- ఆఫీసుల్లోని వెండింగ్ మెషిన్, కాఫెటీరియా వద్ద లభ్యమయ్యే ఆహారపదార్థాలకు సాధ్యమైనతంగా దూరంగా ఉండటమే మేలు. ఇంటి దగ్గర నుంచి తెచ్చుకున్న ఆహారాన్నే (హోమ్ మేడ్ ఫుడ్‌ను) తీసుకోవడమే మంచిది.
- ఒకవేళ కాఫెటేరియా ఫుడ్‌నే తీసుకోవాల్సి వస్తే... పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాలు అంటే... తాజా పండ్లు, సలాడ్స్, మొలకెత్తిన గింజలు, పొట్టుతో ఉన్న పప్పుధాన్యాలు, గింజధాన్యాలు (అంటే ఉదాహరణకు... పొట్టుతోనే ఉన్న గోధుమలతో చేసిన రోటీలు, మొక్కజొన్నలతో చేసిన పదార్థాలు, బ్రౌన్‌బ్రెడ్ శాండ్‌విచ్‌లు) వంటివి తీసుకోవడం మంచిది. కొవ్వు ఎక్కువగా ఉండే పదార్థాలు, బాగా ఎక్కువగా వేయించిన వేపుళ్లు (ఫ్రెంచ్ ఫ్రైస్, సమోసాలు, చిప్స్) వంటి ఆహారాలను వీలైనంతవరకు తీసుకోకపోవడమే మేలు.
- రాత్రివేళల్లో తీపి పదార్థాలు, రిఫైన్డ్ ఫుడ్స్ (అంటే... క్యాండీలు, చాక్లెట్‌లు, వైట్ బ్రెడ్స్, బన్, పాస్తా, పిజ్జాలు, కూల్‌డ్రింక్స్) వంటి వాటిని సాధ్యమైనంత వరకు దూరంగా ఉండటమే మంచిది.
- రాత్రివేళ పనిచేస్తుండేవారు వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగుతూ ఉండాలి. పగటితో పోలిస్తే రాత్రి కాసంత చల్లగా ఉంటుంది కాబట్టి నీళ్లు తక్కువగా తీసుకుంటూ ఉంటారు. దీంతో డీహైడ్రేషన్ ముప్పు ఉంటుంది. కాబట్టి నైట్ షిఫ్ట్‌లో తరచూ నీళ్లు తాగుతూ ఉండటం మంచిది.
- నైట్ షిఫ్టుల్లో పనిచేసేవారు కాఫీ, టీ లు చాలా ఎక్కువగా తాగుతుంటారు. నిద్రరాకుండా ఉండటానికీ అలాగే బ్రేక్ సమయాల్లో ఇలా టీ, కాఫీలు తాగడం చాలా సాధారణం. అయితే వాటికి వీలైనంతగా తగ్గించాలి. టీ, కాఫీలు తాగాలనిపించినప్పుడల్లా నీళ్లు తాగుతుండటం మేలు.
- రాత్రివేళల్లో పనిచేసేవారు చాలావరకు వ్యాయామాలకు దూరంగా ఉంటారు. రాత్రంతా డ్యూటీ చేయడంతో పొద్దున్నే ఇంటికెళ్లగానే నిద్రకు ఉపక్రమిస్తుంటారు. ఇక రాత్రి డ్యూటీకి వచ్చే తొందరలో వ్యాయామాలను వదిలేస్తుండటం కద్దు. అయితే ఇలాంటివాళ్లంతా తమ వర్క్‌షెడ్యూల్‌కు అనుగుణంగా రోజులోని ఏదో ఒక సమయంలో క్రమం తప్పకుండా ప్రతిరోజూ 45 - 60 నిమిషాల పాటు వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. రాత్రి షిఫ్టుల్లో పని సమయంలో వారిని ఉత్సాహంగా ఉంచడానికి ఈ వ్యాయామం తోడ్పడుతుంది. పైగా వ్యాయామపు ఉత్సాహం వల్ల రాత్రి పని చేసేటప్పుడు తూగురావడం వంటివి జరగవు. ఈ వ్యాయామాల వల్ల మరో ప్రయోజనం ఏమిటంటే రాత్రి డ్యూటీల కారణంగా బరువు పెరగడమూ జరగదు.
- ఇదే వ్యాయామం రాత్రిపనివేళల్లో పని చేయడం వల్ల కలిగే ఒత్తిడిని (స్ట్రెస్‌ను) నివారిస్తుంది. దాంతో అధిక రక్తపోటు (హైబీపీ), డిస్‌లిపిడేమియా (రక్తంలో కొలెస్ట్రాల్ పాళ్లు అసాధారణంగా పెరగడం) వంటి ముప్పులూ నివారితమవుతాయి.

టాయ్ పరిశ్రమకు 'టారిఫ్'ల ప్రయోజనం!

చైనా, వియత్నాంపై అధిక సుంకాల ఎఫెక్ట్...



న్యూఢిల్లీ: ట్రంప్ టారిఫ్ వార్ సెగ అన్ని దేశాలకూ గట్టిగానే తగులుతోంది. అయితే, భారత్‌తో పోలిస్తే చైనా, వియత్నాం తదితర పోటీ దేశాలపై అధిక సుంకాలు విధించడం మన టాయ్ పరిశ్రమ దీన్ని సదావకాశంగా మలుచుకోవడానికి సిద్ధమవుతోంది. ఇతర దేశాల సంస్థలతో జాయింట్ వెంచర్‌ల ఏర్పాటు ద్వారా తయారీ సామర్థ్యాన్ని విస్తరించేందుకు దేశీ కంపెనీలు ఇప్పటికే పని మొదలు పెట్టాయని ఎగుమతిదారులు చెబుతున్నారు. ఇతర దేశాలపై అధిక టారిఫ్‌ల ప్రభావంతో మన ఎగుమతిదారులకు ప్రయోజనం చేకూరనుందని, దీంతో ఈ వాణిజ్య యుద్ధంలో భారత్ విజయం సాధించనుందని కూడా వారు అంటున్నారు. ఆసియాలో చైనాపై 54 శాతం, బంగ్లాదేశ్‌పై 37 శాతం, థాయ్‌లాండ్‌పై 36 శాతం, ఇండోనేషియాపై 32 శాతం చొప్పున ట్రంప్ భారీగా సుంకాలను వడ్డించిన సంగతి తెలిసిందే. భారత్‌పై మాత్రం 26 శాతం టారిఫ్‌లతో సరిపెట్టారు. 'ఇది మనకు భారీగా అవకాశాలను అందించనుంది. ఎందుకంటే వియత్నాం 6 బిలియన్ డాలర్లు, చైనా 80 బిలియన్ డాలర్ల చొప్పున ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయి. భారతీయ టాయ్స్‌తో పోలిస్తే వారి వస్తువులకు అధిక సుంకాలు పడతాయి. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా బడా టాయ్ సంస్థలన్నీ భారత్‌లో ప్లాంట్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తున్నాయి' అని ప్లేగ్రో టాయ్స్ ఇండియా సీఈఓ మను గుప్తా పేర్కొన్నారు.

34.8 కోట్ల ఎగుమతులు..

పరిశ్రమ వర్గాల గణాంకాల ప్రకారం గడిచిన మూడేళ్లుగా భారత్ నుంచి 32.6-34.8 కోట్ల డాలర్ల విలువైన టాయ్ ఎగుమతులు జరుగుతున్నాయి. అమెరికాతో వీలైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరితే, భారతీయ టాయ్ సంస్థలు యూఎస్‌కు తమ ఎగుమతులను పెంచేందుకు దోహదం చేస్తుందని కూడా గుప్తా అభిప్రాయపడ్డారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా ఇప్పుడు రంగాల వారీగా పాలసీలను రూపొందిస్తున్నాయన్నారు.


కాగా, బడ్జెట్లో టాయ్ పరిశ్రమ కోసం ప్రకటించిన జాతీయ యాక్షన్ ప్లాన్ ఈ రంగానికి మరింత దన్నుగా నిలవనుందని సన్‌లార్డ్ గ్రూప్ ప్రమోటర్ అమితాభ్ ఖర్బందా పేర్కొన్నారు. ఇతర దేశాల ఆధిపత్యంతో భారత్ అనేక ఏళ్లుగా నికర టాయ్స్ దిగుమతిదారుగానే కొనసాగుతోంది. గడిచిన దశాబ్దకాలానికి పైగా చైనా పైనే పూర్తిగా ఆధారపడుతూ 76 శాతం మేర టాయ్స్ దిగుమతి చేసుకుంటోంది. అయితే, ఈ పరిస్థితి క్రమంగా మారుతోంది. 2012-13లో భారత్ చైనా నుంచి 21.4 కోట్ల డాలర్ల టాయ్స్ దిగుమతి చేసుకోగా, 2023-24లో ఇది 4.16 కోట్ల డాలర్లకు దిగొచ్చింది. అంటే దాదాపు 94 శాతం దిగుమతులు కాస్తా, 64 శాతానికి తగ్గాయి. అంతర్జాతీయ టాయ్ మార్కెట్లో భారత్ పోటీతత్వానికి ఇది నిదర్శనమని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.



ఎగుమతిదార్లకు కేంద్రం దన్ను..

కొత్త మార్కెట్లను అన్వేషించడంలో తోడ్పాటు

- చౌకగా రుణాలు అందించడంపై దృష్టి
- టారిఫ్‌లతో వెల్లువెత్తే దిగుమతుల సమీక్షకు గ్రూప్ ఏర్పాటు



న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌ల దెబ్బతో ఆందోళన చెందుతున్న ఎగుమతి సంస్థలకు బాసటగా నిల్చేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. కొత్త మార్కెట్లను అన్వేషించడంలో వాటికి మరింత తోడ్పాటు అందించనుంది. అలాగే, తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు అందేలా చూడటం, .. యూరోపియన్ యూనియన్‌తో పాటు బ్రిటన్, న్యూజిల్యాండ్ తదితర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై చర్చలను వేగవంతం చేయడం తదితర చర్యలు తీసుకుంటోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత్ నుంచి ఎగుమతులను ప్రోత్సహించేందుకు ఆస్ట్రేలియా, బ్రెజిల్ లాంటి 20 దేశాలతో వరుసగా ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలందినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎగుమతి సంస్థలకు (ఎంఎస్ఎంఈ) సులభంగా రుణాలు లభించేలా చూడటం, ఇతర దేశాలు అమలు చేసే టారిఫ్‌యేతర చర్యలను ఎదుర్కొనడంలో సహాయాన్ని అందించడం మొదలైన వాటి కోసం ప్రభుత్వం ప్రత్యేక స్కీములను రూపొందిస్తోంది. 2023-24లో 119.71 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యంతో భారత్‌కు అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిల్చిన అమెరికా, మన దేశంపై 26 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. భారత్ మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 18 శాతంగా ఉంటుంది.

ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థల్లో 'అతి'గా ఆందోళన లేదు..

అమెరికా టారిఫ్‌లపై దేశీయ ఎలక్ట్రానిక్స్, ఐటీ రంగ తయారీ సంస్థల్లో ప్రస్తుతానికైతే 'అతి'గా ఆందోళనేమీ లేదని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్ చెప్పారు. అయితే, మారిపోతున్న పరిస్థితుల మీదే అంతా ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. తయారీ కంపెనీలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని కృష్ణన్ వివరించారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో పోటీదేశాలతో పోలిస్తే తాము కొంత మెరుగైన స్థితిలోనే ఉన్నట్లు దేశీ కంపెనీలు భావిస్తున్నాయి. టారిఫ్‌ల వల్ల అమెరికాకు హార్డ్‌వేర్ ఎగుమతులపై ప్రభావం పడినా, ఆసియాలోని మిగతా తయారీ హబ్‌లతో పోలిస్తే సుంకాల భారం తక్కువే ఉండటం మనకు కొంత సానుకూలాంశమని టెలికం పరికరాల తయారీ సంస్థ జీఎక్స్ గ్రూప్ సీఈవో పరితోష్ ప్రజాపతి తెలిపారు.

దిగుమతులపై ఫోకస్..

సుంకాల మోతతో ఇతర దేశాల నుంచి భారత్‌లోకి దిగుమతులు వెల్లువెత్తే అవకాశాలను కూడా ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. అమెరికాలో టారిఫ్‌ల కారణంగా అక్కడికి ఎగుమతి చేయాల్సిన ఉత్పత్తులన్నింటినీ చైనా తదితర దేశాలు భారత్‌కు మళ్లించవచ్చని భావిస్తున్నారు. వీటిని సమీక్షించేందుకు ప్రత్యేక మానిటరింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందులో వాణిజ్య శాఖ, రెవెన్యూ శాఖ, పారిశ్రామిక ప్రోత్సాహం..అంతర్గత వాణిజ్య విభాగానికి (డీపీఐఐటీ) చెందిన అధికారులు సభ్యులుగా ఉంటారు. జూన్, జూలై నుంచి దిగుమతులు ఒక్కసారిగా పెరగవచ్చనే అంచనాలు నెలకొన్నాయి. కన్జ్యూమర్ గూడ్స్, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, ఉక్కు మొదలైనవి వెల్లువెత్తవచ్చని భావిస్తున్నారు. దిగుమతులు పెరుగుదల, దేశీ పరిశ్రమ మీద వాటి ప్రభావాలపై తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయా శాఖలు, పరిశ్రమ వర్గాలకు ప్రభుత్వం సూచించింది. భారత్ నుంచి మొత్తం ఎగుమతుల్లో చైనా వాటా 4 శాతమే అయినప్పటికీ దిగుమతుల్లో మాత్రం 15 శాతంగా ఉంటోంది. 2023-24లో చైనాకు భారత్ ఎగుమతులు 16.65 బిలియన్ డాలర్లుగా ఉండగా దిగుమతులు 101.73 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అమెరికాతో మనకు వాణిజ్య మిగులు ఉంటే, చైనాతో మాత్రం ఏకంగా 85 బిలియన్ డాలర్ల లోటు ఉంది.

అదానీ కొలంబో టెర్మినల్ షురూ

పబ్లిక్ ప్రయివేట్ భాగస్వామ్యంలో ఏర్పాటు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ తాజాగా శ్రీలంకలోని కొలంబో పశ్చిమ అంతర్జాతీయ టెర్మినల్(సీడబ్ల్యూఐటీ)ను ప్రారంభించినట్లు వెల్లడించింది. పబ్లిక్ ప్రయివేట్ భాగస్వామ్యంలో అభివృద్ధి చేసిన సీడబ్ల్యూఐటీని కన్సార్షియం నిర్వహించనున్నట్లు తెలియజేసింది. కంపెనీ అధ్యక్షతన శ్రీలంక దిగ్గజం జాన్ కీల్స్ హోల్డింగ్స్ పీఎల్‌సీ, శ్రీలంక పోర్ట్స్ అథారిటీ కన్సార్షియంలో భాగమైనట్లు పేర్కొంది. 35ఏళ్ల కాలానికి నిర్మించు, నిర్వహించు, బదిలీ చేయి(బీఓటీ) పద్ధతిలో ఒప్పందం అమలుకానున్నట్లు వివరించింది. 80 కోట్ల డాలర్ల పెట్టుబడులతో 1,400 మీటర్ల పొడవు, 20 మీటర్ల లోతుతో అభివృద్ధి చేసిన కొలంబో టెర్మినల్ వార్షికంగా 3.2 మిలియన్ టీఈయూను హ్యాండిల్ చేయగలదని తెలియజేసింది. కొలంబోలో ఇది తొలి డీప్‌వాటర్ టెర్మినల్‌కాగా.. పూర్తి ఆటోమేటిడ్‌గా ఏర్పాటైన్నట్లు పేర్కొంది. తద్వారా కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యాలు మెరుగుపడటం, వెస్సల్ టర్న్ అరౌండ్ సమయం తగ్గడం వంటి సౌకర్యాలకు వీలు కలగనున్నట్లు తెలియజేసింది.

ఐపీవో సెయిలింగ్‌కు బోట్ రెడీ

- గోప్యతా విధానంలో సెబీకి ప్రాస్పెక్టస్
- ఇటీవల రహస్య పద్ధతికే కంపెనీల మొగ్గు



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ డివైస్‌ల దేశీ స్టార్టప్ ఇమేజిన్ మార్కెటింగ్ మరోసారి పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముందస్తు గోప్యతా విధానంలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. బోట్ బ్రాండుతో వేరబుల్స్, ఆడియో తదితర ప్రొడక్టులు తయారు చేసే కంపెనీ ఇంతక్రితం 2022 జనవరిలోనూ సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. తద్వారా రూ. 2,000 కోట్ల సమీకరణకు ప్రణాళికలు వేసినప్పటికీ ఇష్యూ చేపట్టలేదు. కాగా.. గోప్యతా విధానంలో దాఖలు చేసే ప్రాస్పెక్టస్ వివరాలు చివరివరకూ వెల్లడించవలసిన ఆవశ్యకత లేని సంగతి తెలిసిందే. ఇదేవిధంగా తప్పనిసరిగా పబ్లిక్ ఇష్యూ చేపట్టవలసిన అవసరం సైతం ఉండదు. 2013లో అమన్ గుప్తా, సమీర్ మెహతా ఏర్పాటు చేసిన ఇమేజిన్ మార్కెటింగ్ ఆడియో గేర్, వేరబుల్స్, మొబైల్ యాక్సెసరీస్ తదితర ప్రొడక్టులను బోట్ బ్రాండుతో రూపొందిస్తోంది. ఇటీవల గోప్యతా విధానంలో ఐపీవో ప్రాస్పెక్టస్ దాఖలు చేస్తున్న కంపెనీల సంఖ్య పెరుగుతుండటం గమనార్హం! కొద్ది రోజులక్రితమే టాటా గ్రూప్ ఫైనాన్షియల్ సర్వీసుల దిగ్గజం టాటా క్యాపిటల్, ఎడ్‌టెక్ యూనికార్న్ ఫిజిక్స్‌వాలా సైతం ఇదే పద్ధతిని ఆశ్రయించాయి. 2024లో ఫుడ్ డెలివరీ దిగ్గజం స్విగ్గీ, సూపర్‌మార్ట్ దిగ్గజం విశాల్ మెగా మార్ట్ రహస్య విధానంలో ప్రాస్పెక్టస్ దాఖలు చేసి లిస్టయిన విషయం విదితమే! టాటా ప్లే(గతంలో టాటా స్కై) తొలిసారి గోప్యతా మార్గంలో ప్రాస్పెక్టస్ దాఖలు చేసి సెబీ అనుమతి పొందింది. అయితే ఐపీవో చేపట్టలేదు.

ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ రుణ పరిష్కారం

తాజాగా 197 సంస్థలకు రూ. 45,281 కోట్లు

న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ గ్రూప్ 2025 మార్చికల్లా 197 సంస్థలకు చెందిన రూ. 45,281 కోట్ల రుణాలను పరిష్కరించినట్లు వెల్లడించింది. దివాలా అపిలేట్ ట్రిబ్యునల్ ఎన్‌సీఎల్ఏటీకి తాజాగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఈ అంశాలను పేర్కొంది. ఇది 2024 అక్టోబర్ 28కల్లా పరిష్కారం చూపిన రూ. 38,082 కోట్ల రుణాలతో పోలిస్తే ఇవి 19 శాతం అధికంకావడం గమనార్హం! 302 సంస్థలకు రూ. 61,000 కోట్ల రుణ పరిష్కార లక్ష్యంలో భాగంగా 2025 మార్చి31కల్లా 197 సంస్థలకు రూ. 45,281 కోట్లు పరిష్కరించినట్లు వివరించింది. వెరసి ఇకపై 105 సంస్థల రుణాలను పరిష్కరించవలసి ఉన్నట్లు తెలియజేసింది. వీటిలో 57 సంస్థలకు మాత్రమే మారటోరియం రక్షణ అవసరమున్నట్లు వెల్లడించింది.

ఆర్‌బీఐ పాలసీ సమీక్ష షురూ...

పావు శాతం వడ్డీ రేట్ల కోత అంచనాలు



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష సోమవారం ప్రారంభమైంది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సారథ్యంలోని ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) బుధవారం ప్రకటించనుంది. ఓవైపు ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం మరోవైపు అమెరికా టారిఫ్‌ల షాక్‌ల నుంచి ఎకానమీకి ఊతమివ్వాల్సిన పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఏప్రిల్ సమావేశంలో కీలక పాలసీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చనే అంచనాలు నెలకొన్నాయి. 2020 మే తర్వాత తొలిసారిగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆర్‌బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఇది 6.25 శాతానికి దిగి వచ్చింది. ఈ ఏడాది మొత్తం మీద 100 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశం ఉందని ఎస్‌బీఐ ఎకనమిక్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ ఒక నివేదికలో అంచనా వేసింది. ఫిబ్రవరి, ఏప్రిల్‌లో రెండు విడతల్లో మొత్తం మీద అర శాతం చొప్పున తగ్గించి, జూన్ సమీక్షలో విరామం తర్వాత ఆగస్టు నుంచి మరో రెండు విడతల్లో ఇంకో అర శాతం తగ్గించవచ్చని అభిప్రాయపడింది.

కొత్త ఫీచర్లతో అర్బన్ క్రూయిజర్ హైరైడర్



న్యూఢిల్లీ: అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌లో కొత్త ఫీచర్లను జోడించినట్లు టయోటా కిర్లోస్కర్ మోటర్స్ (టీకేఎం) వెల్లడించింది. అదనపు భద్రత కోసం 6 ఎయిర్‌బ్యాగ్స్‌ను ఇప్పుడు అన్ని వేరియంట్స్‌లోను ప్రామాణికంగా అందిస్తున్నట్లు తెలిపింది. అలాగే, ఏడబ్ల్యూడీ వేరియంట్‌లో 5 స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్ స్థానంలో 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్, నిర్దిష్ట వేరియంట్స్‌లో ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ (ఈపీబీ)ని ప్రవేశపెట్టినట్లు వివరించింది. సరికొత్త ఫీచర్లున్న హైరైడర్ ధర రూ. 11.34 లక్షల నుంచి (ఎక్స్‌షోరూం) ప్రారంభమవుతుంది.

బ్యాంకులు రూ. 14 వేల కోట్లు తీసుకున్నాయ్

- నేను కట్టాల్సిన దానికన్నా రెట్టింపే రాబట్టాయి..
- విజయ్ మాల్యా వెల్లడి



న్యూఢిల్లీ: భారతీయ బ్యాంకులు తన ఆస్తులను అటాచ్ చేయడం ద్వారా తాను కట్టాల్సిన దానికంటే రెట్టింపు మొత్తాన్ని రాబట్టుకున్నాయని పరారీలో ఉన్న కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ మాజీ చీఫ్ విజయ్ మాల్యా వ్యాఖ్యానించారు. ఇందుకు 2024-25 ఆర్థిక శాఖ వార్షిక నివేదికలోని గణాంకాలే సాక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఉద్దేశపూర్వక ఎగవేతదారుల నుంచి రాబట్టిన మొత్తాన్ని ప్రస్తావిస్తూ, మాల్యా కేసులో రూ. 14,131.8 కోట్లు రికవర్ అయ్యిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ నివేదికలో పేర్కొన్నట్లు మాల్యా వివరించారు. డెట్ రికవరీ ట్రిబ్యునల్ ఆదేశించిన రూ. 6,203 కోట్ల రికవరీకి ఇది రెట్టింపు మొత్తం అని ఆయన చెప్పారు. తనను భారత్‌కు అప్పగించాలంటూ బ్రిటన్ కోర్టులో నడుస్తున్న కేసులో ఇది కీలక సాక్ష్యంగా ఉండబోతోందన్నారు. బ్యాంకులు దీన్ని ఏ విధంగా కోర్టులో సమర్థించుకుంటాయో చూడాలని వ్యాఖ్యానించారు. వివిధ బ్యాంకులకు కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రూ. 9,000 కోట్లు బాకీపడిన కేసుకు సంబంధించి 2016 మార్చిలో మాల్యా బ్రిటన్‌కు పారిపోయారు. దీంతో మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా పరిగణిస్తున్నారు. ఆయన్ను స్వదేశం రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

భారత్-బ్రిటన్ ఆర్థిక సమావేశానికి ఆర్థిక మంత్రి



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 8 నుంచి 13 వరకు బ్రిటన్, ఆస్ట్రియాలో అధికారికంగా పర్యటించనున్నారు. ఈ సందర్భంగా లండన్‌లో మంత్రుల స్థాయిలో జరిగే 13వ భారత్-బ్రిటన్ ఆర్థిక సమావేశంలో (ఈఎఫ్‌డీ) పాల్గొనున్నారు. పెట్టుబడులు, ఆర్థిక సేవలు, ట్యాక్సేషన్ మొదలైన అంశాల్లో పరస్పర సహకారానికి సంబంధించి మంత్రులు, అధికారుల స్థాయుల్లో సంప్రదింపులకు ఇది వేదికగా నిలుస్తుంది. మరోవైపు బ్రిటన్, ఆస్ట్రియాల్లో ద్వైపాక్షిక సమావేశాల్లో మంత్రి పాల్గొంటారు. మేధావుల సంఘాలు, ఇన్వెస్టర్లు, వ్యాపార దిగ్గజాలతో కూడా భేటీ అవుతారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-4-2025

విశాఖ	445-00
చిత్తూరు	480-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,462
ఎన్ఎస్ఈ	1,24,335
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,10,384
ఎఫ్ఐఐ	- 9,040
డీఐఐ	+ 12,122

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	60.94 (రాత్రి 11.30కు)	$ 61.99 (క్రితం ముగింపు)
బ్రెంట్	64.44 (రాత్రి 11.30కు)	$ 65.58 (క్రితం ముగింపు)

ఇక ఐటీ రంగానికి సవాళ్లు

గ్లోబల్ స్థాయిలో ఆర్థిక మందగమనం

- 2024-25 ఫలితాలపై అనిశ్చితుల ఎఫెక్ట్
- 2025-26కు ఆదాయ అంచనాలు డీలా
- ఐటీ పరిశ్రమ తీరుపై విశ్లేషకుల అభిప్రాయం



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆర్థిక అనిశ్చితులు, ట్రంప్ టారిఫ్‌లతో తలెత్తిన వాణిజ్య భయాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో దేశీ సాఫ్ట్‌వేర్ పరిశ్రమపై ప్రతికూల ప్రభావాన్ని చూపనున్నట్లు పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

దీనికితోడు యూరోపియన్ దేశాలపైనా టారిఫ్‌ల అంశం ప్రతికూల ప్రభావాన్ని చూపనున్నట్లు వివరించారు. వెరసి ఐటీ పరిశ్రమకు అతిపెద్ద మార్కెట్లుగా నిలుస్తున్న యూఎస్, యూరప్‌లలో ప్రతీకార టారిఫ్‌లు మందగమనం లేదా ఆర్థిక మాంద్యానికి దారి చూపనున్నట్లు ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. ఇది ప్రపంచవ్యాప్త ఆందోళనలకు కారణమవుతున్నట్లు ఐటీ నిపుణులు విశ్లేషించారు. ఈ నేపథ్యంలో ఇటీవలే ముగిసిన గత ఆర్థిక సంవత్సరం(2024-25) చివరి త్రైమాసిక(జనవరి-మార్చి) ఫలితాలు నిరాశపరచవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా ప్రస్తుత ఏడాది(2025-26) ఆదాయ అంచనాలు(గైడెన్స్) నీరసించవచ్చని భావిస్తున్నారు.

దిగ్గజాలు రెడీ

ఇకపై సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజాలు 2024-25 క్యూ4(జనవరి-మార్చి) ఫలితాల విడుదలకు సిద్ధపడుతున్నాయి. ఇదే సమయంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)తోపాటు తొలి త్రైమాసిక(ఏప్రిల్-జూన్) ఫలితాలపై అంచనాలు(గైడెన్స్) ప్రకటించనున్నాయి. తొలుత టాటా గ్రూప్ దిగ్గజం టీసీఎస్ 10న ఫలితాలు విడుదల చేయనుంది. ఈ బాటలో విప్రో 15న, ఇన్ఫోసిస్ 17న, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 22న, టెక్ మహీంద్రా 24న పనితీరు వెల్లడించనున్నాయి.

వ్యయాలు తగ్గవచ్చు

ఐటీ సేవలకు అతిపెద్ద విభాగం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ)తోపాటు.. కీలకమైన రిటైల్, తయారీ రంగాలలో కంపెనీల వ్యయాలు తగ్గనున్నట్లు భావిస్తున్నారు. విచక్షణాధారిత వ్యయాలపై ప్రతికూల ప్రభావం కనిపించవచ్చని చెబుతున్నారు. దీంతో సమీప భవిష్యత్‌లో రికవరీకి చాన్స్ తక్కువేనని స్పష్టం చేస్తున్నారు. వెరసి రానున్న రెండు త్రైమాసికాలలో ఐటీ కంపెనీల ఫలితాలు నిరాశపరచడానికితోడు ఆదాయ అంచనాలలో కోతలకు వీలున్నట్లు తెలియజేశారు. ప్రస్తుత టారిఫ్ వార్ కారణంగా రిటైల్, తయారీ రంగాలు డీలా పడవచ్చని అభిప్రాయపడ్డారు. అయితే సర్వైవల్ వ్యయాలు తప్పకపోవచ్చని, జెన్ఏఐకు సైతం పెట్టుబడుల కేటాయింపులు పెరగవచ్చని మరికొంతమంది నిపుణులు పేర్కొన్నారు. ఫలితంగా ఈ ఏడాది(2025-26) ద్వితీయార్ధం(అక్టోబర్-మార్చి)లో ఆర్థిక స్థిరత్వం, ఏఐ సేవలకు డిమాండ్ వంటి అంశాలు తిరిగి ఐటీ సేవలకు సానుకూలతను తీసుకువచ్చే అవకాశమున్నట్లు అభిప్రాయపడ్డారు.

రుణ చెల్లింపుల్లో కాఫీ డే వైఫల్యం

2025 మార్చి 31కల్లా రూ. 425.38 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ తాజాగా 2025 మార్చి31కల్లా రూ. 425.38 కోట్ల రుణ చెల్లింపుల్లో విఫలమైనట్లు వెల్లడించింది. వీటిలో అసలు, వడ్డీ కలసి ఉన్నట్లు పేర్కొంది. బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థల రుణాలుసహా అన్‌లిస్టెడ్ రుణ సెక్యూరిటీలు(ఎన్‌సీడీ, ఎన్‌సీఆర్‌పీఎస్) ఉన్నట్లు తెలియజేసింది. అసెట్ రిజల్యూషన్ ద్వారా రుణాలు తగ్గించుకుంటున్న కంపెనీ లిక్విడిటీ సంక్షోభం కారణంగా రుణ చెల్లింపులు ఆలస్యమవుతున్నట్లు వివరించింది. చెల్లింపుల వైఫల్యం నేపథ్యంలో రుణదాతలు లోన్ రీకాల్ నోటీసుల జారీతోపాటు.. చట్టపరమైన చర్యలు సైతం చేపడుతున్నట్లు పేర్కొంది. లోన్ రీకాల్ నోటీసులు, న్యాయ వివాదాలు, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పెండింగ్‌లో ఉండటం వంటి అంశాల కారణంగా 2021 ఏప్రిల్ నుంచి వడ్డీ మదింపు చేపట్టలేదని వెల్లడించింది.


రిషభ్ పంత్

నెహ్రా మాటల్లో 'ఆనందం' వెతుక్కున్నా!

రిషభ్ పంత్ వ్యాఖ్య

● కారు ప్రమాదంతో చాలా మారానన్న లక్నో జట్టు కెప్టెన్

న్యూఢిల్లీ: కారు ప్రమాదానికి గురై కోలుకుంటున్న సమయంలో భారత మాజీ ఆటగాడు ఆశిష్ నెహ్రా తనకు మానసికంగా ధైర్యాన్నిస్తూ అండగా నిలిచాడని వికెట్ కీపర్ రిషభ్ పంత్ గుర్తు చేసుకున్నాడు. అతని స్ఫూర్తిదాయక మాటలతో తాను ప్రతికూల పరిస్థితులను అధిగమించానని పంత్ అన్నాడు. 'కష్టకాలంలో ఒక సలహా నాపై బాగా ప్రభావం చూపించింది. భారత మాజీ పేసర్ ఆశిష్ నెహ్రా నేను ఆడే స్థానిక క్లబ్‌లో కూడా సీనియర్. ఆయన నా వద్దకు వచ్చి నా ఆరోగ్యం గురించి వాకబు చేసిన తర్వాత ఆయన ఒకే ఒక మాట అన్నాడు. నీకు సంతోషం కలిగించే పనులు మాత్రమే చేస్తూ ఉండు. నేను కూడా గతంలో చాలా సార్లు గాయాలబారిన పడ్డాను. అయినా సరే అన్నీ మరచి ఆనందంగా ఉండటం ముఖ్యం అని నెహ్రా చెప్పాడు. నేను కోలుకునే క్రమంలో ఈ మాటలు బాగా ప్రభావం చూపించాయి' అని పంత్ వివరించాడు. ఒకటి, రెండు రోజుల్లోనే కోలుకోలేనని వాస్తవం అర్థమైన తర్వాత తనను తాను తిట్టుకోవడం మానేశానని, ప్రతికూల విషయాల గురించి ఆలోచించడం తగ్గించాలని పంత్ చెప్పాడు. కారు ప్రమాదం వల్ల తాను జీవితాన్ని చూసే విధానం మారిందని రిషభ్ పంత్ భావోద్వేగంతో అన్నాడు. ఇది క్రికెట్ గురించి తన ఆలోచనలను కూడా మార్చేసిందని భారత వికెట్ కీపర్ పేర్కొన్నాడు. 'ప్రమాదం తర్వాత నేను చాలా చిన్న చిన్న పనులు కూడా సొంతంగా చేసుకోలేకపోయేవాడిని. అంతా బాగున్నట్లు మనం ఇలాంటివి పట్టించుకోం. కానీ వాటి విలువ నాకు అప్పుడు అర్థమైంది. క్రీడల్లో కూడా ప్రతి రోజూ బాగా ఆడాలనే కోరుకుంటాం. కానీ అది ఎప్పుడూ జరగదు. ఇలాంటి అంశాల్లో ప్రమా దం తర్వాత నా ఆలోచనా ధోరణి మారింది' అని పంత్ వెల్లడించాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న పంత్ ప్రదర్శన బాగా లేదు. అయితే తాను అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నానని, పరిస్థితి మారుతుందని అతను ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఇంగ్లండ్ కెప్టెన్‌గా హ్యారీ బ్రూక్

వన్డే, టి20 జట్ల సారథ్య బాధ్యతలు



లండన్: ఇంగ్లండ్ క్రికెట్ జట్టు వన్డే, టి20 ఫార్మాట్‌లకు కొత్త కెప్టెన్‌గా హ్యారీ బ్రూక్ ఎంపికయ్యాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో బ్రూక్‌కు సారథ్య బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ప్రకటించింది. టెస్టు టీమ్‌కు ఇప్పటికే బెన్ స్టోక్స్ కెప్టెన్‌గా ఉన్నాడు. చాంపియన్స్ ట్రోఫీలో పేలవ ప్రదర్శన తర్వాత జోస్ బట్లర్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. ఇప్పటి వరకు వైస్ కెప్టెన్‌గా ఉన్న బ్రూక్... బట్లర్ గైర్హాజరులో ఆస్ట్రేలియాపై ఐదు వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ సిరీస్‌ను ఇంగ్లండ్ 3-2తో గెలుచుకుంది. 2018 అండర్-19 వరల్డ్ కప్‌లో బ్రూక్ ఇంగ్లండ్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. జాతీయ జట్టు తరఫున ఆడిన 26 వన్డేల్లో 34.00 సగటుతో 816 పరుగులు చేసిన బ్రూక్... 44 టి20ల్లో 146.15 స్ట్రయిక్‌రేట్‌తో 798 పరుగులు సాధించాడు. 2022లో టి20 వరల్డ్ కప్ గెలిచిన జట్టులో బ్రూక్ సభ్యుడిగా ఉన్నాడు.

ఆంధ్రప్రదేశ్‌కు మూడో ఓటమి

ఝాన్సీ (ఉత్తరప్రదేశ్): జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు వరుసగా మూడో పరాజయం చవిచూసింది. 'బి' డివిజన్‌లో భాగంగా పూల్ 'ఎ' మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 3-5 గోల్స్ తేడాతో ఉత్తరాఖండ్ చేతిలో ఓడిపోయింది. ఆంధ్రప్రదేశ్ తరఫున రమణ బల్లా వెంకట్ (34వ నిమిషంలో), బోయ శివ (37వ నిమిషంలో), రాగిపాటి సందీప్ కుమార్ (49వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఉత్తరాఖండ్ జట్టుకు విశాల్ కుమార్ (10వ, 32వ నిమిషాల్లో), కెప్టెన్ దీపక్ సింగ్ (12వ, 50వ నిమిషాల్లో) రెండు గోల్స్ చొప్పున అందించగా... దీపాన్షు అస్వాల్ (20వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. ఐదు జట్లున్న పూల్ 'ఎ'లో ఆంధ్రప్రదేశ్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడి చివరిదైన ఐదో స్థానంలో ఉంది. బుధవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ జట్టుతో ఆంధ్రప్రదేశ్ జట్టు తలపడుతుంది.



మెయిన్ 'డ్రా'కు నగాల్ అర్హత

మోంజా (ఇటలీ): భారత పురుషుల టెన్నిస్ సింగిల్స్ నంబర్‌వన్ సుమిత్ నగాల్ మోంజా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టోర్నీలో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. ఫెడరికో ఇనాకోన్ (ఇటలీ)తో సోమవారం జరిగిన క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో సుమిత్ నగాల్ 6-4, 6-2తో గెలుపొంది మెయిన్ 'డ్రా'లో చోటు సంపాదించాడు. 93 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నగాల్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. అంతకుముందు క్వాలిఫయింగ్ తొలి రౌండ్ మ్యాచ్‌లో నగాల్ 5-7, 7-6 (7/2), 6-2తో ఎర్గీ కిర్‌కిన్ (టర్కీ)పై గెలుపొందాడు. మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ఆస్ట్రియా ప్లేయర్ ఫిలిప్ మిసోలిచ్‌తో సుమిత్ ఆడతాడు.

28వ ర్యాంక్‌లో యూకీ బాంబ్రీ

సోమవారం విడుదల చేసిన ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో యూకీ బాంబ్రీ భారత నంబర్ వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. యూకీ రెండు స్థానాలు పడిపోయి 28వ ర్యాంక్‌లో నిలిచాడు. ఆరేళ్లుగా డబుల్స్‌లో భారత నంబర్‌వన్‌గా ఉన్న రోహన్ బోపన్న గతవారం టాప్ ర్యాంక్‌ను యూకీకి కోల్పోయాడు. ప్రస్తుతం బోపన్న 43వ స్థానంలో ఉన్నాడు.


ధోని

'మరో 10 నెలల సమయం ఉంది'

రిటైర్మెంట్ ఆలోచనపై ఎమ్మెస్ ధోని

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో తాజా ప్రదర్శనను బట్టి చూస్తే మహేంద్ర సింగ్ ధోని రిటైర్మెంట్‌పై మళ్లీ చర్చ మొదలైంది. గత మూడు సీజన్లుగా బ్యాటింగ్‌లో ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్న అతను బలవంతంగా కొనసాగుతున్నాడని అన్ని వైపుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ సీజన్‌లో కూడా నాలుగు మ్యాచ్‌లలో కలిపి ధోని 76 పరుగులు మాత్రమే చేశాడు. ఈ నేపథ్యంలో ధోని ఆటకు గుడ్‌బై చెబితే మంచిదని చాలా మంది సూచిస్తున్నారు. దీనిపై ఎమ్మెస్ స్వయంగా స్పందించాడు. తన రిటైర్మెంట్‌పై నిర్ణయించుకునేందుకు చాలా సమయం ఉందని అతను వ్యాఖ్యానించాడు. వచ్చే ఐపీఎల్ వరకు తనకు అవకాశం ఉందని అతను అన్నాడు. 'ప్రస్తుతం నేను ఐపీఎల్‌లో ఇంకా ఆడుతున్నాను. ఏడాదికి ఒకసారి ఇక్కడ మాత్రమే బరిలోకి దిగుతున్నాను. ఇప్పుడు నాకు 43 ఏళ్లు. లీగ్ తాజా సీజన్ ముగిసే వరకు 44 ఏళ్లు వస్తాయి. కాబట్టి మరో సంవత్సరం లీగ్ ఆడాలా లేదా అని నిర్ణయం తీసుకునేందుకు నా వద్ద 10 నెలల సమయం ఉంది. నా శరీరం ఎలా స్పందిస్తుందనే దానిపైనే ఇది ఆధారపడి ఉంటుంది' అని ధోని స్పష్టం చేశాడు. మైదానంలో తాను సాధించిన ఘనతల పట్ల సంతృప్తిగా ఉన్నట్లు అతను వెల్లడించాడు. 'నేను సంతోషంగా ఉన్నానా లేదా అనే ప్రశ్నే తలెత్తదు. ఏం జరగాలో అది జరిగిపోయింది. దానిని మార్చలేము. మీకు ఎదురయ్యే వాటన్నింటినీ స్వీకరించాలి. ఎందుకంటే గతంలో ఏం జరిగినా నా అంతర్జాతీయ పరుగులకు ఒక్క పరుగు కూడా అదనంగా జోడించలేను. ఒక్క పరుగు కూడా ఎవ్వరూ తగ్గించలేరు' అని భారత మాజీ కెప్టెన్ తన మనసులో మాటను వెల్లడించాడు.



'ప్లే ఆఫ్' బెర్త్ లక్ష్యంగా...

బిల్లీ జీన్ కింగ్ కప్ బరిలో భారత జట్టు ● పుణేలో నేటి నుంచి ఆసియా ఓసియానియా గ్రూప్-1 క్వాలిఫయింగ్ టోర్నీ

పుణే: ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 మహిళల టెన్నిస్ టోర్నమెంట్ కోసం భారత జట్టు సిద్ధమైంది. నేటి నుంచి ఐదు రోజులపాటు పుణే వేదికగా జరగనున్న ఈ టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేయడమే లక్ష్యంగా భారత టెన్నిస్ ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు. తెలుగమ్మాయిలు సహజ యామలపల్లి, భమిడిపాటి శ్రీవల్లి రష్మికతో పాటు అంకితా రైనా, వైదేహి, ప్రార్థన తొంబారేలతో కూడిన మన జట్టు ముమ్మర సాధన చేస్తోంది. ఇటీవల ముంబై డబ్ల్యూటీఏ టోర్నమెంట్ సెమీఫైనల్‌కు చేరిన యువ సంచలనం మాయా రాజేశ్వరన్ రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికైంది. రౌండ్ రాబిన్ లీగ్ ఫార్మాట్‌లో జరగనున్న ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు న్యూజిలాండ్, చైనీస్ తైపీ, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, హాంకాంగ్ జట్లు పాల్గొంటున్నాయి. గతేడాది మూడో స్థానంలో నిలవడం ద్వారా వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్స్ దశకు అర్హత పొందలేకపోయిన భారత జట్టు ఈసారి ఆ అవాంతరాలను అధిగమించాలని పట్టుదలతో ఉంది. 'ప్రస్తుతానికి మా లక్ష్యం ప్లేయర్లను శారీరకంగా, మానసికంగా తాజాగా ఉంచడమే. ఈ వారం చాలా ముఖ్యమైంది. ఫిట్‌గా ఉంటేనే కోర్ట్‌లో చురుగ్గా కదలగలరు' అని భారత కెప్టెన్ విశాల్ ఉప్పల్ పేర్కొన్నాడు. టోర్నమెంట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని డైరెక్టర్ సుందర్ అయ్యర్ పేర్కొన్నారు. ప్రేక్షకులను ఉచితంగా అనుమతించనున్నట్లు వెల్లడించిన సుందర్ అయ్యర్... టోర్నీకి 'సుహానా' గ్రూప్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తుందని వెల్లడించారు. ఐటా, ఐటీఎఫ్ మహారాష్ట్ర టెన్నిస్ సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీని డీడీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.



విజేత పెగూలా

చార్ల్స్‌టన్ : అమెరికా టెన్నిస్ స్టార్ జెస్సికా పెగూలా తన కెరీర్‌లో ఎనిమిదో సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. చార్ల్స్‌టన్ ఓపెన్ డబ్ల్యూటీఏ-500 టోర్నీలో పెగూలా చాంపియన్‌గా అవతరించింది. అమెరికాకే చెందిన సోఫియా కెనిన్‌తో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో పెగూలా 6-3, 7-5తో గెలుపొందింది. ఈ సీజన్‌లోని పెగూలాకిది రెండో టైటిల్. ఈ విజయంతో పెగూలా తన కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌ను అందుకుంది. విజేతగా నిలిచిన పెగూలాకు 1,64,000 డాలర్ల (రూ. 1 కోటీ 40 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

మిల్లర్, డసెన్‌లకు హైబ్రిడ్ కాంట్రాక్ట్

● 18 మంది ఆటగాళ్లకు వార్షిక కాంట్రాక్ట్ ప్రకటించిన క్రికెట్ దక్షిణాఫ్రికా
● జాబితాలో హెన్రిచ్ క్లాసెన్‌కు చోటుపై త్వరలో నిర్ణయం

కేప్‌టౌన్: వచ్చే ఏడాది కాలానికి క్రికెట్ దక్షిణాఫ్రికా (సీఎస్‌ఏ) తమ ఆటగాళ్లకు కొత్త కాంట్రాక్ట్‌లను ప్రకటించింది. ఈ ఏడాది జూన్ 1 నుంచి వచ్చే ఏడాది మే 31 వరకు ఈ కాంట్రాక్ట్ ఉంటుంది. 18 మంది ఆటగాళ్లకు రెగ్యులర్ కాంట్రాక్ట్‌లు ఇవ్వగా... తొలిసారి హైబ్రిడ్ కాంట్రాక్ట్‌లను ప్రవేశపెట్టారు. స్టార్ ప్లేయర్ డేవిడ్ మిల్లర్‌తోపాటు వాన్ డెర్ డసెన్‌కు హైబ్రిడ్ కాంట్రాక్ట్ కట్టబెట్టారు. హైబ్రిడ్ కాంట్రాక్ట్ కారణంగా మిల్లర్, డసెన్‌లు తాము ఎంచుకున్న ద్వైపాక్షిక సిరీస్‌లలో, ఐసీసీ టోర్నీలలో పాల్గొనే అవకాశం ఉంటుంది. స్టార్ ప్లేయర్ హెన్రిచ్ క్లాసెన్ పేరు కాంట్రాక్ట్ జాబితాలో లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే ఈ విషయంపై సీఎస్‌ఏ వివరణ ఇచ్చింది. క్లాసెన్‌తో కాంట్రాక్ట్ విషయంపై చర్చలు జరుగుతున్నాయని, ఒక కొలిక్కి వచ్చాక నిర్ణయం వెలువరిస్తామని తెలిపింది. 'జాతీయ కాంట్రాక్ట్‌లు పొందిన ఆటగాళ్లందరికీ, ముఖ్యంగా తొలిసారి ఈ జాబితాలో చోటు పొందిన వారికి నా అభినందనలు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్, స్వదేశంలో 2027లో జరిగే వన్డే వరల్డ్‌కప్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ జాబితా రూపొందించాం' అని దక్షిణాఫ్రికా జాతీయ జట్ల హై పెర్ఫార్మెన్స్ డైరెక్టర్ ఎనోచ్ ఎన్‌క్వే తెలిపారు. లిజాడ్ విలియమ్స్, సెనురన్ ముత్తుస్వామి, క్వెనా మాఫాకలకు తొలిసారి కాంట్రాక్ట్‌లు లభించాయి.


డసెన్

వచ్చే ఏడాది కాలంలో దక్షిణాఫ్రికా స్వదేశంలో వెస్టిండీస్‌తో ఆడటంతోపాటు జింబాబ్వే, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, పాకిస్తాన్, భారత్‌లో పర్యటించనుంది.

కాంట్రాక్ట్ పొందిన దక్షిణాఫ్రికా క్రికెటర్ల జాబితా: తెంబా బవుమా, డేవిడ్ బెడింగమ్, నాండ్రె బర్గర్, గెరాల్డ్ కొయెట్జీ, టోనీ డి జార్జి, రీజా హెండ్రిక్స్, మార్కో యాన్సెన్, కేశవ్ మహరాజ్, క్వెనా మఫాక, మార్క్‌రమ్, వియాన్ ముల్డర్, సెనురన్ ముత్తుస్వామి, ఇన్‌గిడి, రబడ, రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెరీన్, లిజాడ్ విలియమ్స్. డేవిడ్ మిల్లర్, వాన్ డెర్ డసెన్ (హైబ్రిడ్ కాంట్రాక్ట్).


మిల్లర్

సింధుపైనే మరోసారి ఆశలు

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. పురుషుల సింగిల్స్, మహిళల సింగిల్స్, పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో మ్యాచ్‌లుంటాయి. మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ మాజీ చాంపియన్ పీవీ సింధుపైనే భారత్ పతకావకాశాలు ఆధారపడి ఉన్నాయి. తొలి రౌండ్‌లో ప్రపంచ 34వ ర్యాంకర్ ఎస్టెర్ వర్దోయో (ఇండోనేసియా)తో సింధు ఆడనుంది. ఈ టోర్నీ చరిత్రలో సింధు రెండుసార్లు (2014, 2022) కాంస్య పతకాలు సాధించింది. భారత్‌కే చెందిన సైనా నెహ్వాల్ అత్యధికంగా మూడు కాంస్య పతకాలు గెలిచింది. ఈసారీ సింధు కాంస్యం నెగ్గితే సైనా రికార్డును సమం చేస్తుంది. 63 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో మహిళల సింగిల్స్‌లో భారత్ నుంచి ఇప్పటి వరకు ఎవరూ ఫైనల్ చేరుకోలేకపోయారు. సింధుతోపాటు భారత్ తరఫున మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్, అనుపమ, ఆకర్షి కశ్యప్ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. పురుషుల సింగిల్స్‌లో భారత్ తరఫున లక్ష్య సేన్, ప్రణయ్, ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జి బరిలో ఉన్నారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం; మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ జోడీ ఈ టోర్నీ నుంచి వైదొలిగారు.



ఇబ్బందుల్లో ఉన్నా.. అందుకే చోరీ చేస్తున్నా

క్షమాపణ లేఖ వదిలివెళ్లిన మంచి దొంగ

ఖర్గావ్: 'జుజర్ భాయ్.. నిండా అప్పుల్లో మునిగి ఉన్నా..అప్పులోళ్లు రోజూ వేధించుకు తింటున్నారు..వాళ్లతో వేగలేక తప్పనిసరి పరిస్థితుల్లో ఈ దొంగతనం చేస్తున్నా..అదీ శ్రీరామ నవమి నాడు..! ఏమీ అనుకోకు, నీ డబ్బు మళ్లీ ఆరు నెలల్లో తిరిగి ఇచ్చేస్తా.. ఇది నా వాగ్దానం 'అంటూ ఓ మంచి దొంగ ఓ దుకాణం నుంచి రూ.2.45 లక్షలు ఎత్తుకెళ్లాడు. మధ్యప్రదేశ్‌లోని ఖర్గావ్ జిల్లా కొత్వాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జమీదార్ మొహల్లాలో ఆదివారం రాత్రి ఈ ఘరానా చోరీ ఘటన చోటుచేసుకుంది. మరునాడు దుకాణం తెరిచిన జుజర్ అలీ బొహ్రాకు నగదు ఉంచిన బ్యాగులో ఈ లేఖ కనిపించింది. ఆశ్చర్యపోయిన ఆయన విషయం పోలీసులకు తెలిపారు. చోరుడు ప్రింటెడ్ లేఖలో దుకాణం యజమానిని జుజర్ భాయ్ అంటూ మర్యాదగా సంబోధించాడని పోలీస్ ఎస్సై అర్షద్ ఖాన్ చెప్పారు. బ్యాగులో ఉంచిన రూ.2.84 లక్షలకుగాను అతడు రూ.2.45 లక్షలు మాత్రమే తీసుకెళ్లి, రూ.38వేలను లేఖతోపాటు బ్యాగులోనే వదిలివెళ్లాడని యజమాని తెలిపాడన్నారు. రామ నవమి పండగ నాడు ఇలా దొంగతనానికి పాల్పడుతున్నందుకు క్షమించాలని కూడా దుకాణం యజమానిని అతడు కోరినట్లు ఎస్సై వివరించారు. 'నేనుండేది మీ చుట్టుపక్కల ప్రాంతంలోనే. నాకు చాలా అప్పులున్నాయి. అప్పిచ్చిన వాళ్లు రోజూ నా ఇంటికి వస్తున్నారు. దొంగతనం చేయాలని నాకు ఏ మాత్రంలేదు. కానీ, గత్యంతరం లేదు. ఈ డబ్బుతో నాకు చాలా అవసరముంది. అయితే, అవసరమైనంత మాత్రమే తీసుకెళ్తున్నా. మిగతాది బ్యాగులోనే వదిలిపెడ్తున్నా. ఆరు నెలల్లో తిరిగి ఇచ్చేస్తా. అప్పుడిక మీరు నన్ను పోలీసులకు అప్పగించొచ్చు' అని అందులో వివరించాడు. అంతేకాదు, ఈ లేఖలో పేర్కొన్న ప్రతి విషయమూ సత్యమేనని స్పష్టం చేశాడన్నారు.



జమ్మూకశ్మీర్ రాజ్‌భవన్‌లో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో పోలీసు అమరులకు నివాళులర్పిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

అంతర్జాతీయ వేదికలపై సహకారం బలోపేతం

భారత్, పోర్చుగీస్ నిర్ణయం

లిస్బన్: ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ వేదికలపై సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని భారత్, పోర్చుగీస్ నిర్ణయించాయి. ప్రస్తుతం పోర్చుగల్ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం ఆ దేశాధ్యక్షుడు మార్సెలో రెబెలో డిసౌజాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు దేశాల ప్రతినిధి బృందాలు పరస్పర ప్రయోజనం కలిగించే అన్ని అంశాలపై చర్చలు జరిపాయి. 'ఇరువురు నేతలు ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన అన్ని ముఖ్యమైన అంశాలను చర్చించారు'అని అనంతరం పోర్చుగీస్ అధ్యక్ష భవనం ఒక ప్రకటన విడుదల చేసింది. పోర్చుగల్ అధ్యక్షుడు మార్సెలో రెబెలోతో నిర్మాణాత్మక, ఫలవంతమైన చర్చలు జరిపినట్లు రాష్ట్రపతి ముర్ము ప్రకటించారు. రెండు దేశాల సంబంధాలు పునఃప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక స్టాంప్‌ను కూడా విడుదల చేశామన్నారు. అంతకుముందు, రాజధాని లిస్బన్ చేరుకున్న రాష్ట్రపతి ముర్ము చారిత్రక ప్రాస డో ఇంపెరియో స్క్వేర్‌లో సైనిక వందనం స్వీకరించారు.

31 మంది మావోల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ, నారాయణపూర్ జిల్లాల్లో సోమవారం 31 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దంతెవాడ జిల్లాలో 26 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఎస్పీ గౌరవ్‌రాయ్ వెల్లడించారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక స్వచ్ఛందంగా బయటకు వచ్చారని తెలిపారు. వీరిలో ముగ్గురిపై రూ.4.50 లక్షల నగదు రివార్డు ఉందని, ప్రభుత్వం తరపున పునరావాసం కల్పిస్తామని ఎస్పీ వెల్లడించారు. ఇక నారాయణపూర్ జిల్లాలో ఐదుగురు మహిళా మావోయిస్టులు అక్కడి పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిపై రూ.లక్ష చొప్పున రివార్డు ఉందని నారాయణపూర్ ఎస్పీ ప్రభాత్‌కుమార్ వెల్లడించారు.

విమానంలో వృద్ధురాలి మృతి

ముంబై: ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలో విషాదం నెలకొంది. ఆదివారం రాత్రి ముంబై నుంచి వారణాసి వెళ్తున్న విమానంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఉత్తర ప్రదేశ్‌లోని మీర్జాపూర్‌కు చెందిన 89 ఏళ్ల సుశీలాదేవి మార్గమధ్యంలో అస్వస్థతకు గురైంది. దాంతో విమానాన్ని అత్యవసరంగా ఛత్రపతి శంభాజీనగర్ విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. వైద్య బృందం పరీక్షించగా ఆమె అప్పటికే మృతి చెందింది. మృతదేహాన్ని శంభాజీనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం విమానం వారణాసికి బయలుదేరింది.

నీటిలో కరిగే ప్లాస్టిక్!

వినూత్నంగా ఆవిష్కరించిన అంకుర సంస్థ

- ప్లాస్టిక్ కరగడంతో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సమస్యకు చెక్‌పెట్టే ఛాన్స్

రిమోట్ కంట్రోల్, ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, టీవీ, కంప్యూటర్, క్యాలిక్యులేటర్, గేమ్ కంట్రోలర్, కీబోర్డ్.. ఇలా చెప్పుకుంటూ పోతే అత్యంత విలువైన లోహాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల సమ్మేళనంగా రూపొందిన ఉపకరణాలెన్నింటినో మనం దైనందిన జీవితంలో వాడి పాడుచేసి పడేస్తున్నాం. ఈ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అలాగే భూమిలో కలుస్తూ భూకాలుష్యానికి కారణమవుతున్నాయి. ఏటా పేరుకుపోతున్న ఇ-వేస్ట్‌లో తిరిగి పునఃశుద్ధికి నోచుకునే లోహాల పరిమాణం అత్యంత సూక్ష్మం. అత్యంత విలువైన, అరుదైన లోహాలు, ఖనిజాలతో తయారైన వస్తువుల నుంచి కేవలం 1 శాతం లోహాలనే తిరిగి రీసైక్లింగ్ చేయగల్గుతున్నాం. ఇలా ఇప్పటికే రూ.5.32 లక్షల కోట్ల విలువైన లోహాలు ఎలక్ట్రానిక్ డివైజ్‌ల నుంచి రీసైక్లింగ్‌కు నోచుకోకుండా మట్టిలో కలిసిపోయాయి. వీటిని ఇలా వృథాగా పోనివ్వకుండా పూర్తిగా ఒడిసిపట్టే అద్భుత ఆలోచనను పెంటాఫామ్ అనే అంకుర సంస్థ అమల్లోకి తెచ్చింది. ఎలక్ట్రానిక్ డివైజ్, దాని సర్క్యూట్‌ను నీటిలో కరిగిపోయే ప్లాస్టిక్ మదర్ బోర్డ్‌కు అమరిస్తే ఆ డివైజ్ పాడయ్యాక నీటిలో ఉంచితే ఆ సర్క్యూట్‌లోని విలువైన లోహాలను తిరిగి సులభంగా సంగ్రహించవచ్చు. ఇలా ఇ-వేస్ట్ సమస్యకు చక్కటి పరిష్కారం చూపుతున్న అద్భుత 'ఆక్వాఫేడ్' ప్లాస్టిక్ కథాకమామిషు ఇదీ..

ఆరు గంటల్లో పూర్తిగా కరుగుతుంది

మూడేళ్ల క్రితం ప్రపంచవ్యాప్తంగా 6.2 కోట్ల టన్నుల ఇ-వేస్ట్ పోగుబడిందని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఈ ఎలక్ట్రానిక్స్ చెత్తను కోట్లాది లారీల్లో నింపితే అవి భూమధ్యరేఖ పొడవునా దారి కడతాయని ఐరాస పేర్కొంది. పాదరసం, లెడ్ వంటి వాటితోపాటు బంగారం వంటి అత్యంత ఖరీదైన లోహాలతో కొన్ని ఎలక్ట్రానిక్ డివైజ్‌ల సర్క్యూట్‌లను తయారుచేస్తారు. భూమి ఎలక్ట్రానిక్ వ్యర్థాల కుప్పగా తయారవుతున్న దారుణ పరిస్థితుల్లో ఓవైపు ఇ-వేస్ట్‌ను తగ్గిస్తూనే మరోవైపు లోహాలను సంగ్రహించేలా ఆక్వాఫేడ్ ప్లాస్టిక్‌ను తయారుచేశామని పెంటాఫామ్ వ్యవస్థాపకులు, ఆక్వాఫేడ్ సహ ఆవిష్కర్తలు శామ్యూల్ వాంగ్‌సపుత్రా, జూన్‌సంగ్ లీ చెప్పారు. రీసైక్లింగ్ అవుతున్న వాటితో పోలిస్తే పెరుగుతున్న ఇ-వేస్ట్ పరిమాణం ఏకంగా ఐదు రెట్లు ఎక్కువ. అందుకే దీనిని పరిష్కారం కనుగొన్నామని సంస్థ వ్యవస్థాపకులు చెప్పారు. ఆక్వాఫేడ్ ప్లాస్టిక్ కేసింగ్‌తో తయారైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్‌ను నీటితో నింపిన పాత్రలో ఉంచితే ప్లాస్టిక్ దాదాపు ఆరు గంటల్లో పూర్తిగా కరుగుతుంది. అప్పుడు డివైజ్‌లోని ఖరీదైన లోహాలు, ఇతర ఎలక్ట్రానిక్ సూక్ష్మభాగాలను చేతితో విడివిడిగా తీయొచ్చు. ప్లాస్టిక్ కరిగిన నీటిని పారబోస్తే సరిపోతుంది. ఈ ప్లాస్టిక్ కేసింగ్‌ను గ్యాడ్జెట్ తయారుచేసిన కొత్తలో మొదట నీరు తగిలితే మెత్తబడకుండా ఉండేలా వాటర్‌ప్రూఫ్ కోటింగ్‌తో సిద్ధంచేస్తారు. ''పాడైన ఎలక్ట్రానిక్ వస్తువు నుంచి విలువైన లోహాలను జాగ్రత్తగా బయటకు తీయడం ఇ-వేస్ట్ కార్మికులకు తలకు మించిన భారం. ఎంతో కష్టపడినా పూర్తిస్థాయిలో విలువైన లోహాన్ని బయటకు తీయలేం. అదే ఆక్వాఫేడ్ ప్లాస్టిక్‌తో తయారైన గ్యాడ్జెట్ నుంచి సులభంగా లోహాలను వేరేచేయొచ్చు''అని శామ్యూల్ వాంగ్‌సపుత్రా అన్నారు.

అంట్లు తోముతుంటే మెరిసిన ఆలోచన!

గొప్ప ఆవిష్కరణలెన్నో విచిత్రంగా జరిగాయని వింటుంటాం. ఆక్వాఫేడ్ సైతం అలా వచ్చిందే. ఈ విషయాన్ని స్వయంగా వాంగ్‌సపుత్రా వెల్లడించారు. ''ఓరోజు నేను అంట్లు తోముతుంటే అంట్లు తోమే సబ్బు నీరు తగలగానే పాత్రలను శుభ్రం చేస్తూనే మటుమాయం కావడం చూశా. సబ్బు తన విధి నిర్వర్తించి తర్వాత అంతర్థానమవడం గమనించా. ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌లను పట్టి ఉంచే ప్లాస్టిక్ కేసింగ్ కూడా తర్వాత అదృశ్యమైతే ఎలా ఉంటుంది? అనే ఆలోచన నుంచే ఈ ఆక్వాఫేడ్ పురుడుపోసుకుంది. ఒక వినూత్న పాలిమర్‌తో కొత్తరకం ప్లాస్టిక్ తయారుచేస్తే బాగుంటుందని భావించాం. ఇందుకోసం ఈ రంగంలో నిపుణులైన లండన్ ఇంపీరియల్ కాలేజీలో 'మెటీరియల్'శాస్త్రవేత్తలు ఎన్రికో మ్యాన్‌ఫ్రెడీ-హేలాక్, మరియం లామారిలతో చేతులు కలిపి కొత్త ప్లాస్టిక్‌ను సృష్టించాం''అని ఆయన చెప్పారు. ఈ ప్లాస్టిక్‌ను వాణిజ్యపర ఉత్పత్తుల అవసరాల కోసం ఇంకా వినియోగించలేదు. పూర్తిస్థాయి పరీక్షల తర్వాత ఇది భిన్నరకాల డివైజ్‌ల కేసింగ్ కోసం ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

మీకెంత ధైర్యం?



కార్యక్రమానికి అంతరాయం కలిగించిన వనియాను వెనక్కి నెడుతున్న ఓ ఉద్యోగిని. (ఇన్‌సెట్లో) వనియా

- గాజాలో ఇజ్రాయెల్‌కు సాయపడేందుకు సంస్థ టెక్నాలజీని దుర్వినియోగం చేస్తారా?
- మైక్రోసాఫ్ట్ దిగ్గజాలు బిల్‌గేట్స్, స్టీవ్ బామర్, సత్య నాదెళ్లపై భారతీయ మహిళా టెకీ విమర్శలు

వాషింగ్టన్: అమెరికాలోని వాషింగ్టన్‌లో మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యాలయంలో గత వారం జరిగిన సంస్థ 50వ వార్షికోత్సవంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. భారతీయ మూలాలున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అదే సంస్థ ఉద్యోగిణి వనియా అగ్రవాల్ హఠాత్తుగా వేదిక వద్దకు వచ్చి అక్కడే ఉన్న సంస్థ తాజా, మాజీ సీఈవోలు సత్యా నాదెళ్ల, స్టీవ్ బామర్, బిల్ గేట్స్‌లనుద్దేశిస్తూ విమర్శలు గుప్పించారు. ''మీకెంత ధైర్యం?. యుద్ధంలో ఇజ్రాయెల్‌కు సాయపడేందుకు మైక్రోసాఫ్ట్‌కు చెందిన క్లౌడ్, ఏఐ టెక్నాలజీలను దుర్వినియోగం చేస్తారా?. పాలస్తీనియన్ల రక్తంతో సంబరాలు చేసుకుంటున్నందుకు సిగ్గుపడండి. మైక్రోసాఫ్ట్ అందించిన టెక్నాలజీని ఉపయోగించి ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోంది. దీంతో యుద్ధంలో గాజాలో 50,000 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇకనైనా మీరు ఇజ్రాయెల్‌తో కాంట్రాక్ట్‌ను తెగతెంపులు చేసుకోండి''అని వనియా బిగ్గరగా అరిచారు. దాంతో అక్కడి సిబ్బంది వెంటనే ఆమెను వెనక్కి లాక్కెళ్లారు. సంబంధిత వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఘటన తర్వాత వాణియా మైక్రోసాఫ్ట్‌లోని ఏఐ విభాగ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. అజూర్ క్లౌడ్, కృత్రిమ మేధ టెక్నాలజీలను వాడుకునేందుకు ఇజ్రాయెల్ మంత్రిత్వ శాఖ మైక్రోసాఫ్ట్‌తో దాదాపు రూ.1,144 కోట్ల విలువైన కాంట్రాక్ట్ కుదుర్చుకుందని వనియా ఆరోపించారు.

వనియాపైనా నెటిజన్ల విమర్శలు

సొంత సంస్థపై ఆరోపణలు చేసిన వనియాపై పలువురు నెటిజన్లు విమర్శిస్తూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ''ఆమెను పాలస్తీనాకు పంపించండి. హమాస్ వాళ్లు ఈమెను బాగా చూసుకుంటారు', 'ఈమె నకిలీ హిందువు. ఈమెకు జిహాదీతో పెళ్లిచేయాలి', 'ఈమెను అమెరికా నుంచి బహిష్కరించి ఇండియాకు పంపేయాలి', 'ఇండియాకు వద్దు. పాలస్తీనాకు పంపాలి', 'పాలస్తీనాకు పంపేయండి. హమాస్‌కు మద్దతుగా ఎంచక్కా కొత్త సాఫ్ట్‌వేర్, ఏఐ వ్యూహాలు సిద్ధంచేస్తుంది'అంటూ వేర్వేరు రకాలుగా విమర్శించారు.

సిటీల్లో సాధారణం

- యువతితో ఆగంతకుడి అసభ్య ప్రవర్తనపై కర్ణాటక మంత్రి వివాదాస్పద వ్యాఖ్య
- విమర్శలు గుప్పించిన బీజేపీ

బనశంకరి/ శివాజీనగర: బెంగళూరు వంటి మహా నగరాల్లో మహిళలపై ఆకతాయిల లైంగిక వేధింపుల ఘటనలు సర్వసాధారణమని కర్ణాటక హోం మంత్రి జి.పరమేశ్వర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో బాధ్యతాయుత పదవిలో ఉన్న వ్యక్తి ఇలా ఇష్టారీతిన మాట్లాడటమేంటి? అంటూ బీజేపీసహా పలు వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.

అసలేం జరిగింది?

ఈనెల మూడో తేదీన అర్ధరాత్రి దాటాక 2 గంటలపుడు బెంగళూరులోని బీటీఎం లేఔట్ వద్ద ఇద్దరు యువతులు వీధిలో నడచి వెళ్తున్నారు. వీళ్ల వెనకే వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి హఠాత్తుగా వీళ్లలో ఒక యువతిని పట్టుకుని, గోడకు అదిమిపట్టి అసభ్యంగా తాకి పారిపోయాడు. ఈ దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. కానీ లైంగికవేధింపు వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో చివరకు సోమవారం సుద్దగుంటెపాళ్య పోలీస్‌స్టేషన్‌లో ఒక స్థానికుడు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దుండగుని కోసం పోలీసులు వేట మొదలెట్టారు. ఈ విషయమై హోం మంత్రి పరమేశ్వర సోమవారం మీడియాతో మాట్లాడారు. ''ఇంత పెద్ద నగరంలో అక్కడక్కడా ఇలాంటి ఘటనలు జరుగుతుంటాయి. అయినా ఇలాంటి ఘటనకు వెంటనే ప్రాచుర్యం లభిస్తుంది. వాస్తవానికి పోలీసులు వర్షాలు, చలిని లెక్కచేయకుండా రోజంతా గస్తీ కాస్తూనే ఉంటారు. అందుకే బెంగళూరు ప్రశాంతంగా ఉంది. యువతిపై వేధింపుల అంశంపై బెంగళూరు పోలీస్ కమిషనర్ బి.దయానందతో మాట్లాడా. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించా''అని అన్నారు. మంత్రి వ్యాఖ్యలపై పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ మంత్రిని రాజీనామాచేయాలని ఆ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రాలు ఆదేశించాలని బీజేపీ డిమాండ్‌చేసింది. ''మహిళలను అవమానించడం, అవహేళనగా మాట్లాడటం, తీవ్రమైన అంశాలను పట్టించుకోవడం కాంగ్రెస్‌కు అలవాటు''అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అన్నారు. వేధింపుల ఉదంతంలో నివేదిక ఇవ్వాలని పోలీసు కమిషనర్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ లేఖ రాసింది.

కిడ్నాప్.. ఆపై గ్యాంగ్ రేప్..!

22 మంది రేప్ చేశారని యువతి ఆరోపణ

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో దారుణం చోటుచేసుకుంది. ఓ యువతిని కిడ్నాప్ చేసి, వారం రోజుల వ్యవధిలో 22 గ్యాంగ్ రేప్‌నకు పాల్పడ్డారు. వీరిలో ఆరుగురిని అరెస్ట్ చేశామని, మిగతా వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. నగరంలోని లాల్‌పూర్‌కు చెందిన 19 ఏళ్ల యువతి మార్చి 29వ తేదీన ఫ్రెండ్‌ను కలిసేందుకని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తరచూ ఆమె ఇలాగే బయటకు వెళ్లి వస్తూంటుంది. కానీ, ఈసారి అలా జరగలేదు. దీంతో, కుటుంబసభ్యులు ఏప్రిల్ 4వ తేదీన ఆమె కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు, పోలీసులు పాండేపూర్ వద్ద డ్రగ్స్ మత్తులో ఉన్న ఆమెను కిడ్నాపర్ల చెర నుంచి విడిపించారు. అనంతరం ఆమెను దగ్గర్లోని ఫ్రెండ్ ఇంటి వద్ద వదిలి వెళ్లారు. ఆ తర్వాత సొంతింటికి చేరుకుని తనపై లైంగిక దాడి జరిగిన విషయాన్ని తండ్రికి తెలిపింది. ఈ నెల 6న తండ్రితో వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానిక హుక్కా సెంటర్, ఒక హోటల్, ఒక లాడ్జి, ఒక గెస్ట్ హౌస్‌లో తనపై మొత్తం 22 మంది అత్యాచారానికి ఒడిగట్టినట్లు అందులో ఆరోపించింది. కేసు నమోదు చేసిన పోలీసులు హుకూల్ గంజ్, లాల్‌పూర్ ఏరియాలకు చెందిన కొందరు నిందితులను అదే రోజు రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అయితే, వీరిలో కొందరు మైనర్లు అయినందున పోలీసులు వీరి పూర్తి వివరాలను వెల్లడించడం లేదు. అయితే, బాధితురాలు కానీ, ఆమె కుటుంబం కానీ లైంగిక దాడి జరిగినట్లుగా ఏప్రిల్ 4న ఫిర్యాదు అందించలేదని డీసీపీ చంద్రకాంత్ మీనా తెలిపారు. అత్యాచారం జరిగిందంటూ వారు ఈ నెల 6వ తేదీన మాత్రమే ఫిర్యాదు చేశారని, దర్యాప్తు పురోగతిలో ఉందని ఆయన వివరించారు.

గత తప్పిదాల నుంచి నేర్చుకుంటున్నాం

బిహార్‌లో 'సంవిధాన్ సురక్షా సమ్మేళన్'లో రాహుల్ వ్యాఖ్యలు



ర్యాలీలో పాల్గొన్న రాహుల్

పట్నా: బిహార్‌లో అణగారిన వర్గాల సాధికారత, అభ్యున్నతే తమ తొలి ప్రాధాన్యాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. సోమవారం రాహుల్ పట్నాలో 'సంవిధాన్ సురక్షా సమ్మేళన్'కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ''బిహార్‌లో పార్టీ గత తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకుంటోంది. రాష్ట్రంలో భాగస్వామ్య పార్టీలతో కలిసి ఏర్పాటుచేసిన మహాఘట్‌బంధన్ ఇకపై ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, అత్యంత అణగారిన వర్గాలు, మైనారిటీల అభ్యున్నతి కోసం కృషిచేస్తుంది''అని రాహుల్ అన్నారు. ''గతంలో రాష్ట్ర కాంగ్రెస్‌లో కొన్ని తప్పులు జరిగాయి. మూడింట రెండొంతుల కాంగ్రెస్ కమిటీలకు ఉన్నత కులాల నేతలు సారథ్యంవహించేవారు. ఇప్పుడు అణగారిన కులాల నేతలు సారథ్యంవహిస్తున్నారు. ఈ మార్పు చిన్నదే అయినా అత్యంత ప్రాధాన్యమైంది''అని అన్నారు. ''మన భారత రాజ్యాంగం కేవలం 70 ఏళ్ల పాతది కాదు. మన రాజ్యాంగానికి వేల ఏళ్ల చరిత్ర ఉంది. బుద్ధుని కాలంలో మొదలై కబీర్, గురునానక్‌లకు సమకాలీనంగా కొనసాగుతూ తర్వాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌లో స్ఫూర్తిని నింపింది''అని అన్నారు. అంతకుముందు బెగుసరాయ్ జిల్లాలో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) నేషనల్ ఇన్‌చార్జ్ కన్హయ్య కుమార్ నేతృత్వంలో కొనసాగుతున్న 'వలసలు ఆపేద్దాం. ఉద్యోగాలు డిమాండ్‌చేద్దాం(రోకో, నౌకరీ దో)'పాదయాత్రలో రాహుల్ పాల్గొన్నారు. రాహుల్‌గాంధీలాగా పెద్దసంఖ్యలో యువత తెలుపు రంగు టీ-షర్ట్ ధరించి పాదయాత్రలో పాల్గొన్నారు. పాదయాత్రలో రాహుల్ పాల్గొనడంపై బీజేపీ విమర్శించింది. ''పలాయన్ రోకో, నౌకరీ దో అంటూ రాహుల్ పాదయాత్రచేస్తున్నారు. ముందుగా ప్రజల మనసుల్లోంచి కనుమరుగు(పలాయన్)కాకుండా ఉండటంపై రాహుల్ దృష్టిపెట్టాలి''అని బీజేపీ నేత, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఎద్దేవాచేశారు.

'వక్ఫ్' పిటిషన్లపై త్వరలో నిర్ణయం: సీజేఐ

న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) చట్టం-2025 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను అత్యవసరంగా విచారణకు స్వీకరించడంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఈ మేరకు ఇప్పటికే పలు పిటిషన్లు దాఖలైనట్లు న్యాయవాది కపిల్ సిబల్ సోమవారం సీజేఐ సంజీవ్ ఖన్నా ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దాంతో, ''వాటిని అత్యవసర విచారణ నిమిత్తం స్వీకరించే విషయాన్ని పరిశీలిస్తాం. ఆ మేరకు విజ్ఞప్తి చేస్తూ కోర్టుకు లేఖలు సమర్పించండి. లేదా ఈమెయిల్స్ పంపండి'' అని పిటిషనర్ల తరపు లాయర్లకు సీజేఐ సూచించారు. ఇప్పటికే లేఖలు రాశామని సిబల్ బదులిచ్చారు. వక్ఫ్ చట్టంపై మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు ఎంపీలు, పలు ముస్లిం సంస్థలు ఇప్పటికే సుప్రీంను ఆశ్రయించడం తెలిసిందే. తాజాగా ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, డీఎంకేతో పాటు కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ కూడా సోమవారం దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దాంతో వక్ఫ్ బిల్లును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల సంఖ్య 10కి చేరింది.

వీవీప్యాట్ స్లిప్పుల లెక్కింపుపై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: ఈవీఎంలలోని ఓట్లతోపాటు వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్)స్లిప్పులను పూర్తిగా లెక్కించాలంటూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు 2024 ఆగస్టులో ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ హన్స్ రాజ్ జైన్ అనే వ్యక్తి వేసిన పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. ఈవీఎంల డేటాను వీవీ ప్యాట్ స్లిప్పులతో 100% పరిశీలన జరపాలన్న వినతిని తోసిపుచ్చిన ధర్మాసనం .. 'ఈవీఎంలు సురక్షితం, సౌకర్యవంతం'అని నొక్కిచెప్పింది. 'గతంలో ఇటువంటి అంశాలపైనే పలు తీర్పులు వెలువరించాం. మళ్లీ మళ్లీ అవే తీర్పులివ్వలేం'అని స్పష్టం చేసింది. 'ఢిల్లీ హైకోర్టు తీర్పుపై కలుగు జేసుకునేందుకు తగు ప్రాతిపదిక మాకు కనిపించలేదు. అందుకే కొట్టివేస్తున్నాం'అని పేర్కొంది.

ఢిల్లీలో 40.2 డిగ్రీలు... సీజన్‌లోనే రికార్డు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఎండ తీవ్రత అకస్మాత్తుగా పెరిగిపోయింది. సఫ్దర్‌జంగ్‌లో సోమవారం ఏకంగా 40.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణం కంటే ఇది 5.1 డిగ్రీలు ఎక్కువ. ఈ సీజన్‌లో ఇదే అత్యధికమని వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది. అదేవిధంగా పాలంలో 39.5 డిగ్రీలు నమోదైంది. ఇది సీజన్ సరాసరి కంటే నాలుగు డిగ్రీలెక్కువ. సోమ, బుధ వారాల మధ్య దేశ రాజధాని ప్రాంతంలో వడగాడ్పులు వీచే అవకాశముందని వారం క్రితం ఐఎండీ హెచ్చరించింది. సోమ, మంగళవారాల్లో ఢిల్లీకి ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఉష్ణోగ్రతలు 40, 42 డిగ్రీల సెల్సియస్ వరకు పెరగొచ్చని తెలిపింది.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

ముంబై: ముంబై-జైపూర్ ఇండిగో విమానానికి సోమవారం బాంబు బెదిరింపు వచ్చింది. జైపూర్ నుంచి 225 మంది ప్రయాణికులతో టేకాఫ్ తీసుకున్న ఆర్‌ఈ 5324 నంబర్ విమానంలో బాంబు పెట్టినట్లు ఆ విమానం మరుగుదొడ్డిలో ఓ నోట్ దొరికింది. దీంతో, విమానం సిబ్బంది ముంబై విమానాశ్రయానికి సమాచారం అందించారు. విమానాశ్రయంలో రాత్రి 8.43 గంటల సమయంలో పూర్తి స్థాయి ఎమర్జెన్సీ ప్రకటించి, .50 గంటలకు అత్యవసర ల్యాండింగ్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. సెక్యూరిటీ నియమాల ప్రకారం దూరంగా నిలిపి ప్రయాణికులను కిందికి దించేశారు. విమానంలో పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టామన్నారు. ఘటనతో ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాకపోకలపై ఎటువంటి ప్రభావం పడలేదని అధికారులు తెలిపారు.

భారత, నేపాల్ సుప్రీంకోర్టుల ఎంఓయూ

కఠ్మాండు: భారత, నేపాల్ పరస్పరం న్యాయపరమైన సహకారాన్ని మరింత పెంచుకోనున్నాయి. ఇరుదేశాల సుప్రీంకోర్టులు సోమవారం ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ సమక్షంలో సీజేఐ సంజీవ్ ఖన్నా, నేపాల్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ మాన్‌సింగ్ రౌత్ ఒప్పందంపై సంతకాలు చేశారు. వాటిలో భాగంగా సమాచార పంపిణీ, శిక్షణ, సామర్థ్య కల్పనతో పాటు పలు అంశాల్లో రెండు దేశాలూ ఇకపై మరింత సమన్వయంతో కలిసి పని చేయనున్నాయి. సహకారం, పరస్పర గౌరవం ద్వారానే న్యాయవ్యవస్థలు మరింతగా రాణిస్తాయని సీజేఐ ఖన్నా ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

8న భారత్‌కు దుబాయ్ యువరాజు

న్యూఢిల్లీ: దుబాయ్ యువరాజు షేక్ హమ్‌దాన్ బిన్ మహ్మద్ అల్ మక్తౌమ్ రెండు రోజుల పర్యటనకు ఈ నుల ఈ నెల 8న ఢిల్లీకి చేరుకుంటారని విదేశాంగ శాఖ సోమవారం తెలిపింది. విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో యువరాజు షేక్ హమ్‌దాన్ సమావేశమవుతారని వివరించింది. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు వస్తున్న షేక్ హమ్‌దాన్ గౌరవార్థం ఈ నెల 8న ప్రత్యేక విందు ఉంటుందని తెలిపింది. పలువురు మంత్రులు, సీనియర్ అధికారులు, ఉన్నత స్థాయి వాణిజ్య బృందంతో వస్తున్న షేక్ హమ్‌దాన్ వస్తున్నారని తెలిపింది. భారత్-యూఏఈల మధ్య బంధాన్ని బలోపేతం చేసేందుకు వ్యాపారవేత్తలతో ముంబైలో రౌండ్‌టేబుల్ సమావేశం కూడా ఉంటుంది. షేక్ హమ్‌దాన్ భారత్‌లో అధికారిక పర్యటనకు రావడం ఇదే మొదటిసారని విదేశాంగ శాఖ వెల్లడించింది.

కునాల్ కామ్రా బెయిల్ పొడిగింపు

చెన్నై/ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై వ్యంగ్య వ్యాఖ్యల కేసులో స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా మధ్యంతర బెయిల్‌ను మద్రాస్ హైకోర్టు ఏప్రిల్ 17 వరకు పొడిగించింది. ఆయన 2021 నుంచీ చెన్నైలో ఉంటున్నారు. ముంబై పోలీసులు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని బాంబే హైకోర్టును కామ్రా ఆశ్రయించారు.

తమిళ సమస్యలపై మోదీ మౌనం: స్టాలిన్

చెన్నై: తమిళనాడు సమస్యలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహిస్తున్నారని సీఎం ఎంకే స్టాలిన్ విమర్శించారు. ''శ్రీలంకలో పర్యటించిన మోదీ తమిళనాడు జాలర్ల సమస్య పరిష్కారంపై చిత్తశుద్ధి చూపలేదు. వారిని, వారి ఫిషింగ్ బోట్లను విడిపించడానికి చర్యలు తీసుకోలేదు. కచ్చతీవు దీవిని భారత్‌కు అప్పగించాలన్న డిమాండ్‌ను పట్టించుకోలేదు'' అని సోమవారం అసెంబ్లీలో ఆరోపించారు.

5వేల మంది అఫ్గాన్లను నిర్బంధించిన పాక్

లాహోర్: పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్న 5వేల మందికిపైగా అఫ్గానిస్తాన్ దేశీయుల్ని అధికారులు నిర్బంధించారు. వీరిని సొంత దేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లాలంటూ విధించిన గడువు మార్చి 31వ తేదీతో ముగియడంతో పంజాబ్ వ్యాప్తంగా 150 కాలనీల్లో ఉంటున్న వీరిని ట్రాన్సిట్ క్యాంపులకు తరలించామని, వీరిలో 2,300 మంది చిన్నారులు, 1,100 మంది మహిళలున్నారని ప్రభుత్వం సోమవారం తెలిపింది.

రన్య కస్టడీ 21 వరకు పొడిగింపు

బెంగళూరు: బంగారం స్మగ్లింగ్ కేసులో బెంగళూరు కోర్టు సినీ నటి రన్యా రావు, మరో ఇద్దరి జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 21వ తేదీ వరకు పొడిగించింది. దుబాయ్ నుంచి అక్రమ మార్గంలో రూ.12.56 కోట్ల విలువైన బంగారం తరలించేందుకు కుట్ర పన్నినట్లు రన్య, వ్యాపారవేత్త తరుణ్ రాజు, ఆభరణాల డీలర్ సాహిల్ జైన్ ఆరోపణలు ఎదుర్కొంటుండటం తెల్సిందే.

జపాన్‌లో కూలిన ఎయిర్ అంబులెన్స్

టోక్యో: నైరుతి జపాన్ సమీపంలో ఓ ఎయిర్ అంబులెన్స్ సముద్రంలో కుప్పకూలింది. నాగసాకి ప్రావిన్స్ నుంచి ఫుకువోకాలోని ఆసుపత్రికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనలో హెలికాప్టర్‌లోని రోగితో పాటు డాక్టర్, కేర్‌టేకర్ మృతి చెందారు. ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు.

ప్రజా పదవుల దుర్వినియోగాన్ని ప్రశ్నించే కోవారంటో

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

వివిధ రిట్లు-అర్థం-పరిధి - ప్రాముఖ్యత

ప్రొహిబిషన్ (నిషేధం)

భాషా పరంగా ప్రొహిబిషన్ అంటే నిషేధించడం అని అర్థం. ఏదైనా దిగువ కోర్టు లేదా ట్రిబ్యునల్ తన పరిధిని అతిక్రమించి కేసులు విచారిస్తున్నప్పుడు ఆ విచారణను తదుపరి ఆదేశాల వరకు నిలిపివేయాలని కోర్టు ఆదేశిస్తుంది. దిగువ కోర్టులు తమ పరిధులను అతిక్రమించకుండా నిరోధించడమే ఈ రిట్ ముఖ్య ఉద్దేశం. ప్రొహిబిషన్ న్యాయ సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది. పాలనా సంస్థలు, చట్టపర సంస్థలకు వర్తించదు.

సెర్షియోరరి (ఉన్నత న్యాయస్థాన పరిశీలన అధికారం)

భాషాపరంగా సెర్షియోరరి అంటే 'సుపీరియర్' లేదా 'టు బి సర్టిఫైడ్' లేదా 'బ్రింగ్ ద రికార్డ్స్' అని అర్థం. ఏదైనా దిగువ కోర్టు తన పరిధిని అతిక్రమించి కేసును విచారించి తీర్పు వెలువరించినప్పుడు దాన్ని రద్దు చేసి, కేసును పై స్థాయి కోర్టుకు బదిలీ చేయాలని ఇచ్చే ఆదేశం. ఈ రిట్ ఉద్దేశం కూడా దిగువ న్యాయస్థానాలు తమ పరిధులను అతిక్రమించకుండా నిరోధించడమే.

సెర్షియోరరిని ప్రైవేటు సంస్థలు, శాసన సంస్థలకు వ్యతిరేకంగా జారీ చేయరు. ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే పరిపాలనా సంస్థలకు వ్యతిరేకంగా జారీచేయవచ్చని ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఎన్విరాన్-లీగల్ యాక్షన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1996) కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.

ప్రొహిబిషన్, సెర్షియోరరి మధ్య తేడాలు

ప్రొహిబిషన్, సెర్షియోరరిల రిట్ల ఉద్దేశం ఒక్కటే. దిగువ కోర్టులు తమ పరిధులను అతిక్రమించకుండా నియంత్రించడం. అయితే వీటి ప్రక్రియలో తేడా ఉంది. కేసు ప్రారంభదశలో ఉంటే ప్రొహిబిషన్ రిట్, తీర్పు వెలువడిన తర్వాత సెర్షియోరరి రిట్‌ను జారీ చేస్తారు.

సెర్షియోరరి రిట్ దిగువ కోర్టులను నియంత్రించడంతోపాటు, అవి చేసిన తప్పులను కూడా సవరిస్తుంది. ప్రొహిబిషన్ రిట్ కేవలం నిలుపుదల చేస్తుంది. (Prohibition is preventive where as certiorari is curative)

కోవారంటో (అధికార పృచ్ఛ)

భాషాపరంగా దీన్ని 'బై వాట్ వారంట్' (By What Warrant) అంటారు. అంటే 'ఏ అధికారంతో' అని ప్రశ్నించడం. ప్రజా పదవుల దుర్వినియోగాన్ని అరికట్టడం ఈ రిట్ ప్రధాన ఉద్దేశం. ప్రజా సంబంధమైన పదవుల్లోకి అక్రమంగా ప్రవేశించిన లేదా ప్రజా పదవులను దుర్వినియోగం చేసిన వ్యక్తి ఆ పదవిలో కొనసాగడానికి చట్టబద్ధంగా ఉన్న అధికారాన్ని న్యాయస్థానాలు ప్రశ్నిస్తాయి. చట్టబద్ధత లేకపోతే ఆ పదవి నుంచి వెంటనే తొలగిపోవాలని ఆదేశిస్తాయి. ప్రజా పదవి అంటే చట్టంతో ఏర్పాటైన స్వతంత్ర ప్రతిపత్తి సంస్థ. ఉదాహరణకు ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, మంత్రులు, ముఖ్యమంత్రులు మొదలైనవి.

ఈ రిట్ కోసం బాధితుడు మాత్రమే న్యాయస్థానాల్లో కేసు వేయాలనే నియమం లేదు. ప్రజా పదవులను దుర్వినియోగం నుంచి కాపాడాలనే సామాజిక స్పృహ ఉన్న ఏ పౌరుడైనా కోర్టును ఆశ్రయించవచ్చు. మూడో వ్యక్తికి (Third Person) ఇందులో జోక్యం చేసుకునే హక్కు (Locus Standi- లోకస్ స్టాండై) ఉంటుంది.

ఇన్‌జంక్షన్ (నిలుపుదల ఆదేశం)

ఈ రిట్ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించ లేదు. కేవలం సివిల్ వివాదాల్లో యథాతథస్థితిని (Status-Quo-Ante) కొనసాగించడానికి దీన్ని జారీ చేస్తారు. భర్తీ చేయడానికి వీలుపడని నష్టాన్ని అరికట్టేందుకు ఇన్‌జంక్షన్‌ను జారీ చేస్తారు. కాబట్టి ప్రాథమిక హక్కుల రక్షణకు, ఈ రిట్‌కు సంబంధం లేదు.

ప్రాథమిక హక్కులు - ఇతర నిబంధనలు

ప్రకరణ 33ను అనుసరించి, ప్రాథమిక హక్కులు కింది వర్గాలకు వర్తించే విషయంలో పార్లమెంటు చట్టం ద్వారా కొన్ని పరిమితులు విధించవచ్చు.

ఎ) సైనిక, పారా మిలటరీ దళాలు.

బి) పోలీసులు, ఇతర రక్షణపరమైన విధులు నిర్వర్తిస్తున్న సంస్థలు, అధికారుల ప్రాథమిక హక్కులపై పరిమితులు విధించవచ్చు.

సి) గూఢచార సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు.

డి) అత్యవసర సర్వీసులైన టెలి కమ్యూనికేషన్లు, ఇతర శాఖల్లో పనిచేసే ఉద్యోగులు.

ప్రకరణ 34-సైనికచట్టం (Marshal Law) - ప్రాథమిక హక్కులపై పరిమితులు

దేశంలోని ఏదైనా ప్రాంతంలో సైనిక చట్టం ప్రకటించినప్పుడు ఆ సమయంలో సైనిక బలగాలు చేపట్టిన చర్యలు, తద్వారా జరిగిన నష్టాలకు, పరిణామాలకు వారిని బాధ్యులను చేయడానికి వీలులేదు. పార్లమెంటు ఒక చట్టం ద్వారా వారి చర్యలకు రక్షణ కల్పిస్తుంది. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిందని న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి వీలులేదు.

ప్రకరణ 34, 35ల మధ్య తేడా

ప్రకరణ 34లో ప్రస్తావించిన అంశాలు కేవలం కొన్ని వర్గాల ఉద్యోగులు, వారి హక్కులపై విధించిన పరిమితులు. ప్రకరణ 35లో ప్రస్తావించిన అంశాలు కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో ప్రాథమిక హక్కులను పరిమితం చేయడానికి రూపొందించినవి. కాబట్టి ఒకటి వర్గానికి సంబంధించింది, మరొకటి ప్రాంతానికి సంబంధించినది.

ఉదా: 1958లో రూపొందించిన సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (Armed Forces (Special Power) Act- AFSPA). దీన్ని పలు పర్యాయాలు సవరించి అసోం, మణిపూర్ రాష్ట్రాల్లోని కల్లోలిత ప్రాంతాల్లో విధించారు. అలాగే 1983లో పంజాబ్, చండీగఢ్‌లో కూడా ప్రయోగించారు. అక్కడి పరిస్థితుల కారణంగా శాంతి భద్రతల నిర్వహణలో పోలీసులు విఫలమైనప్పుడు ఈ చట్టం ద్వారా సాయుధ బలగాలకు ప్రత్యేక అధికారాలు ఉంటాయి.

ప్రకరణ- 35 చట్టబద్ధత, శిక్షలు

మూడో భాగంలో పేర్కొన్న నిబంధన అమలుకు చట్టబద్ధత కల్పించడం, శిక్షలు నిర్ణయించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. శాసనసభలకు ఉండదు. ప్రాథమిక హక్కుల అమలుకు సంబంధించి దేశవ్యాప్తంగా ఒకే పద్ధతి లేదా ప్రక్రియ ఉండాలనే ఉద్దేశంతో ఈ అధికారాన్ని పార్లమెంటుకు మాత్రమే ఇచ్చారు.

ఉదా: ప్రకరణ 16(3) ప్రకారం రిజర్వేషన్ల అమలు, ప్రకరణ 32(3) ప్రకారం రిట్లు జారీ చేసే అధికారాన్ని న్యాయస్థానాలకు సంక్రమింపజేయడం, ప్రకరణ 33 ప్రకారం సాయుధ బలగాల ప్రాథమిక హక్కులపై పరిమితులు విధించడం, ప్రకరణ 34 ప్రకారం సైనిక పాలన, మొదలైన అంశాలపై పార్లమెంటుకు మాత్రమే చట్టాలు చేసే అధికారం ఉంటుంది. అదే విధంగా ఈ భాగంలో పేర్కొన్న నేరాలకు, (ఉదాహరణకు ప్రకరణ 17లో పేర్కొన్న అస్పృశ్యత, 23లో పేర్కొన్న దోపిడీ, 24 లోని బాలకార్మిక వ్యవస్థ మొదలైన వాటికి) శిక్షలు నిర్ణయించే అధికారం పార్లమెంటుకే ఉంటుంది.

ప్రకరణ 35(బి) ప్రకారం, పై విషయాలకు సంబంధించి రాజ్యాంగం అమల్లోకి రాక పూర్వం ఉన్న చట్టాలు అలాగే కొనసాగుతాయి. అయితే ప్రకరణ 372 ప్రకారం పూర్వ శాసనాలకు మార్పులు, చేర్పులు, సవరణలు చేసి పార్లమెంటు కొత్త చట్టాలు రూపొందించుకోవచ్చు.



ప్రాథమిక హక్కులు - ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (Public Interest Litigation-PIL)

ప్రాథమిక హక్కుల రక్షణ, అమలుకు సంబంధించి రాజ్యాంగంలో ప్రత్యేక ఏర్పాట్లను ప్రకరణ 32, ప్రకరణ 226లో పేర్కొన్నారు. హక్కులకు భంగం వాటిల్లినప్పుడు లేదా అమలు కానప్పుడు బాధితుడే కోర్టును ఆశ్రయిస్తాడు. అయితే బాధితుడికి సరైన అవగాహన లేకపోవడం లేదా ఆర్థిక, సామాజిక స్థితి పరంగా కోర్టును ఆశ్రయించే పరిస్థితి ఉండకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో బాధితులకు సంబంధించి ప్రజాప్రయోజనం అందులో ఇమిడి ఉంటే వారి తరఫున మూడో వ్యక్తి కూడా కోర్టులో వ్యాజ్యం వేయవచ్చు. దీన్నే ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం అంటారు.

సాధారణంగా కోర్టు జోక్యాన్ని కోరే హక్కు (Locus Standi) బాధితులకే ఉంటుంది. కానీ సుప్రీంకోర్టు ఆ హక్కును ఇతరులకు కూడా సంక్రమింపజేసింది. ఈ వెసులుబాటును పబ్లిక్ ఇంట్రస్ట్ లిటిగేషన్ (పీఐఎల్) లేదా సోషల్లీ ఇంట్రస్ట్ లిటిగేషన్ అని అంటారు.

గమనిక: పీఐఎల్ భావన మొదట అమెరికా న్యాయ వ్యవస్థలో ప్రారంభమైంది. ఆ తర్వాత ఆస్ట్రేలియాలో బాగా ప్రచారంలోకి వచ్చింది. ఇండియాలోని పీఐఎల్ భావన అమెరికా నమూనా లాంటిదే. కానీ కొన్ని మార్పులతో పాటిస్తుంది.

రాజ్యాంగంలో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం గురించి ప్రస్తావన లేదు. అయితే సుప్రీంకోర్టులో మొదటిసారి ఈ భావనను ప్రవేశపెట్టింది జస్టిస్ వి.ఆర్. కృష్ణ అయ్యర్. ఆ తర్వాత జస్టిస్ పి.ఎన్. భగవతి నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్‌కి మొదటిసారిగా 1979లో బిహార్ జైల్లో ఖైదీల తరఫున పీఐఎల్ దాఖలు చేశారు. దీన్నే హుస్సార ఖతూన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ కేసు అంటారు.

1981లో ఎస్.పి.గుప్తా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసును పీఐఎల్‌కు సంబంధించిన అతి ముఖ్యమైన కేసుగా పేర్కొంటారు. జస్టిస్ పి.ఎన్.భగవతి పీఐఎల్‌ను చక్కగా నిర్వచించి, తగిన వివరణ ఇచ్చారు.

ప్రకరణ 32 ప్రకారం,సుప్రీంకోర్టులో, ప్రకరణ 226 ప్రకారం హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దాఖలు చేయవచ్చు. ఇతర న్యాయస్థానాలకు ఈ అధికారం లేదు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి కుంభకోణాలు పీఐఎల్ ద్వారానే దేశంలో వెలుగులోకి వచ్చాయి.

పీఐఎల్‌ను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించరాదు. ప్రచారం కోసం ప్రత్యర్థులను ఇబ్బందులకు గురి చేయాలనే దురుద్దేశంతో ప్రజాప్రయోజనాల నెపంతో పీఐఎల్ ను దాఖలు చేస్తే అలాంటి వ్యక్తులపై న్యాయస్థానాలు భారీ జరిమానాలు విధిస్తాయి.

ఉదా: సంజీవ్ భట్నాగర్ జాతీయగీతం నుంచి సింధ్ అనే పదాన్ని తొలగించాలని సుప్రీంకోర్టులో పీఐఎల్ దాఖలు చేశారు. అది అనవసరమైన, ఆర్భాటమైన కేసుగా భావించి కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు భారీ జరిమానా విధించింది.

ప్రాథమిక హక్కులపై పరిమితులు- జాతీయ అత్యవసర పరిస్థితి ప్రభావం

నిబంధన 352 ప్రకారం, జాతీయ అత్యవసర పరిస్థితి విధించినప్పుడు మూడో భాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులు రద్దవుతాయి. దీనికి సంబంధించి రాజ్యాంగంలో ప్రకరణలు 358, 359లలో వివరణలు ఉన్నాయి.

ప్రకరణ 358 ప్రకారం బాహ్య అత్యవసర పరిస్థితి

యుద్ధం, దురాక్రమణ కారణంగా అత్యవసర పరిస్థితి విధించినప్పుడు మాత్రమే వర్తిస్తుంది. దీని ప్రకారం ప్రకరణ 19లో పేర్కొన్న స్వేచ్ఛలను మాత్రమే రద్దు చేస్తారు. ఇతర ప్రాథమిక హక్కులు రద్దు కావు.

ప్రకరణ 358 ప్రకారం జాతీయ అత్యవసర పరిస్థితిలో ప్రకరణ 19లో పేర్కొన్న స్వేచ్ఛలు వాటంతట అవే రద్దవుతాయి.

కానీ ప్రకరణ 359 ప్రకారం ప్రాథమిక హక్కులు రద్దు చేయడానికి రాష్ట్రపతి ప్రత్యేక ఆదేశాన్ని జారీ చేయాలి. ఎమర్జెన్సీ విధించినంత మాత్రాన వాటంతట అవే రద్దు కావు.

నిబంధన 358 పరిధి దేశవ్యాప్తంగా వర్తిస్తుంది. కానీ ప్రకరణ 359 పరిధి దేశంలో కొన్ని ప్రాంతాలకు లేదా మొత్తం భాగానికి వర్తింపజేయవచ్చు.

జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ కారణంగా విధించినప్పటికీ (బాహ్య, అంతరంగిక కారణాలు) ప్రకరణ 20, 21 రద్దుకావు. ఈ అంశాన్ని 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా పొందుపరిచారు.

ప్రకరణలు 358, 359 మధ్య కొంత సామీప్యం ఉంది. ఇవి అత్యవసర పరిస్థితి విధించడం ద్వారా జరిగే పరిణామాలకు రక్షణ కల్పిస్తాయి కానీ ఎమర్జెన్సీతో సంబంధం లేని చట్టాలకు వర్తించవు.

ప్రాథమిక హక్కులు- మినహాయింపులు

ప్రకరణ 31-ఏ లో పేర్కొన్న ఐదు రకాల చట్టాలు తమ ప్రాథమిక హక్కులకు విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీలులేదు. ఈ అంశాలను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చారు.

నిబంధన 31-బిలో కూడా ఇలాంటి పరిమితులనే పేర్కొన్నారు. 31-సి ప్రకారం నిర్దేశిక నియమాల్లో పొందుపరిచిన 39-బి, 39-సి అమలు కోసం ప్రాథమిక హక్కులపై పరిమితులు విధిస్తే, అది రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానంలో ప్రశ్నించరాదు.

ప్రాథమిక హక్కులు - ముఖ్య వివాదాలు - సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.కె. గోపాలన్ వర్సెస్ తమిళనాడు -1950:

1950లో చేసిన నివారక నిర్బంధ చట్టంలోని సెక్షన్ 4 న్యాయ సమీక్షాధికారానికి విరుద్ధంగా ఉన్నందున అది చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయితే ఈ చట్టం కింద ముందస్తు అరెస్టు సమంజసమేనని పేర్కొంది.

శంకర్ ప్రసాద్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా-1951:

మొదటి రాజ్యాంగ సవరణకు సంబంధించిన అంశాన్ని ఈ వివాదంలో సుప్రీం కోర్టు పరిశీలించింది. ఈ సవరణ రాజ్యాంగబద్ధమేనని తీర్పు చెప్పింది. ఈ కేసులోనే సుప్రీం కోర్టు మొదటిసారి న్యాయ సమీక్షాధికారాన్ని వినియోగించింది.

బేలా బెనర్జీ వర్సెస్ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం-1954:

ఈ వివాదం కూడా ఆస్తి హక్కుకు సంబంధించిందే. ప్రభుత్వం ప్రజల ఆస్తిని స్వాధీనం చేసుకున్నప్పుడు అందుకు మార్కెట్ విలువతో కూడిన నష్టపరిహారాన్ని చెల్లించాలని తీర్పు చెప్పింది.

Where did he complete his education?



Question Tags

We use question tags to confirm the information. It is very small, may be contains 2 or 3 words. We write positive tag to negative statement and negative tag to positive statement.

Ex: Kiran is a doctor.

Question Tag: Isn't he.

Steps to write question tags:

1. Write auxiliary verb of the sentence as a beginning word (am, is, are, was, were, will, would, shall, should, can, could, do, does, did, has, have, had, may, might, need, ought to etc.)
2. If there are no auxiliaries use "do, does, did" depend on the tense of the verb.
3. Do not write no, not & never if they are in the sentence.
4. Write no, not & never if they are not in the sentence.
5. Write subject or reflexive pronoun (I, we, you, he, she, it, they) as the last word. Use question mark (?) at the end.
6. Use positive tags only for the negative words "few, little, never, rarely, scarcely, hardly, seldom".

Examples:

Statement	Question Tag
Sita sings well.	Doesn't she?
They came yesterday.	Did they?
I like sweets.	Don't I?
Raju cannot swim.	Can he?
I am right.	Aren't I?
You will help me.	Won't you?

Vocabulary:

The knowledge of words is called vocabulary. Generally synonyms (same meaning words), Antonyms (opposite meaning words), Spellings, Silent letters will be given in TET.

Synonyms:

Abandon: leave, relinquish, forsake, resign

Appreciate: estimate, value, recognize

Bliss: happiness, joy, delight, facility, rapture

Capital: chief, principal, pre-eminent, excellent

Antonyms:

Abstract	×	concrete
Barren	×	fertile
Cheerful	×	gloomy
Dawn	×	dusk
Expand	×	contract
Foreign	×	native

Silent Letters:

The letters in brackets are not pronounced. They are silent.

- clim(b), com(b), dum(b), dou(b)t, de(b)t
- mus(c)le
- han(d)kerchief, san(d)wich, we(d)nesday
- champa(g)ne, forei(g)n, si(g)n
- bou(gh)t, brou(gh)t, cau(gh)t, thou(gh)t, borou(gh), dau(gh)ter, hei(gh)t, hi(gh), li(gh)t, mi(gh)t, kni(gh)t, nei(gh)bour, ni(gh)t, ri(gh)t, strai(gh)t, throu(gh), ti(gh)t, wei(gh)
- w(h)at, w(h)en, w(h)ere, w(h)ether, w(h)ich, w(h)ip, w(h)y
- (h)onest, (h)onour, (h)our
- (k)nee, (k)nife, (k)nob, (k)nock, (k)now and similarly in other words beginning **kn**
- ca(l)m, cou(l)d, ha(l)f, sa(l)mon, shou(l)d, ta(l)k, pa(l)m, sta(l)k, wa(l)k, wou(l)d, autum(n), hym(n)
- (p)neumatic, (p)syichiatrist, (p)sychology, (p)sychotherapy, (p)terodactyl and similarly in other words beginning ps, pn or pt.
- cu(p)board
- i(r)on
- (w)rap, (w)rite, (w)rong
- (w)ho, (w)hom, (w)hose, (w)hole

Phrasal Verbs:

Phrasal verbs are verbs followed by prepositions and adverbs which give them special idiomatic meanings. Here is a list of important phrases.

1. Break down = collapse
   Ex: The woman broke down when she heard the news of her husband's death.
2. Call in = bring in
   Ex: Please call in your friend.
3. Draw out = take out from his pocket
   Ex: He drew out the knife.
4. Fall off = declined
   Ex: The demand for scooters has fallen off.
5. Get over = recover from
   Ex: She got over the shock.

Sentences:

There are 4 types of sentences depend on no. of clauses they have. They are

Simple sentence:

A simple sentence is one which has only one subject and one predicate. That means it has only one clause.

Ex: Ramu is a doctor.

Compound sentence: Compound sentence is made up of two or more clauses and combined by coordinating conjunctions like "and, so, but".

Ex: He ran fast but missed the train.
'He ran fast' is one clause and 'missed the train' is another clause.

Complex sentence:

Some clauses cannot stand independently. They depend upon main clauses. Complex sentence is one which has one main clause and one or more subordinate clauses.

Ex: He told me that he was a doctor.
He told me- main clause
That he was a doctor - subordinate clause.

Compound-Complex sentence: If there are more than one main clauses and at least one subordinate clause it becomes Compound-Complex sentence.

Ex: When Sachin completed the century the audience clapped and the cheer girls danced.
The audience clapped – main clause 1
The cheer girls danced – main clause 2
When Sachin completed the century – subordinate clause

Transformation of sentences

1. **Simple to compound:** Change the phrase as another main clause and combine them with conjunction.
   Ex: I praised him for his intelligence (simple)
   Change the phrase as clause.
   For his intelligence => he was an intelligent
   Use conjunction 'so'.
   He was an intelligent, so I praised him. (Compound)
2. **Compound to Complex:** Change one main clause as subordinate clause.
   Ex: He was sick and so he could not come to school. (Compound)
   As he was sick, he could not come to school. (Complex)
3. **Compound to Simple:** Change a main clause into a phrase.
   Ex: Ravi felt hungry, he had his lunch. (Compound)
   Being hungry, Ravi had his lunch. (Simple)
4. **Complex to Simple:** Change the subordinate clause into phrase and use it along with main clause.
   Ex: He doesn't know where she works. (Complex)
   Where she works (sub. Clause) => her working place. (Phrase)
   He doesn't know her working place. (Simple)
5. **Complex to Compound:** Change the subordinate clause into main clause and combine with conjunction (and, or, but).
   Ex: Though Ravi is irregular, he is a bright student. (Complex)
   Ravi is irregular but he is a bright student. (Compound)

Letter writing:

We can divide the letters into Personal and business. In multiple choice questions few things only can be asked from this.

Salutations of the Personal letters: Dear father, My dear mother, Dear Ravi, Dear friend.

Salutations of the Business letters: Sir, Madam, M/s

Subscriptions of the personal letter: Yours affectionately, Yours sincerely (only for friends), Yours lovingly, Your loving son

Subscriptions of the business letters: Yours faithfully, Yours truly.

No apostrophe in subscriptions.

Often confused phrase:

Your's faithfully (wrong)
Yours faithful (wrong)
Yours faithfully (correct)
-ly comes compulsory at the end, if it started with 'yours'.
-ly doesn't come if it is 'your'
Yours loving son (wrong)
Your loving son (correct)

Comprehension passage

Read the passage once carefully before reading the questions corresponding. Again read the paragraph. Then you can get central idea of the passage. Finally answer the questions. Model passage is given here.

Louis Braille lost his sight accidentally as a child. Nevertheless, he was able to complete his education at a school for the blind in Paris and became a teacher. In his days, the few books that were available for blind people were printed in big, raised type, the letters used were those of the ordinary alphabet. The reading of such books required immense effort. Writing was almost impossible for a blind person was still restricted to an alphabet which was extraordinarily difficult to reproduce on paper.

Braille's idea was to use raised dots instead of raised letters. He evolved a system which used only six dots in all. By various combinations of these dots, it not only proved possible to represent each letter in the alphabet, but punctuation marks, numbers and musical notations as well. Reading and writing have thus been enormously simplified. The sensitive fingers of a blind person can travel rapidly over the dots.

Choose the correct answer from the given four alternatives:

1. **Louis Braille**
   1.was blind by birth
   2. lost his sight gradually
   3. became blind accidentally
   4. became blind after he com pleted his education
2. **The books for blind before Braille were**
   1. printed in raised letters
   2. used raised dots
   3. used a special alphabet
   4.were not available
3. **Braille's new system:**
   1. introduced a new alphabet for the blind
   2.used six dots in different combinations
   3. introduced a new typewriter
   4. trained the blind to use their fingers
4. **His new system can represent**
   1. alphabets & numbers
   2. punctuation marks
   3. musical notations
   4. all of the above
5. **Where did he complete his education?**
   1. New York 2. Paris
   3. London 4. Russia

Answers

1) 3 2) 1 3) 2 4) 4 5) 2

దేశంలో మొదటి బయోస్ఫియర్ రిజర్వ్?

జీవ వైవిధ్య సంరక్షణ
(అటవీ వనరుల, వన్యజాతి జీవుల సంరక్షణ)

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ

జీవావరణంలోని సమస్త జీవజాతుల మధ్య ఉన్న జన్యుపరమైన, జాతులపరమైన, ఆవరణ వ్యవస్థల పరమైన తేడాలు, వైవిధ్యతలనే జీవ వైవిధ్యతగా పరిగణిస్తారు. పర్యావరణ, ఆహార, వైద్య, వాణిజ్య, పారిశ్రామిక, సామాజిక, సాంస్కృతిక, సౌందర్యపరంగా జీవ వైవిధ్య ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత, భవిష్యత్ తరాలకు జీవ వనరులను అందుబాటులో ఉంచుతూ, సుస్థిరాభివృద్ధి సాధించడానికి సాంకేతిక విజ్ఞానం ద్వారా జీవ వైవిధ్యతను సమర్థంగా నిర్వహించడమే జీవ వైవిధ్య సంరక్షణ.

జీవ వైవిధ్య సంరక్షణలో ఇమిడి ఉన్న అంశాలు:

1. మానవ చర్యల వల్ల ప్రమాదస్థితిలో ఉన్న వన్య, వృక్ష, జంతుజాతులను గుర్తించి, వాటిని పునఃస్థాపితం చేసే రక్షణ ప్రణాళికలను రూపొందించాలి.
2. ప్రమాద స్థితిలో ఉన్న జాతుల బీజద్రవ్యాలను, విత్తనాలను, పిండాలను భద్రపరిచే ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలి
3. దేశవాళీ రకాల జాతుల ఆవాసాలను గుర్తించి, వాటి పరిరక్షణకు రక్షిత ప్రాంతాలను గుర్తించాలి. జీవ జాతుల అక్రమ రవాణాను, అంతర్జాతీయ వ్యాపారాన్ని అరికట్టే శాసనాలు, చట్టాలను అమలు చేయాలి.
4. బహుళ జాతి కంపెనీలు సాగించే జీవ చౌర్యాన్ని అరికట్టే చర్యలు చేపట్టాలి.

* జీవ వైద్య సంరక్షణకు రెండు రకాల వ్యూహాలను అమలు చేస్తున్నారు. అవి..
  1) IN-Situ సంరక్షణ (ఆవాసాంతర సంరక్షణ)
  2) Ex-Situ సంరక్షణ(ఆవాసేతర సంరక్షణ)

బయోస్ఫియర్ రిజర్వ్	రాష్ట్రం
నీలగిరి (దేశంలోని మొదటి బయోస్ఫియర్, 1986లో ప్రకటించారు.	తమిళనాడు
అగస్త్యమలై	కేరళ
గల్ఫ్ ఆఫ్ మన్నార్	తమిళనాడు
గ్రేట్ నికోబార్	అండమాన్ నికోబార్
సిమ్లిపాల్	ఒడిశా
అమర్ కంటక్-అచానకర్	మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్
పాంచ్‌మర్హి	మధ్యప్రదేశ్
సుందర్‌బన్	వెస్ట్‌బెంగాల్
దిబ్రూసికాయ్	అసోం
మానస	అసోం
నోక్రేక్	మేఘాలయ
దిబాంగ్-దెహాంగ్	అరుణాచల్‌ప్రదేశ్
కాంచనజంగా	సిక్కిం
నందాదేవి	ఉత్తరాఖండ్
రాణ్ ఆఫ్ కచ్	గుజరాత్
కోల్డ్ డెసర్ట్	హిమాచల్‌ప్రదేశ్
శేషాచల	ఆంధ్రప్రదేశ్
పన్నా	మధ్యప్రదేశ్

IN-Situ సంరక్షణ:

ఏదైనా భౌగోళిక ప్రాంతంలో అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జీవజాతులను వాటి జన్యు సంపదను అదే భౌగోళిక ప్రాంతంలో మానవ ప్రమేయంతో రక్షించే విధానమే IN-Situ సంరక్షణ. ఈ పద్ధతిలో సమాజానికి లాభం కలిగించే విభిన్న రకాల రక్షిత ప్రాంతాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ విధానంలో 4 రకాల కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నారు. అవి..

ఎ) జాతీయ పార్కులు:
ప్రకృతి సంపద, సుందర ప్రదేశాలు, దృశ్యాలు, వన్యజీవులను సంరక్షించేందుకు జాతీయ పార్కులను ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాంతాల నుంచి వంట చెరకును సేకరించుకోవడం, పశువులను మేపుకోవడం, అటవీ ఉత్పత్తులను సేకరించడం నిషిద్ధం. ఈ ప్రాంతాలపై వ్యక్తిగత హక్కులు ఉండవు. జాతీయ పార్కుల హద్దులను శాసనం ద్వారా నిర్ణయిస్తారు. ప్రస్తుతం దేశంలో 4.2 మిలియన్ హెక్టార్లలో (దేశ భూభాగంలో 1.3శాతం) 97 జాతీయ పార్కులు ఉన్నాయి.



బి) వన్యమృగ సంరక్షణ కేంద్రాలు (అభయారణ్యాలు):
వీటిని వన్యప్రాణుల సంరక్షణకు కేటాయించినప్పటికీ వీటి సరిహద్దులను శాసనం ద్వారా నిర్ణయించరు. ఇక్కడి వన్యప్రాణులకు కీడు కలిగించనంత వరకు అటవీ కార్యకలాపాలను చేపట్టేందుకు అనుమతి ఉంది. ప్రస్తుతం 12 మిలియన్ల హెక్టార్ల భూభాగంలో (దేశభూభాగంలో 3.7 శాతం) 512 జాతీయ పార్కులు ఉన్నాయి.

సి) బయోస్ఫియర్ రిజర్వ్:
ఏదైనా భౌగోళిక ప్రాంతంలో వృక్ష, జంతుజాతులు, వాటి జన్యువుల పరిరక్షణ, గిరిజనుల జీవనశైలి, పెంపుడు మొక్కల, జంతువుల జన్యు ఆధారాలను సంరక్షించేందుకు ఏర్పాటైన బహుళ ప్రయోజనకర రక్షిత ప్రాంతాలే బయోస్ఫియర్ రిజర్వ్‌లు. యునెస్కో ఆధ్వర్యంలో ఏర్పాటైన మ్యాన్ అండ్ బయోస్ఫియర్ ప్రోగ్రామ్ (1971) ప్రస్తుతం దేశంలో 19 బయోస్ఫియర్ ప్రాంతాలను ప్రకటించింది.

డి) దుర్బల, ప్రమాద స్థితిలో ఉన్న జీవజాతుల పరిరక్షణకు ప్రత్యేక పథకాలు:

ప్రాజెక్టు టైగర్:
అంతరించిపోతున్న పులుల సంతతిని పరిరక్షించడానికి, వాటి సంఖ్యను పెంపొందించడానికి, వాటిలోని సౌందర్య, సాంస్కృతిక, వాణిజ్య, ఆవరణ వ్యవస్థల పరమైన విలువలను కాపాడడానికి 1973 నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పథకం కింద దేశంలో 58 పులి సంరక్షణా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పులిసంరక్షణా కేంద్రాలు, పులులు ఎక్కువ సంఖ్యలో ఉన్న రాష్ట్రం మధ్యప్రదేశ్. అందుకే దీన్ని పులి రాష్ట్రంగా పిలుస్తారు. అంతేకాకుండా పులిని 1973లో జాతీయ జంతువుగా ప్రకటించారు.

ప్రాజెక్టు ఎలిఫెంటా: ఏనుగుల సంతతిని పెంచడానికి 1992లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం దేశంలోని 13 రాష్ట్రాల్లో 33 ఏనుగు సంరక్షణా కేంద్రాలున్నాయి.

ప్రాజెక్టు క్రోకోడైల్: మొసళ్ల పరిరక్షణకు 1975 నుంచి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఎనిమిది రాష్ట్రాల్లో 34 మొసలి సంరక్షణా కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

ప్రాజెక్టు సీ టర్టుల్స్: సముద్ర తాబేళ్ల పరిరక్షణకు 1975లో ఈ పథకాన్ని ఒడిశాలోని గహిర్‌మతాబీచ్‌లో ఏర్పాటు చేశారు. ఇందులో రిడ్లే రకానికి చెందిన తాబేళ్లను పరిరక్షిస్తున్నారు.

2) Ex-Situ సంరక్షణ:

ఏదైనా భౌగోళిక ప్రాంతంలో అంతరించే స్థితిలో ఉన్న జీవ జాతులను వాటి సహజ ఆవాసాలకు వెలుపల పరిరక్షించే విధానమే Ex-Situ సంరక్షణ. ఈ విధానంలో జీవజాతులు, వాటి నమూనాలను, విత్తన, పిండ నిల్వల బ్యాంకులు, కణజాల వర్ధన కేంద్రాలు, జన్యుబ్యాంకులు, బీజ ద్రవ్య బ్యాంకులు, చేపల గుడ్ల నిల్వ కేంద్రాలు, జంతు ప్రదర్శనశాలలో సంరక్షిస్తారు.

పైన తెలిపిన విధానాలతోపాటు దేశంలో అనేక చట్టాలు, పరిశోధనా కేంద్రాలను కూడా జీవ వైవిధ్య సంరక్షణలో భాగంగా రూపొందించి అమలు చేస్తున్నారు. అవి..

1. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, కోల్‌కతా
2. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, డెహ్రాడూన్
3. ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, డెహ్రాడూన్
4. అరిడ్ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్-జోధ్‌పూర్(రాజస్థాన్)
5. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్రీ-డెహ్రాడూన్
6. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ ఆఫ్ టెక్నాలజీ-బెంగళూరు
7. ట్రోఫికల్ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - జబల్‌పూర్(మధ్యప్రదేశ్)
8. హిమాలయా ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, సిమ్లా(హిమాచల్ ప్రదేశ్)
9. సెంటర్ ఫర్ సోషల్ ఫారెస్ట్రీ ఆఫ్ ఎకొలాజికల్ రిహాబిలిటేషన్-అలహాబాద్
10. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్-భోపాల్
11. వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, డెహ్రాడూన్
12. జీబీ పంథ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్-అల్‌మోరా(ఉత్తరాఖండ్)
13. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్- నాగ్‌పూర్

జాతీయ పార్కు/ వన్యమృగ సంరక్షణ కేంద్రం	రాష్ట్రం/ కేంద్రపాలిత ప్రాంతం	ప్రత్యేకత
దచిగాం జాతీయ పార్కు	జమ్మూ కాశ్మీర్	హంగుల్ (కాశ్మీరి దుప్పి)
సలీం అలీ పక్షి సంరక్షణ కేంద్రం	జమ్మూ కాశ్మీర్	హిమాలయన్ మంచుకోడి
జిమ్ కార్బెట్ జాతీయ పార్కు (దేశంలోనే తొలి జాతీయ పార్కు)	ఉత్తరాఖండ్	పులులు
ఘనా పక్షి సంరక్షణ కేంద్రం	రాజస్థాన్	సైబీరియన్ కొంగలు
ఖాజీరంగా జాతీయ పార్కు	అసోం	ఒంటికొమ్ము ఖడ్గమృగం
వాలీ ఆఫ్ ఫ్లవర్స్ జాతీయ పార్కు	ఉత్తరాఖండ్	భిన్నరకాల పుష్పజాతుల పరిరక్షణ
సరిస్కా వన్యమృగ సంరక్షణ కేంద్రం	రాజస్థాన్	పులులు
కన్హా జాతీయ పార్కు	మధ్యప్రదేశ్	పులులు
కన్నేర్‌ఘాట్ జాతీయపార్కు	ఛత్తీస్‌గఢ్	పులులు
కంచర గాడిదల సంరక్షణా కేంద్రం	గుజరాత్	కంచర గాడిదలు
గిర్ వన్యమృగ సంరక్షణ కేంద్రం	గుజరాత్	సింహాలు
బోరివిల్లా జాతీయపార్కు	మహారాష్ట్ర	అరిచే జింకలు
బన్నేర్‌ఘాట్ జాతీయపార్కు	బెంగళూరు	ప్రపంచంలో అతిపెద్ద సీతాకోక చిలుకల సంరక్షణ కేంద్రం
సైలెంట్ వ్యాలీ జాతీయ పార్కు	కేరళ	మకాక్ కోతులు (సింహపు తోక ఉన్న కోతులు)
పెరియార్ వన్యమృగ సంరక్షణ కేంద్రం	కేరళ	ఏనుగులు, పులులు
రాజీవ్‌గాంధీ పులుల సంరక్షణ కేంద్రం	ఆంధ్రప్రదేశ్	పులులు

మాదిరి ప్రశ్నలు

1. in-Situ జీవ వైవిధ్య సంరక్షణా విధానంలో ఒక కార్యక్రమం కానిది?
   1) జాతీయ పార్కులు 2) ప్రాజెక్ట్ టైగర్
   3) బయోస్ఫియర్ రిజర్వ్
   4) ఉద్యానవనాలు
2. కన్హా జాతీయపార్కు ఏ నది ఒడ్డున ఉంది?
   1) చంబల్ 2) బెట్వా
   3) కెన్ 4) సోన్
3. సైబీరియన్ కొంగలకు ప్రసిద్ధి చెందిన పక్షి సంరక్షణా కేంద్రం?
   1) నేలపట్టు 2) సలీంఅలీ
   3) ఘనా 4) సుల్తాన్‌పూర్
4. కన్నేర్‌ఘాట్ జాతీయ పార్కు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) జార్ఖండ్ 2) కర్ణాటక
   3) ఛత్తీస్‌గఢ్ 4) మధ్యప్రదేశ్
5. దేశంలో మొదటి బయోస్ఫియర్ రిజర్వ్?
   1) సుందర్‌బన్
   2) గల్ఫ్ ఆఫ్ మన్నార్
   3) కాంచనజంగా 4) నీలగిరి
6. అరిచే జింకలకు ప్రసిద్ధి చెందిన వన్యమృగ సంరక్షణా కేంద్రం?
   1) కన్హా 2) సైలెంట్ వ్యాలీ
   3) బోరివిల్లా 4) రణతంబోర్
7. సైలెంట్ వ్యాలీ జాతీయ పార్కు దేనికి ప్రసిద్ధి?
   1) పులులు 2) ఏనుగులు
   3) మకాక్ కోతులు
   4) సీతాకోక చిలుకలు
8. నేలపట్టు పక్షి సంరక్షణా కేంద్రం ఏ సరస్సు ఒడ్డున ఉంది?
   1) కొల్లేరు 2) సాంబార్
   3) చిల్కా 4) పులికాట్
9. పులి రాష్ట్రంగా దేన్ని పిలుస్తారు?
   1) ఛత్తీస్‌గఢ్ 2) మధ్యప్రదేశ్
   3) ఆంధ్రప్రదేశ్ 4) అసోం

సమాధానాలు
1) 4 2) 2 3) 3 4) 3 5) 4
6) 3 7) 3 8) 4 9) 2

గుండె సంకోచాన్ని ఏమంటారు?

పోటీ పరీక్షల ప్రత్యేకం
బయాలజీ

రక్తం, రక్త ప్రసరణ

మానవ శరీరంలో ముఖ్యమైన ద్రవం రక్తం. 70 కిలోల బరువున్న ఆరోగ్యవంతుడైన పురుషుడిలో 5-6 లీటర్ల రక్తం ఉంటుంది. రక్తం అధ్యయనం హెమటాలజీ. రక్తం ద్రవ రూపంలోని సంయోజక కణజాలం. ఆహార పదార్థాలు, శ్వాస వాయువులు, వ్యర్థాలు, హార్మోన్ల రవాణాను రక్తం నిర్వహిస్తుంది. తెల్ల రక్తకణాలు ఉండటం ద్వారా రక్తం శరీర నిరోధక శక్తిలో పాల్గొంటుంది.రక్తంలో రెండు భాగాలు ఉంటాయి. అం దులో ఒకటి ప్లాస్మా. ఇది రక్తంలోని ద్రవభాగం. రక్తంలో 55 శాతం ప్లాస్మా ఉంటుంది. మిగిలిన 45 శాతం రక్తకణాలు ఉంటాయి. ప్లాస్మాలో 92 శాతం నీరు, మిగిలిన 8 శాతం ఘన పదార్థాలు ఉంటాయి. ఈ ఘన పదార్థాల్లో ప్రొటీన్లు, పిండి పదార్థాలు, కొవ్వులు వంటివి కర్బన పదార్థాలు. ఖనిజాలన్నీ అకర్బన పదార్థాలు.

రక్తకణాలు

ఇవి మూడు రకాలు. అవి ఎర్రరక్తకణాలు, తెల్ల రక్త కణాలు, రక్తఫలికికలు. రక్త కణాలు ఎముక మజ్జ నుంచి ఏర్పడుతాయి. పిండాభివృద్ధిలో వీ టిని కాలేయం ఏర్పరుస్తుంది. రక్తం, రక్తకణాలు ఏర్ప డడాన్ని హీమోపాయిసస్ అంటారు. శరీరంలోని మరో ముఖ్యద్రవం శోషరసం. ఎర్రరక్తకణాలు లేని ద్రవం శోషరసం. శరీర కణజాలా ల మధ్య ప్రత్యేకనాళాల్లో శోషరసం ప్రవహిస్తుం ది. దీనిలో తెల్ల రక్తకణాలు ఉంటాయి కాబట్టి ఇదికూడా రోగ నిరోధక శక్తిలో పాల్గొంటుంది.

ఎర్ర రక్తకణాలు:
ప్రతి క్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో 4.5 నుంచి 5 మిలియన్ల ఎర్రరక్తకణాలు ఉంటాయి. శరీరంలో సుమారు 32 బిలియన్ల ఎర్ర రక్తకణాలు ఉంటాయి. ఎముక మజ్జలో ఇవి ఏర్పడడాన్ని ఎరిత్రోపాయిసిస్ అంటారు. ఇవి ద్విపుటా కారంలో ఉంటాయి. అభివృద్ధి చెందిన క్షీరదాల ఎర్ర రక్తకణాల్లో కేంద్రకం, ఇతర కణభాగాలు ఉండవు. కేవలం హీమోగ్లోబిన్ మాత్రమే ఉంటుంది. హీమోగ్లోబిన్‌లో రెండు భాగాలు ఉంటాయి. అవి.. హీం, గ్లోబిన్. ఇనుము ఫెర్రస్ రూపంలో కలిగి ఉన్న కర్బన పదార్థం హీం. గ్లోబిన్ ఒక ప్రొటీను. రక్తం ఎరుపు రంగులో ఉండటానికి కారణమైన వర్ణకం హీమోగ్లోబిన్. ఇది ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్‌ల రవాణాను నిర్వహిస్తుంది. ప్రతి హీమోగ్లోబిన్ అణువు నాలుగు ఆక్సిజన్ అణువులను రవాణా చేస్తుంది. హీమోగ్లోబిన్ ఏర్పడడానికి, ఎర్రరక్తకణాలు అభివృద్ధి చెందడానికి ఇనుము, విటమిన్ బి12 (సైనకోబాలమిన్), విటమిన్ బి9 (ఫోలిక్ ఆమ్లం) అవసరమవుతాయి. ఆహారంలో ఇవి లోపిస్తే అనీమియా (రక్తహీనత) సంభవిస్తుంది. ఎర్ర రక్తకణాల జీవితకాలం 120 రోజులు. ఆ తర్వాత అవి ప్లీహంలో నశిస్తాయి.

తెల్ల రక్తకణాలు:
వీటిని ల్యూకోసైట్లు అంటారు. శరీర రక్షక భటులుగా వ్యవహరిస్తాయి. వీటి జీవితకాలం కొన్ని రోజుల నుంచి కొన్ని వారాల వరకు ఉంటుంది. ఇవి ప్రధానంగా రెండు రకాలు. అవి.. గ్రాన్యులోసైట్లు, ఎగ్రాన్యులోసైట్లు. గ్రాన్యులోసైట్ల కణ ద్రవ్యంలో ప్రత్యేక కణికలు ఉంటాయి. ఇవి ప్రధానంగా మూడు రకాలు. అవి.. అసిడోఫిల్స్, బేసోఫిల్స్, న్యూట్రోఫిల్స్. ఎగ్రాన్యులోసైట్లు రెండు రకాలు. అవి.. మోనోసైట్‌లు, అసిడోఫిల్స్ లేదా ఇసినోఫిల్స్. అలర్జీ చర్యల్లో పాల్గొంటాయి. న్యూట్రోఫిల్స్, మోనోసైట్లు భక్షక కణాలుగా వ్యవహరిస్తాయి. శరీర రోగ నిరోధక శక్తిలో ప్రధానమైనవి లింఫోసైట్లు. ఇవి రెండు రకాలు. అవి T, B లింఫోసైట్లు. T లింఫోసైట్లు మళ్లీ రెండు రకాలు. అవి CD_4/T_4 కణాలు, CD_8 కణాలు. శరీరంలోకి ప్రవేశించిన వ్యాధి కారకాన్ని గుర్తించి దాన్ని నాశనం చేసే ప్రక్రియను T లింఫోసైట్‌లు ప్రారంభిస్తాయి. వీటి ద్వారా సెల్యులార్ ఇమ్యూనిటీ లభిస్తుంది. వ్యాధి కారకానికి విరుద్ధంగా ప్రతి దేహకాల (యాంటీ బాడీస్)ను విడుదల చేసి ఇమ్యూనిటీని అందించేవి B లింఫోసైట్లు. ఈ రకమైన ఇమ్యూనిటీ హ్యూమొరల్ ఇమ్యూనిటీ. తెల్ల రక్తకణాల సంఖ్య అసాధారణంగా పెరిగితే ల్యుకేమియా లేదా రక్త కేన్సర్ వస్తుంది. వీటి సంఖ్య అసాధారణంగా తగ్గడం ల్యూకోపీనియా.

రక్త ఫలకికలు:
ఇవి నిజమైన కణాలు కాదు. ఎముక మజ్జలో మెగా క్యారియోసైట్‌ల నుంచి ఏర్పడిన ఖండితాలు. వీటి జీవితకాలం 3-10 రోజులు. ప్రతి క్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో 2.5-5 లక్షలు ఉంటాయి. గాయమైనప్పుడు రక్త స్కందన ప్రక్రియను ప్రారంభిస్తాయి. గాయమైన ప్రాంతంలో ఇవి విచ్ఛిన్నం చెంది థ్రాంబోప్లాస్టిన్ పదార్థాన్ని విడుదలచేస్తాయి. ఇవి రక్తంలోని ప్రోథాంబిన్‌ను థ్రాంబిన్‌గా మారుస్తాయి. ఆ తర్వాత థ్రాంబిన్ చర్య ద్వారా రక్తంలోని ఫైబ్రినోజన్‌ను ఫైబ్రిన్‌గా మారుస్తాయి. ఫైబ్రిన్ ప్రొటీన్ పోగులుగా మారి సంక్లిష్ట జాలకాన్ని ఏర్పర్చి రక్తం నష్టాన్ని నివారిస్తుంది. ఈ ప్రక్రియలో 13 ప్రధాన రక్తస్కందన కారకాలు, కొన్ని అనుబంధ కారకాలు పాల్గొంటాయి. శరీరంలో రక్తం గడ్డకట్టడాన్ని హిపారిన్ నివారిస్తుంది. రక్త సంకోచానికి కావాల్సిన ఖనిజం కాల్షియం. అనుబంధ కారకాల్లో ముఖ్యమైంది విటమిన్ -కె. ఏ చిన్న దెబ్బ తగిలినా రక్తస్కంధనం జరగని వ్యాధి హీమోఫీలియా. కృత్రిమ రక్తస్కందన కారకాలుగా ఉపయోగించేవి సిట్రేట్‌లు, ఆక్సలేట్‌లు, డైకొమరల్.

రక్త వర్గాలు:
ఎర్రరక్తకణాల్లోని ప్రత్యేక ప్రతిజనకాల ఆధారంగా మానవ రక్తాన్ని వివిధ గ్రూపులుగా విభజించారు.



A, B, O రక్తవ్యవస్థను తొలిసారిగా ల్యాండ్‌స్టీనర్ గుర్తించారు. మానవ ఎర్రరక్తకణాలపై A,B ప్రతిజనకాలు ఉండటం లేదా లేకపోవడం ఆధారంగా మనుషులు నాలుగు వర్గాలు. A గ్రూపు ఎర్రరక్తకణాల్లో A అనే ప్రతిజనకం ఉంటుంది. B గ్రూపు ఎర్ర రక్తకణాలపై B ప్రతిజనకం ఉంటుంది. ఎర్ర రక్తకణాలపై A,B ప్రతిజనకాలు రెండూ ఉన్న వారు AB గ్రూపునకు చెందుతారు. ఈ రెండు ప్రతిజనకాలూ లేనివారు O గ్రూపునకు చెందుతారు. A గ్రూపు రక్తాన్ని B గ్రూపు వారికి ఇస్తే A ప్రతిజనకానికి విరుద్ధంగా B వ్యక్తి శరీరంలో ప్రతిదేహకాలు విడుదలై రక్తం గడ్డకడుతుంది. ఇది ప్రాణాంతకం కూడా కావచ్చు. అదేవిధంగా B గ్రూపు రక్తాన్ని A గ్రూపు వారికి ఇస్తే ఇదే సమస్య వస్తుంది. కాబట్టి A గ్రూపు వారికి A గ్రూపు రక్తాన్ని, B గ్రూపు వారికి B గ్రూపు రక్తాన్ని ఇవ్వాలి. ఐతే వీరిద్దరికీ O గ్రూపు రక్తాన్ని ఇవ్వొచ్చు. అదేవిధంగా AB గ్రూపు వారికి A,B,O, గ్రూపు రక్తాన్ని ఇవ్వొచ్చు. కాబట్టి AB గ్రూపు వారు విశ్వ గ్రహీతలు. O గ్రూపు వారి రక్తాన్ని అందరికీ ఇవ్వొచ్చు. కాబట్టి వీరు విశ్వదాతలు. వీరికి మాత్రం O గ్రూపు రక్తాన్నే ఇవ్వాలి. A, B ప్రతిజనకాలకు అదనంగా మనిషి ఎర్ర రక్తకణాలపై Rh ప్రతిజనకాన్ని కూడా ల్యాండ్ స్టీనర్, వీనర్ గుర్తించారు. ABO రక్త వ్యవస్థకు సంబంధం లేకుండా ఒక వ్యక్తి ఎర్ర రక్తకణాలపై Rh ప్రతిజనకం ఉండొచ్చు లేదా ఉండకపోవచ్చు. దీన్ని కలిగి ఉన్నవారిని Rh పాజిటివ్ అని, లేనివారిని Rh నెగిటివ్ అని సంబోధిస్తారు. అరుదుగా ఎవరిలో లేని ప్రతిజనకం కొందరి ఎర్రరక్తకణాల్లో ఉంటుంది. దీనికి మంచి ఉదాహరణ బాంబే ప్రతిజనకం. బాంబే రక్త గ్రూపునకు చెందిన వారిలో బాంబే ప్రతిజనకం (H) ఉంటుంది.

గుండె, రక్త ప్రసరణ:
శరీరంలో రక్తాన్ని పంపు చేసే అవయవం గుండె. అకశేరుకాల్లో నాడీ జనిత, సకశేరుకాలలో కండర జనిత గుండె ఉంటుంది. మనిషిలో నాలుగు గదుల గుండె ఉంటుంది. ఊపిరితిత్తుల మధ్యలో మీడియా స్టీనియం అనే కుహరంలో గుండె అమరి ఉంటుంది. గుండెలోని పై గదులు కర్ణికలు. కింది గదులు జఠరికలు. గుండె లయ ఒక కండర కణుపులో మొదలవుతుంది. దీన్ని లయారంభకం అంటారు. మానవుడి గుండెలో రెండు లయారంభకాలు ఉంటాయి. సిరాకర్ణికా కణుపు గుండె కుడికర్ణిక కుడివైపు పై భాగంలో ఉంటుంది. రెండోది కర్ణికా జఠరికా కణుపు. ఇది కుడి కర్ణిక, కుడి జఠరిక మధ్య ఉంటుంది. సిరా కర్ణికా కణుపు వద్ద జనించిన సంకోచ తరంగాలు కర్ణికలకు మాత్రమే పరిమితమవుతాయి. దీని నుంచి సంకోచ తరంగాలను అందుకున్న కర్ణిక, జఠరిక కణుపు హిస్ కండరకట్ట ద్వారా జఠరికలకు చేరుతాయి. ఈ విధంగా మొత్తం గుండె సంకోచిస్తుంది. గుండె సంకోచం సిస్టోల్. గుండె సడలిక డయాస్టోల్. కర్ణికల సంకోచం ద్వారా రక్తం జఠరికల్లోకి చేరుతుంది. జఠరికల సంకోచం ద్వారా మళ్లీ రక్తం కర్ణికల్లోకి చేరకుండా ప్రత్యేక కవాటాలు అడ్డుకుంటాయి. ఎడమ కర్ణిక, జఠరికల మధ్య అగ్రద్వయ లేదా మిట్రల్ కవాటం; కుడి కర్ణిక, జఠరికల మధ్య అగ్రత్రయ కవాటం ఉంటాయి.

సిరలు:
శరీరంలోని సిరలు వివిధ భాగాల నుంచి సేకరించిన మలిన/ ఆమ్లజని రహిత రక్తాన్ని ఊర్ధ్వ, నిమ్న మహా సిరల ద్వారా గుండె కుడి కర్ణికలోకి విడుదల చేస్తాయి. ఐతే ఒక్క పుపుస సిర మాత్రమే ఊపిరితిత్తుల నుంచి శుద్ధ/ ఆమ్లజని సహిత రక్తాన్ని ఎడమ కర్ణికలోకి విడుదల చేస్తుంది. కర్ణికలు సంకోచిస్తాయి. జఠరికల్లోకి రక్తం చేరుతుంది. ఎడమ జఠరికలోకి చేరిన శుద్ధ రక్తం మహాధమని ద్వారా శరీరంలోని ధమనుల్లోకి చేరుతుంది. కుడి కర్ణికలోకి చేరిన మలిన రక్తం ఒక పుపుస ధమని ద్వారా ఊపిరితిత్తులకు చేరుతుంది. ఈ విధంగా శరీరంలోని ధమనులన్నీ గుండె ఎడమ జఠరిక నుంచి శుద్ధ రక్తాన్ని అన్ని శరీర భాగాలకూ సరఫరా చేస్తాయి. ఒక పుపుస ధమని మాత్రమే గుండె కుడి జఠరిక నుంచి మలిన రక్తాన్ని ఊపిరితిత్తులకు సరఫరా చేస్తుంది. ఈ రకంగా గుండె కుడి భాగంలో మలిన రక్తం, ఎడమ భాగంలో శుద్ధ రక్తం స్వతంత్రంగా సరఫరా కావడం ద్విరక్త ప్రసరణ.

మాదిరి ప్రశ్నలు

1. ప్రతి 100 మి.లీ. రక్తంలో హీమోగ్లోబిన్ ఏ మోతాదులో ఉంటుంది?
   ఎ) 15 గ్రాములు బి) 15 మిల్లీ గ్రాములు
   సి) 25 గ్రాములు డి) 25 మిల్లీ గ్రాములు
2. ఎముక మజ్జ నుంచి రక్తం, రక్త కణాలు ఏర్పడని జన్యువ్యాధి?
   ఎ) హీమోఫీలియా బి) థలసీమియా
   సి) పాలిసైథామియా డి) అడిసిన్స్
3. విటమిన్ బి12 లోపం ద్వారా సంభవించే రక్తహీనత?
   ఎ) మెగలోబ్లాస్టిక్ బి) మాక్రోసిస్టిక్
   సి) పెర్నిసియస్ డి) న్యూట్రిషినల్
4. మానవుడిలో ఎర్ర, తెల్ల రక్తకణాల నిష్పత్తి?
   ఎ) 1:600 బి) 600:1
   సి) 6000:1 డి) 1:6000
5. రక్తం రసాయన గుణం?
   ఎ) స్వల్పక్షారం బి) మోస్తరు క్షారం
   సి) స్వల్ప ఆమ్లం డి) మోస్తరు ఆమ్లం
6. ప్రతి క్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో తెల్ల రక్తకణాలు సంఖ్య?
   ఎ) 8000- 12,000
   బి) 2- 2.5 లక్షలు
   సి) 3.0- 3.5 మిలియన్‌లు
   డి) 3,000- 5,000
7. తెల్ల రక్తకణాలలో ఎక్కువగా ఉండేవి?
   ఎ) అసిడోఫిల్స్ బి) బేసోఫిల్స్
   సి) న్యూట్రోఫిల్స్ డి) మోనోసైట్‌లు
8. దోమ లాలాజలంలో రక్తస్కందన నివారిణి?
   ఎ) హీమోలైసిన్ బి) హిరుడిన్
   సి) లైసోజైం డి) అల్బుమిన్
9. బాంబే ప్రతిజనకం?
   ఎ) H బి) M సి) N డి) p
10. కింది ఏ జంటకు కలిగే రెండు వరుస Rh పాజిటివ్ శిశువు తల్లి గర్భంలోనే మరణించే అవకాశం ఉంది?
    ఎ) Rh^+ పురుషుడు, Rh^- స్త్రీ
    బి) Rh^- పురుషుడు, Rh^+ స్త్రీ
    సి) Rh^+ పురుషుడు, Rh^+ స్త్రీ
    డి) Rh^- పురుషుడు, Rh^+ స్త్రీ
11. వీటిలో ఏ అవయవం తొలగించినప్పటికీ ఏ సమస్యా ఉండదు?
    ఎ) ప్లీహం బి) కాలేయం
    సి) ఊపిరితిత్తులు డి) పీయూష గ్రంథి
12. రక్తనాళాల్లో రక్తప్రవాహ వేగాన్ని కొలిచే పరికరం?
    ఎ) ఈసీజీ బి) స్ఫిగ్మామానోమీటరు
    సి) స్ట్రోమరు డి) ఈఈజీ
13. కర్ణికల సంకోచం (సిస్టోల్)కు పట్టే సమయం?
    ఎ) 0.1 సెకను బి) 0.3 సెకను
    సి) 0.5 సెకను డి) 0.8 సెకను
14. రక్త నాళాల అధ్యయనం?
    ఎ) కైనిసియాలజీ బి) సిన్‌డెస్మాలజీ
    సి) ఆంజియాలజీ డి) ట్రికాలజీ
15. గుండె వేగం అసాధారణంగా పెరగడం?
    ఎ) టేకీకార్డియా బి) బ్రేడీ కార్డియా
    సి) ఎరిథిమియా డి) ఏదీకాదు
16. గుండె లయలో లబ్ శబ్దానికి కారణం?
    ఎ) కర్ణికల సంకోచం
    బి) జఠరికల సంకోచం
    సి) కర్ణిక-జఠరిక కవాటాలు మూసు కోవడం
    డి) అర్ధ చంద్రాకార కవాటాలు మూసుకోవడం
17. హెచ్ఐవి ప్రత్యేకంగా దాడిచేసే తెల్ల రక్తకణాలు?
    ఎ) బి - లింఫోసైట్‌లు బి) CD4 కణాలు
    సి) CD8 కణాలు డి) మోనోసైట్‌లు
18. కృత్రిమంగా రూపొందిన గుండె?
    ఎ) టెక్నోకోర్ బి) అబియోకోర్
    సి) కార్డియోకోర్ డి) ఏదీకాదు
19. పురుషుడి గుండె బరువుతో పోలిస్తే స్త్రీ గుండె బరువు ఎంత శాతం తక్కువ ఉంటుంది?
    ఎ) 50 బి) 25 సి) 10 డి) 2
20. శోషరసంలో లేనివి?
    ఎ) తెల్ల రక్తకణాలు బి) ఎర్రరక్తకణాలు
    సి) ప్లాస్మా డి) పైవన్నీ
21. రక్త పరిమాణాన్ని నియంత్రించే అవయవం?
    ఎ) కాలేయం బి) మూత్రపిండం
    సి) ప్లీహం డి) పైవన్నీ
22. సీరంలో లేనివి?
    ఎ) ఎర్రరక్తకణాలు బి) తెల్ల రక్తకణాలు
    సి) రక్త ఫలికలు డి) పైవన్నీ
23. భారత్‌లో ఎక్కువ మంది ప్రజలు ఏ రక్త గ్రూపునకు చెందినవారు?
    ఎ) ఎ బి) బి సి) ఎబి డి) ఒ
24. రక్త స్కందన నివారిణిగా ఉపయోగపడేవి?
    ఎ) పొటాషియం ఆక్సలేట్
    బి) అమ్మోనియం ఆక్సలేట్
    సి) డై కొమరల్ డి) పైవన్నీ
25. సిరలకు సంబంధించిన రుగ్మత?
    ఎ) అథెరోస్క్లిరోసిస్
    బి) స్కిజోఫ్రినియా సి) వారికోస్
    డి) అల్జిమర్స్

సమాధానాలు:
1) ఎ; 2) బి; 3) సి; 4) బి; 5) ఎ
6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) ఎ;
11) ఎ; 12) సి; 13) ఎ; 14) సి; 15) ఎ;
16) సి; 17) బి; 18) బి; 19) బి; 20) బి;
21) సి; 22) డి; 23) బి; 24) డి; 25) సి